సత్యమేవ జయతే

సాక్షి


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 351

మంగళవారం 13-3-2018



బుల్ ధనాధన్!
అమెరికా గణాంకాలతో ఉరకలేసిన మార్కెట్లు. 611 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ - బిజినెస్‌లో



6 వికెట్లతో భారత్ విజయం
ముక్కోణపు టి20 టోర్నీలో శ్రీలంక చిత్తు - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



గిరిజన బిడ్డల పరిహారం

పచ్చ నేతల ఫలహారం!

పోలవరం ప్రాజెక్టులో వేలకోట్ల అక్రమాలు

- ముంపు మండలాల విలీనమప్పుడే దోపిడీకి టీడీపీ కీలక నేతల స్కెచ్
- అనుకూలురైన అధికారులను నియమించుకుని రికార్డుల ఫోర్జరీ
- లేని భూమి ఉన్నట్లుగా.. అసైన్డ్ భూమి పట్టా భూములుగానూ..
- గిరిజనుల భూములను ఇతరులకు చెందినట్లుగా మార్పు
- భూసేకరణ నోటిఫికేషన్‌లకూ.. డ్రాఫ్ట్ డిక్లరేషన్‌లకూ పొంతనే లేదు
- భూ బదలాయింపు నిషేధం చట్టాన్ని తుంగలోకి తొక్కిన అధికారులు
- గతంలో సేకరించిన భూములే మళ్లీ సేకరించి పరిహారం స్వాహా
- అక్రమార్కులకు ఫలహారమైన గిరిజనుల త్యాగం

'సాక్షి' వద్ద పక్కా ఆధారాలు

2లో

కమీషన్ల కోసం పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.16,010 కోట్ల నుంచి రూ. 58,319 కోట్లకు పెంచేశారు... అందులో భూసేకరణ పరిహారం సహాయ పునరావాసానికే రూ. 33,858 కోట్లు అంటున్నారు.. పరిహారం పెంచి గిరిజనులకు మేలు చేస్తున్నారనుకుంటే మనం పొరబడినట్లే.. వారి పొట్టకొట్టి పరిహారం మొత్తాన్ని 'పచ్చ 'చొక్కాలే పంచుకుతింటున్నాయి. తెలుగుదేశం ముఖ్యనేత కనుసన్నల్లో బినామీలు, బడానాయకులు.. ఉన్నతాధికారులు.. రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారు.. రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారు. లేని భూమి ఉన్నట్లుగా రికార్డులు సృష్టించారు.. గిరిజనుల భూములు గిరిజనేతరులవిగా మాయచేశారు.. చెరువులు, వాగులు, వంకలు, చివరకు రహదారులను కూడా సాగుభూములుగా పట్టాలు సృష్టించారు. గిరిజనులకు పూర్తిగా అన్యాయం చేశారు. 1/70 చట్టాన్ని అవహేళన చేశారు. ఊళ్లపై బంది పోటు ముఠాలు పడి దోచుకుతిన్నట్లుగా టీడీపీ నాయకులు గిరిజన గ్రామాలపై పడి అరాచకం సృష్టించారు.. పరిహారం కొట్టేయడానికి ఎన్ని మాయలు చేశారో సాక్ష్యాధారాలతో సహా 'సాక్షి' వెలికితీసింది.

- సాక్షి, అమరావతి


సోమవారం ముంబైలోని ఆజాద్ మైదానంలో సమావేశమైన రైతులు

రైతు 'మహా' విజయం

జై కిసాన్

- ఆదివాసీలు సాగుచేస్తున్న అటవీ భూములు వారికే..
- డిమాండ్లను నెరవేరుస్తామన్న మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్
- ఆందోళన విరమించిన అన్నదాతలు - 11లో


కఠ్మాండూ విమానాశ్రయంలో దిగుతుండగా ప్రమాదానికి గురై కాలిపోయిన విమానం

నేపాల్‌లో ఘోర ప్రమాదం

విమానం కూలి 50 మంది దుర్మరణం

20 మందికి పైగా తీవ్ర గాయాలు

- కఠ్మాండూ ఎయిర్‌పోర్టులో బంగ్లాదేశ్ విమానం దిగుతుండగా దుర్ఘటన
- ఫుట్‌బాల్ మైదానంలోకి దూసుకుపోయి మంటల్లో చిక్కుకున్న విమానం - 11లో

టీడీపీ మా మిత్రపక్షమే
బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ 12లో

మూడు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం!

- మూడు స్థానాలకు నాలుగు సెట్ల నామినేషన్లు
- అందులో ఒకటి వైఎస్సార్‌సీపీ డమ్మీ అభ్యర్థిది
- ఉపసంహరణ తర్వాత ఏకగ్రీవం లాంఛనమే
- నామినేషన్లు దాఖలు చేసిన రమేష్, రవీంద్ర
- న్యాయసేవ చేసినందుకే రవీంద్ర ఎంపిక: సీఎం



- వివరాలు 2లో

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

15 నుంచి 29 వరకు పరీక్షలు

- 2,835 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 6,17,484 మంది విద్యార్థులు - 3లో

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రకాశం, గుంటూరు జిల్లాల సరిహద్దులోని ఈపూరుపాలెంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



6లో

బాబు తీరుతో రాష్ట్రానికి చేటు

- హోదా పోరు క్లైమాక్స్‌లో నాటకం రక్తికట్టిస్తున్నారు
- విలన్ విభాగంలో ఆయనకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చు
- బాపట్ల బహిరంగ సభలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ధ్వజం

హోదా ఇచ్చే పార్టీకే మా మద్దతు
రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం ఎన్డీటీవీ ఇంటర్వ్యూలో వైఎస్ జగన్ స్పష్టీకరణ 16లో

హామీలు అమలుచేయాలనే అడుగుతున్నాం..

- కనీసం శాసనసభ స్థానాలు కూడా పెంచట్లేదు
- దీనిపై గట్టిగా అడిగితే నాపై బురదజల్లుతున్నారు
- శాసనమండలిలో చంద్రబాబు



12లో

పచ్చనేతల ఫలహారం

(పోలవరం ముంపు గ్రామాల నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధులు)

రాష్ట్రంలో విలీనమైన పోలవరం ముంపు మండలాల్లో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారు. లేని భూమిని ఉన్నట్లుగా రికార్డులు సృష్టించారు. గిరిజనుల భూములను గిరిజనేతరులకు చెందినట్లుగా మాయ చేశారు. చెరువులు, వాగులు, వంకలు, చివరకు గ్రామీణ రహదారులను కూడా వదలకుండా అవన్నీ సాగు భూములేనంటూ పట్టాలు సృష్టించారు. భూసేకరణ నోటిఫికేషన్ (డ్రాఫ్ట్ నోటిఫికేషన్–డీఎన్)కూ పరిహారం మంజూరు (అవార్డు) జాబితాకూ పొంతనే లేదు. ఫోర్జరీ రికార్డుల ఆధారంగా భూసేకరణ చేసి పరిహారాన్ని కాజేస్తున్నారు. గతంలో సేకరించిన భూములను మళ్లీ కొత్తగా సేకరించినట్లుగా రికార్డులను ఫోర్జరీ చేశారు. ఇప్పుడా భూములను మళ్లీ సేకరించి పరిహారాన్ని కాజేస్తున్నారు. రాష్ట్రం నుంచి దుర్భిక్షాన్ని తరిమికొట్టేందుకు గిరిజనులు చేసిన త్యాగాల పునాదులపై టీడీపీ నేతలు అక్రమార్జనకు వేసుకున్న రాచబాట ఇది. టీడీపీ ముఖ్యనేతల కనుసన్నల్లో ఉన్నతాధికారుల వెన్నుదన్నుతో రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైన అధికార పార్టీ నేతలు.. బినామీలను ముందు పెట్టి ఇప్పటికే కోట్లు కొల్లగొట్టారు. గిరిజనుల జీవితాలను అంధకారమయం చేసి.. వారికి దక్కాల్సిన వేలాది కోట్ల రూపాయలను కాజేసేందుకు స్కెచ్ వేశారు. ఈ దోపిడీకి పోలవరం ప్రాజెక్టు వేదికైంది. ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా భాసిల్లేలా చేయడమే లక్ష్యంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గోదావరిపై 194.6 టీఎంసీల సామర్థ్యంతో 2005లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పోలవరం ప్రాజెక్టులో 287 గ్రామాలు ముంపునకు గురవుతాయి. 1,05,601 కుటుంబాల ప్రజలు నిర్వాసితులు అవుతారు. 1,39,859.68 ఎకరాల భూమి ముంపునకు గురవుతుంది. కుడి, ఎడమ కాలువల తవ్వకానికి, హెడ్ వర్క్స్ నిర్మాణానికి, ముంపునకు గురయ్యే భూమితో కలిపి 1,61,857.01 ఎకరాల భూమిని సేకరించాలి. ఇందులో సుమారు లక్ష ఎకరాలకుపైగా భూమిని 2014కు ముందే ప్రభుత్వం సేకరించింది. కానీ.. అప్పట్లో సేకరించిన భూముల లెక్కలను తారుమారు చేశారు.



నోటిఫికేషన్‌లో ఒకలా.. డిక్లరేషన్‌లో మరోలా..

పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురయ్యే ఏడు మండలాల పరిధిలోని గ్రామాలను తెలంగాణ నుంచి ఏపీలోకి 2014లో కేంద్రం విలీనం చేసింది. అదే సమయంలో టీడీపీ కీలక నేతల దన్నుతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు దోపిడీకి స్కెచ్ వేశారు. ముంపు మండలాల్లో తమకు అనుకూలురైన తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను నియమించుకుని.. రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారు. ఫోర్జరీ చేసిన రికార్డుల ఆధారంగానే భూములను సేకరించి పరిహారాన్ని కాజేయడానికి పథకం వేశారు. అక్రమాలు బహిర్గతం కాకుండా చేసే క్రమంలో నిబంధనలను ఉల్లంఘించారు. అసలైన రికార్డుల ఆధారంగా భూసేకరణ చేయడానికి డీఎన్‌ను జారీచేసిన అధికారులు, వాటిని ఖరారు చేసేందుకు జారీచేసే డ్రాఫ్ట్ డిక్లరేషన్ (డీడీ)లో మాత్రం ఫోర్జరీ రికార్డులను ఆధారం చేసుకున్నారు. దాన్ని ఆధారంగా చేసుకుని నష్టపరిహారం చెల్లించారు. తమ బినామీలను ముందు పెట్టి.. వారి పేర్లతోనే పరిహారం నిధులను మంజూరు చేయించి సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలో భూ బదలాయింపు నిషేధ చట్టం (ఎల్‌టీఆర్)–1970ను తుంగలో తొక్కారు. గిరిజనుల భూములను గిరిజనేతరులకు చెందినట్లుగా చూపి పరిహారం మంజూరు చేయడం గమనార్హం. ఇప్పటివరకూ 1,02,480.90 ఎకరాలను సేకరించినట్లు చెబుతున్న సర్కార్.. పరిహారం రూపంలో రూ.4,922.6 కోట్లను మంజూరు చేసినట్లు ప్రకటించింది. ఇందులో అధిక శాతం నిధులను గిరిజనుల పొట్టకొట్టి బినామీ పేర్లతో టీడీపీ ప్రజాప్రతినిధులు, కీలక నేతలు స్వాహా చేశారు. ఈ బాగోతంలో ఒక జూనియర్ ఐఏఎస్.. మరో సీనియర్ ఐఏఎస్ అధికారులకు, స్థానిక రెవెన్యూ అధికారులకు భారీ స్థాయిలో ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వచ్చాయి.

ఫోర్జరీలో 'రికార్డు'లు

అధికార పార్టీ కీలక నేత సారథ్యంలో.. ఉన్నతాధికారుల నేతృత్వంలో కుకునూరు మండలంలో టీడీపీ నేతలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై రెవెన్యూ రికార్డులను తిరగరాశారు. అసైన్డ్ భూములను పట్టా భూములుగానూ.. లేని భూమిని ఉన్నట్లుగానూ.. చెరువులు, కుంటలు, వాగులు వంకలు, రహదారి ఉన్న భూములను సైతం సాగు భూములుగా చిత్రీకరించి పరిహారం రూపంలో రూ.140 కోట్లకు పైగా స్వాహా చేశారు. ఒక్క ఉప్పేరులోనే రూ.20 కోట్లకు పైగా కాజేశారు.

సేకరించిన భూమినే మళ్లీ సేకరించి..

ముంపు గ్రామాల్లో గతంలో సేకరించిన భూమి ఇందిరాసాగర్ పోలవరం ప్రాజెక్టు పేరుతో రెవెన్యూ రికార్డుల్లో ఉంది. కానీ.. 2014 తర్వాత రికార్డులను తారుమారు చేశారు. ఆ భూమిని సేకరించనట్లుగా చూపారు. దాన్ని కొత్తగా సేకరించాలని ప్రతిపాదించి.. పరిహారాన్ని కాజేశారు. వేలేరుపాడు మండలంలో గతంలో సేకరించిన 500 ఎకరాలకు పైగా భూమిని మళ్లీ సేకరించినట్లు చూపి రూ.50 కోట్లకు పైగా కొల్లగొట్టారు. అందుకు సాక్ష్యాలు ఇవిగో..

- వేలేరుపాడు మండలం కాచారంలో సర్వే నెంబరు 26లో 3.22 ఎకరాల భూమిని గతంలోనే సేకరించారు. ఈ భూమి ఇందిరాసాగర్ పోలవరం ప్రాజెక్టుకు చెందినట్లుగా రికార్డులు ఉన్నాయి. కానీ, రికార్డులను తారుమారు చేసి వాటిని సేకరించనట్లుగా చూపారు. తాజాగా ఆ భూమి ముగ్గురికి చెందినట్లుగా చూపి రూ.40.21 లక్షలను కాజేశారు.
- వేలేరుపాడు మండలం కొత్తూరులో సర్వే నెంబరు 45లో 4.59 ఎకరాల భూమిని గతంలోనే సేకరించారు. ఆ భూమి కూడా ఇందిరాసాగర్ పోలవరం ప్రాజెక్టుకు చెందినట్లుగా రికార్డులు ఉన్నాయి. కానీ.. వాటినీ తారుమారు చేసి ఆ భూమి ఇద్దరికి చెందినట్లుగా చూపి మళ్లీ సేకరించారు. రూ.51లక్షలను స్వాహా చేశారు.

గిరిజనుల పొట్ట కొట్టి..

భూ బదలాయింపు నిషేధ చట్టం–1970 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములను ఇతరుల పేర్లతో బదలాయింపు చేయకూడదు. కానీ, కొందరు రెవెన్యూ అధికారులు టీడీపీ నేతల పేర్లతో గిరిజనుల భూములను మార్చేసి పరిహారం ఇచ్చేశారు. అందుకూ ఆధారాలు ఇవే..

- కుకునూరు మండలం వంజం వారి గుంపులో సర్వే నెంబరు 305లో 27.90 ఎకరాల భూమి ఉంది. ఇందులో 19 ఎకరాల భూమి ముంపునకు గురవుతుంది. ఇందులో కుర్సాని రాజులు అనే గిరిజనుడికి చెందిన ఐదు ఎకరాల భూమిని ఐత సురేష్‌కు చెందినట్లుగా చూపి రూ.54 లక్షలను కాజేశారు. సర్వే నెంబరు 229/6/1లో 2.07, 305/7లో 1.22 ఎకరాలు వెరసి 3.29 ఎకరాల భూమి తెల్లం గుజ్జయ్యకు ఉంది. ఈ భూమి పరిహారాన్ని కూడా కాజేశారు.


ఇదే మండలం ఇబ్రహీంపేటలో సర్వే నెంబరు 35/2లో జెల్ల లక్ష్మయ్యకు 1.04 ఎకరాల భూమి ఉన్నట్లు డీఎన్‌లో ప్రకటించిన అధికారులు.. పరిహారం మంజూరు చేసేటపుడు మాత్రం ఎల్లంకి వెంకటరత్నంకు ఆ సర్వే నెంబరులో 2.21 ఎకరాలు ఉన్నట్లు చూపి రూ.26.51 లక్షలను జేబులో వేసుకున్నారు.

- కుకునూరు మండలం గుంపెనపల్లిలో సర్వే నెంబరు 24లో 12.24 ఎకరాల భూమి సూరి పురుషోత్తం అనే గిరిజనుడికి ఉన్నట్లు డీఎన్‌లో చూపారు. కానీ.. పరిహారం మంజూరుకు వచ్చేసరికి సూరి పురుషోత్తంకు కేవలం 5.15 ఎకరాలే ఉన్నట్లు చూపి మిగిలిన 7.09 ఎకరాల భూమికి చెందిన రూ.76.98 లక్షలను నలుగురి పేర్లతో కాజేశారు.
- వింజరంలో 131 సర్వే నెంబరులో రూ.138.17 ఎకరాల భూమి ఉంటే.. 195 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డులు సృష్టించి రూ.5.02 కోట్లను స్వాహా చేశారు. సీతారామనగరంలోని మరో సర్వే నెంబరులో 129 ఎకరాల భూమి ఉంటే.. 165 ఎకరాల ఉన్నట్లు రికార్డులను ఫోర్జరీ చేసి పరిహారం రూపంలో రూ.3.97 కోట్లను మింగేశారు.





ఉప్పేరులో సర్వే నెంబరు 16లో 0.34, సర్వే నెంబరు 17లో 0.33, సర్వే నెంబరు 18లో 0.32, సర్వే నెంబరు 19లో 1.24 ఎకరాల చొప్పున ఉన్న అసైన్డ్ భూమిని పోలవరం ప్రాజెక్టు కోసం సేకరిస్తున్నట్లు పత్రికల్లో ప్రకటన (పీఎన్) ఇచ్చారు. కానీ, పరిహారం మంజూరు (అవార్డు) చేసేటప్పుడు మాత్రం సర్వే నెంబరు 16లో 23.01, సర్వే నెంబరు 17లో 15.4, సర్వే నెంబరు 18లో 3.38 ఎకరాలు, సర్వే నెంబరు 19లో 5.02 ఎకరాల పట్టా భూమి ఉన్నట్లు చూపి, 14 మంది పేర్లతో రూ.5.07 కోట్ల పరిహారాన్ని స్వాహా చేశారు.



4285	172	2.24	Avula Satyanarayanareddy S/o Pakeerreddy	2730000	1	ANDHRA BANK	2.0191E+14	Kukunoor	ANDB0002019	9.27449E+11	UPPI
4286	172	5.03	Avula Ramanamma W/o Bhadrareddy	5328750	1	ANDHRA BANK	2.0191E+14	Kukunoor	ANDB0002019	7.59728E+11	UPPI
4287	172	1.14	Paraua Jayalakshmi W/o Mutareddy	1417500	1	APGVB	1040013038	Upperu	NILL	3.04723E+11	UPPI

ఉప్పేరులో మరో సర్వే నెంబరు 52లో 2.28 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమి ఉంది. కానీ.. ఆ భూమి ఇల్లంగి వీర విజయభాస్కర్ రావుకు చెందిన పట్టా భూమిగా చూపి రూ.28.35 లక్షలను మింగేశారు. సర్వే నెంబరు 212లో 1.37 ఎకరాల్లో పీడబ్ల్యూడీ రహదారి ఉంది. కానీ, రహదారి ఉన్న భూమిలో ఆవుల జానకిరామిరెడ్డికి 2.37 ఎకరాలు ఉన్నట్లు చూపి పరిహారం రూపంలో రూ.25.71 లక్షలను స్వాహా చేశారు. అలాగే, సర్వే నెంబరు 172/అ.. లో ఆవుల రమణమ్మ పేరుతో 1.03 ఎకరాల భూమి ఉంది. కానీ.. 5.03 ఎకరాల భూమి ఉన్నట్లు చూపి నష్ట పరిహారం రూపంలో రూ.54.57 లక్షలు నొక్కేశారు.


గణపవరంలో సర్వే నెంబరు 17లో 35.21 ఎకరాల భూమి ఉంది. ఇందులో 30.11 ఎకరాలు ప్రభుత్వ భూమే. కానీ.. 17/1లో 5, 17/1/1లో 4.20 వెరసి 9.20 ఎకరాలు కాకర్ల కొమరయ్యకు ఉన్నట్లు పట్టా సృష్టించారు. సర్వే నెంబరు 17/2లో నాలుగు ఎకరాల భూమి తోట పున్నయ్యకు ఉన్నట్లు రికార్డులు తయారుచేశారు. ఆ ఇద్దరి పేర్లతో భూమి లేకపోయినా 13.20 ఎకరాల ఉన్నట్లు సృష్టించి రూ.52.50 లక్షలు స్వాహా చేశారు. పెదరావిగూడెంలో సర్వే నెంబరు 211లో 0.32 ఎకరాల విస్తీర్ణంలో కుంట ఉంది. కానీ, ఆ సర్వే నెంబరులో గణప రమణయ్యకు 1.11 ఎకరాల ఉన్నట్లు చూపి రూ.13.38 లక్షలు, అగ్నిపర్తి నాగయ్యకు 0.32 ఎకరాల ఉన్నట్లు చూపి రూ.8.4 లక్షలు స్వాహా చేశారు.





ఉప్పేరులోని సర్వే నెంబరు 970 నుంచి 1007 వరకూ 25.30 ఎకరాల ఖాల్సా (ఇనామ్) భూమి ఉంది. ఇందులో 23 ఎకరాలను మాత్రమే పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురవుతుందని తేల్చిన జలవనరుల శాఖాధికారులు.. ఆ భూమినే సేకరించాలని ప్రతిపాదించారు. కానీ.. రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, ఆ సర్వే నెంబర్ల పరిధిలో 39.11 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు. అంటే.. 15.81 ఎకరాల భూమి లేకపోయినా ఉన్నట్లుగా చూపారు. దీనిని సేకరించి 31మంది పేర్లతో రూ.1.71కోట్లను పంచుకు తిన్నారు.

కౌలుకు తీసుకుని మోసం చేశారు



నాకు ఉన్న ఐదు ఎకరాల భూమిని ఐత సురేష్‌కు కౌలుకు ఇచ్చిన. జామాయిల్ పంట వేశాడు. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న నా భూమిని ప్రభుత్వం సేకరించింది. కానీ, పట్టాదారుడైన నాకు పరిహారం ఇవ్వలేదు. ఐత సురేష్‌కు పరిహారం మంజూరు చేసి నా పొట్ట కొట్టారు. రెవెన్యూ అధికారులు, టీడీపీ నేతలు కుమ్మక్కై నాకు అన్యాయం చేశారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితంలేదు.

– తెల్లం గుజ్జయ్య, గిరిజనుడు, వంజం వారి గుంపు

కుటుంబాన్ని రోడ్డున వేశారు



మా కుటుంబానికి ఉన్న 3.29 ఎకరాల పొలాన్ని ఐత సురేష్‌కు కౌలుకు ఇచ్చిన. జామాయిల్ పంట వేశాడు. పోలవరం ప్రాజెక్టులో మా భూమి ముంపునకు గురౌతుందని అధికారులు చెప్పారు. పరిహారం మంజూరైతే మరోచోట పొలం కొనుక్కుని బతుకుదామని ఆశ పెట్టుకున్నాం. కానీ.. పరిహారాన్ని ఐత సురేష్‌కు మంజూరు చేసి మా కుటుంబాన్ని రోడ్డున పడేశారు. ఐటీడీఏ అధికారులకు, తహసీల్దార్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. *– మిచ్చి రాజులు కుటుంబం, వంజం వారి గుంపు*

రికార్డులు తారుమారు చేసి పొట్టకొట్టారు



కుకునూరు మండలం ఉప్పేరు పంచాయతీ పరిధిలోని ఆంబోతులగూడెంలో సర్వే నెంబర్ 80, 85, 91లలో నా తండ్రి ఇల్లంగి ఇమాన్యుయేలుకు 12.09ఎకరాల భూమి ఉంది. సర్వే నెంబర్ 80లో ఉన్న 3.13 ఎకరాల భూమి వివాదంలో ఉందని చూపారు. సర్వే నెంబర్ 85లో ఉన్న 4.27 ఎకరాల భూమి నా పేరుపై ఉన్నట్లు చూపారు. సర్వే నెంబర్ 91లో భూమి లేదన్నారు. కోర్టులో కేసు వేస్తే భూసేకరణ అధికారివద్ద తేల్చుకోవాలని సూచించింది. అక్కడా అన్యాయం చేశారు. నాకు దక్కాల్సిన రూ.90 లక్షల పరిహారాన్ని కాజేశారు.

– ఇల్లంగి పుల్లారావు, ఆంబోతులగూడెం, కుకునూరు మండలం

గిరిజనులను ముంచేశారు



పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో రెవెన్యూ అధికారులు, టీడీపీ నేతలు కుమ్మక్కై గిరిజనులకు తీరని ద్రోహం చేశారు. రికార్డులను తారుమారు చేసి.. గిరిజనేతరులకు పరిహారం ఇచ్చి, గిరిజనులను ముంచేశారు. గతంలో సేకరించిన భూములనే మళ్లీ సేకరించి పరిహారం కాజేశారు. భూసేకరణలో అక్రమాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరినా స్పందించలేదు.

– ఎస్కే గౌస్ పాషా, మండల కార్యదర్శి, సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ

ఈసెట్ నోటిఫికేషన్ విడుదల

జేఎన్‌టీయూ: ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2018 నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఈసెట్ రాష్ట్ర కన్వీనర్ ఆచార్య పీఆర్ భానుమూర్తి తెలిపారు. మే 3వ తేదీన ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 14వ తేదీలోగా http:// www. sche. ap. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మూడు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం!

సాక్షి, అమరావతి: రాష్ట్రం నుంచి ఎన్నికవ్వాల్సిన మూడు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. మూడు స్థానాలకు నలుగురే నామినేషన్లు దాఖలు చేయడం, అందులో ఒకటి డమ్మీ అభ్యర్థి కావడంతో ఏకగ్రీవం లాంఛనమే. మంగళవారం నామినేషన్ల స్క్రుటినీ జరగనుంది. దాఖలైన నామినేషన్లను రిటర్నింగ్ అధికారి పరిశీలించి అవి సరిగా ఉన్నాయో లేదో నిర్ధారిస్తారు. 15వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. రాష్ట్రానికి చెందిన 3 రాజ్యసభ స్థానాలకు టీడీపీ అభ్యర్థులుగా సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రకుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం అసెంబ్లీలో రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యనారాయణకు వారు నామినేషన్ల పత్రాలు అందించారు. ఇద్దరూ రెండేసి సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. మరో స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ వేయగా, డమ్మీగా ఆయన భార్య మరో నామినేషన్ వేశారు. ప్రభాకర్‌రెడ్డి తరఫున పీఏసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ముస్తఫా కలిసి అదనపు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి సత్యనారాయణకు అందించారు.

అందుకే రవీంద్ర ఎంపిక: చంద్రబాబు : పార్లమెంటులో అన్ని పార్టీలకు న్యాయవాదులున్నారని, తమ పార్టీకే లేరని, అందుకే రవీంద్ర కుమార్‌ను రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రవీంద్ర 20 ఏళ్ల నుంచి పార్టీకి సేవ చేస్తున్నారన్నారు. పార్టీకి సంబంధించిన అన్ని కేసులను ఆయనే వాదించే వాడని చెప్పారు.

ఇతర పార్టీల సాయంతో పోరాటం : ఇతర రాజకీయ పార్టీల సాయంతో రాష్ట్ర విభజన హామీల సాధనకు కృషిచేస్తానని రాజ్యసభ సభ్యత్వానికి నామినేషన్ దాఖలు చేసిన సీఎం రమేష్ మీడియాకు తెలిపారు. రెండోసారి తనకు అవకాశం ఇచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయపరమైన సేవలు చేసినందుకు టీడీపీ తనకు రాజ్యసభ సీటు కేటాయించిందని నామినేషన్ అనంతరం కనకమేడల రవీంద్ర కుమార్ మీడియాతో అన్నారు. తనకు అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయంపై పోరాటం చేస్తానని చెప్పారు.

టీడీపీ కేసులు వాదించేది రవీంద్రే

సాక్షి, హైదరాబాద్: రెండు దశాబ్దాలకు పైగా టీడీపీ న్యాయ విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్న కనకమేడల రవీంద్రకుమార్ పార్టీకి అందిస్తూ వచ్చిన సేవలే ఆయనకు రాజ్యసభ సీటు వచ్చేలా చేశాయి. కోర్టు, పార్టీ కార్యాలయంలో ఎప్పుడూ నేతలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండటంతో ఆయన న్యాయ విభాగానికి ఇన్నేళ్లపాటు అధ్యక్షుడిగా కొనసాగగలిగారు. అంతేకాకుండా పలు కీలక కేసుల్లో పార్టీ, చంద్రబాబు తరపున వాదనలు వినిపించారు. చంద్రబాబు ఆస్తులపై ఏసీబీ కోర్టులో లక్ష్మీపార్వతి దాఖలు చేసిన కేసులో, లిక్కర్ స్కామ్‌కు సంబంధించి చంద్రబాబుపై కాంగ్రెస్ నాయకుడు కృష్ణకుమార్ గౌడ్ దాఖలు చేసిన కేసులో కూడా బాబు తరపున వాదనలు వినిపించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో దాదాపు రూ.600 కోట్ల మేర అవినీతి జరిగిందంటూ టీడీపీ న్యాయవాది వజ్జాల శ్రీనివాసరావు ఏసీబీ కోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వంపై దాఖలు చేసిన కేసులోనూ రవీంద్ర కుమార్ వాదించారు. ఓటుకు కోట్లుకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన కేసులో కూడా టీడీపీ తరపున కోర్టుకు హాజరయ్యారు. ఇదే కేసులో ముత్తయ్య తరపున కూడా వాదనలు వినిపించారు. ఇవేకాకుండా ఇడుపులపాయ భూముల కేసు, బ్రాహ్మణి స్టీల్‌ప్లాంట్ భూముల కేసుల్లోనూ టీడీపీ నేతల తరపున కోర్టుల్లో వాదించారు. బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్‌లపై నమోదైన కేసులను కూడా చూశారు.

రాజ్యసభ అభ్యర్థుల ఆస్తులివే..


సాక్షి, అమరావతి: రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసిన టీడీపీ నేతలు సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రకుమార్, వైఎస్సార్ సీపీ నేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తమ ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సీఎం రమేశ్ తన కుటుంబ ఆస్తుల విలువను రూ.258.17 కోట్లుగా చూపించారు. తన పేరుతో రూ.145.51 కోట్లు, తన భార్య పేరుతో 65.98 కోట్లు, ఇద్దరు కుమారుల పేర్ల మీద 6.61 కోట్ల స్థిరాస్తులున్నట్లు తెలిపారు. అలాగే తన పేరుతో రూ.34.41 కోట్లు, భార్య పేరు మీద రూ.5.37 కోట్లు, పిల్లలిద్దరి పేర్ల మీద రూ.30.5 లక్షల చరాస్తులున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో తనకు రూ.18.06 కోట్లు, తన భార్యకు రూ.21.18 కోట్ల అప్పులున్నట్లు వెల్లడించారు. తనకు 3.98 కేజీల బంగారం, తన భార్యకు రూ.3.14 కేజీల బంగారు ఆభరణాలున్నట్లు పేర్కొన్నారు. తాను డిగ్రీ(డిస్‌కంటిన్యూ) ఉత్తీర్ణుడు కాలేకపోయినట్లు వివరించారు. తనపై ఓ క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్నట్లు సీఎం రమేష్ తెలిపారు.

వేమిరెడ్డి ఆస్తులు రూ.230 కోట్లు..

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన ఆస్తుల విలువను రూ.230.24 కోట్లుగా చూపించారు. తన పేరుతో రూ.157 కోట్లు, తన భార్య పేరు మీద రూ.13.01 కోట్ల స్థిరాస్తులున్నాయని తెలిపారు. అలాగే తన పేరు మీద రూ.47.05 కోట్ల చరాస్తులు, భార్య పేరు మీద రూ.12.45 కోట్ల చరాస్తులున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో రూ.96.87 కోట్ల మేర అప్పులున్నట్లు వెల్లడించారు.

రవీంద్రకు రూ.4.38కోట్ల ఆస్తులు

టీడీపీ అభ్యర్థి కనకమేడల రవీంద్రకుమార్ తన ఆస్తుల విలువను రూ.4.38 కోట్లుగా చూపించారు. తన పేరుతో 27.38 లక్షలు, తన భార్య పేరుతో రూ.13.52 లక్షల చరాస్తులున్నట్లు తెలిపారు. అలాగే తన పేరు మీద రూ.2.95 కోట్ల స్థిరాస్తులు, తన భార్య పేరుతో రూ.1.03 కోట్ల స్థిరాస్తులున్నాయని పేర్కొన్నారు.



@ysjagan

రాజన్న రాజ్యం తిరిగితెస్తాం

- పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వైఎస్ జగన్ ట్వీట్
- పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రాజన్న రాజ్యాన్ని తిరిగి తీసుకురావడానికి 8 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ఆదరాభిమానాలు చూపిస్తున్న కార్యకర్తలు, ప్రజలకు పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ట్విట్టర్‌లో సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. 'సరిగ్గా 8 ఏళ్ల క్రితం ఇదే రోజు విలువలతో కూడిన రాజకీయాలను అందించేందుకు.. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను నెరవేర్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పురుడు పోసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కుల సాధన కోసం అండగా నిలుస్తూ.. పోరాడుతూ రాజన్న రాజ్యాన్ని తిరిగి తెస్తాం. దీనికోసం కార్యకర్తలు చూపిస్తున్న అభిమానం, పార్టీ పట్ల విధేయతకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. మద్దతు తెలుపుతున్న ఆంధ్ర ప్రజలకు నా కృతజ్ఞతలు' అంటూ ట్వీట్ చేశారు.



అవిశ్వాస తీర్మానానికి సిద్ధం

- వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీల స్పష్టీకరణ
- ఏప్రిల్ 6న రాజీనామా చేస్తామని వెల్లడి
- పోరాటం ఫలిస్తుందన్న ఎంపీలు
- పార్లమెంటు ఆవరణలో ధర్నా.. సభల్లో ఆందోళన



పార్లమెంటు బయట ఆందోళన చేస్తున్న ఎంపీలు మిథున్‌రెడ్డి, మేకపాటి, విజయసాయిరెడ్డి, వరప్రసాదరావు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, ఏప్రిల్ 6న రాజీనామాలు చేస్తామని వైఎస్సార్‌సీపీ ఎంపీలు పునరుద్ఘాటించారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం సోమవారం పార్లమెంటులో ఆందోళన కొనసాగించారు. ఉదయం 10.30 గంటలకు పార్లమెంటు భవనం ప్రధాన ద్వారం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రత్యేక హోదా కోసం నినదిస్తూ ధర్నా చేశారు. పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వి.వరప్రసాదరావు, మిథున్‌రెడ్డి ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ.. 'కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. పలు పార్టీలు మద్దతు ఇస్తాయని ఆశిస్తున్నాం. మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. టీడీపీ అవిశ్వాస తీర్మానం పెట్టినా మద్దతిస్తామని చెప్పారు. మేం పెట్టినా వాళ్లు ఇవ్వాలని అడిగారు. మా పోరాటంలో భాగంగా వచ్చే నెల 6వ తేదీన రాజీనామాలు సమర్పిస్తాం. అవిశ్వాస తీర్మానానికి వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి. టీడీపీ కూడా మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఒక్క రోజులో వచ్చింది కాదు. పోరాటం చేసే ఏదైనా సాధించుకోగలం. ఏపీకి ప్రత్యేక హోదా ప్రాణవాయువు. మా పోరాటం ఫలిస్తుందని నమ్ముతున్నాం' అని అన్నారు. ధర్నా అనంతరం ఉభయ సభల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆందోళన కొనసాగించారు. లోక్‌సభ ప్రారంభం కాగానే మేకపాటి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాదరావు, మిథున్‌రెడ్డి వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. విభజన హామీలపైనే టీడీపీ సభ్యులు గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేసి తర్వాత లోక్‌సభ వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, ఏఐఏడీఎంకే సభ్యులు ఆందోన చేయడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఎంపీ విజయసాయిరెడ్డి, టీడీపీ సభ్యులు పలు అంశాలపై ఆందోళన చేయడంతో ఉపసభాపతి కురియన్ సభను మంగళవారానికి వాయిదావేశారు.


జేఈవోకు చెక్కును అందజేస్తున్న ప్రసన్నకుమార్

టీటీడీ స్విమ్స్ పథకానికి రూ.కోటి విరాళం

సాక్షి, తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం స్విమ్స్ పథకానికి సోమవారం రూ.కోటి విరాళంగా అందింది. బెంగళూరుకు చెందిన జి.ప్రశాంత్ నారాయణ ఈ విరాళాన్ని ఇచ్చారు. దాత తరఫున ప్రసన్నకుమార్ అనే వ్యక్తి తిరుమలలో జేఈవో కేఎస్.శ్రీనివాసరాజును కలసి రూ.కోటిని చెక్కును అందజేశారు.

ఫిరాయింపుదారుల్ని అనర్హుల్ని చేయండి

- హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పిల్
- వ్యాజ్యాన్ని నేడు విచారించనున్న ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల్లో గెలిచి, అనంతరం అధికార తెలుగుదేశం పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. పార్టీ ఫిరాయించి మంత్రి పదవులు పొందిన ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, సుజయ కృష్ణ రంగారావు, చిదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, భూమా అఖిలప్రియలకు రాజ్యాంగం ప్రకారం ఆ పదవుల్లో కొనసాగే అర్హత ఎంత మాత్రం లేదని, అందువల్ల వారి మంత్రి పదవులను రద్దు చేయాలని కోరుతూ ప్రకాశం జిల్లా, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఫిరాయింపుదారులు ఎమ్మెల్యేలుగా కొనసాగేందుకు అర్హులు కారని, ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఒక్కొక్కరికి రోజుకు రూ. 500 చొప్పున పెనాల్టీ విధించాలని ఆయన తన పిటిషన్‌లో కోర్టును కోరారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా కొనసాగకుండా ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయాలని అభ్యర్థించారు. ఫిరాయింపుదార్లపై స్పీకర్ నిర్ణయం కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, కోర్టులు నేరుగా నిర్ణయాన్ని వెలువరించవచ్చునని సుప్రీంకోర్టు తెలిపిందన్నారు. పిటిషన్‌లో న్యాయశాఖ కార్యదర్శి, అసెంబ్లీ కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు. ఫిరాయింపుదారులైన నలుగురు మంత్రులు, 18 మంది ఎమ్మెల్యేలను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు.

నా ఆలోచన బయటకెందుకు చెబుతాను?

- 14న జరిగే సభలో అన్ని విషయాలు వెల్లడిస్తా
- కాజలో ఇంటికి పవన్ కల్యాణ్ భూమి పూజ


గుంటూరు జిల్లా కాజలో నూతన ఇంటికి భూమిపూజ చేస్తున్న పవన్‌కల్యాణ్ దంపతులు.

సాక్షి, అమరావతి: 'నా ఆలోచన ఏంటో బయటకెందుకు చెబుతాను' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఈ నెల 14న గుంటూరు జిల్లా కాజలో జరిగే సభలో అన్ని అంశాలకు స్పష్టతనిస్తానని వెల్లడించారు. సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో సొంత ఇంటి నిర్మాణానికి పవన్ కల్యాణ్ దంపతులు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మీ వెనుక ఉండి రాజకీయాలు చేయిస్తోంది సీఎం చంద్రబాబు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో సహా ఇతర పార్టీలు విమర్శిస్తున్నా ఒక్కసారి కూడా ఎందుకు ఖండించలేదని విలేకరులు ప్రశ్నించగా 'నేను ఎలా ఆలోచిస్తున్నానో బయటకు ఎందుకు చెబుతాను. సమయం, సందర్భాన్ని బట్టి చెప్పుకుంటూ వెళ్తాను. నేను ఇలా అనుకుంటున్నాను.. నా అభిప్రాయం ఇది అని ఎందుకు చెబుతాను. నాపై విమర్శలు చేసిన వారు అన్నీ చెబుతున్నారా' అని బదులిచ్చారు. పవన్ రాజకీయాలకు కథ, స్క్రీన్ ప్లే అంతా చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ నేతలంటున్నారని ప్రశ్నించగా 'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నరేంద్రమోదీ దర్శకత్వం వహిస్తున్నారా? అలా అంటే వారికి ఎలా ఉంటుంది? నన్ను బీజేపీతో కూడా అనుకోవచ్చుగా, ఎందుకు చంద్రబాబుతోనే అనుకుంటున్నారు' అని ఎదురు ప్రశ్నించారు. ప్రత్యేక హోదా అంశంతోపాటు టీడీపీ మంత్రుల రాజీనామా తదనంతర పరిణామాలపై పార్టీ ఆవిర్భావ మహాసభలో మాట్లాడతానని చెప్పారు. జనసేన రాజకీయంగా ఎలాంటి స్టాండ్ తీసుకోబోతుంది అభిమానులందరి సమక్షంలోనే ప్రకటిస్తానని వెల్లడించారు. కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఎప్పటి నుంచో చెబుతున్నానని, ఎవరినీ వెనుకేసుకు రాలేదని స్పష్టం చేశారు.

సమయం వచ్చినప్పుడు ఆస్తులు ప్రకటిస్తా..

ఉగాది వరకు విజయవాడలో ఉంటానని.. సభ తర్వాత ఒక్కొక్క నిర్ణయాన్ని పార్టీ ప్రకటిస్తుందన్నారు. పార్టీకి యువతతోపాటు అనుభవం ఉన్న నాయకులు అవసరమని తెలిపారు. తన ఆస్తులు ప్రకటించకపోతే ఇబ్బందులు వస్తాయని భయపడనని, సమయం వచ్చినప్పుడు ఆస్తులను ప్రకటిస్తానని పేర్కొన్నారు. 12 మంది అధికార ప్రతినిధుల జాబితాను త్వరలో వెల్లడించనున్నట్టు చెప్పారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

15 నుంచి 29 వరకు పదో తరగతి పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి 29 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. దీనికి సంబంధించి పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు పూర్తి చేసింది. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 6,17,484 మంది విద్యార్థులు హాజరు కానుండగా, మొత్తం 2835 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణపై మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి పాఠశాల విద్యాశాఖాధికారులు, జిల్లాల విద్యాశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి విద్యార్థి బల్లపై కూర్చొని పరీక్ష రాయాలని, అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాల్సిందేనన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సదుపాయాలపై దృష్టి సారించాలని, అక్కడ పర్యటించాలని డీఈవోలకు సూచించారు. యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా వేధిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమస్యాత్మక సెంటర్లలో సీసీటీవీలు ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తెలుసుకోవడానికి సెంటర్ లొకేషన్ యాప్‌ను రూపొందించామని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సంధ్యారాణి చెప్పారు. సమీక్షలో ఎస్ఎస్ఏ ఎస్పీడీ జి.శ్రీనివాసులు, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వీఎస్.భార్గవ, ఆర్జేడీలు, అన్ని జిల్లాల డీఈవోలు పాల్గొన్నారు.

అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

పరీక్ష సమయానికి అర గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి రావాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు సూచించారు. పరీక్షకు ముందురోజే పరీక్ష కేంద్రాలను చూసుకోవడం మంచిదని, ట్రాఫిక్ ఇతర సమస్యలను దృష్టిలో పెట్టుకొని నిర్ణీత సమయం కంటే ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా సన్నద్ధమవ్వాలన్నారు. ఇతర సమస్యలు ఎదురైతే 08662974450, 08662974550 నంబర్లకు ఫోన్ చేయొచ్చని తెలిపారు. కాగా.. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్ష కేంద్రాల వద్ద దింపి, మళ్లీ తీసుకురావడానికి పాఠశాల విద్యాశాఖ ఆర్టీసీతో చర్చిస్తోంది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఆర్టీసీ అధికారులు పరీక్షల రోజుల్లో విద్యార్థులు టెన్త్ హాల్‌టికెట్ చూపితే ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

పీఎస్ఎల్వీ సీ-41 అనుసంధానంలో సాంకేతిక లోపం

శ్రీహరికోట (సూళ్లూరుపేట): శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగ కేంద్రం సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో మొదటి ప్రయోగ వేదికపై పీఎస్ఎల్వీ సీ–41 రాకెట్ అనుసంధానం పనుల్లో సోమవారం రాత్రి సాంకేతిక లోపం తలెత్తి పీఎస్–2 దశను వెనక్కి తీసుకొచ్చేశారు. రాకెట్ మొదటి దశను (పీఎస్–1) ఇటీవల పూర్తి చేసి రెండో దశను (పీఎస్–2) అనుసంధానం చేసేందుకు సోమవారం లాంచ్ ప్యాడ్ వద్దకు తీసుకెళ్లారు. పీఎస్–1 నుంచి పీఎస్–2కు కనెక్షన్ ఇచ్చే ఎలక్ట్రానిక్స్ కేబుల్స్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో అనుసంధానాన్ని నిలిపేశారు. దీంతో అనుకున్న తేదీకి రాకెట్‌ను ప్రయోగించలేక పోగా కొంత జాప్యం చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ నెల 29 సాయంత్రం ప్రయోగించేందుకు పనులు ముమ్మరం చేస్తున్నారు.

సాక్షి

మంగళవారం, మార్చి, 13

'మహా' రైతు విజయం!

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఈమధ్య చాన్నాళ్లనుంచి 'రైతు అనుకూల బడ్జెట్'లను ప్రవేశపెట్టడంలో పోటీపడుతున్నాయి. రైతులకు రుణాలను మాఫీ చేస్తామనడం, కొన్ని నెలలు గడిచాక మాఫీ చేశామని చెప్పడం కూడా రివాజుగా జరుగుతున్నదే. కానీ ఇప్పుడు రోజులు మారాయి. చేసిన వాగ్దానాలకూ, వాటన్నిటినీ తీర్చామని చెబుతున్న లెక్కలకూ పొంతన లేకపోవడాన్ని గమనించి, ఆగ్రహించి మహారాష్ట్ర రైతులు మారుమూల గ్రామాలనుంచి ఆరు రోజులపాటు 'లాంగ్‌మార్చ్' నిర్వహించి ముంబై మహా నగరానికి వెల్లువలా తరలివచ్చారు. రాష్ట్ర అధికార పీఠం కొలువుదీరిన 'మంత్రాలయ'ను సోమ వారం దిగ్బంధించడానికి సంసిద్ధులయ్యారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రతిష్టకూ పోకుండా, రైతులను రెచ్చగొట్టకుండా వారడిగిన డిమాండ్లలో పదింటిని నెరవేర్చడానికి లిఖితపూర్వకంగా ఒప్పుకుని సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించింది. పర్యవసానంగా రైతులు ఆ మహానగరం నుంచి ప్రశాంతంగా తమ తమ ప్రాంతాలకు నిష్క్రమించారు. సీపీఎం అనుబంధ సంస్థ అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో సాగిన ఈ యాత్ర అనేకవిధాల విశిష్టమైనది.

చెప్పినవి చేయకపోవటం, పైగా అన్నీ చేశామని దబాయించడం అలవాటుగా మార్చుకున్న పాలకులు ఇలాంటి లిఖితపూర్వక ఒప్పందాలను మాత్రం ఎంతవరకూ ఖాతరు చేస్తారని సంశయిస్తున్నవారు లేకపోలేదు. అలా జరిగినా ఆశ్చర్యం లేదు కూడా. కానీ ప్రశ్నించడాన్నయినా, నిరసనలనైనా అంగీకరించలేని మనస్తత్వం పాలకుల్లో పెరిగిపోతున్న వర్తమానంలో ఫడణవీస్ అందుకు భిన్నంగా వ్యవహరించారు. వారి నిరసన గళం ముంబై వీధుల్లో వినబడనీయకూడదన్న పట్టుదలకు పోలేదు. ఎక్కడికక్కడ పోలీసుల్ని పెట్టి మార్గమధ్యంలో అరెస్టులు చేయించలేదు. ఆ ఒరవడిలోనే లిఖితపూర్వక ఒప్పందం విషయంలోనూ వ్యవహరిస్తే అది ఆయనకే మేలు చేస్తుంది. లేన ట్టయితే రైతులకు వారి పంథా వారికుంటుంది. ఈ రైతులంతా ఆదివాసీలు. ఈ 'లాంగ్ మార్చ్'లో యువ రైతులు మొదలుకొని వృద్ధుల వరకూ ఉన్నారు. కొందరు తల్లులు తమ పిల్లల్ని కూడా తీసుకొచ్చారు. కాళ్లకు చెప్పుల్లేనివారూ, అనారోగ్యంబారిన పడినవారూ, కట్టుకోవడానికి సరైన బట్టల్లేనివారూ ఈ 50,000మందిలో ఉన్నారు. వీరంతా ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్నామంటున్న రుణాలను పొందలేక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక మొత్తాల్లో అప్పులు చేసి సేద్యం సాగించినవారు. విత్తనాలు మొదలుకొని ఎరు వులు, పురుగుమందుల వరకూ అన్నిటి ధరలూ పెరిగిన కారణంగా ఖర్చు తడిసిమోపెడై ఊపిరాడని స్థితికి చేరుకున్నవారు. ఈ కష్టాలన్నిటికీ ప్రకృతి వైపరీత్యాలు తోడై చివరకు దిగుబడి సమయానికి పంటలకు గిట్టుబాటు ధర రాక చితికిపోతున్నవారు. ప్రభుత్వాలు అమలు చేసే రకరకాల ప్రాజెక్టుల కార ణంగా కొంపా గోడూ పోగొట్టుకుంటూ నిరాశ్రయులవుతున్నవారు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడుతున్నవారు. అందువల్లే ఈ రైతులు కేవలం రుణమాఫీని మాత్రమే డిమాండ్ చేయలేదు. అటవీ హక్కుల పరిరక్షణ చట్టం కింద తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని, స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా పంటలకు గిట్టుబాటు ధరలు నిర్ణ యించాలని, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. అకాల వర్షాల వల్ల, చీడపీడల వల్ల నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లాగే మహారాష్ట్ర రైతులు కూడా వరస కరువుల్ని ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలోని కోటి 37 లక్షలమంది రైతుల్లో 78 శాతంమంది చిన్న, సన్నకారు రైతులు. ప్రభుత్వం అమలు చేశామంటున్న రుణమాఫీతో సహ ఏదీ సక్రమంగా ఈ రైతులకు దక్కలేదు. అందుకే రైతుల్లో ఇంతగా అసంతృప్తి.

ఈ రైతు యాత్రను 'లాంగ్ మార్చ్'గా పిలవడం వల్లనో, ఎర్రజెండాలు దండిగా కనిపించడం వల్లనో, ఆదివాసీలు అధికసంఖ్యలో ఉన్నందువల్లనో బీజేపీ ఎంపీ పూనమ్ మహజన్‌కు ఇది 'మావోయిస్టుల' యాత్రగా, అందులోని వారు పట్టణ మావోయిస్టులుగా కనబడ్డారు. ఈ రైతు యాత్ర సాగిన వారం రోజులూ ఒక్కటంటే ఒక్క అపశ్రుతి చోటు చేసుకోకపోవడం, అందులో పాల్గొన్నవారంతా ఎంతో క్రమశిక్షణతో మెలగడం అందరినీ ఆకట్టుకుంది. అంత కన్నా ముఖ్యమైనదేమంటే ఈ యాత్రకు పట్టణ, నగర ప్రాంతాల పౌరుల నుంచి వచ్చిన స్పందన. యాత్ర ప్రారంభమైన నాసిక్‌లోగానీ, ఆ తర్వాత థాణేలోగానీ, ముంబైలోగానీ ఆ రైతులకు పౌరులు ఘన స్వాగతం పలికిన తీరు అమోఘం. పాదరక్షలు లేకుండా నిరంతరాయంగా నడవటం వల్ల అరికాళ్లకు పుళ్లు పడి ఇబ్బందిపడుతున్నవారిని గమనించి వాటిని కొని పంచినవారు కొందరైతే, తమ పాదరక్షల్ని ఇచ్చినవారు మరికొందరు. వివిధ సామాజిక సంస్థల నిర్వాహకులు ఆ రైతుల ఆకలిదప్పుల్ని తీర్చారు. కొన్ని ఆసుపత్రులు, కొందరు వైద్యులు స్వచ్ఛందంగా రైతులకు వైద్య సేవలందించారు. ఈ ఉద్యమం కారణంగా తమ పిల్లల పదో తరగతి పరీక్షలకు అంతరాయం కలుగుతుందని, సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం అసాధ్యమవుతుందని తల్లిదండ్రులు ఆందోళనపడ్డారు. అది తెలుసుకుని నిర్వాహకులు యాత్రలో కొన్ని మార్పులు చేసుకున్నారు. పర్య వసానంగా విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా పరీక్ష పూర్తయ్యాక రైతుల దగ్గరకెళ్లి కృతజ్ఞతలు చెప్పారు. కమ్యూనిస్టులంటే ససేమిరా గిట్టని శివసేన ఈ యాత్రకు మద్దతు ప్రకటించడం ఒక విశేషమైతే...తమ పార్టీ ఎంపీ తెలిసీ తెలియక మాట్లాడిన మాటలను బీజేపీ తిరస్కరించడం మరో విశేషం. ఈ ఆందోళన మహారాష్ట్ర పాలకులకు మాత్రమే కాదు... అన్ని రాష్ట్రాల పాలకులకూ హెచ్చరికే. వాగ్దానాలిచ్చి మాట తప్పితే రైతులు మునుపటిలా మౌనంగా ఉండరని, తిరగ బడతారని వారు గుర్తించడం ఉత్తమం.



జాతీయ సౌభాగ్యానికి ప్రాథమిక వనరు వ్యవసాయం. రైతు సౌభాగ్యానికి దారి తీయని వ్యవసాయం వృథా.

– జేజే మేప్స్
అమెరికన్ ఆవిష్కర్త, విద్యావేత్త

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.ఏకాదశి ప.1.10 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం ఉత్తరాషాఢ ప.12.13 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం సా.4.37 నుంచి 6.22 వరకు, దుర్ముహూర్తం ఉ.8.34 నుంచి 9.24 వరకు, తదుపరి రా.10.55 నుంచి 11.44 వరకు, అమృతఘడియలు తె.3.11 నుంచి 4.55 వరకు.


సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ప 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	5.14	మగ్రీబ్	6.26
జొహర్	12.26	ఇషా	7.38
అసర్	4.45		

వితండవాదమే ఒక విధ్వంసం

విశ్లేషణ



ఐవైఆర్ కృష్ణారావు


విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా నష్టపోయినది– హైదరాబాద్ మహా నగరం. ఆ నగరం ద్వారా వచ్చే ఆదాయ వనరులు. నిజానికి ఈ మహా నగరాన్ని అంతా కలసి నిర్మించుకున్నాం. ఇంతకు మించి రాష్ట్రానికి జరిగిన నష్టం ఏదీ లేదు. ఈ నష్టానికి కూడా పూర్తిగా కాకపోవచ్చు, కానీ ఎంతో కొంత కేంద్రం నుంచి పరిహారం వచ్చింది. విభజనతో నష్టం, కేంద్రం సహాయ నిరాకరణ అంటూ అవే విషయాలను, విమర్శలను పదే పదే ప్రస్తా విస్తూ దాని నుంచి రాజకీయ లబ్ధి పొందాలని పాకులాడడం సరికాదు.

గుంటూరు జిల్లా కాకానిలో ఈమధ్య జరిగిన ఒక బహిరంగ సభలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే నుంచి వైదొలగకపోయినా, కేంద్ర మంత్రిమండలి నుంచి తెలుగుదే శం పార్టీ సభ్యులూ రాష్ట్ర మంత్రివర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేలూ రాజీనా మాలు సమర్పించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చర్చనీయాంశ మనే చెప్పాలి. కొందరు వ్యక్తులు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాన్ని లెక్కలు చూపించమని అడుగుతున్నాయనీ, కానీ అది సాధ్యం కాదనీ, అడగడం సరికాదనీ ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభు త్వం కూడా సార్వభౌమాధికారం కలిగిన వ్యవస్థలేనని ఆయన వాదన. ఒక వేళ దేని గురించి అయినా సమాధానమో, వివరణో ఇవ్వవలసి వస్తే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కూ, రాష్ట్ర ప్రభుత్వం శాసనసభకూ సమాధానం చెప్పు కోవాలని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. అంతేతప్ప ఇంకెవరికీ జమా ఖర్చులు చెప్పవలసిన అవసరం లేదని భాష్యం చెప్పారు. అంతేకాదు, రాష్ట్ర విభజన హేతుబద్ధంగా జరగలేదనీ, దీనితో ఆంధ్రప్రదేశ్‌కు తీరని నష్టం వాటిల్లిందనీ అంటూ, ఇందువల్ల పంజాబ్, అస్సాం రాష్ట్రాల తరహాలో వెళితే ఆంధ్రప్రదేశ్ మరింతగా నష్టపోక తప్పదని కూడా చంద్రబాబు విశ్లే షించారు. అసలు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరుపుకోకుండా, దానికి బదులు నవ నిర్మాణదీక్షా దినాన్ని జరుపుకోవడం వెనుక ఆర్థిక పరిస్థితులే ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. అంతేకాకుండా, రాష్ట్రానికి న్యాయం జరగని పక్షంలో విభజన శక్తులు విజృంభిస్తాయని పార్లమెంట్ సభ్యుడొకరు హెచ్చరిక వంటి వ్యాఖ్య కూడా చేశారు. పైగా ఆ ఎంపీ ముఖ్యమంత్రికి సన్ని హితునిగా పేర్గాంచారు కూడా.

ఆ వ్యాఖ్యలు అవాంఛనీయం

దేశంలో ఒక అనుభవజ్ఞుడైన రాజకీయవేత్తగా, ముఖ్యమంత్రి పదవిని చిరకా లం నిర్వహించిన వ్యక్తిగా పేరున్న చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు, ఆ వ్యాఖ్య లలోని ఔచిత్యాన్ని చర్చిద్దాం. వ్యక్తులకు, సంస్థలకు ప్రభుత్వాలు లెక్కలు చూపించవలసిన అవసరం లేదన్నది చంద్రబాబు చేసిన మొదటి వ్యాఖ్య. ఇలా భావించడం సహేతుకమే. సరైనదే కూడా. సమాచార హక్కు చట్టం కిందనే అయినా కూడా, ఇవ్వవలసిన సమాచారం కన్నా ఎక్కువ సమాచా రాన్ని ఏ ప్రభుత్వమూ అటు ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు ఇవ్వవలసిన అవ సరం లేదు. ఆ చట్టం పరిధి మేరకు ప్రజలు కావలసిన సమాచారాన్ని ప్రభు త్వం నుంచి పొందవచ్చు. కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులకు సంబంధించి వినియోగ పత్రాలను (యుటిలైజేషన్ సర్టిఫికెట్) సమర్పించవ లసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల మీద మాత్రం ఉంది. ఈ బాధ్యత నుంచి ఏ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకమైన వెసులుబాటు, మినహాయింపు లేవు. రాష్ట్రా లలో చేపట్టవలసిన కొన్ని పథకాలు, ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నిర్దిష్టంగా కొన్ని నిధులు వస్తాయి. ఆ నిధులు ఎలా ఖర్చు చేసినదీ లెక్క చెప్పవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉంటుంది. ఇది ఆర్థిక క్రమశిక్షణలో కీలకమైన అంశం.

రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ప్రతిపత్తి, సార్వభౌమాధికారం కలిగిన వ్యవ స్థలని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కానీ ఒకటి. రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థలంటే ఎవరికీ పేచీ ఉండదు. కానీ అవి సార్వభౌమా ధికారం కలిగిన వ్యవస్థలు కావని మాత్రం గుర్తించాలి. ఏ దేశంలో అయినా రక్షణ, విదేశీ వ్యవహారాలను నిర్వహించే కేంద్ర ప్రభుత్వానికే సార్వభౌమాధి కారం ఉంటుంది. చంద్రబాబు భావనలోని సార్వభౌమాధికార వ్యవస్థ చాలా కఠినమైన నిబంధనలతో రూపొందించిన అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభు త్వాలకు కూడా లేదు.



రాష్ట్రాన్ని హేతుబద్ధత లేకుండా, అశాస్త్రీయంగా విభజించారని చంద్ర బాబు ఆరోపణ. అందుకు రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం వాటిల్లిందని ఆయన అంటున్నారు. అసలు జరిగిన పరిణామాలు, గడచిపోయిన కాలం నేప థ్యంలో ఇలాంటి వాదనలోని సహేతుకత ఎంత? పైగా ఈ అంశాన్ని నాలుగే ళ్లుగా ముఖ్యమంత్రి ఎప్పుడు అవకాశం వచ్చినా జార విడుచుకోకూడదన్నట్టు చర్విత చర్వణంగా ప్రస్తావిస్తూనే ఉన్నారు. కానీ రాష్ట్ర విభజన అనే ఆ 'అశా స్త్రీయ' పరిణామంలో, అందుకు అంకురార్పణ చేసిన అనేక శక్తులలో ముఖ్య మంత్రిగారి పాత్ర కూడా లేదని చెప్పలేం కదా! ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు పలుకుతూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా అక్టోబర్ 8, 2006లో చంద్రబాబు రాష్ట్రపతికి లేఖ రాశారు. అందువల్ల రాష్ట్ర విభజన నిర్ణ యానికి ఆయన కూడా బాధ్యత వహించవలసి ఉంటుంది. రాష్ట్ర విభజనకు ఆయన కట్టుబడి ఉన్న సంగతి తేలిపోయినప్పుడు, ఇక మిగిలేది ఏమిటి? హేతుబద్ధత లేకుండా, అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని విభజించారన్న అంశం.

బిల్లుకు ప్రతిపాదనలు చేస్తే బాగుండేది

పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టదలిచిన బిల్లు ఏదైనప్పటికీ దాని ప్రతులను ముందుగానే సభ్యులందరికీ అందచేస్తారు. అలాగే విభజన బిల్లు ప్రతులు కూడా తెలుగుదేశం సభ్యులందరికీ ముందుగానే అంది ఉంటాయి. మరి, విభజన నిర్హేతుకమన్న అభిప్రాయం కలిగి ఉన్నవారు ఆ బిల్లును అధ్యయనం చేసి, శాస్త్రీయమైన, హేతుబద్ధమైన మార్పులను ఆనాడే ఎందుకు ప్రతిపా దించలేదు? తెలుగుదేశం పార్టీ అధినేతగా చంద్రబాబు కూడా ఆ బిల్లును క్షుణ్ణంగా అధ్యయనం చేసి, పరిశీలించి తన పార్టీ సభ్యులకు ఎందుకు తగిన విధంగా దిశా నిర్దేశం చేయలేదు? విభజన బిల్లు పార్లమెంట్‌లో గందరగోళం మధ్య నెగ్గింది. నిజమే. అయినా కూడా ఆ బిల్లుకు లిఖిత పూర్వకంగా మార్పులూ చేర్పులూ సూచించడానికి పార్లమెంట్ సభ్యులకు చాలినంత సమయం ఉందన్న మాట మాత్రం వాస్తవం. కానీ ఆనాడు రాజకీయ ప్రయో జనాల కోసం వారు మౌనం దాల్చారు. ఇప్పుడుమాత్రం విభజన అశా స్త్రీయం, నిర్హేతుకం అంటూ పదే పదే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ధోరణి వల్ల ముఖ్యమంత్రి విశ్వసనీయతపైనే అనుమానం కలుగుతుంది.

విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టాన్ని, పంజాబ్, అస్సాం రాష్ట్రాలకు జరిగిన నష్టాలతో పోల్చడం మరొకటి. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం, ఈ తరహా పోలికలు తేవడం సుదీర్ఘ రాజకీయ, పాలనానుభవం కలిగిన నాయకుల స్థాయికి ఎంత మాత్రం తగదు. అసలు ఈ వ్యాఖ్యలు చంద్రబాబు చేయకుండా ఉంటే బాగుండేది. పంజాబ్, అస్సాం రాష్ట్రాల పరిస్థితికీ, విభజనానంతర ఆంధ్రప్రదేశ్ పరిస్థితికీ పోలికే లేదు. అనాలో చితంగా జరిగిన రాష్ట్ర విభజన వలన ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు దెబ్బ తిన్నాయని అభిప్రాయపడడం, భావించడం తప్పు కాదు. కానీ, తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా ఆనాడు విభజనను అంగీకరించిన అన్ని రాజకీయ పార్టీలు ఇందుకు బాధ్యత వహించవలసిందే. మరొక విషయం. విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అందించవలసిన చేయూత గురించి నాలుగేళ్లుగా రాష్ట్రం తరఫున మంతనాలు సాగించారు. చర్చలు ఫలప్రదంగా జరిగాయని చెబుతూ వచ్చారు. పురోగతి కూడా తృప్తికరంగానే ఉందని చెప్పారు. కానీ మళ్లీ ఇప్పుడు హఠాత్తుగా వేరొక ధోరణి ప్రదర్శిస్తూ పంజాబ్, అస్సాంల స్థితిగతులతో రాష్ట్ర పరిణామాలను పోల్చడం చాలా ప్రమాదకర మైన ఎజెండాను తెర మీదకు తీసుకురావడమే అవుతుంది. ముఖ్యమంత్రితో పాటు, పార్టీలో ముఖ్యునిగా భావించే మరొక ఎంపీ చేసిన వ్యాఖ్యలు, ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకుల వ్యాఖ్యానాలు పరిశీలిస్తే అవన్నీ దేశ ప్రయోజనాలకు, వాటి స్ఫూర్తికి భిన్నమైన ధోరణులని చెప్పక తప్పదు.

ఇక, రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరుపుకోవడానికి బదులు నవ నిర్మాణ దీక్షను జరుపుకోవడం గురించి కొంచెం. ముఖ్యమంత్రికి అపార పాలనానుభవం ఉంది. కొత్త రాష్ట్రం సమస్యలు, ఆర్థిక సమస్యలు తెలుసు. కానీ రాష్ట్రం ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా ఆర్థిక క్రమశిక్షణ కనిపించదు. ఎటు చూసినా హద్దులెరుగని ఖర్చు. వీటిని గమనించకుండా ఇప్పుడు బీద అరు పులు శోచనీయం కాదా! ఇలాంటి ధోరణికీ, ఆ బీద అరుపులకు ఇకనైనా స్వస్తి పలకవలసిన అవసరం చాలా ఉంది. నవ నిర్మాణదీక్ష పేరుతో, హేతు బద్ధత లేకుండా విభజన జరిగిందంటూ కాంగ్రెస్ అనే చచ్చిన గుర్రాన్ని మళ్లీ మళ్లీ బాదుతున్నారు. ఇలాంటి ధోరణితో చల్లారిన మనోభావాలను రెచ్చ గొట్టే యత్నం చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ సరికాదు.

ఆశావాదంతో అడుగేద్దాం!

నిజమే, మనకు 1953లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి సంక్రమించిన ఆంధ్ర రాష్ట్రమే ఇప్పుడు దక్కింది. మళ్లీ ఇందులో భద్రాచలం మినహాయింపు. విభజనకు ముందే దూరదృష్టితో భద్రాచలానికి ప్రత్యేక జిల్లా హోదా కల్పిస్తా మని హామీ ఇచ్చి ఉంటే ఆ ప్రాంత వాసులు కూడా ఆంధ్రప్రదేశ్‌తో కలిసే వారు. కానీ రాజధాని సమస్య ఒకటి ఉంది. మళ్లీ ఎక్కడ రాజమండ్రి, కాకి నాడ పరుగెత్తవలసి వస్తుందోనని వారు తెలంగాణ వైపు మొగ్గు చూపారు.

విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా నష్టపోయినది– హైదరా బాద్ మహా నగరం. ఆ నగరం ద్వారా వచ్చే ఆదాయ వనరులు. నిజానికి ఈ మహా నగరాన్ని అంతా కలసి నిర్మించుకున్నాం. ఇంతకు మించి రాష్ట్రానికి జరిగిన నష్టం ఏదీ లేదు. ఈ నష్టానికి కూడా పూర్తిగా కాకపోవచ్చు, కానీ ఎంతో కొంత కేంద్రం నుంచి పరిహారం వచ్చింది. విభజనతో నష్టం, కేంద్రం సహాయ నిరాకరణ అంటూ అవే విషయాలను, విమర్శలను పదే పదే ప్రస్తా విస్తూ దాని నుంచి రాజకీయ లబ్ధి పొందాలని పాకులాడడం సరికాదు. అందుకు బదులు కొత్త రాష్ట్రాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేసుకోవడానికి ఆశావాదులమై ముందడుగు వేయడం అత్యంత అవసరం. అలాంటి సమయం ఇప్పుడు ఆసన్నమైంది కూడా. ముఖ్యమంత్రికి నా విన్నపం ఏమి టంటే– అక్టోబర్ 1వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవంగా జరుపుకుందాం. విశాలాంధ్ర విభజనతోనే నవంబర్ 1 తన ఉనికిని కోల్పోయింది. అక్టోబర్ 1, 1953 నాడు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని కర్నూలులో నిర్వహించారు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదే స్ఫూర్తితో ఆశావాదంతో అవతరణ దినోత్సవాన్ని జరు పుకుందాం. నిరాశావాదానికి ప్రతిబింబించే నవ నిర్మాణ కార్యక్రమానికి చర మగీతం పాడదాం. ఆంధ్ర రాష్ట్రం కోసం తన ప్రాణాన్ని అర్పించిన పొట్టి శ్రీరాములుగారికీ, తన సంపదనంతా త్యాగం చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు గారికి అప్పుడే నిజమైన నివాళి ఘటించినట్టు అవుతుంది.

వ్యాసకర్త ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి

పరిణతి ప్రదర్శించిన రైతు ర్యాలీ

తమ డిమాండ్ల సాధనకు నాసిక్ నుంచి 180 కిలోమీటర్ల దూరం నడిచివచ్చిన రైతులు ముంబై నగరంలో ట్రాఫిక్‌కు, పదోతరగతి పరీక్షలకు అంతరాయం కలగ కుండా గొప్ప సంయమనం ప్రదర్శించారు.

విశ్లేషణ



మహేశ్ విజాపుర్కర్

ముంబైకి హృదయం అనేది లేదని, పూర్తిగా నింపిన లేక మరొక రూపంలోని పర్సులు మాత్రమే అక్కడ ఉంటాయని నానుడి. కానీ సోమవారం అర్ధ రాత్రి వేలాదిమంది రైతులతో కూడిన సమూహం తమకు డిమాండ్లతోపాటు గొప్ప మనసు కూడా ఉన్నట్లు చాటు కుంది. తమ డిమాండ్ల సాధనకు మహారాష్ట్ర శాసనస భను ముట్టడించాలనే లక్ష్యంతో వచ్చిన ఈ రైతులు ముంబై నగరంలోకి పగటిపూట భారీ ప్రదర్శన చేస్తూ అట్టహాసంగా రావడానికి బదులుగా సుదూరంలోని శివారు ప్రాంతం నుంచి అర్ధరాత్రిపూట మేల్కొని నిశ్శ బ్దంగా నడుస్తూ నగరాన్ని చేరుకున్నారు. ఎందుకంటే వారు ముంబై నగర ప్రజలను ఇబ్బంది పెట్టాలని భావించలేదు. కారణం.. పిల్లలు తమ పరీక్షలు రాయడా నికి అది ఇబ్బంది కలిగిస్తుందని వారు భావించారు.

దాదాపు 30 వేలకు పైబడిన రైతుల సుదీర్ఘ ర్యాలీతో ఎలా వ్యవహరించాలో అర్థం కాని స్థితిలో ప్రభుత్వం కొట్టుమిట్టాడింది. ఈ నేపథ్యంలో పదోతర గతి విద్యార్థులు ట్రాఫిక్ ఇబ్బందులకు గురి కాకుండా తమ పరీక్షలకు హాజరవడానికి కాస్త త్వరగా బయలు దేరాలని రైతులు కోరారు. కానీ తాము ముందుగా అను కున్నట్లుగా రద్దీసమయంలో నగరంలోకి ఊరేగింపుగా రావడాన్ని ఆపుకుని అనేక గంటల ముందుగా రాత్రి పూటే రైతులు నగరానికి చేరుకున్నారు.

రైతుల డిమాండ్లు తక్కువగా మాత్రం లేవు. అలా గని వారు దురాశాపరులేమీ కాదు. గత కొంత కాలంగా మన వ్యవస్థ రైతుల జీవనాధారాన్ని కొల్లగొట్టి వారిని తీవ్ర కష్టాల పాలు చేస్తూవచ్చింది. ముంబైకి 160 కిలోమీ టర్ల దూరంలోని నాసిక్ నుంచి రైతుల లాంగ్ మార్చ్ మొదలైంది. వామపక్షానికి చెందిన అఖిల భారత కిసాన్ సభ దీన్ని నిర్వహించింది. రోజు తర్వాత రోజు వారు ప్రధాన రహదారి గుండా కొన్ని ప్ల కార్డులు పట్టుకుని నినాదాలు కూడా చేయకుండా నడుచుకుంటూ వచ్చారు. అయితే వారి నిశ్శబ్దమే గట్టిగా సవ్వడి చేస్తూవచ్చింది. ముంబై మీడియా అయితే రైతుల యాత్రను పెద్దగా పట్టించుకోలేదు. మొబైల్ ఫోన్‌లో ఈ యాత్ర గురించిన ఫొటోను తీసి సోషల్ మీడియాలో దాన్ని షేర్ చేయడం తప్ప మీడియా పెద్దగా స్పందించలేదనే చెప్పాలి.

కానీ రైతుల ర్యాలీ థాణే చేరుకున్నప్పుడు మాత్రమే మీడియా మేల్కొంది. ఆ ఊరేగింపు ముంబై నగరానికి వస్తే ట్రాఫిక్‌కి బాగా ఇబ్బంది కలుగుతుంది. ట్రాఫిక్‌కి అంతరాయం కలగడమే ఊరేగింపు విజయానికి కొల మానం కదా. కాబట్టే మీడియా ఒకవిధమైన చికాకుతో థాణే వద్ద ఖాళీ గస్తీ పోస్టు వద్ద టీవీ చర్చను నిర్వ హించింది. ఆ ఒక్క టీవీ యాంకర్ కూడా అసలు రైతులు ఎందుకు మార్చ్ చేస్తున్నట్లు అని ప్రశ్నించడం గమనార్హం.

తాము పాదయాత్ర ఎందుకు తలపెడుతున్నామో చెబుతూ నిర్వాహక సంస్థ చాలా ముందుగానే డిమాండ్ల జాబితాను ప్రచురించింది. వాటిలో బేషరతుగా రుణ మాఫీ చేయడం, ముంబై–నాగపూర్ సూపర్‌ఫాస్ట్ హైవే నిర్మాణం కోసం భూ సేకరణను నిలిపివేయడం, రైతు సమస్యలపై స్వామినాథన్ కమిటీ నివేదికను అమలు చేయడం. 12 ఏళ్ల క్రితం చట్టంగా తీసుకొచ్చిన అటవీ భూములపై హక్కులను తమ పేరుమీద దఖలు పర్చ డం, ప్రజాపంపిణీ వ్యవస్థను పునర్‌వ్యవస్థీకరించడం వంటివి కొన్ని డిమాండ్లు.



సోమవారం ఉదయం ముంబై నగరవాసులకు మహాశ్చర్యం కలిగింది. ఎందుకంటే ఆందోళనాకారులు కొత్త బాట పట్టారు. సుదీర్ఘ ర్యాలీ పొడవునా నడుచు కుంటూ వచ్చిన రైతులు నాసిక్ నుంచి థాణే హైవేలో కూడా తమ ఊరేగింపుతో ట్రాఫిక్‌కు బాగా అంత రాయం కలగడం చూశారు. దాంతో వారు ముంబైని కాస్త కరుణించాలని నిర్ణయించుకున్నారు. రైతులు పెద్ద మనసుతో వ్యవహరించారనే చెప్పాలి. ఇది ఒక రకంగా చెప్పాలంటే తెలివైన ప్రజా సంబంధాల నిర్వహణా వ్యూహం కావచ్చు. దీంతో ప్రభుత్వం ఈ ర్యాలీని తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. రైతులు థాణేను దాటి రాకముందే ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతుల డిమాండ్లపై తాను సానుకూలంగా ఉన్నట్లు చెప్పారు. కానీ ఒక విషయం మాత్రం వివరణ లేకుండా అలాగే ఉండిపోయింది.

రైతులు ఇంత సుదీర్ఘంగా తారురోడ్డు మీద నడుచు కుంటూ రాకుండా ముఖ్యమంత్రి తగు చర్యలు ఎందుకు చేపట్టలేదు? ర్యాలీలో పాల్గొన్న రైతుల్లో కొందరు ఎంత పేదవారంటే వారికి కనీసం కాళ్లకు చెప్పులు కూడా లేవు. రైతులను అలా ఇబ్బంది పెట్టడానికి బదులుగా సీఎం తన అధికారులను ర్యాలీ మొదలైన నాసిక్ వద్దకే పంపించాల్సి ఉండింది. లేదా తానే స్వయంగా అక్కడికి వెళ్లి రైతులను కలిసి ఉండాల్సింది. వారి డిమాండ్లు కొత్త వేమీ కాదు. అయితే అనేక డిమాండ్లను వారు కలిపే శారు. ఇక రుణమాఫీ విషయంలో ప్రభుత్వ నిజాయితీ అనుమానాస్పదంగానే ఉంది.

రైతు ర్యాలీపట్ల ప్రజానీకంలో ఏర్పడిన సాను భూతి, ముంబైకి ర్యాలీ చేరుకున్న తర్వాత అన్ని ప్రతిపక్ష పార్టీలు వారిని కలిసి మద్దతు పలకడం వంటివి బీజేపీని కాస్త కదిలించాల్సి ఉంది. చివరకు కలిసి ఉంటూనే పోరుకు దిగుతున్న శివసేన సైతం రైతుల ర్యాలీకి మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా గతంలో వామ పక్షాన్ని ఎర్ర కోతులుగా అభివర్ణిస్తూ వచ్చిన బాల్ థాక్రే వ్యాఖ్యను మళ్లీ మననం చేసుకోవాల్సి ఉంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com

అవసరం తీరాక బోడి మల్లన్న

రాజధాని నిర్మాణానికి ఎలాంటి డీపీఆర్ లేకుండా కేంద్రం రెండున్నరవేల కోట్లు కేంద్రం ఇచ్చినా.. వాటికి లెక్కాపత్రాలు లేవు. పైగా, కేంద్రం ఇచ్చిన నిధులకు లెక్కలే చెప్పాల్సిన అవసరం లేదని బాబు మాట్లాడుతున్నారు.

సందర్భం



పురిఘళ్ల రఘురాం


బీజేపీతో నాలుగేళ్లు కాపు రం చేశాక చంద్రబాబు బీజేపీది అన్యాయమంటూ కొత్త పల్లవి మొదలుపె ట్టారు. ముందుగా నిర్ణయిం చుకున్న వ్యూహంలో భాగం గానే బీజేపీపై విమర్శలు ఎక్కుపెడుతూ జనంలో చుల కనయ్యేలా ప్రణాళికను బహుబాగుగా అమలు చేస్తున్నారు. 46 నెలల పాల నలో ఏపీ ప్రజలను అనుభవం పేరుతో ఆశలు చూపించి చివరాకరకు నెపమంతా కేంద్రం మీద నెట్టేసే బృహత్ కార్యక్రమానికి అమరావతి కేంద్రంగా శ్రీకారం చుట్టారు. తన సర్కారుపై అంతకంతకూ పెరిగిపోతున్న వ్యతిరేకతను ప్రత్యేక హోదాపైకి మళ్లి స్తున్నారు. ఎన్నికల్లో గెలవడానికి తప్ప ఆ తర్వాత బాబుకు కమలం పార్టీ అవసరం మాత్రం ఉండదు.

బాబు గారు రెండు సార్లు ఎన్నికల్లో విజయం సాధించడానికి కారణం ముమ్మాటికీ బీజేపీయే. 1998 లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసింది. బీజేపీ 19.5 శాతం ఓట్లను రాబట్టింది. నాలుగు ఎంపీ స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ ఓట్ల శాతాన్ని గమనించిన చంద్ర బాబు, బీజేపీతో పొత్తు పెట్టుకోకుంటే.. వచ్చే ఎన్ని కల్లో ఇబ్బందన్న భావనతో దోస్తీకి చేశారు. 1999లో అటల్జీ ప్రభంజనం తనకు అనుకూలంగా మలచుకో వాలని... బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. టీడీపీతో పొత్తులో బీజేపీ ఏడు సీట్లు సాధించింది. అయితే 19.5 శాతంగా ఉన్న ఓటు బ్యాంక్ మాయమైపోయింది. నాటి నుంచి బీజేపీకి ఏపీలో చంద్రగ్రహణం పట్టింది.

1999లో బీజేపీతో పొత్తు పెట్టుకోకుంటే టీడీపీ ఎంత మాత్రం గెలిచే అవకాశం లేదు. టీడీపీతో పొత్తు పెట్టుకోవడంతో బీజేపీ నాటి నుంచి నేటికీ కోలుకో లేదు. టీడీపీ కుటిలనీతితో బీజేపీ కేవలం 11 చోట్లే గెలిచింది. మొత్తంగా బీజేపీ తీవ్రంగా నష్టపోయింది. అయితే 2003లో నక్సల్స్ దాడి తర్వాత కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ముందస్తు ఎన్నికలకు వెళ్లడంతో బొక్క బోర్లాపడాల్సిన దుస్థితి తలెత్తింది.

మొత్తంగా ఎన్నికల్లో నక్సల్స్ దాడి చేసినా... జనంలో మాత్రం సానుభూతి కలగలేదంటే బాబు సర్కారుపై జనంలో ఎంతటి కోపం ఉందో అర్థం చేసు కోవచ్చు. 2004 ఎన్నికలు ఓడిపోయిన తర్వాత బీజే పీతో కలవడం చారిత్రక తప్పిదమంటూ గగ్గోలు పెట్టారు. ప్రజలల్లో తీవ్ర వ్యతిరేకత గుర్తించకపోవడం ఒకవైపు బాబు చేసిన తప్పిదమైతే... కాంగ్రెస్ పార్టీని పాదయాత్రతో వైఎస్సార్ ఒంటి చేత్తో గెలిపించారు.

ఇక 2014 ఎన్నికలకు ముందు మోదీ ప్రభం జనాన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలని బాబు మళ్లీ బీజేపీ పంచన చేరారు. అవసరానికి వాడు కోవడం.. అవసరం తీరిన తర్వాత కరివేపాకులా పక్క నపడేయడం తొలినుంచీ బాబుగారు నేర్చుకున్న రాజ కీయ చాణక్యత. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ చెప్పినట్టు ఈ ఆటలో ఏపీ సీఎం బాబుకు ఆస్కార్ ఇవ్వాల్సిందే. తాజాగా ఏపీలో బీజేపీని నిర్వీర్యం చేయాలి. బీజేపీ కన్పించకూడదు. మోదీని విలన్‌గా జనం చూడాలి. ఇదే లక్ష్యంతో మీడియాలోనూ ఊదర గొట్టడం ప్రారంభించారు. తెలుగు తమ్ముళ్లు బాబు గారి స్కెచ్ మేరకు రంగంలోకి ఇప్పటికే దిగిపోయారు. జగన్ ప్రత్యేక హోదా అంటూ టీడీపీని కార్నర్ చేస్తే.. ప్యాకేజీకి అంగీకరించిన బాబు.. ఇప్పుడు బీజేపీని ఇరుకునపెట్టేందుకు మళ్లీ ప్రత్యేక హోదా పాట పాడు తున్నారు. జగన్‌కు మైలేజ్ రాకూడదు. అది నాకే రావా లన్నది బాబు ఫిలాసఫీ.



బాబు... మూడేళ్లలో మూడు ముచ్చట్లు పెట్టారు. ముందు హోదా సంజీవిని అన్నారు. తర్వాత ప్యాకేజీ సో బెటరన్నారు. ఇప్పుడు మళ్లీ హోదానే అన్నింటికీ మందంటూ మాట మార్చారు. గతంలో హోదా కావా లన్నందుకు ప్రతిపక్ష నేత జగన్‌తోపాటు, ఏపీ హక్కుల పరిరక్షణ నేత చలసాని శ్రీనివాస్‌ను నిర్బం ధించారు. హోదా అంటే జైళ్లో పెడతానన్నారు. 40 నెలల తర్వాత సర్కారుపై వచ్చిన వ్యతిరేకతను కేంద్రంపై నెట్టేసేందుకు గ్రాండ్ స్కెచ్ వేసి... మసి బూసి మారేడు కాయచేస్తున్నారు.

మూడు రాష్ట్రాలు ఏర్పాటు చేసిన కేంద్రం రాయ్ పూర్‌కు మాత్రమే రూ. 50 కోట్ల నిధులు ఇచ్చింది. ఉత్త రాఖండ్ కేపిటల్ డెహ్రాడూన్‌కు పైసా ఇవ్వలేదు. జార్ఖండ్ రాజధాని కోసమూ కేంద్రం నిధులివ్వలేదు. రాజధాని నిర్మాణం కోసం ఎలాంటి డీపీఆర్ లేకుండా కేంద్రం రెండున్నరవేల కోట్లు కేంద్రం ఇచ్చినా... వాటికి లెక్కాపత్రాలు లేవు. నాలుగేళ్లుగా కేంద్రం ఎన్ని విధాల సాయం చేసినా వాటిని మాత్రం ఎక్కడా కూడా కన్పించకుండా చేశారు. రాష్ట్రాన్ని కలిసి అభి వృద్ధి చేయాలని ప్రజల తీర్పు వచ్చినా టీడీపీ మాత్రం తన రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమనుకుంటోంది. టీడీపీ బీజేపీతో ఉన్నా లేకున్నా... ఏపీ అభివృద్ధి బాధ్యత కేంద్రానిదే. ఏపీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే వరకు కేంద్రం చేయూత అందిస్తూనే ఉంటుందని ప్రధాని మోదీ అయినా, ఆర్థిక మంత్రి జైట్లీ అయినా ఒకటే చెబుతున్నారు. స్పెషల్ పర్పస్ వెహికల్ (నిర్దిష్ట మైన ప్రాజెక్టు పరిపూర్తికి ఏర్పాటయ్యే యంత్రాంగం) ఏర్పరిస్తే రాష్ట్రానికి నేరుగా దాని నుంచి నిధులు అంది స్తామని కేంద్రప్రభుత్వం మొదటినుంచి చెబుతోంది కానీ ఏపీ ప్రభుత్వం మాత్రం అలా చేయలేదు.

వ్యాసకర్త బీజేపీ సమన్వయకర్త, ఢిల్లీ
ఈ–మెయిల్ : raghuram.delhi@gmail.com

టెట్‌లో 79 ప్రశ్నలకు కలవనున్న మార్కులు

పేపర్	యాడ్ స్కోర్	'కీ'లో మార్పులు	2 జవాబులున్న ప్రశ్నలు
1	5	11	16
2(మ్యాథ్స్)	8	8	8
2 (సోషల్)	3	5	7
3	0	3	5
మొత్తం	16	27	36

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రాథమిక 'కీ'కి సంబంధించి వివిధ సబ్జెక్టులపై వచ్చిన అభ్యంతరాల్లో 79 సహేతుకమైనవిగా పాఠశాల విద్యాశాఖ గుర్తించింది. పరీక్ష రాసిన అభ్యర్థులకు ఈ 79 ప్రశ్నలకు మార్కులను కలపనున్నట్లు టెట్ కన్వీనర్ ఎ.సుబ్బారెడ్డి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 2 వరకు జరిగిన ఈ పరీక్షలకు 4,10,828 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి పేపర్ 1, 2, 3లలో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల అనంతరం విడుదల చేసిన ప్రాథమిక 'కీ'పై మొత్తం 19,314 అభ్యంతరాలు వచ్చాయి. ఇందులో 99.40 శాతం సహేతుకం కానివని నిపుణుల కమిటీ గుర్తించింది. కేవలం 2,604 అభ్యంతరాలు (0.60) మాత్రమే సరైనవిగా గుర్తించింది. వీటన్నింటినీ పరిశీలించిన కమిటీ ఒకేరకమైన వాటిని గుర్తించి మూడు కేటగిరీలుగా విభజించింది. అవి..1. ప్రశ్నలు తప్పుగా ఉండి, సమాధానం తప్పుగా ఉండటం, 2. ప్రాథమిక 'కీ'లో తప్పు రావడం, 3. రెండు సరైన సమాధానాలు ఇచ్చి ఉండటం. ఈ మేరకు 79 ప్రశ్నలకు మార్కులు కలపనుంది. తప్పు సమాధానాలు, తప్పు ప్రశ్నలకు సంబంధించి అందరికీ ఒకే రకమైన మార్కులు కలవనున్నాయి. మిగిలిన వాటిలో సమాధానం ఇచ్చినవారికి మాత్రమే మార్కులు కలపనున్నారు. కొంతమంది అభ్యర్థులు పరీక్ష రాసేటప్పుడు సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిసిందని, దీనిపై అధికారులతో చర్చించి మార్కులు కలపడంపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

జగన్‌తోనే బీసీల అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ నేతలు జోగి రమేష్, మల్లాది విష్ణు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న జోగి రమేష్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): బీసీల అభివృద్ధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే జోగి రమేష్ అన్నారు. ముదిరాజ్‌లకు రూ.వెయ్యికోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నాచౌక్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు వైఎస్సార్‌సీపీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లాది విష్ణు, జోగి రమేష్ మద్దతు ప్రకటించారు. జోగి రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ హయంలో బీసీ విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంటు సాయంతో ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల్లో చేరి ఉన్నత విద్యను అభ్యసించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూస్తోందన్నారు. ముదిరాజ్‌ల సమస్యలను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానన్నారు. రాజధానిలో బీసీ విద్యార్థులకు 200 గదులతో హాస్టల్, కళ్యాణమండపం నిర్మించాలన్నారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వం కొన్ని కులాలకే కార్పొరేషన్లు, ఫెడరేషన్లు ఏర్పాటు చేసి మిగతా వారిపై వివక్ష చూపుతోందన్నారు. ముదిరాజ్‌లకు ఈ బడ్జెట్‌లో రూ.వెయ్యికోట్లు కేటాయించి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ- డీ గ్రూపులో ఉన్న ముదిరాజ్ కులస్తులను బీసీ- ఏ గ్రూపులోకి మార్చాలన్నారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు లక్ష్మీపతి, శ్రీనివాస్, సుబ్బారావు, మారేష్, వైఎస్సార్‌సీపీ నగర బీసీ విభాగం అధ్యక్షుడు బోను రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

రూ.1,29,480 పట్టివేత

అవనిగడ్డ: కృష్ణా జిల్లా అవనిగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం దాడులు చేశారు. ఏసీబీ డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ దాడులు దివిసీమలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పక్కా సమాచారం అందుకున్న ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐలు కె.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వరరావు, హ్యాపీ కృపానందం, రమేష్‌బాబు ఏకకాలంలో కార్యాలయంపై సోదాలు చేశారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ అర్జా రాఘవరావు, సిబ్బంది, డాక్యుమెంటరీ రైటర్స్ నుంచి రూ.1,29,480 అక్రమంగా ఉన్న సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ.. విచారణ అనంతరం నివేదికను డీసీ ఆర్‌పీ ఠాగూర్‌కు చర్యలు తీసుకోవాలని నివేదిస్తామని చెప్పారు. మధ్యాహ్నం 2గంటల వరకూ కార్యాలయ సర్వర్ పనిచేయలేదని డీఎస్పీ తెలిపారు.

టీడీపీ, బీజేపీ ద్రోహం చేస్తున్నాయి

ప్రత్యేకహోదాపై పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి

సాక్షి, అమరావతి/మైలవరం/ నందిగామ: రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ ద్రోహం చేస్తున్నాయని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మండిపడ్డారు. కృష్ణా జిల్లా మైలవరంలోని సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించి ఉంటే ఏపీ ఇప్పటికే నవ్యాంధ్రగా వెలుగొందేదన్నారు. ఆయన విజయవాడలో మాట్లాడుతూ... విభజన హామీల సాధనకు అన్ని పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, ప్రత్యేక హోదా కోరుతూ నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ సంఘీభావం ప్రకటించారు.

తెలంగాణలోని ఏపీ స్థానికత టీచర్ల ధర్మదీక్ష

తమను సొంత రాష్ట్రానికి బదిలీ చేయాలని డిమాండ్



విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్మదీక్ష చేపట్టిన ఉపాధ్యాయులు

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పనిచేస్తున్న స్థానికేతర ఉపాధ్యాయుల్లో బదిలీ కోరుకొనే టీచర్లను వారి సొంత రాష్ట్రాలకు బదిలీ చేయాలని నాన్ లోకల్ టీచర్ల అసోసియేషన్ (ఎన్‌ఎల్‌టీఏ) డిమాండ్ చేసింది. సోమవారం ఈ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్మదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ... తెలంగాణ నుంచి 420 మంది, ఏపీ నుంచి 200 మంది తమ సొంత రాష్ట్రాలకు వెళ్లేందుకు బదిలీలను కోరుకుంటున్నారన్నారు. ఈ విషయమై నాలుగేళ్లుగా ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్రాష్ట్ర బదిలీలు రాష్ట్రస్థాయి ఉద్యోగులకే తప్ప మిగిలిన వారికి వర్తించవన్న నిబంధనతో జిల్లా కేడర్‌కు చెందిన తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. జిల్లా, జోన్ స్థాయి ఉద్యోగులకు అంతర్రాష్ట్ర బదిలీలకు అవకాశం కల్పించి, తమను సొంత రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. ఈ దీక్షకు పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఎస్టీయూ సహా వివిధ సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు.

ఎన్నో ఆశలతో వెళ్లి..

- భర్త, కుమార్తెను వీడి గల్ఫ్ దేశానికి
- అక్కడ అనాథగా బతికి అనారోగ్యంతో మృతి



పద్మ(ఫైల్)

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): ఆమె పేదరికాన్ని అనుభవించింది. భర్త సంపాదనకు తోడుగా అదనపు ఆదాయాన్ని సంపాదించాలని ఆశించింది. గల్ఫ్ దేశాలకు వెళ్తే బతుకు బాగుపడుతుందని ఆశించింది. అయితే దురదృష్టం కొద్దీ అక్కడ ఆమెకు పరిస్థితులు సహకరించలేదు. చివరికి అనారోగ్యంతో ప్రాణం విడిచింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ఆచంట మండలం పెనుమంచిలి గ్రామానికి చెందిన వస్కు పద్మ (46)కు ఆమెకు భర్త శ్రీనివాసరావు, కుమార్తె స్రవంతి ఉన్నారు. భర్త కూలిపనులు చేసి కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. గల్ఫ్ దేశం వెళ్తే బతుకు బాగుంటుందని పద్మ భావించింది. ఎనిమిదేళ్ల క్రితం ఆమె దుబాయ్‌లో అరబ్ హౌస్‌లో ఓ సేట్ వద్ద ఇంటి పనికి వెళ్లింది. కొద్ది నెలలకు పరిస్థితులు అనుకూలించక అక్కడి నుంచి పరారైంది. వీసా, పాస్ పోర్టు సేట్‌వద్దే ఉండిపోవడంతో అనాథగా, అనధికారికంగా తిరిగేది. అక్కడక్కడా ఇళ్లలో పనులు చేసుకుని పొట్ట పోసుకునేది. అక్కడ ప్రతిరోజూ గుడ్‌న్యూస్ మినిస్ట్రీస్ చర్చికి వెళ్లేది. దీంతో చర్చిలో పాస్టర్లు సుధాకర్‌రావు, షిరోన్‌రోజ్‌లకు పరిచయం ఉండేది. కొద్ది రోజులుగా చర్చికి రాకపోవడంతో ఆమె గురించి వారు ఆరా తీస్తే ఫిబ్రవరి 6న ఆసుపత్రిలో చేరి చికిత్సపొందుతూ ఫిబ్రవరి 16న మరణించినట్లు తెలిసింది. సుధాకర్‌రావు, షిరోన్‌రోజ్ ఆంధ్రప్రదేశ్ నాన్‌రెసిడెన్స్ తెలుగు (ఏపీఎన్ఆర్‌టీ) సంస్థకు పరిస్థితులను తెలియజేయడంతో ఆ సంస్థ సీఈఓ డాక్టర్ వేమూరి రవి, ఎన్ఆర్ఐ మంత్రి కొల్లు రవీంద్ర స్పందించారు. వీరి ఆదేశాలతో ఆ సంస్థ కోఆర్డినేటర్ పాడిపిరెడ్డి వాసు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు ఎయిరిండియా విమానంలో సోమవారం దుబాయ్‌నుంచి పద్మ మృతదేహాన్ని విశాఖపట్నం తీసుకు వచ్చారు. ఇక్కడి నుంచి అంబులెన్స్‌లో భీమవరం పెనుమంచిలి గ్రామానికి పాడిపిరెడ్డి వాసు స్వయంగా తరలించి ఆమె భర్తకు అప్పగించారు.

ప్రజాసంకల్ప యాత్ర





వెదుళ్లపల్లి వద్ద జగన్‌తో కలిసి అడుగులేస్తున్న విద్యార్థినులు



బాపట్ల బహిరంగ సభకు హాజరైన అశేషజనవాహినిలో ఓ భాగం.. ప్రసంగిస్తున్న వైఎస్ జగన్

బాబు తీరుతో రాష్ట్రానికి చేటు

చంద్రబాబు ఈ నాలుగేళ్లలో గట్టిగా పోరాడి ఉంటే ప్రత్యేక హోదా వచ్చి ఉండేది. నాలుగేళ్లుగా ఈయన డ్రామాలు ఆడడం మనందరం చూశాం. ఊసరవెల్లి కంటే వేగంగా రంగులు మారుస్తున్నారు. మొన్న ఆస్కార్ అవార్డులు పొందిన వారి ఫొటోలు పేపర్లో చూశాను. అందులో చంద్రబాబు బొమ్మ కనిపించలేదేమిటా.. అని ఆశ్చర్యపోయాను. అవార్డులు ఇచ్చే వాళ్లు విదేశాల్లో ఉంటారు కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో మన చంద్రబాబు ఆడే డ్రామాలు చూసి ఉండరేమో అనుకున్నా. ఒకవేళ వారు చూసి ఉంటే ఉత్తమ విలన్ అవార్డు ఎవరికి వచ్చేదో తెలుసా? (జనం నుంచి చంద్రబాబు, చంద్రబాబు అని కేకలు).

రాజీనామా చేసిన బీజేపీ మంత్రుల్ని చంద్రబాబు పొగిడితే ఆయన్ను బీజేపీ వాళ్లు పొగుడుతారు. ప్రజల చెవుల్లో పూలు పెడతారా? రాజకీయాల్లో ఉన్నప్పుడు ఏ రాజకీయ నాయకునికైనా విశ్వసనీయత, విలువలు, నిజాయితీ ముఖ్యం. ఇవి లేకపోతే అచ్చం చంద్రబాబులా తయారవుతారు.

అంకెలు, సంఖ్యలు పెంచి రాష్ట్రంలో తలసరి ఆదాయం ఎక్కువగా ఉందని తప్పుడు లెక్కలు చూపించడం వాస్తవం కాదా? ఈ లెక్కలు చూస్తే ఎవరైనా ఏమనుకుంటారు? నిన్నటి బడ్జెట్‌లో ఈ ఫిగర్స్ తార స్థాయికి చేరాయి. రాష్ట్రంలో రూ.5 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉందని తప్పుడు లెక్కలు చెబుతున్నారు. ఇంత ఆదాయం ఉంటే ప్రత్యేక హోదా ఇస్తారా?

- హోదా పోరు క్లైమాక్స్‌లో నాటకం రక్తికట్టిస్తున్నారు
- చంద్రబాబుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ధ్వజం
- ఇంకా ఎన్‌డీఏలోనే కొనసాగుతారట
- వాళ్లు అవిశ్వాసం పెట్టరట.. మేము పెడితే మద్దతు ఇవ్వరట
- లేని గొప్పలు చెబుతుంటే హోదా ఎలా ఇస్తారయ్యా..
- ఎంపీలు ఏకతాటిపై నిలవడానికి ముందుకు రండి
- మీ పాలనలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు..
- కృష్ణా డెల్టా ఆధునికీకరణ అటకెక్కింది..
- ఇలాంటి నాయకుడు అవసరమా.. ఆలోచించాలని ప్రజలకు విజ్ఞప్తి

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'ప్రత్యేక హోదాను నీరుగార్చే నాటకాన్ని చంద్రబాబు ఈ మధ్య కాలంలో రక్తికట్టించారు. కేంద్ర మంత్రులను ఉపసంహరించడంతో కొద్దో గొప్పో జ్ఞానోదయం అయ్యిందనుకున్నాం. కానీ, ఎన్‌డీఏలోనే ఉంటారట. కన్వీనర్‌గా కొనసాగుతారట. అవిశ్వాసానికి మద్దతు ఇవ్వరట. ఎంపీలు రాజీనామా చేయరట. హోదా కావాలని రాష్ట్ర ప్రజలందరూ కోరుకుంటుంటే ఈ పెద్దమనిషి ఇలా మాట్లాడటం ధర్మమా? నిజాయితీ, చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్న ఈ వ్యక్తిని ఏమనాలి?' అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం 110వ రోజు గుంటూరు జిల్లా బాపట్ల గడియారం స్తంభం సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మార్చి 21న అవిశ్వాసం పెడుతున్నామని, రాష్ట్ర ఎంపీలు 25 మంది ఒక్కటిగా నిలబడి పోరాడితే కేంద్రం దిగి వస్తుందన్నారు. ఈ తరహా పోరాటం చేసినా కేంద్రం దిగిరాక పోతే పార్లమెంట్ సమావేశాల చివరి రోజు ఏప్రిల్ 6న 25 మంది ఎంపీలు రాజీనామాలు చేసి వాళ్ల ముఖాన కొడితే ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరని ఆయన ప్రశ్నించారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఉచిత విద్యుత్ ఎండమావే అయింది..

ఈ రోజు గుంటూరు జిల్లాలో అడుగుపెడుతూనే జరిగిన ఓ సంఘటన నన్ను కదిలించింది. పూల రైతులు కలిశారు. ఈ నియోజకవర్గంలో దాదాపు 20 వేల ఎకరాల్లో పూలు, తులసి, మిర్చి, కూరగాయల పంటలు సాగు చేస్తుంటామని చెబుతూ ఉచిత కరెంటు అంటే నాన్నగారి హయంలో ఇచ్చిందే తప్ప ఇప్పటిది కాదన్నా అని చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ హయాంలో నెలకు రూ.50 సర్వీసు చార్జీలు చెల్లిస్తే సరిపోయేదన్నా, ఇప్పుడు నెలకు రూ.1500 నుంచి రూ.3 వేల వరకు చెల్లించాల్సివస్తోందన్నా.. అని చెబితే నిజంగా బాధేసింది. ఇవాళ ఉచిత కరెంటు ఎండమావేనని ఆ రైతులు చెబుతుంటే గుండెలు తరుక్కుపోయాయి. పగలు 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఆచరణలో 7 గంటలు కూడా ఇవ్వడం లేదు.



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈపూరుపాలెంలో పార్టీ నేతల మధ్య కేక్ కట్ చేస్తున్న జగన్

ఆక్వా రైతుల పరిస్థితీ అంతే

చంద్రబాబు సీఎం కాగానే ఏ పంటకూ గిట్టుబాటు ధర లేకుండా పోయిందని నన్ను కలిసిన ఆక్వా రైతులు వాపోయారు. దాదాపు 25 వేల ఎకరాలలో ఈ ప్రాంతంలో ఆక్వా సాగుంది. ముఖ్యమంత్రి తన హెరిటేజ్ లాభాల కోసం తానే తక్కువ రేటుకు కొంటుంటాడన్నా.. తానే దళారి అయ్యాడు కాబట్టి మాకు కనీస గిట్టుబాటు ధరలు కూడా లేకుండా చేస్తున్నారన్నా.. అని రైతులు చెబుతుంటే చాలా బాధేసింది. పంట పండే వరకు రేటు ఉంటుందని, చేతికొచ్చే సరికి ధర పడిపోతుందన్నారు. రొయ్యలు 30 కౌంట్ ఉన్నప్పుడు ధర రూ.450, రూ.500 పలకాల్సి ఉంటే ఏప్రిల్ నాటికి అది కాస్తా రూ.300, రూ.350కి పడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయట. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని ఆక్వా రైతులు చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో మత్స్యకారులు నన్ను కలిశారు. 400కు పైగా బోట్లు ఉన్నాయి. వైఎస్సార్ హయాంలో వీరి బతుకులు బాగుండేవి. డీజిల్ లీటర్ ధర రూ.29 ఉన్నప్పుడు వైఎస్సార్ రూ.6 సబ్సిడీ ఇచ్చేవారు. ఇప్పుడు చంద్రబాబు హయాంలో డీజిల్ ధర రూ.69కి చేరినా సబ్సిడీ మాత్రం పెంచలేదు. కొత్త మర పడవ కొనుక్కుంటే డీజిల్‌కు సబ్సిడీ ఇవ్వాల్సి వస్తుందని రిజిస్ట్రేషన్ కూడా చేయని దుస్థితి దాపురించిందట. పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాలు డెల్టా పరిధిలోకి వస్తాయి. ఈ మండలాలకు కృష్ణా నీళ్లు అందడం లేదు. నాన్నగారు బతికి ఉన్నప్పుడు కృష్ణా డెల్టా ఆధునికీకరణకు రూ.4 వేల కోట్లతో పనులు ప్రారంభిస్తే ఇప్పుడు వాటిని పట్టించుకున్న పాపానపోలేదు.

రైతులకు కుచ్చుటోపీ

రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదు. శనగలు క్వింటాల్ కనీస మద్దతు ధర రూ.4,450 అయితే రూ.3,500కు, కందులు రూ.5,450కి కొనాల్సి ఉంటే రూ.3,500 – రూ.4 వేలకు, మినుములు రూ.5,400కి కొనాల్సి ఉంటే రూ.4 వేలకు, పత్తి రూ.4,320కి కొనాల్సి ఉంటే రూ.3,000 – రూ.3,500కు దళారులు కొంటున్నారు. ఇక మిర్చిని రూ.6 వేలకు కూడా కొనడం లేదు. వాస్తవ పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే చంద్రబాబు మాత్రం నోరు విప్పితే చాలు అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ అంటాడు. వ్యవసాయం బ్రహ్మాండమంటాడు. రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణమాఫీ కింద ఇప్పటికి ఇచ్చిన సొమ్ము వడ్డీలకే సరిపోలేదు. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇళ్లకు రావడానికి బదులు బ్యాంకుల నుంచి వేలం నోటీసులు వస్తున్నాయి. రైతులకు కుచ్చుటోపి పెట్టాడు. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు ఒక్క రూపాయి రుణమాఫీ కాకపోగా వేలం నోటీసులు వస్తున్నాయి. జాబులు లేవు, రూ.2 వేలు నిరుద్యోగ భృతీ లేదు. ఇంటికి నెలకు రూ.2 వేలు చొప్పున రూ.94 వేలు బాకీ పడ్డాడు.

ఏమి చెప్పారు.. ఏమి చేశారు?

ఇవాళ ఈయనగారి హైటెక్ పాలనలో ఫోన్ కొడితే చాలు ఇళ్లకే మద్యం సీసాలను సరఫరా చేసే పరిస్థితి. ఇవాళ కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయి. రేషన్ షాపుల్లో ఇవాళ బియ్యం తప్ప మరేమీ ఇవ్వడం లేదు. నాలుగేళ్ల చంద్రబాబు పాలన మీరందరూ చూశారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరుగబోతున్నాయి. మీకు మోసం చేసేవాడు, అబద్ధాలు చెప్పే నాయకుడు కావాలా? చంద్రబాబును పొరపాటున క్షమిస్తే.. రేపు ప్రతి ఇంటికి కేజీ బంగారం, బోనస్‌గా ప్రతి ఇంటికి బెంజికారు ఇస్తానంటారు. అవీ నమ్మరని తెలిసి ప్రతి ఇంటికి మనిషిని పంపించి ప్రతి ఒక్కరి చేతిలో రూ.3 వేలు డబ్బు పెడతారు. డబ్బు ఇస్తే మాత్రం వద్దు అనకండి. రూ.5 వేలు అడగండి. ఆడబ్బంతా మనదే. మన జేబుల్లో నుంచి దోచిన సొమ్మే. (జనం పెద్ద ఎత్తున కేకలు వేశారు) కానీ ఓటు వేసే సమయంలో మాత్రం మనస్సాక్షి ప్రకారం ఓటు వేయండి. అబద్ధాలు చెప్పే వారిని, మోసాలు చేసేవారిని బంగాళాఖాతంలో కలపండి. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో మార్పు తేవడం ఒక్క జగన్ వల్ల అయ్యే పని కాదు. మీ అందరి తోడు, దీవెనలు కావాలి'' అని జగన్ కోరారు. ఈ సభలో పార్టీ నేతలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు.

వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ

విద్య, వైద్యం కోసం ఏ పేదవాడు అప్పుల పాలు కాకూడదన్నది మన లక్ష్యం. అందుకే మనందరి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాం. వైద్యం ఖర్చు వెయ్యి రూపాయలు దాటే ప్రతి వ్యాధినీ ఆరోగ్య శ్రీలో చేరుస్తాం. నాన్నగారి పాలనలో 108 నంబర్‌కు ఫోన్‌కొడితే 20 నిమిషాల్లో మన ముందుకు అంబులెన్స్ వచ్చేది. ఇవాళ అంబులెన్స్‌కు ఫోన్ కొడితే డీజిల్ లేదని, జీతాలు అందక ధర్నా చేస్తున్నారన్న సమాధానాలు వస్తున్నాయి. పెద్ద పెద్ద జబ్బులు వస్తే వైద్యం చేయించుకోవడానికి హైదరాబాద్‌కు వెళ్తాం. కానీ ఇప్పుడక్కడ ఆరోగ్య శ్రీ చెల్లుబాటు కాదంటున్నారు. ఇక్కడేమో మంచి ఆసుపత్రులు లేవు. ఉన్న ఆసుపత్రుల్లో పిల్లలను ఎలుకలు కొరుక్కుతింటున్నాయి. నెట్‌వర్క్ ఆసుపత్రులకు 8 నెలలుగా బిల్లులు చెల్లించడం లేదు. ఆరోగ్యశ్రీ రోగులు బయటకు పోండని నెట్‌వర్క్ ఆసుపత్రులు చెబుతున్నాయి. చంద్రబాబు పాలనలో ఆరోగ్యశ్రీ ఇంతగా నిర్వీర్యం అయింది. ఇవాళ పొరపాటున ఏ కాన్సరో వస్తే ఏడెనిమిదిసార్లు కీమో థెరపీ చేయాలి. ఒక్కసారి కీమో థెరపీ చేయాలంటే రూ.లక్ష ఖర్చు అవుతుంది. ఈ ప్రభుత్వం కేవలం రెండుసార్లు మాత్రమే కీమో థెరపీ చేస్తానంటోంది. ఆరు నెలల తర్వాత వ్యాధి తిరగబెట్టే ప్రమాదం ఉంది. అంటే రోగులు అకాల మరణం పొందాల్సిందేనా? కిడ్నీ పేషెంట్లకు డయాలసిస్‌కు నెలకు రూ.24 వేల ఖర్చు వస్తోంది. ఇవాళ కిడ్నీ బాగోలేకపోతే ఖాళీలు లేవని డయాలసిస్ చేయడం లేదు. ఇవాళ చిన్నచిన్న పిల్లలకు మూగ, చెవుడు ఉంటే కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ చేయించాలి. నాన్నగారి హయాంలో ఇలాంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించేవారు. ఇవాళ ఆ మూగ, చెవుడు పిల్లల అవస్థలు వర్ణనాతీతం. నాన్నగారు పేద వారి కోసం ఒక అడుగు ముందుకు వేశారు. ఆయన కొడుకుగా జగన్ రెండు అడుగులు ముందుకు వేస్తాడు. ఎంత ఖర్చయినా సరే ఉచితంగా మంచి వైద్యం ఎక్కడ అందితే అక్కడ చేయించుకునేలా ఆరోగ్య శ్రీని సంస్కరిస్తాం. డాక్టర్ల సలహా మేరకు రోగులు విశ్రాంతి తీసుకునే కాలానికి డబ్బులిచ్చి ఆదుకుంటాం. కిడ్నీ, తలసీమియా వంటి దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న పేదవారికి ప్రతి నెల రూ.10 వేలు పింఛన్ ఇచ్చి తోడుగా ఉంటాం.

బాబూ.. ఇది మోసం కాక మరేంటి?

- రాష్ట్రాన్ని విడగొట్టినప్పుడు అప్పటి కేంద్ర ప్రభుత్వం 2014 మార్చి 2న ప్రత్యేకంగా క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రణాళికా సంఘానికి సిఫార్సు చేస్తూ నివేదిక పంపింది. ఎన్‌డీఏ పాలనలో 7 నెలల పాటు ఆ ఫైల్ ప్లానింగ్ కమిషన్ వద్ద పడి ఉన్న మాట నిజమా? కాదా? ఆ ఏడు నెలల పాటు ఏమి చేశావు?
- ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక 11 నెలల పాటు 13వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమలులో ఉన్న మాట వాస్తవం కాదా? అప్పుడు కేంద్రం ఏది చెబితే దానికి మీరు తలూపింది నిజం కాదా?
- అయినా ప్రత్యేక హోదాకు, 14వ ఆర్థిక సంఘానికి సంబంధం ఏమిటి? ఆనాడే ఎందుకు నిలదీయలేకపోయావు?
- మొన్న అరుణ్ జైట్లీ స్టేట్‌మెంట్ ఇవ్వగానే ఉలిక్కిపడినట్టు ఓవర్ యాక్షన్ చేసి కేంద్రం నుంచి మంత్రులను ఉపసంహరించుకుంటున్నానని ప్రకటించావు. వారితో రాజీనామా చేయించావు. 2016 సెప్టెంబర్‌లోనే అరుణ్ జైట్లీ ఈ ప్రకటన చేసినప్పుడు అర్ధరాత్రి హడావుడిగా మీడియా సమావేశం పెట్టి ఎందుకు స్వాగతించావు?
- ఆవేళ అరుణ్ జైట్లీ చేసిన ప్రకటనకూ, ఇటీవల చేసిన ప్రకటనకు ఏమన్నా తేడా ఉందా?
- నిజంగా ప్రత్యేక హోదాపై శ్రద్ధ ఉంటే కేంద్రంపై పోరాడాలి.. అలగాలి.. ఆరాటపడాలి.. అది చేయడానికి బదులు ప్రత్యేక హోదాయే అవసరం లేదన్న రీతిలో వ్యవహరించి మోసం చేసింది మీరు కాదా?
- దేశం మొత్తం మీద అభివృద్ధి రేటు 6.5 శాతం నుంచి 7 శాతం ఉంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా దాదాపు ఇదేరీతిలో ఉంది. అయితే మన రాష్ట్రంలో మాత్రం 12 శాతం అభివృద్ధి ఉన్నట్టు చూపించడం ధర్మమేనా?
- ఈ స్థాయిలో అభివృద్ధి శాతం చూపిస్తూ రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటారా? 40 లక్షల ఉద్యోగాలిచ్చామంటారా? అలాగైతే చదువుకున్న పిల్లలు పక్క రాష్ట్రాలకు ఎందుకు వలస పోతున్నారు?



విద్యార్థులతో కలిసి ప్రత్యేక హోదా ప్లకార్డు పట్టుకున్న ప్రతిపక్ష నేత జగన్

110వ రోజు

12–03–2018, సోమవారం
బాపట్ల.. మూర్తి రక్షణ నగరం,
గుంటూరు జిల్లా



ఆ సంకల్పమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీగా పురుడుపోసుకుంది

మార్చి 12.. జీవితంలో మరిచిపోలేని రోజు. కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమైన పార్టీ పుట్టినరోజు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక చరిత్రాత్మక అవసరంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిన రోజు. నాన్నగారి మహాభినిష్క్రమణ ఆంధ్రావనికి గుండె కోతగా మారింది. ఆ మహానేత హఠాన్మరణాన్ని తట్టుకోలేక వందలాది గుండెలు ఆగిపోయాయి. కోట్లాది మంది ప్రజల జీవితాలు కకావికలమయ్యాయి. అంతటి శోక సంద్రంలో మేమంతా ఉండగా.. నాన్నగారి కోసం పరితపించి ప్రాణాలొదిలిన ఆత్మబంధువుల కుటుంబాలను ఓదార్చరాదన్న ఆంక్షలు అంతులేని మానసిక క్షోభకు గురిచేశాయి. పుట్టి బుద్ధెరిగిన నాటి నుంచి తను నమ్మిన విలువల పట్ల నిజాయితీతో, నిబద్ధతతో, చిత్తశుద్ధితో ప్రజల కోసమే రాజకీయ ప్రస్థానం చేసిన నాన్నగారిని చూస్తూ పెరిగినవాడిని. మనల్ని నమ్మినవారి కోసం, మన వెంట నిలిచిన వారి కోసం, ఇచ్చిన మాట కోసం ఎంత కష్టాన్నైనా, ఎన్ని నష్టాలనైనా భరించినా ఫర్వాలేదన్నది నాన్నగారి సిద్ధాంతం. అందుకే నమ్మిన సిద్ధాంతం కోసం, నమ్ముకున్న జనం కోసం మరో ఆలోచన లేకుండా ముందడుగు వేశాను. భగవంతుడి సంకల్పమేమో.. నన్ను బలంగా కదిలించింది. ఆ సంకల్పమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీగా పురుడుపోసుకుంది. నాటి నుంచి నేటి వరకు పార్టీ సారథిగా నిరంతరం ప్రజలతో మమేకమై.. ప్రజల కష్టాలలో, కన్నీళ్లలో, బాధల్లో, బాధ్యతల్లో పాలుపంచుకుంటూ ముందుకు సాగుతున్నాను. అప్పటి నుంచి ఇప్పటి దాకా పార్టీని దెబ్బతీసేందుకు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు, డబ్బుతో ప్రలోభాలు. నా వెంట నిలిచి నన్ను ముందుకు నడిపిస్తున్న నా సహచరుల, ప్రజల భరోసాతో అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొంటూ వస్తున్నా. విలువలు, విశ్వసనీయతలే ప్రాణంగా, ప్రజాసేవే పరమావధిగా.. దినదిన ప్రవర్ధమానమై ఎనిమిదో ఏట అడుగిడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన కార్యకర్తలందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

హోదా కోసం గళమెత్తి, ప్లకార్డులు చేతబట్టి బాపట్ల ఇంజినీరింగ్ విద్యార్థులు నన్ను కలిశారు. హోదా విషయంలో బాబుగారివన్నీ పిల్లిమొగ్గలేనని, ఆయనను ఏమాత్రం విశ్వసించలేమని విమర్శించారు. 'అన్నా.. మాకు ఉద్యోగమైనా, ఉపాధి అయినా హోదాతోనే సాధ్యం. మీ మీద మాకు నమ్మకముంది. హోదా సాధన కోసం మీ పోరాటంలో మేమందరం భాగస్వాములవుతాం' అంటూ ఆ సోదరులు చెబుతుంటే ఆసక్తిగా ఆలకించాను. రాష్ట్ర భవిష్యత్తుపై ఆ పిల్లలకున్న పాటి స్పష్టమైన ఆలోచనలు, తపన మన రాజకీయ పెద్దలకుంటే ఎంత బావుండు.. అనిపించింది.

బాపట్ల ప్రాంతం పూల తోటలకు ప్రసిద్ధి. కానీ ఈ రోజు కలిసిన పూల రైతులు ఎంత దయనీయ స్థితిలో ఉన్నారో బాధగా చెప్పుకొన్నారు. 'సార్.. నాన్నగారి హయాంలో మాకు ఉచిత విద్యుత్ అందేది. పూలకు మార్కెట్టూ బావుండేది. కానీ ఈ ప్రభుత్వంలో వేలకు వేలు కరెంటు బిల్లులొస్తున్నాయి. పూలకు గిట్టుబాటూ లేదు..' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రైతు వ్యతిరేక పాలనలో రైతన్న కంట కన్నీరు తప్ప ఇంకేం ఊహించగలం!

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. మీరు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పగటి పూటే తొమ్మిది గంటల నాణ్యమైన, నిరంతరాయ ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి.. ప్రమాణ స్వీకారం చేసి.. మాట తప్పి.. రైతులను నట్టేట ముంచడం భావ్యమేనా?

వైఎస్. జగన్.







ఈపూరుపాలెం, బేతపూడి, స్టువర్టుపురంలో దివ్యాంగురాలు, సోదరి, అవ్వల కష్టాలు వింటున్న జననేత



మహాత్మాజీ పురం వద్ద జగన్‌తో తన కష్టం చెప్పుకుంటున్న ఓ అవ్వ

ప్రజాసంకల్ప యాత్ర 110వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,484.2 కిలోమీటర్లు

110వ రోజు నడిచిన దూరం
12 కిలోమీటర్లు

ప్రారంభం: ఉ. 8.40 గంటలకు ఈపూరుపాలెం
ముగింపు: బాపట్ల.. మూర్తి రక్షణ నగరం

ముఖ్యాంశాలు
- ఈపూరుపాలెంలో పార్టీ పతాకావిష్కరణ
- స్టువర్టుపురం, చిన్నబేతపూడి, వెదుళ్లపల్లి, వడ్డెపాలెం, కుక్కలవానిపాలెం, మహాత్మాజీ పురం, దరివాదకొత్తపాలెం జనంతో మమేకం
- బాపట్లలో బహిరంగ సభ.

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 7.30 గంటలకు బాపట్ల మూర్తి రక్షణ నగరం

ముఖ్యాంశాలు
- బాపట్ల మూర్తి రక్షణ నగరం, కొండుబొట్లవారిపాలెం క్రాస్, అప్పికట్ల, పూండ్ల క్రాస్, ఈతేరులో జనంతో మమేకం.

ప్రజా సంకల్ప యాత్ర – మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం, 13-3-2018


ప్రతీకాత్మక చిత్రం

లైఫ్ ఈజ్ ఎ ఛాయిస్!
స్వేచ్ఛ ఉంటుంది.
నిగూఢంగా..
సంకోచాల మధ్య దాగి ఉంటుంది.
సంకోచాలు పొరల్లాంటివి.
ఆత్మగౌరవాన్ని, జీవితాన్ని,
ధైర్యాన్ని కప్పేస్తాయి!
జీవిత బంధం అందమైనదే...
నిర్బంధం కానంత వరకు.
నిర్బంధం అనిపించనంత వరకు.
నిజానికి.. బంధం ఎవరితోనో కాదు..
ముందు మనకు మనతో ఉండాలి.
మనల్ని మనం నిర్బంధించుకోకూడదు.
అనుమానం, అవమానం, అన్యాయాల నుంచి..
వన్.. టు.. త్రీ.. గో!

వన్.. టు.. త్రీ.. గో!

బాల్యంలో, యవ్వనంలో, వైవాహిక జీవితంలో, వృద్ధాప్యంలో.. ఏ దశలోనూ స్త్రీకి ఛాయిస్ ఉండదు. అమ్మానాన్న చెప్పినట్లో, సమాజం నిర్దేశించినట్లో, భర్త ఆదేశించినట్లో, బిడ్డలు ఆశించినట్లో ఆమె జీవితం ఆమె ప్రమేయం లేకుండా సాగిపోతుంది. ఇష్టాలు, అభిప్రాయాలు, ఆశయాలు, నిర్ణయాలు ఇవేవీ స్త్రీ జీవితంలో ఉండవు. అసలు తను జీవిస్తున్నది తన కోసమే కాదన్నంతగా ఆమె తన చుట్టూ ఉన్న బంధాల నిర్బంధనాలలో.. ముళ్లకంపపై చీరలా పరుచుకుంటుంది. ఎక్కడో కొందరు స్త్రీమూర్తులు మాత్రమే ఆ ముళ్లను విడిపించుకుని బయటికి వచ్చే ధైర్యం చేస్తారు. 'హర్‌ఛాయిస్' పేరుతో బీబీసీ భారతీయ భాషల విభాగం తాజాగా రూపొందించిన పన్నెండు నిజజీవిత కథలు.. అలా ముళ్లను విడిపించుకున్న మహిళలవే! వాటిలోని మూడు కథలివి.

మై బిగ్ సీక్రెట్



పశువులా మీద పడటానికి వచ్చిన ప్రతిసారీ నా భర్తకు నేను ఏదో ఒక అబద్ధం చెప్పి తప్పించుకోవాలని చూసేదాన్ని. తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అలసట.. ఏదో ఒక అబద్ధం. 'అయితే నాకేంటి?' అని మీద పడేవాడు!

అలా నా 20వ యేటకే నలుగురు పిల్లల్ని కన్నాను. పనేమీ చేసేవాడు కాదు. తాగొచ్చేవాడు. కొట్టేవాడు. మీద పడేవాడు. అదే పని. అమ్మకు చెబితే, 'ప్రతి ఇంట్లోనూ ఉండే ముదనష్టమే' అని బాధపడింది. భర్తను మాత్రం వదిలెయ్యొద్దంది.

నేను ఒకరింట్లో పనిచేసేదాన్ని. నా గురించి ఆమెకు తెలుసు. 'మళ్లీ గర్భం వస్తుందేమోనమ్మా..' అని తరచూ నేను ఆమె దగ్గర అంటుండేదాన్ని.

''నేను చెప్పినట్లు చేస్తావా?'' అన్నారు ఓరోజు ఆవిడ.. నా బాధను, భయాన్ని చూసి.

చేస్తానన్నాను.

ఏం చెయ్యాలో చెప్పారు ఆవిడ.

''నా భర్తకు తెలిస్తే చంపేస్తాడేమోనమ్మా'' అన్నాను.

''నువ్వు చెబితేనే కదా తెలిసేది'' అన్నారు.

ఆవిడ చెప్పిన దాని గురించి చాలారోజులు ఆలోచించాను. నా భర్తకు తెలిస్తే ఏమౌతుంది? ఇంకా తాగుతాడు. ఇంకా కొడతాడు. అప్పటికి అయిపోతుంది. మళ్లీ మళ్లీ పిల్లల్ని కంటూ ఉండే నరకం తప్పుతుంది కదా అనుకున్నాను. ఒక నిర్ణయానికి వచ్చాను.

పదేళ్లయింది ఇప్పటికి. నా భర్తకు తెలీదు, నా పిల్లలకూ తెలీదు.. నేను ఆపరేషన్ చేయించుకున్నానని. ఆ రహస్యం నాలోనే ఉండిపోయింది. నా భర్త ఇప్పటికీ తాగొస్తాడు. ఇప్పటికీ మీద పడతాడు. కానీ నాకొక ధీమా. నా ఇష్టానికి వ్యతిరేకంగా ఏమీ జరగదని. నాకొక గర్వం. నా దేహం నా చెప్పుచేతల్లోనే ఉందని.

ఓ పెద్ద రహస్యాన్ని నేను కడుపులో మోస్తున్నాను. ఆ రహస్యానికి నేనెప్పటికీ జన్మనివ్వను.

ఎవ్రీథింగ్ విల్‌బి ఆల్‌రైట్



ముస్తఫాతో నేను ప్రేమలో పడినప్పుడు ముస్తఫాది ఏ దేశమో, ముస్తఫాది ఏ మతమో, ముస్తఫాది ఏ కులమో నేను చూసుకోలేదు. ప్రేమించానంతే.

నేను క్రిస్టియన్‌ని. నార్త్ ఈస్ట్‌లో మాది చిన్న ఊరు. ముస్తఫా ముస్లిం. ఆఫ్రికన్. ఇద్దరం కలిసున్నాం. అయితే కొన్నాళ్లే! మమ్మల్ని కలిపి ఉంచగల ఏ సామాజిక శక్తీ మాకోసం రాలేకపోయింది. అడ్డు మరి. కులం అడ్డు. మతం అడ్డు. దేశం అడ్డు.

మా సహజీవనం తెగిపోయేనాటికి నాకు 21 ఏళ్లు. నా కడుపులో అతడి బిడ్డ. 'తీయించుకో' ఫ్రెండ్స్ సలహా ఇచ్చారు. 'ఉంచుకుంటాను' అన్నాను. 'ఎందుకా దరిద్రం!' అన్నట్లు చూశారు.

అంతకన్నా బాధించే మాట.. ముస్తఫా అన్నాడు! 'నీ లోపల ఉన్నది నా బిడ్డే అని నమ్మకం ఏంటి? అని. ఆ క్షణమే అతడితో విడిపోయి వచ్చేశాను.

కూతురు జీవితం ఇలా అయిపోయిందేమిటని నా తల్లిదండ్రులు బాధపడలేదు. ఈ భూమ్మీదకి తమది కాని వారసత్వాన్ని ఎక్కడ మోసుకొస్తానోనని భయపడ్డారు. కూతురికి నల్లటి ఆఫ్రికా శిశువు పుట్టబోతున్నాడంటేనే వాళ్లకు కంపరంగా ఉంది.

కుటుంబ సభ్యులు, బంధువులు నన్ను వెలివేశారు. నేను, నాకు పుట్టబోయే బిడ్డ.. ఇద్దరమే ఒకరికొకరం తోడుగా ఈ మనుషుల మధ్య నిలబడిపోయాం. చేరదీసేవారు లేరు. గ్లాసు నీళ్లతో సేదతీర్చేవారూ లేరు. నాకొక మంచి ఉద్యోగం కూడా లేదు. ఒక్క ఫ్రెండు మాత్రం మిగిలింది.

'జాగ్రత్తే' అంది. తన మీద తలవాల్చి ఏడ్చేశాను. నొప్పులొచ్చే వరకు ఆ ఫ్రెండే నాకు తల్లి అయింది. దగ్గరుండి ఆసుపత్రికి తీసుకెళ్లింది. మగ బిడ్డ పుట్టాడు. వాణ్ణి చూడగానే నా మనసు తేలికయింది. ఇప్పుడు నా వయసు 29 ఏళ్లు. నా బిడ్డ వయసు ఆరేళ్లు. ఈ ఆరేళ్లు నేను లోకానికి ఎదురీదాను. బలంగా తయారయ్యాను. నా బిడ్డకు బలాన్ని ఇవ్వాలంటే ఈ మాత్రం బలం నాకు ఉండాలి కదా.

బార్న్ అగైన్



అది మా ఫస్ట్‌నైట్. నా వయసు 35 ఏళ్లు. నేను కన్యను. అయితే ఆ ఫస్ట్‌నైట్ తర్వాత కూడా కన్యగానే ఉండబోతున్నానని నాకు తెలియదు.

గదిలోకి వెళ్లాను. నా భర్త నన్ను గట్టిగా కౌగిలించుకుంటాడని, నాపై ముద్దులు కురిపిస్తాడని ఎదురుచూస్తున్నాను.

అటు తిరిగి పడుకున్నాడు! నిద్రపోయాడు! అయితే అది వచ్చిన నిద్ర కాదని, తెప్పించుకుంటున్న నిద్ర అని కొన్నాళ్ల తర్వాత నాకు తెలిసింది.

ఫస్ట్‌నైట్ తెల్లారే అడిగాను. ఒంట్లో బాగోలేదన్నాడు. రెండో రాత్రి, మూడో రాత్రి, ఆ తర్వాతి రాత్రులన్నిట్లో అతడికి ఒంట్లో బాగోలేదు.

సెక్స్ ఒక్కటే నా సమస్య కాదు. కనీసం అతడు నన్ను టచ్ చెయ్యడం లేదు! మాట్లాడ్డం లేదు. నా అనుమానం నిజమైంది. ఆ నిజాన్ని మా అత్తమామలు దాచిపెట్టి నా గొంతు కోసారు. దుఃఖం వేసింది. గది తలుపులు వేసుకుని బోరున ఏడ్చారు. మావాళ్ల దగ్గర కూడా.

''ఊర్కో. ఏమీ జరగనట్లే ఉండు. నీ కర్మింతే అని సరిపెట్టుకో'' అని సలహా ఇచ్చారు.

నేను సరిపెట్టుకోలేక పోయాను. అర్థంలేని రిలేషన్ అది. మెడలో తాళి ఉన్నా, మదిలో మొగుడు లేని రిలేషన్ అది. పిచ్చి రిలేషన్. అతడిని వదిలేయాలని నిర్ణయించుకు న్నాను. భర్తని వదిలేస్తే తప్పు ఈ సమాజంలో. కానీ అతడు భర్తకూడా కాదే! వదిలేయొచ్చు.

అమ్మకీ, నాన్నకీ చెప్పాను.

''భర్తకు విడాకులిస్తే, నిన్ను ఇంటి గడప కూడా తొక్కనివ్వం'' అన్నారు అమ్మానాన్న!

నాకిక ఏ గడపా అక్కర్లేదనుకున్నాను. మెట్టినింటికి, పుట్టింటికి దూరంగా వచ్చేశాను. ఫ్రెండ్స్ హెల్ప్ చేశారు. ఉమెన్స్ హాస్టల్‌లో చేరాను. ఉద్యోగం వెతుక్కున్నాను. విడాకులకు ఫైల్ చేశాను.

నా భర్త, అత్తమామలు నన్ను దూషించారు. పరాయి పురుషులతో సంబంధాలను అంటగట్టారు. నేనేం బాధపడలేదు.

ఇంపొటెంట్ భర్తతో ఏ సంబంధమూ లేకుండా ఒకే ఇంట్లో ఉండటం అంతకంటే పెద్ద బాధ.

విడాకులు రావడానికి మూడేళ్లు పట్టింది.

విడాకుల పత్రాలు చేతికి వచ్చినప్పుడు నేను మా అమ్మ కడుపులోంచి మళ్లీ పుట్టినట్లు అనిపించింది. ఫ్రెష్‌గా.

త్రీ స్టోరీస్: **దివ్య ఆర్య, ఐశ్వర్య రవిశంకర్, సింధువాణి త్రిపాఠీ.** /ఇలస్ట్రేషన్స్ : **గోపాల్ శూన్య**

ఫైవ్ ఉమెన్


రవీందర్ భోగల్

భోజ్యేషు ఇండస్ట్రీ

మహిళ 'భోజ్యేషు మాత' అయితే కావచ్చు. అయితే భోజనాన్ని వండి వడ్డించే పరిశ్రమలో ఆమె రాణించగలదా అనే సంశయం అనేకమందిలో ఇప్పటికీ ఉంది. ఆ సంశయాలను పటాపంచలు చేస్తూ 'రాణించగలం' అని.. గత దశాబ్దకాలంగా లండన్‌లో తమ పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు ఓ ఐదుగురు భారతీయ మహిళలు.

దీప్నా ఆనంద్

లండన్‌లోని భారతీయ భోజన పరిశ్రమ రంగంలో దాదాపుగా మొదటి స్థానంలో ఉన్నారు దీప్నా ఆనంద్. ఈమె తాతగారు కెన్యాలో 1950లో ఒక రెస్టారెంట్ ప్రారంభించి దానికొక బ్రాండ్ ఇమేజిని సృష్టించుకున్నారు. అయితే పదిహేనేళ్ల తర్వాత దాని ప్రాభవం తగ్గిపోయింది. దాంతో ఆమె తండ్రి రంగంలోకి దిగి 'డిప్ ఇన్ బ్రిలియంట్' పేరుతో లండన్‌లో రెస్టారెంట్‌ను ప్రారంభించారు. సంప్రదాయ పంజాబీ తాలీని, తన కుటుంబంలో అంతా ఇష్టపడే రుచులను రెస్టారెంట్‌లో ప్రవేశపెట్టారు. దీంతో ఆ కెన్యా ఘుమఘుమలు లండన్‌కు వ్యాపించాయి. తర్వాత తండ్రి నుంచి తను స్వీకరించారు దీప్నా. ఇప్పుడు 'ఇన్ కిచెన్ ఆన్ బి 4 యు' అనే టీవీ షోతో లండన్‌లో చాలా పాపులర్ అయ్యారు.


దీప్నా ఆనంద్


శిల్పా దండేకర్


ఆస్మా ఖాన్


ఏంజెలా మాలిక్

రవీందర్ భోగల్

రవీందర్ భోగల్ అనే ఈ ఫ్యాషన్ జర్నలిస్ట్ కూడా రెస్టారెంట్ వైపు తన దృష్టిని మరల్చారు. చెఫ్, కుకరీ రైటర్‌గా లండన్‌లో పేరొందారు. 'జెంటిల్‌మెన్స్ క్లబ్ డెకార్' పేరుతో రెస్టారెంట్స్‌ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కెన్యా, నార్త్ ఇండియన్ వంటకాలను ఈమె తన రెస్టారెంట్ ద్వారా అందిస్తున్నారు.

ఆస్మాఖాన్

ఇరవై నాలుగు గంటలూ ఈమె రెస్టారెంట్‌లో ఛాయ్ కోసం ఆర్డర్ ఇవ్వచ్చు. కోల్‌కతా వాసి అయిన ఆస్మా ఖాన్ తన ఇండియన్ రెస్టారెంట్ ద్వారా రాయల్ మొఘల్ ఘుమఘుమలను అందిస్తున్నారు. కొన్నేళ్లక్రితం కుటుంబంతో లండన్ చేరిన ఆస్మా లాయర్‌గానూ రాణించారు. హైదరాబాద్ రాయల్ డిషెస్, కోల్‌కతా స్ట్రీట్ ఫుడ్, బెంగాల్ క్లాసికల్ రిఫ్లెక్స్.. ఆస్మా అందించే రుచులలో జిహ్వను మైమరపిస్తాయి.

చెఫ్ శిల్పా దండేకర్

పూర్తిగా ఇండియన్ వంటకాలను మూడేళ్లుగా అందిస్తున్నారు. శిల్ప ఇండియన్ తాజ్ హోటల్ గ్రూప్‌లో శిక్షణ తీసుకున్నారు. యు.కె. వెళ్లిన తర్వాత అక్కడి పబ్బులలో రుచికరమైన వంటలను అందించారు. ఆ తర్వాత తనే సొంతంగా రెస్టారెంట్‌ను ప్రారంభించారు. కాలానుగుణంగా లభించే పదార్థాలతో వంటలను రుచికరంగా అందించడం శిల్ప ప్రత్యేకత.



వీళ్ల కన్నా ముందు

లండన్‌లో మొదటిసారి 'చట్నీ మేరీ' అనే పేరుతో మోడ్రన్ ఇండియన్ రెస్టారెంట్‌ని నమిత, కామెలియా అనే ఇద్దరు అక్కచెల్లెళ్లు 1990లలో ప్రారంభించారు. పంజాబీయులు అయిన ఈ అక్కచెల్లెళ్లు తమ కుటుంబ సంప్రదాయ రుచులను వండి వడ్డించారు. వంటల పుస్తకాలు, టీవీ షోల ద్వారా భోజనప్రియుల మనసులను కొల్లగొట్టారు. కొన్నాళ్లలోనే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచారు.

ఏంజెలా మాలిక్

ఈమెది పంజాబీ నేపథ్యం. చెఫ్‌గా రాణించడమే కాకుండా సొంతంగా కుకరీ స్కూల్‌ను నడుపుతున్నారు. టీవీల్లోనూ, రేడియోలోనూ తన క్లాసుల ద్వారా నగరవాసులకు చేరువయ్యారు. ఏంజెలా మాలిక్ అనే మరో చెఫ్ 'లండన్ ఫుడ్ బోర్డ్' సభ్యురాలిగా భారతీయ రుచులపై స్థానికులకు ఆసక్తి కలిగించడంతో పాటు, భారతీయ భోజన పరిశ్రమకు విస్తృతినీ కల్పిస్తున్నారు.

'ప్రతిభ ఉన్న ఏ రంగంలో అయినా అవకాశాల కోసం ఎదురుచూడటం కాదు, ఆ అవకాశాలను మనమే కల్పించుకోవాలి' అనేది ఈ ఆధునిక మహిళలు వంట ద్వారా నిరూపిస్తూ చెబుతున్నారు.

– ఎస్.ఆర్.


చెట్టు నీడ

మధ్యలో ఎక్కడినుంచి వచ్చింది?

ఒక ఊళ్లో ఒకాయన ఉండేవాడు. ఆయనకు విపరీతమైన కోపం. ప్రతిదానికీ ఇంట్లోవాళ్ల మీదా, బయటివాళ్ల మీదా అరిచేవాడు. ఈ కోపగొండి స్వభావం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. దాన్ని తగ్గించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. చివరకు ఒక స్నేహితుడి సలహా మీద, ఒక ఊళ్లో ఒక గురువును సంప్రదించడానికి వెళ్లాడు. గురువు శాంతంగా కూర్చునివున్నాడు. చేతులు జోడించి నమస్కరించి, 'గురూజీ, నన్ను నేను నియంత్రించుకోలేనంత కోపం వస్తుంటుంది నాకు. అది తగ్గడానికి ఏమైనా పరిష్కారం సూచించండి' అని అడిగాడు. గురువు ఎంతో మృదువుగా, 'నీ సమస్య విచిత్రంగా ఉన్నదే! ఏదీ, నన్నో సారి చూడనీ' అన్నాడు.

అతడికి అర్థం కాలేదు. అయోమయంగా ముఖం పెట్టి, 'అంటే నేను దాన్ని ఇప్పుడు మీకు చూపలేను' అని చెప్పాడు. 'మరి నాకు ఎప్పుడు చూపగలుగుతావు?' అడిగాడు గురువు అంతే మెత్తగా. ఆయన ముఖంలో ఏ వ్యంగ్యమూ లేదు. 'అంటే... అది నాకు అనూహ్యంగా వస్తుంది' అన్నాడతను. 'ఊహూ. అట్లా అయితే అది నీ అసలైన స్వభావం కాదన్నమాట' వివరించే ధోరణిలో చెప్పాడు గురువు. 'అది నీ అసలైన స్వభావమే అయితే నాకు ఎప్పుడంటే అప్పుడు చూపగలిగేవాడివి. ఎందుకంటే నువ్వు పుట్టినప్పుడు అది నీ దగ్గర లేదు. దీని గురించి ఆలోచించు'.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్...! నేను ఒక అబ్బాయిని టు ఇయర్స్ నుంచి లవ్ చేస్తున్నా. తను కూడా నన్ను లవ్ చేశాడు. నేను తనని లవ్ చేశానని మా ఇంట్లో కూడా తెలుసు. కానీ తను మాత్రం... ''నేను నిన్ను అసలు లవ్వే చెయ్యలేదు, నేను ఇంకో అమ్మాయిని సిన్సియర్‌గా లవ్ చేస్తున్నా, తననే పెళ్లి చేసుకుంటా'' అన్నాడు. ఆ అమ్మాయి ఫోటో కూడా పంపించాడు. దాంతో మేం చాలా రోజులు మాట్లాడుకోలేదు. కానీ ఇప్పుడు మళ్లీ తనే... ''నువ్వంటే చాలా ఇష్టం, నిన్నే పెళ్లి చేసుకుంటా'' అంటున్నాడు. నాకు తన మీద నమ్మకం లేదు. బట్ తనంటే ప్రాణం. తను లేకుండా నేను ఉండలేను. సొల్యూషన్ చెప్పండి ప్లీజ్.

- సుమిత్ర

బతకలేనంటావేంటి రా బంగారం...?

'చెబుతుంది కదా సార్ చాలా ఇష్టమని..!?'

వాడు తెడ్డుగాడు...

'ఏంటి సార్ మీ చెల్లెలు ఇష్టపడ్డ వాణ్ని పట్టుకుని తెడ్డుగాడంటున్నారు????'

సరే వాడు కేటుగాడు...!

'సార్ ఫీల్ అవుద్ది సార్ సుమిత్ర..!'

అవ్వాలి.. కనబడిన అమ్మాయినల్లా ట్రాప్ చేసే కొడుకు...

'సార్... వెరీ బ్యాడ్ సార్....!'

ఒకే సారీ సుమిత్ర... వాడు వేస్ట్‌గాడు రా బంగారం. వాడు నిన్ను ముంచేస్తాడు. అస్సలు నమ్మకు. కొత్త దుపట్టాలతో పాత గొంతులు కోసే రకం...

'కొత్త దుపట్టాలతో పాత గొంతులు.. అంటే ఏంటి సార్???'

కొత్తగా కనపడిన అమ్మాయి దుపట్టాతో... పాత లవర్ గొంతు కోసే యూజ్‌లెస్ ఫెలో అని.

'అర్థమయ్యింది కదా సుమిత్ర..! మీ అన్నయ్యకు వాడి మీద చాలా కోపంగా ఉంది. నేను ఎంత ఆపినా ముక్కులో నుంచి చెవుల్లోనుంచి పొగలు కక్కుతూనే ఉన్నారు. ఆయన మాట విని వాణ్ని మరచిపో బంగారం!'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

సుడోకు

	9		1					6
5	8		9		6			
6				8	2		5	
	6	5		3		1	7	
	2	8				9	3	
	1	7		9		2	6	
	4		3	2				7
			7		9		8	1
8					1		4	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

4	1	8	5	9	7	2	6	3
7	5	2	6	1	3	4	8	9
3	9	6	4	8	2	5	7	1
1	8	4	3	2	5	7	9	6
6	3	9	8	7	4	1	2	5
2	7	5	9	6	1	3	4	8
8	4	1	7	3	6	9	5	2
9	2	7	1	5	8	6	3	4
5	6	3	2	4	9	8	1	7

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



పల్లవి: చిరునవ్వే విసిరావే నిదురించే కలపై
సిరిమువ్వె నడిచావే నిను కోరేటి ఈ గుండెపై
వెలుగేదో పరిచావే నిను చూస్తున్న నా కళ్లపై
॥చిరునవ్వే విసిరావే॥

చరణం : 1
సరదా సరదాలెన్నో అందించావే
సమయం గురుతే రాని సావాసంతో
విరహం చెరలో నన్నే బంధించావే
ఎపుడూ మరుపే రాని నీ అందంతో
ఆహ్వానం పంపించావే ఆనందం రప్పించావే
రెప్పల్లోన త్రుళ్లే చూపులతో
ఆరాటం ఊరించావే మోమాటం మారించావే
చేరువలోన చేసే దూరంతో – చెలియా ఆ ఆ ఆ
॥చిరునవ్వే విసిరావే॥

చరణం : 2
అసలే వయసే నన్ను తరిమేస్తుంటే
అపుడే ఎదురౌతావు ఏం చెయ్యాలే
అసలీ తడబాటేంటని అడిగేస్తుంటే
సరిగా నమ్మించే బదులేం చెప్పాలే
తప్పేదో చేస్తున్నట్టు తప్పించుకుంటున్నట్టు
ఎన్నాళ్లింక కాలం గడపాలే
నీ కోసం నేనున్నట్టు నీ ప్రాణం నమ్మేటట్టు
ఎవ్వరితో నా కబురంపించాలే – చెలియా ఆ ఆ ఆ
॥చిరునవ్వే విసిరావే॥

రచన: అనంత్‌శ్రీరామ్; సంగీతం: అనూప్ రూబెన్స్
గానం: విజయ్ ప్రకాశ్; చిత్రం: ప్రేమ కావాలి
https://youtu.be/wzKdQ2i0wbA

కట్‌చేయ్...దాచేయ్...



● ధర్మశాలలో రజనీకాంత్‌కి స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రత్యేక పూజలు చేయడంలేదు

రజనీకాంత్ ఆధ్యాత్మిక యాత్ర శనివారం మొదలైంది. వారం పది రోజులపాటు సాగే ఈ ట్రిప్‌లో రజనీ పలు దేవాలయాలను సందర్శించి, ధ్యానం చేసి, 'యోగాద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా' వందేళ్ల వేడుకల్లో పాల్గొని చెన్నై చేరుకుంటారు. ''ఇటీవల పొలిటికల్ జర్నీ స్టార్ట్ చేశాను. ఆ ప్రయాణం కోసం ఈ ప్రయాణం (ఆధ్యాత్మిక యాత్ర)లో ప్రత్యేక పూజలు చేయాలనుకోవడంలేదు. ఎప్పటిలానే ఇది కూడా ఓ స్పిరిచ్యువల్ జర్నీ అంతే'' అని రజనీ పేర్కొన్నారు. ముందు ధర్మశాల వెళ్లిన రజనీకి ఘనస్వాగతం లభించింది. అక్కడి శివాలయాన్ని దర్శించారాయన. ఆ తర్వాత రిషికేష్ వెళ్లడానికి ప్లాన్ చేసుకున్నారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్‌లో 1917లో పరమహంస యోగానంద ప్రారంభించిన 'యోగాద సత్సంగ సొసైటీ' (వైఎస్ఎస్) వందేళ్ల వేడుకల్లో పాల్గొంటారు.


బ్యాంకాక్‌లో బాహుబలి.. లండన్‌లో కట్టప్ప



● సత్యరాజ్

ముందు బాహుబలి (ప్రభాస్) బొమ్మ.. ఇప్పుడు కట్టప్ప (సత్యరాజ్) బొమ్మ కూడా కనువిందు చేయనుంది. ఎక్కడ అంటే? మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో. తుస్సాడ్స్ బ్యాంకాక్ శాఖలో ఇప్పటికే బాహుబలి కొలువు దీరాడు. ఇప్పుడు లండన్ శాఖలో కట్టప్ప కనిపించబోతున్నాడు. ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకునే ప్రముఖుల మైనపు విగ్రహాలను తుస్సాడ్స్ వారు మ్యూజియంలో ప్రతిష్ఠించే విషయం తెలిసిందే. 'బాహుబలి'తో ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకున్న ప్రభాస్ మైనపు విగ్రహాన్ని బాహుబలి గెటప్‌లోనే ప్రతిష్ఠించారు. ఇదే సినిమా ద్వారా బోలెడంత పాపులార్టీ తెచ్చుకున్న సత్యరాజ్ విగ్రహాన్ని కట్టప్ప గెటప్‌లో పెట్టాలని తుస్సాడ్స్ నిర్ణయించుకుంది. త్వరలో సత్యరాజ్‌ని కలిసి విగ్రహ కొలతలు తీసుకోనున్నారు. లండన్ తుస్సాడ్స్‌లో చోటు సంపాదించుకోబోతున్న తొలి తమిళ నటుడు సత్యరాజే కావడం విశేషం. తమిళంలో ఆయన దాదాపు 200 పై చిలుకు సినిమాలు చేసినా ఒక్క 'బాహుబలి' ఆయన్ను వరల్డ్ వైడ్‌గా పాపులర్ చేసేసింది.

వంకాయల సత్యనారాయణమూర్తి ఇక లేరు



ప్రముఖ సినీ, రంగస్థల సీనియర్ నటుడు, దర్శకుడు వంకాయల సత్యనారాయణ (78) ఇక లేరు. నటుడిగా సుమారు నాలుగు దశాబ్దాలపాటు వెండితెరపై విభిన్న పాత్రల్ని పండించిన ఆయన సోమవారం తన నివాసంలో మృతి చెందారు. కొద్ది కాలంగా శ్వాస సంబంధ సమస్యతో బాధపడుతూ విశాఖలోని తన కుమార్తె ఇంట్లో తుదిశ్వాస విడిచారు. 1940లో విశాఖపట్నం చవలవారి వీధిలో సత్యనారాయణ జన్మించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. అనారోగ్యంతో బాధపడుతూ కుమార్తె ఇంట్లోనే ఉంటున్నారు. నెల క్రితం కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించిన ఒక నాటకంలో ముఖ్యపాత్ర పోషించి మెప్పించారు. నడవలేని స్థితిల్లో ఉన్నా నాటకాలంటే ఆయనకు ఎంతో మక్కువ. నాటక రంగం నుంచే 'నీడలేని ఆడది' సినిమాతో చిత్ర రంగప్రవేశం చేశారు. సీతామాలక్ష్మి, శ్రీనివాస కల్యాణం, శుభలేఖ, దొంగకోళ్లు, విజేత వంటి చిత్రాలతోపాటు 160కిపైగా చిత్రాల్లో, పలు సీరియల్స్‌లో నటించారు. వందలాది రంగస్థల ప్రదర్శనలు ఇచ్చారు.

అందుకే కొత్తవాళ్లను తీసుకుంటా



● అనిల్ సుంకర

''నేను దర్శకుణ్ణి అవ్వాలనే ఇండస్ట్రీకొచ్చా. కానీ, డైరెక్టర్‌గా విఫలమయ్యా. నిర్మాతగా సక్సెస్ అయ్యా. అందుకే నిర్మాతగా ఉండటమే ఇష్టం'' అన్నారు అనిల్ సుంకర. నిఖిల్ హీరోగా, సంయుక్తా హెగ్డే, సిమ్రన్ పరింజ హీరోయిన్స్‌గా శరన్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మించిన 'కిరాక్ పార్టీ' ఈ నెల 16న విడుదలకానుంది. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ–'' నాకు ఎప్పటి నుంచో 'శివ' లాంటి సినిమా చేయాలని ఆశ. కన్నడ 'కిరిక్ పార్టీ' కథాంశం 'శివ' చిత్రానికి కొంత దగ్గరగా ఉండటంతో 'కిరాక్ పార్టీ'గా తెలుగులో రీమేక్ చేశా. ఈ చిత్రానికి తొలుత దర్శకునిగా రాజుసుందరం అనుకున్నాం. ఆయన తెలుగు, తమిళ భాషల్లో చేద్దామన్నారు. రెండు భాషల్లో ఒకేసారి ఫోకస్ చేయలేమని శరన్‌కి అవకాశం ఇచ్చాం. చాలా మంది కుర్రాళ్లు పల్లెటూరి నుంచి ఇంజనీరింగ్ చేయడానికి సిటీకొస్తారు. మొదటి సంవత్సరం భయంగా ఉంటారు. చివరి సంవత్సారానికి పూర్తిగా మారిపోతారు. అదెలా అన్నదే కథాంశం. మా సినిమాల్లో కొత్త వాళ్లను ఎక్కువగా తీసుకోవడానికి కారణం రెమ్యునరేషన్ తక్కువనే(నవ్వుతూ). ఫ్రెష్‌నెస్ కోసమే కొత్త వాళ్లను తీసుకుంటాం. శర్వానంద్– 'దండుపాళ్యం' డైరెక్టర్ శ్రీనివాసరాజుతో ఓ సినిమా అనుకున్నాం. కథ పూర్తయ్యాక వివరాలు చెబుతా'' అన్నారు.




● పూజా హెగ్డే

ట్రిపుల్ ధమాకా

ఏక్.. దో.. తీన్ అని లెక్కేస్తున్నారు పూజా హెగ్డే ఫ్యాన్స్. అవును.. ప్రస్తుతం పూజా హెగ్డే ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు భారీ ప్రాజెక్ట్స్ సైన్ చేసి ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. వరుస అవకాశాలతో తన డైరీని ఖాళీ లేకుండా నింపేస్తున్నారు పూజా. ఎన్టీఆర్–త్రివిక్రమ్ కాంబినేషన్‌లో హీరోయిన్‌గా సైన్ చేసిన కొద్ది రోజులకే, వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేశ్ బాబు 25వ సినిమాలోను ఛాన్స్ కొట్టేశారామె. వెంటనే పూజా డబుల్ ధమాకా కొట్టేసింది అనుకున్నారంతా. ఇప్పుడు రాధాకృష్ణ కుమార్ డైరెక్షన్‌లో ప్రభాస్ చేయబోయే నెక్ట్స్ సినిమాలోనూ పూజా హెగ్డేని హీరోయిన్‌గా తీసుకున్నారు. ఈ లవ్ స్టోరీ మూవీలో ప్రభాస్ ప్రేయసిగా పూజా రొమాన్స్ చేయనున్నారట. దీంతో డబుల్ ధమాకా కాస్తా ట్రిపుల్ ధమకా అయింది. ఈ మూడు భారీ ప్రాజెక్ట్‌ల తర్వాత పూజ టాప్ లిస్ట్‌లోకి చేరిపోయే అవకాశం ఉందని ఊహించవచ్చు.

మ్యూజికల్ మల్టీస్టారర్



● నాగార్జున



● నాని

నాగార్జున, నాని హీరోలుగా వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వనీదత్ ఓ మల్టీస్టారర్ మూవీ నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మార్చి 18న ఉగాది రోజు నుంచి మొదలుకానుంది. ఈ సందర్భంగా నిర్మాత అశ్వనీదత్ మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో మణిశర్మ చేసిన సినిమాలన్నీ మ్యూజికల్ హిట్స్‌గా నిలిచాయి. ఈ మల్టీస్టారర్ కూడా మ్యూజికల్‌గా ఉండాలని పూర్తిగా దృష్టి పెడుతున్నాం. మ్యూజిక్ సిట్టింగ్స్ అమెరికాలో జరుగుతున్నాయి. మా బ్యానర్‌లో చేసిన మల్టీస్టారర్స్ మంచి విజయాన్ని సాధించాయి. ఈ సినిమా కూడా హిట్ అయి మా బ్యానర్‌కు మంచి పేరు తీసుకువస్తుంది అనుకుంటున్నాను'' అన్నారు. ''ఎంటర్‌టైన్ చేసే డిఫరెంట్ సబ్జెక్ట్ ఇది. నాగార్జున, నాని వంటి హీరోలతో వైజయంతి బ్యానర్‌లో సినిమా చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య. ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ, కెమెరా: శ్యామ్‌దత్.

వ్యోమగామి.. ప్రేమగామి



● అదితీ రావ్ హైదరీ



● వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ స్పేస్ మూవీ రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వ్యోమగామి (ఆస్ట్రోనాట్)గా కనిపించనున్నారు. వ్యోమగామి అంటే గాల్లో తేలేవారు. అంటే స్పేస్‌లో గ్రావిటీ లేనందున వాళ్లు అలా తిరుగుతుంటారు. అలాంటి వ్యోమగామిని ముంచడానికి 'చెలియా' భామ అదితీ రావ్ హైదరీ రెడీ అయింది. కంగారుపడకండి ముంచేయటానికి అంటే పీకల్లోతు ప్రేమలో అండీ. మరి ఈ వ్యోమగామి ప్రేమగామిగా మారతాడా? తనకు అప్పగించిన మిషన్‌ను ఎలా పూర్తి చేస్తాడు? అనే విషయం తెలియాలంటే మాత్రం సినిమా చూడాల్సిందే. ఈ సినిమాలో వరుణ్ పక్కన హీరోయిన్‌గా అదితీ రావ్ హైదరీను సెలెక్ట్ చేసుకున్నారట చిత్ర బృందం. ప్రస్తుతం తన పాత్ర కోసం బరువు తగ్గే పనిలో ఉన్న వరుణ్ తేజ్ త్వరలోనే జీరో గ్రావిటీలో ట్రెనింగ్ తీసుకోవటానికి విదేశాలకు పయనం కానున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఉన్నప్పటికీ ఒక్క పాట కూడా ఉండదని సమాచారం. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాయిబాబు, రాజీవ్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా ఈ ఏడాది ద్వితీయార్ధంలో రిలీజ్ కానుంది.

ఇద్దరిదీ ఒకే కథ



● శ్రీవిష్ణు

'నువ్వు ఆత్మన్యూనతా భావంతో బాధ పడుతున్నావ్.. అయ్యో.. ఇదేదో బ్లడ్ క్యాన్సరో, మౌత్ క్యాన్సరో కాదు కదా అండీ?.. దాని కన్నా పెద్దది'... 'పాన్‌షాపు వాడిది బతుకు కాదా? కొబ్బరి బోండాలు అమ్ముకునేవాడిది ఓ బతుకు కాదా? మెకానిక్ షెడ్డు వాడిది బతుకు కాదా? డ్రైవర్‌ది బతుకు కాదా? ఏం.. మీలాంటి లెక్చరర్లు, డాక్టర్లు, ఇంజనీర్లవే బతుకులా?' వంటి డైలాగులు 'నీది నాది ఒకే కథ' సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. శ్రీ విష్ణు, 'బిచ్చగాడు' ఫేమ్ సాట్నా టైటస్ జంటగా నటించిన చిత్రం 'నీది నాది ఒకే కథ'. వేణు ఊడుగుల దర్శకత్వంలో ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– '' మా సినిమా టీజర్, పాటలకు మంచి స్పందన వస్తోంది. శ్రీ విష్ణు స్టూడెంట్‌గా కనిపించనున్నారు. చిత్తూరు యాసలో తను పలికిన ఘాటైన డైలాగులు యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సినిమా కూడా అన్నివర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. పోసాని కృష్ణమురళి, దేవిప్రసాద్ నటించిన ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, కెమెరా: రాజ్ తోట (అర్జున్‌రెడ్డి ఫేమ్).

వినగానే నచ్చేసింది - దేవిశ్రీ

ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన కొవెర దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'యు'. 'కథే హీరో' అన్నది ఉపశీర్షిక. కొవెర, హిమాన్షి కాంట్రగడ్డ జంటగా విజయలక్ష్మి కొండా నిర్మించిన ఈ చిత్రంలోని తొలి పాటను మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ విడుదల చేశారు. అనంతరం దేవిశ్రీ మాట్లాడుతూ– ''ఈ పాట చాలా ఆహ్లాదంగా ఉంది. వినగానే నచ్చేసింది. ఈ సినిమాలోని అన్ని పాటలు మంచి హిట్ అయి మ్యూజిక్ డైరెక్టర్ సత్య మహావీర్‌కి మంచి పేరు రావాలి. సినిమా కూడా మంచి విజయం సాధించాలి'' అన్నారు. దర్శకుడు కొవెర మాట్లాడుతూ– '' సత్య మహావీర్ మంచి సంగీతం అందించి, సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లారు. మిగిలిన పాటలని, సినిమా త్వరలో రిలీజ్ చేస్తాం'' అన్నారు. సంగీత దర్శకుడు సత్య మహావీర్, స్క్రీన్ ప్లే రచయిత మధు పాల్గొన్నారు. ఈ సినిమాకి కెమెరా: రాకేశ్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: శివ నాగశివ గణపర్తి, మూర్తినాయుడు పాదం, సమర్పణ: నాగానిక.




● కొవెర, దేవిశ్రీ ప్రసాద్

సెల్ఫ్ చెక్

సత్సంబంధాలు ఏర్పరచుకోవాలంటే సందేహిస్తున్నారా?

కొందరు ఇతరులతో స్నేహంగా ఉండాలంటే సంకోచిస్తారు. లేనిపోనివి ఊహించుకుంటూ భయపడతారు. సంతోషంగా, ఆరోగ్యంగా ఉన్నంతసేపు ఇబ్బంది కలుగక పోవచ్చు. కష్టాల్లో ఉన్నప్పుడే సహాయం అవసరమవుతుంది. అప్పటిదాకా ఇతరులతో పట్టీపట్టనట్లు ఉండి, అకస్మాత్తుగా సహాయం అడిగితే ఎవరూ చేయరు. మీరు ఎదుటివారితో స్నేహంగా ఉండటానికి సంకోచిస్తున్నారా? పరిచయాలు పెంచుకోవటానికి సందేహిస్తున్నారా?

1. ఎవరితోనైనా రిలేషన్ ఏర్పరచుకుంటే వారి వల్ల బాధపడవలసి వస్తుంది.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
2. మీ దృష్టిలో స్నేహం, ప్రేమ, అనుబంధాలు యాంత్రికమైనవి.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
3. సొంత విషయాలను ఇతరులతో పంచుకోవటానికి మీరు వ్యతిరేకం.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
4. ఇతరులకు చాలా దగ్గరవ్వటం మీలో భయాన్ని పెంచుతుంది.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
5. అంత సులువుగా ఎవరినీ నమ్మరు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
6. ఎవరితోనైనా క్లోజ్‌గా ఉంటే వారు నమ్మించి మోసం చేస్తారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
7. ఎదుటివారు మీకు దగ్గరవుతున్నా వారిని దూరంగా ఉంచుతారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐



8. అందరికీ దూరంగా ఉంటే ప్రశాంతంగా ఉంటుంది.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
9. బాగా పరిచయస్తులతో కూడ చాలా తక్కువగా మాట్లాడతారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
10. గతంలో ఇతరులను నమ్మి నష్టపోయారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐

'బి' లు 'ఎ' ల కన్నా ఎక్కువగా వస్తే ఎదుటివారితో స్నేహంగా, ప్రేమగా ఉండటానికి సంకోచిస్తారు. అనవసరమైన భయాలను వదలండి. ప్రపంచంలో అందరూ ఇతరులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారని తెలుసుకోండి. స్నేహం విలువను గ్రహించటానికి ప్రయత్నించండి. 'ఎ' లు 'బి' ల కన్నా ఎక్కువగా వస్తే మీ చుట్టుపక్కలవారితో మంచి రిలేషన్ కొనసాగించగలరు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం
13-3-2018

కష్టం అలివిగాని జుట్టులా అదేంటో నెత్తి మీదే మొలుస్తుంది. పెద్ద భారమైపోతుంది.
ఒకటి కాదు రెండు కాదు ఎన్నో చిక్కులుగా తయారవుతుంది. అలాగే భరిస్తూ కూచుంటే ఊడల్లాగా పాకుతుంది.
ఎక్కడో మనలో దాగున్న మనోధైర్యాన్ని బయటికి తీసుకొస్తే ఆ కష్టాన్ని జుట్టు పట్టుకొని ఈడ్చేయొచ్చు.




● క్షురకవృత్తిలో ఉన్న భర్త అకస్మాత్తుగా మరణిస్తే అంతులేని కష్టాలను ఎదుర్కొని నేడు విశాఖలో అతి పెద్ద సెలూన్‌ను యజమానిగా మారిన ఆతవ పద్మావతి... తన కుటుంబ సభ్యులతో...

కష్టాన్ని జుట్టుపట్టి ఈడ్చేసింది

మా స్వస్థలం చీరాల. చిన్న వయసులోనే మా అమ్మానాన్నలు నాకు లోకేశ్వర్రావుతో పెళ్లి చేశారు. నా భర్తది బార్బర్ పని. ఆరుగురు పిల్లలు పుట్టారు. అందరూ కొడుకులే. నా భర్త ఉమ్మడి కుటుంబంలో ఉంటూ బార్బర్‌గా కుటుంబాన్ని పోషించేవాడు. పెళ్లయిన కొన్నాళ్లు మా జీవితం సజావుగానే సాగింది. మూడో పిల్లాడు కలిగేనాటి నుంచి నా భర్తలో మార్పులొచ్చాయి. చెడు అలవాట్లలో పడి ఇంటికి ఆలస్యంగా రావడం, కుటుంబాన్ని పట్టించుకోకపోవడం చేసేవాడు. అతని బాధ్యతారాహిత్యంపై ఆయన అన్నదమ్ములు విసిగిపోయారు. నా భర్త మారతాడని ఎన్ని రకాలుగానో ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి కుటుంబం నుంచి దూరంగా పెడితే బాగుపడతాడని మమ్మల్ని దూరం పెట్టారు.

స్కూలు ఉప్మాయే భోజనం

నా భర్త, నేను, పిల్లలం విశాఖ వలస వచ్చేసి పాతగోపాలపట్నంలో చిన్నపాక అద్దెకు తీసుకుని బతకడం ప్రారంభించాం. మా ఆయన చిన్నబడ్డీ పెట్టుకుని క్షౌరవృత్తితో సంపాదనకు ప్రయత్నించాడు. కొంతకాలం తిండికి ఇబ్బంది లేకుండా కుటుంబాన్ని నెట్టుకు వస్తుండగా కష్టం నా నెత్తి మీద పడింది. ఆయనకు హటాత్తుగా క్యాన్సర్ సోకింది. నాకేం అర్థం కాలేదు. ఇంత పెద్ద కష్టమా అనుకున్నాను. కేజీహెచ్‌లో ఆయనకు వైద్యం ఇప్పిస్తూ ఇంకో వైపు పిల్లలను పోషించడానికి నానా ప్రయాశలు పడ్డాను. చేతిలో చిల్లి గవ్వ ఉండేది కాదు. భయంకరమైన ఆకలి. చివరకు శనక్కాయలు అమ్మి పిల్లలకు పట్టెడన్నం పెట్టడానికి చాలా కష్టపడ్డాను. చాలామార్లు పస్తులుండేదాన్ని. పాతగోపాలపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పెట్టే ఉప్మాయే తప్ప ఇంట్లో భోజనం ప్రతి రోజూ ఉండేది కాదు. పాఠశాలకు సెలవిస్తే ఆ రోజు నాతో పాటు పిల్లల పరిస్థితి రోదనగానే ఉండేది. నా వేదనను మా బావ బోసుబాబు, మరిది అప్పారావు అర్థం చేసుకున్నారు. పెద్దకొడుకు వరప్రసాద్‌ను చీరాల తీసుకువెళ్లారు. రెండో కొడుకు శ్రీనుని తొమ్మిదో ఏటే గత్యంతరం లేక

'అమ్మా... బిడ్డల మొహం చూసి బతకాలమ్మా... కష్టం ఎప్పుడూ శాశ్వత చుట్టం కాదు.. ఏదో ఒక రోజు అది పెట్టె సర్దుకొని వచ్చినదారినే వెళ్లాల్సిందే' అని ఆమె ఇచ్చిన మానసిక ధైర్యంతో ఆలోచన విరమించుకున్నా.

గోపాలపట్నంలో ఓ సెలూన్‌లో చేర్పించాను. శ్రీను నాకు తోడుగా రోజుకి రూపాయి సంపాదన తెచ్చిపెడుతుండేవాడు. అదే చాలా పెద్ద మొత్తంగా ఉండేది నాకు. నా మూడో కొడుకు విజయకుమార్ అప్పటికి ఒకటో తరగతి చదువుతుండగా, బలరాం నాలుగో సంవత్సరంలో అడుగులేస్తున్నాడు. కవలపిల్లలుగా ఉన్న రామ లక్ష్మణులకు రెండేళ్ల వయసు. ఆ సమయంలో నా భర్తకి ఆపరేషన్ చేసినా బతకలేదు. చనిపోయాడు. ఆ రోజు పాతగోపాలపట్నంలో భోరున వర్షం. క్యాన్సర్ రోగి అని నా భర్తని మోయడానికి గ్రామస్తులు ముందుకు రాలేదు. అంత్యక్రియలు చేయడానికి నా చేతిలో చిల్లిగవ్వలేదు. ఆ కష్టం ఒకటి ఈ కష్టం ఒకటి. చివరికి గ్రామస్తుల్ని ప్రాధేయపడితే నలుగురు వ్యక్తులు వచ్చారు. వారితో నేను కూడా పాడి మోశాను. పదేళ్ల వయసున్న నా కొడుకు శ్రీను తలకొరివి పెట్టాల్సి వచ్చింది.

మళ్లీ సొంతూరికి ప్రయాణం...

నా భర్త మరణంతో తేరుకోలేకపోయాను. ఒంటరి బతుకు ఎలా బతకాలా అని భయపడిపోయాను. బతుకు సాగించలేక పిల్లలతో స్వస్థలం చీరాల వెళ్లిపోయాను. మా బావకు ఇద్దరు కొడుకుల్ని, మరిదికి ఇద్దరు కొడుకుల్ని అప్పగించి రామలక్ష్మణులతో అదే ఊళ్లో కన్నవారి ఇంటికి వెళ్లిపోయాను. చీరాల వెళ్లాక ఎన్నో అవమానాలు, సూటిపోటి మాటలు, నిందలూ భరించాను. తండ్రిలేని బిడ్డలతో ఎన్నాళ్లిలా కాలం గడిపేదని కుమిలిపోతుండేదాన్ని. ఆ రోజుల్లో భర్త లేని ఆడవాళ్లను సమాజంలో ఆదరించే పరిస్థితి లేదు. విధవరాలి మొహం చూడకూడదని, ఎదురు పడితే ఛీఛీ అంటూ కొంతమంది ఈసడించుకుంటుండే వారు. మనోధైర్యం చెప్పేవారు ఉండేవారు కాదు. బంధుమిత్రుల్లో ఆదరణలేదు. ఇలాగైతే బతకలేమని, బతికి ఉన్నా జనం బతకనిచ్చేలా లేరని కుంగిపోయేదాన్ని. ఒకదశలో ఆత్మహత్యే శరణ్యమనుకున్నా. కానీ, ఆ సమయంలో ఓ ముసలామె ఓదార్పు నాకు బతకాలనిపించేలా చేసింది. 'అమ్మా... బిడ్డల మొహం చూసి బతకాలమ్మా... కష్టం ఎప్పుడూ శాశ్వత చుట్టం కాదు.. ఏదో ఒక రోజు అది పెట్టె సర్దుకొని వచ్చినదారినే వెళ్లాల్సిందే' అని ఆమె ఇచ్చిన మానసిక ధైర్యంతో ఆలోచన విరమించుకున్నా. మున్ముందు మంచి రోజులొస్తాయని ఆమె చెప్పిన మాటలు ఇపుడు నిజమయ్యాయి.

కొత్తజీవితం పెద్ద ఫ్యామిలీగా...


పిల్లలు ఎదిగొచ్చాక కుటుంబాన్ని వృద్ధి చేసుకోవడానికి మళ్లీ పిల్లలతో విశాఖ వలస వచ్చేశాను. గోపాలపట్నం శివారు చంద్రనగర్‌లో కుటుంబాన్ని నిలబెట్టుకున్నాను. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కష్టార్జితంతో కమ్మలిల్లు కట్టించాను. పిల్లలు సెలూన్‌లలో చేరి నాకు అండగా నిలిచారు. ఇలా ప్రతిరూపాయినీ పొదుపు చేసి బుచ్చిరాజుపాలెంలో చిన్నసెలూన్ పెట్టించాను. పిల్లలకు వరుసగా పెళ్లిళ్లు చేశాను. కోడళ్లు, కొడుకులతో ఉమ్మడి కుటుంబాన్ని బలోపేతం చేశాను. పిల్లల రెక్కల కష్టంతో కమ్మలింటిని కాస్తా మేడ ఇల్లుగా చేసుకున్నాం. పిల్లలు ఇపుడున్న ట్రెండ్‌కి తగ్గట్టు సెలూన్‌లని నిర్వహించడంతో అవి 'ఎంహెచ్‌డీఫ్యామిలీ సెలూన్' పేరిట విస్తరిస్తున్నాయి. గోపాలపట్నంలో ఎంహెచ్‌డీ సెలూన్ నగరంలో అతిపెద్దదిగా పేరుపొందిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. మా ఆలోచనలకు తోడుగా కోడళ్లు కూడా ఊరికే కూర్చోకుండా ఫ్యామిలీ సెలూన్‌ని నడుపుతున్నారు. ఇలా కొడుకులు, కోడళ్లు మనుమలు, మనువరాళ్లతో ఒకేతాటిపై పెద్ద కుటుంబంగా ఉన్నామని చెప్పడానికి ఇపుడు గర్వంగానే ఉంది. కష్టాలొస్తే జీవితం లేదన్న భావన ఉండకూడదు...ఓర్పు, శ్రమ, విలువలే జీవితమని నన్ను ఉదహరిస్తూ జనం చెప్పుకుంటుంటే సంతోషంగా ఉంది.

– **ఉద్దండం హరేకృష్ణగాంధీ**, గోపాలపట్నం

● సైన్స్- సంప్రదాయం

ఆచమనం అంటే ఏమిటి?

పూజలు, వ్రతాల్లో 'ఆచమనం' అనే మాట చాలా సార్లు వింటాం. కానీ ఆ పదానికి అర్థం చాలామందికి సరిగా తెలీదు. అందుకే 'ఆచమనం' అంటే ఏమిటి, అసలు ఆచమనం ఎందుకు చేయాలి? నీటిని అరచేతిలో పోసుకుని తాగడం వల్ల ప్రయోజనం ఏమిటి, అలా ఎందుకు తాగాలి, ఉద్ధరణితో తిన్నగా నోట్లో పోసుకుని ఎందుకు తాగకూడదు? మూడు ఉద్ధరణిల నీరు మాత్రమే ఎందుకు తీసుకోవాలి? నీరు కాస్త ఎక్కువో తక్కువో అయితే ఏమవుతుంది... వంటి సందేహాలు కలగడం సహజం. అందుకే ఆచమనం చేయడంలో పరమార్థం ఏమిటో విపులంగా తెలుసుకుందాం. మన గొంతు ముందు భాగం లోంచి శబ్దాలు వస్తాయి. దీన్ని స్వరపేటిక అంటాం. దీనిచుట్టూ ఉండే కార్టిలేజ్ కవచం కొంత వరకూ రక్షణ లభిస్తుంది. ఇది ఎంత అద్భుతమైనదో, అంత సున్నితమైనది. ఈ గొంతు స్థానంలో చిన్నదెబ్బ తగిలినా ప్రమాదమే. స్వరపేటిక దెబ్బతిని మాట పడిపోవచ్చు, ఒక్కోసారి ప్రాణమే పోవచ్చు. స్వరపేటిక లోపలి భాగంలో ధ్వని ఉత్పాదక పొరలు ఉంటాయి. ఇవి ఇంగ్లీషు అక్షరం 'గ ఆకారంలో పరస్పరం కలిసిపోయి ఉంటాయి. ఈ తంత్రులు సూక్ష్మంగా ఉండి, ఎపెక్స్ ముందుభాగంలో పాతుకుని



రోజులో ఆచమనం పేరుతో అనేకసార్లు మెల్లగా నీరు తాగడం వల్ల గొంతు, ఇతర అవయవాలు వ్యాయామం చేసినట్లు అవుతుంది.

ఉంటాయి. స్వరపేటిక కవాటాలు పల్చటి మాంసపు పొరతో ముడిపడి ఉంటాయి. ఈ శరీర నిర్మాణం గురించి చెప్పుకోవడం ఎందుకంటే, మన భావవ్యక్తీకరణకు కారకమైన స్వరపేటిక మహా సున్నితమైనది. ముక్కు, నోరు, నాలుక, పెదవులు, పళ్ళు, గొంతు నాళాలు, అంగిలి, కొండనాలుక, గొంతు లోపలి భాగం, శ్వాసనాళం, అన్ననాళం, స్వర తంత్రులు, వాటిచుట్టూ ఉన్న ప్రదేశం ఇవన్నీ ఎంతో నాజూకైనవి. వీటికి బలం కలిగించడమే ఆచమనం పరమోద్దేశం. రోజులో ఆచమనం పేరుతో అనేకసార్లు మెల్లగా నీరు తాగడం వల్ల గొంతు, ఇతర అవయవాలు వ్యాయామం చేసినట్లు అవుతుంది.

ఇక ఉద్ధరణితో తిన్నగా ఎందుకు తాగకూడదు, చేతిలో వేసుకునే ఎందుకు తాగాలి అంటే, మన చేతుల్లో కొంత విద్యుత్తు ప్రవహిస్తూ ఉంటుంది. చేతిలో నీళ్ళు వేసుకుని తాగడం వల్ల ఆ నీరు విద్యుత్తును పీల్చుకుని నోటి ద్వారా శరీరంలోనికి ప్రవేశిస్తుంది. అక్కడ ఉన్న విద్యుత్తుతో కలిసి శరీరం అంతా సమానత్వం ఉండేలా, సమ ధాతువుగా ఉండేలా చేస్తుంది. ఒక ఉద్ధరణి చొప్పున కొద్దికొద్దిగా నీరు సేవించడం వల్ల ఆ కొద్దిపాటి విద్యుత్తు పెదాలు మొదలు నాలుక, గొంతు, పేగుల వరకూ ఉన్న సున్నితమైన అవయవాలను ఉత్తేజ పరుస్తాయి. అలవాటుగా పాటించే ఆచారాల వెనుక ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. శాస్త్రీయత ఉంది.

పరి పరిశోధన

కృత్రిమ గుండె రెడీ!



హమ్మయ్యా... ఎట్టకేలకు మనిషికి గుండె అందుబాటులోకి రానుంది.. వ్యాధి లేదా పోటు వంటి కారణాలతో గుండె బాగా బలహీనపడితే ఇప్పటివరకూ కృత్రిమ గుండెను వాడేవారు గానీ.. అదంతా తాత్కాలికమే. అవయవ దానం ద్వారా ఇంకో గుండె దొరికేంత వరకూ రోగిని బతికేలా చేస్తుంది ఈ గుండె. అయితే ఒరెగాన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్శిటీ శాస్త్రవేత్తల పుణ్యమా అని ఇప్పుడు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకనుంది. డాక్టర్ రిచర్డ్ వాంప్లర్ అనే శాస్త్రవేత్త 2014 నుంచి ఈ కృత్రిమ గుండెను అభివృద్ధి చేస్తున్నారు. మిగిలిన కృత్రిమ గుండెల మాదిరిగా ఇందులో బోలెడన్ని భాగాలు ఉండవు. కచ్చితంగా చెప్పాలంటే ఒకే ఒక్క కదిలే భాగం ఉంటుంది. అలాగే మనిషి గుండెలో మాదిరిగా కవాటాలు లేకుండానే దీన్ని తయారుచేశారు. టైటానియం గొట్టం... అందులో అటుఇటు కదిలే గొట్టం లాంటి నిర్మాణం. ఇదీ ఒరెగాన్ గుండె స్థూల నిర్మాణం. కదిలే గొట్టం గుండె దిగువ భాగంలో ఉండే రెండు కవాటాల మాదిరిగా పనిచేస్తుందన్నమాట. రోగి తనతోపాటు మోసుకెళ్లే బ్యాటరీ ద్వారా శక్తితో పనిచేస్తుంది ఇది. ఆవులు, గొర్రెల్లో ఈ కృత్రిమ గుండెను ఇప్పటికే విజయవంతంగా పరీక్షించారు. మూడు నెలలపాటు పనిచేయించిన తరవాత మానవులపై ప్రయోగాలు చేస్తామని ఒరెగాన్ యూనివర్శిటీ అంటోంది.

హైడ్రోజెల్‌తోనూ ఇమ్యునో థెరపీ..



ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధికి మెరుగైన చికిత్స కనుక్కునే ప్రయత్నాల్లో రైస్ యూనివర్శిటీ, టెక్సాస్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు కీలకమైన ముందడుగు వేశారు. మందును దీర్ఘకాలంపాటు నెమ్మదిగా విడుదల చేస్తూ కణుతులు పూర్తిగా నాశనయమ్యేలా చేయగల సరికొత్త హైడ్రోజెల్‌ను వీరు అభివృద్ధి చేశారు. రోగ నిరోధక వ్యవస్థను కాపాడే టీ-కణాలను కేన్సర్‌పై దాడికి ఉపయోగించడాన్ని ఇమ్యునో థెరపీ అంటారని.. ఇటీవలి కాలంలో ఈ పద్ధతి మంచి ఫలితాలు సాధిస్తున్నదనీ మనందరికీ తెలుసు. అయితే దీంతోనూ కొన్ని ఇబ్బందులు లేకపోలేదు. ఇంజెక్షన్ల రూపంలో అందించే మందులు శరీరం మొత్తం వ్యాపిస్తూంటాయి. ఈ క్రమంలో కేన్సర్ కణితి వద్దకు వచ్చేసరికి వీటి ప్రభావం తక్కువైపోతూంటుంది. రైస్, టెక్సాస్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన హైడ్రోజెల్‌ను నేరుగా కణితి ఉన్న ప్రాంతంలోకే పంపిస్తారు కాబట్టి.. అది అక్కడే ఉండటంతో పాటు మందులను కూడా చాలా నెమ్మదిగా విడుదల చేస్తూ కేన్సర్ కణాలు చచ్చిపోయేందుకు దోహదపడుతుంది. ఈ హైడ్రోజెల్‌ను ఎలుకలపై ప్రయోగించినప్పుడు అవి ఎక్కువ కాలం జీవించడంతోపాటు కొత్తగా ప్రవేశపెట్టిన కేన్సర్ కణాలను కూడా చంపేయగలిగాయని ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త జెఫ్రీ హార్ట్‌గెరింక్ తెలిపారు.

ఎరువుల ఖర్చు తగ్గించే సరికొత్త గ్రాఫీన్..

రైతులకు ఉన్న అనేకానేక కష్టాల్లో ఎరువుల ఖర్చు ఒకటి. పోనీ ఇంత ఖర్చు పెట్టి వేసిన ఎరువులు పూర్తిస్థాయిలో ఫలితమిస్తాయా? అంటే అదీ లేదు. వానొస్తే లేదా నీళ్లల్లో కలిస్తే ఎరువులు వాటితో కొట్టుకుపోతాయి. ఈ నేపథ్యంలో అడిలైడ్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు గ్రాఫీన్ ఆక్సైడ్ పదార్థం ఆధారంగా కొత్త రకం ఎరువులను తయారు చేశారు. భూమిలోకి చేరిన తరువాత ఇవి చాలా నెమ్మదిగా తమ లోపల ఉండే ఎరువులను విడుదల చేస్తాయి. సాధారణ ఎరువులు కేవలం 12 నుంచి 24 గంటల్లోపు వాటిలోని పోషకాలన్నింటినీ విడుదల చేసేస్తాయి. ఈ క్రమంలో అవసరమైన సమయంలో మొక్కలకు ఎరువులు అందే అవకాశం లేకుండా పోతుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ప్రొఫెసర్ మైక్ మెక్‌లాగిన్ తెలిపారు. అయితే గ్రాఫీన్ ఆక్సైడ్ ఆధారంగా తయారైన ఎరువులు నెలరోజుల వరకూ పోషకాలను నెమ్మదిగా విడుదల చేసేలా తయారు చేసుకోవచ్చునని మైక్ తెలిపారు. తాము తమ పరిశోధనల్లో జింక్, కాపర్ వంటి సూక్ష్మపోషకాలను గ్రాఫీన్ ఆక్సైడ్ ద్వారా గోధుమ పంటకు అందించారు. సాధారణ ఎరువులతో పండుతున్న పంటలతో పోల్చి చూసినప్పుడు గ్రాఫీన్ ఆక్సైడ్ ఎరువులు వాడిన పంటల్లో ఈ రెండు సూక్ష్మ పోషకాలు ఎక్కువగా ఉన్నట్లు తెలిసిందని మైక్ వివరించారు. భూమిలో ఉండే సేంద్రియ కార్బన్ నిర్మాణాన్ని దగ్గరగా పోలి ఉండటం వల్ల గ్రాఫీన్ ఆక్సైడ్ వాడకం పర్యావరణపరమైన సమస్యలేవీ సృష్టించదని మైక్ అంటున్నారు.



జనరల్ హెల్త్ కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

నాలుక మీద పొర కరిగిపోయింది



నా వయసు 37. నెలలో రెండు మూడు సార్లు ఆల్కహాల్ తీసుకునే అలవాటు ఉంది. గత ఏడాది తినేటప్పుడు బాగా మంటగా ఉంటే డాక్టరును సంప్రదించాను. నాలుకపై కుడివైపు ఉన్న మ్యూకస్ మెంబ్రేన్ కరిగిపోయిందని చెప్పి, బీ-కాంప్లెక్స్ టాబ్లెట్స్ రాసిచ్చారు. మొదట్లో కాస్త ఉపశమనం అనిపించినా ఆ తర్వాత అదే సమస్య తిరగబెట్టింది. ఇప్పుడు మళ్లీ నాలుకకు ఎడమవైపున కూడా ఇదే సమస్య వచ్చింది. ఏమీ తినలేకపోతున్నాను. దయచేసి నా సమస్యకు తగిన పరిష్కారం చెప్పండి.

– రామచంద్రయ్య, కర్నూలు

మీరు చెప్పిన లక్షణాలు గ్లాసైటిస్ అనే కండిషన్‌ను సూచిస్తున్నాయి. అంటే గ్లాసైటిస్ సమస్యలో నాలుక మీద ఉన్న పొర ఇన్‌ఫ్లేమ్ కావడం జరుగుతుంది. ఈ సమస్యకు బీ కాంప్లెక్స్ లోపం మొదలుకొని ఆల్కహాల్ మితిమీరి తీసుకోవడం, పొగతాగడం, డయాబెటిస్ వంటి అనేక అంశాలు కారణం కావచ్చు. గ్లాసైటిస్ అదుపులోకి రావడానికి అందుకు కారణమైన అంశాలను అదుపులో పెట్టుకోవాలి. దాంతోపాటు ప్రో-బయాటిక్స్ అనే పదార్థాలను వైద్యులు దాదాపు ఒక నెల నుంచి రెండు నెలల వరకు ప్రిస్క్రయిబ్ చేస్తూ ఉంటారు. ప్రో-బయాటిక్స్ అంటే మజ్జిగ, పెరుగు వంటి పదార్థాల్లో సాధారణంగా ఎక్కువగా కనిపించే లాక్టోబ్యాసిల్లై అనే మనకు మేలు చేసే బ్యాక్టీరియా అన్నమాట. ఈ పదార్థాలను ఎక్కువగా తీసుకుంటే ఈ గ్లాసైటిస్ అనే సమస్య కొంతవరకు మెరుగవుతుంది. మీరు ఇకసారి మెడికల్ స్పెషలిస్ట్‌కు చూపించి ఆయన సూచనల మేరకు చికిత్స తీసుకోండి.

రాత్రిళ్లు కాళ్లు తిమ్మిరెక్కుతున్నాయి...

నాకు రోజు రాత్రివేళల్లో అదీ నిద్రలో కాళ్లు తిమ్మిరెక్కుతాయి. పడుకున్న కాసేపటికే కాలు తిమ్మిరెక్కిపోయి బాధగా లేచి కూర్చుంటాను. తిమ్మిరెక్కిన సమయంలో కాలు కిందపెట్టనివ్వదు. నొప్పి, బాధతో విలవిల్లాడిపోతాను. ఇది చాలా బాధాకరంగా ఉంటోంది. దయచేసి నాకు సరియైన సలహా ఇవ్వగలరు.

– శ్రీహరిప్రసాద్, నల్లగొండ

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి చూస్తే మీ సమస్య పెరిఫెరల్ న్యూరోపతి కావచ్చని అనిపిస్తోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా డయాబెటిస్, క్రానిక్ ఆల్కహాలిజం సమస్యలు ఉన్నవారిలో ఇది చాలా సాధారణం. మీ సమస్యకు అసలు కారణాన్ని నిర్ధారణ చేయడానికి బ్లడ్‌టెస్ట్ వంటి కొన్ని పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. కారణాన్ని బట్టి సమస్యకు తగిన మందులను మెడికల్ కన్సల్టెంట్ పర్యవేక్షణలో కనీసం రెండు, మూడు నెలలైనా వాడాల్సి ఉంటుంది.



చికిత్స తర్వాత క్షయ మళ్లీ తిరగబెట్టవచ్చా...?

నా వయస్సు 42 ఏళ్లు. రెండేళ్ల క్రితం క్షయ వ్యాధి పాజిటివ్ వచ్చింది. హెచ్‌ఐవీ పరీక్ష కూడా చేయించాను. అది నెగెటివ్ వచ్చింది. ఆర్నెల్ల పాటు ట్రీట్‌మెంట్ తీసుకున్నాను. చికిత్స తర్వాత పరీక్ష చేయించుకుంటే నెగెటివ్ వచ్చింది. ఒకసారి క్షయ వచ్చాక అది తగ్గేవరకు మందులు తీసుకొని నెగెటివ్ అని వచ్చాక కూడా మళ్లీ అది తిరగబెట్టే అవకాశం ఉందా? నేను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– ప్రసాదమూర్తి, అనకాపల్లి

పూర్తిగా చికిత్స తీసుకున్న తర్వాత క్షయవ్యాధి తిరగబెట్టడానికి అవకాశాలు కాస్త అరుదే. అయితే అరుదుగానైనా ఈ సమస్య మళ్లీ వచ్చేందుకు అవకాశం లేకపోలేదు. ఇలా వ్యాధి తిరగబెట్టడం అన్నది చికిత్స పొందిన వ్యక్తి వ్యాధి నిరోధకశక్తిపై ఆధారపడి ఉంటుంది. ఎప్పుడైనా వారిలో ఇతర కారణాల వల్ల (ఉదా: డయాబెటిస్, వయస్సుపైబడటం, హెచ్‌ఐవీ వంటివి) వ్యాధినిరోధకశక్తి తగ్గి క్షయ మళ్లీ తిరగబెట్టే అవకాశాలు ఉండవచ్చు. దీన్నే 'రీ యాక్టివేషన్' అంటారు. ఇలా వ్యాధి తిరగబెట్టకుండా ఉండాలంటే మంచి సమతుల పౌష్టికాహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సరైన నిద్ర, డయాబెటిస్ లాంటి సమస్యలు ఉంటే వాటిని పూర్తిగా నియంత్రణలో పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.



పెయిన్ కిల్లర్స్ వాడినప్పటి నుంచి కడుపులో మంట!

నా వయసు 47 ఏళ్లు. నాకు మొదటి నుంచి అసిడిటీ సమస్య ఉంది. ఇటీవల తీవ్రమైన మెడ నొప్పి రావడంతో డాక్టర్‌ను సంప్రదించి మందులు వాడుతున్నాను. ఒకటి రెండు సార్లు పెయిన్‌కిల్లర్స్ వాడాను. అవి వాడినప్పటి నుంచి కడుపులో మంట మరింతగా పెరుగుతోంది. నాకు పరిష్కారాన్ని సూచించండి.

– నాగరాజు, గుంటూరు


కొన్ని నొప్పి నివారణ మందుల వల్ల... ముఖ్యంగా ఎన్ఎస్ఏఐడి గ్రూపునకు చెందిన బ్రూఫెన్, డైక్లోఫెనాక్, నాప్రోక్సెన్ వంటి వాటివల్ల అసిడిటీ, గుండెలో మంట వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఇలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేని మందులు కూడా ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. మీరు ఒకసారి మీ డాక్టర్‌ను సంప్రదించి మీకు మందులతో వస్తున్న సైడ్‌ఎఫెక్ట్స్ గురించి వివరించండి. డాక్టర్ మందులు మార్చి ఇస్తే మీ సమస్య తీరుతుంది.

ముక్కులు బిగదీసుకుపోతున్నాయి... పరిష్కారం చెప్పండి

నా వయస్సు 33. ఈ వయసులోనూ రోజూ ఉదయం వేళ చాలా సేపు ముక్కు కారుతుండటంతో నేను చాలా ఇబ్బందిగా ఫీలవుతుంటాను. ఇక స్వీట్స్, అరటిపళ్లు, పెరుగు, పులుసు కూరలు తిన్నప్పుడు ఆ రాత్రంతా ముక్కులు బిగదీసుకుపోతాయి. ఊపిరి సరిగా అందక బాధపడుతుంటాను. ముక్కు రంధ్రాల్లో ఏదో ఒకటి ఎప్పుడూ మూసుకుపోయి ఉంటుంది. మాకు దగ్గర్లోని డాక్టర్‌కు చూపిస్తే ఇజ్నోఫిలియా అని సిట్రజిన్ ఇచ్చారు. నా సమస్యకు తగిన పరిష్కారం చూపించండి.

– డి. పార్థసారథి, నరసరావుపేట

మీరు రాసిన వివరాల ప్రకారం మీ సమస్య అలర్జిక్ సైనోరైనైటిస్ కావచ్చు. అంటే... అలర్జీ కారణంగా ముఖం ఎముకల్లో ఉండే ఖాళీ ప్రదేశాలైన సైనస్‌లలో, ముక్కులో ఉండే లైనింగ్ పొరల్లో కొంత వాపు వచ్చి అవి ముక్కు రంధ్రాలను బ్లాక్ చేయడం వల్ల ఇలాంటి సమస్య కనిపిస్తుంటుందన్న మాట. మీరు మీ డాక్టర్ చెప్పిన మందులతో పాటు కొన్ని నేసల్ స్ప్రేస్ (డీ-కంజెస్టెంట్స్) వాడటం వల్ల ఉపశమనం ఉంటుంది. ఒకసారి మీరు మెడికల్ స్పెషలిస్ట్‌ను కలిసి తగిన చికిత్స తీసుకోండి.



డాక్టర్ ఎమ్. గోవర్ధన్,
సీనియర్ ఫిజీషియన్,
కేర్ హాస్పిటల్స్,
నాంపల్లి, హైదరాబాద్


సాగుబడి

ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.

పూర్వాభాద్ర కార్తె: మార్చి 17 వరకు

మామిడిని కాపాడుకుందాం!

వాతావరణం మారిపోయింది. అసాధారణ వాతావరణం మామిడి రైతు గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది. సంక్రాంతి సమయంలో చుట్టుముట్టిన దట్టమైన పొగమంచు పూతను దెబ్బతీసింది. ఇప్పుడేమో రాత్రి పూట వణికించే చలి, పగటి పూట అధిక ఉష్ణోగ్రత మామిడి రైతుపై పగబట్టినట్టే కనిపిస్తున్నాయి. పూత ఆలస్యం కావడం, తీరా వచ్చిన పిందెలు కూడా రాలిపోతుండడంతో రైతులు కలవరపడుతున్నారు. రాత్రి ఉష్ణోగ్రత సాధారణం కన్నా ఐదారు డిగ్రీలు తక్కువగా ఉండటం.. పగటి ఉష్ణోగ్రత సాధారణం కన్నా ఎక్కువగా ఉండటం వంటి విపరిణామాలు ఆశలను తుంచేస్తున్నాయి. తేనెమంచు, తదితర చీడపీడలు రసాయనిక మందులు చల్లే రైతులను అల్లాడిస్తున్నాయి. అయితే, ప్రకృతి వ్యవసాయదారుల పరిస్థితి మెరుగ్గానే ఉంది. సేంద్రియ తోటల్లో చీడపీడల బెడద లేదు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా వాతావరణ మార్పులను దీటుగా ఎదుర్కోవచ్చని, మామిడి తోటలను కాపాడుకోవచ్చని వీరి అనుభవాలు చెబుతున్నాయి..


సుధామోహన్‌కు చెందిన సేంద్రియ మామిడి తోటలో పూతతో నిండి ఉన్న బంగినపల్లి చెట్టు (ఇన్‌సెట్‌లో.. మామిడి పిందెలు)

చలి పెరిగినా పూత బాగుంది..

గత ఏడాది ఆగస్టు తర్వాత వర్షాలేవు. కరువొచ్చింది. చలి కూడా తక్కువే. ఈ ఏడాది వర్షాలు బాగున్నాయి. చలి పెరిగింది. పూత బాగుంది. గత ఏడాదికన్నా రెట్టింపు దిగుబడి వస్తుందనుకుంటున్నాను. మా తోట పదెకరాలు. 14 ఏళ్ల నాటిది. మొదటి నుంచీ మనసబు ఫుకుఒకా ప్రకృతి వ్యవసాయ పద్ధతిని పాటిస్తున్నా. అసలు నీరు పెట్టలేదు. కలుపు తీయకుండా సజీవ ఆచ్ఛాదన చేస్తున్నాం. వాన నీటి సంరక్షణకు ఇంకుడుగుంటలు తీశాం.



కలుపుమందులు, రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడట్లేదు. మా చెట్లకు ఎటువంటి తెగుళ్లూ లేవు. వేపనూనె కూడా పిచికారీ చేయట్లేదు. నీరు ఎప్పుడూ పెట్టలేదు. మా ప్రాంతంలో నీరు పెట్టిన తోటలు చిగుళ్లతో గుబురుగా ఉన్నాయి, తేనెమంచు పురుగు వచ్చింది. రసం పీల్చే పురుగుల వల్ల ఆకులు కూడా రాలిపోతున్నాయి. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వల్ల రోగనిరోధక శక్తి ఆ చెట్లకు తక్కువగా ఉండటం వల్ల అన్ని రకాల పురుగులు, తెగుళ్లూ వస్తుంటాయి. మాకు ఆ బెడద లేదు. మా తోటలో ఎకరానికి 99 చొప్పున చిన్న రసం చెట్లున్నాయి. మాది కరువు ప్రాంతాలకూ సరిపోయే అధిక సాంద్రత పద్ధతి. ఎటు చూసినా 21 అడుగులకో చెట్టు నాటాం. పంట అయిపోగానే ప్రూనింగ్ చేస్తాం. గాలిదుమ్ములను తట్టుకుంటుంది. కాయ రాలుడు చాలా తక్కువ. కరువును తట్టుకొని, గాలులను తట్టుకొని దీర్ఘకాలం దిగుబడులనిచ్చే విధంగా ఇన్‌సిటు గ్రాఫ్టింగ్ పద్ధతిని అనుసరిస్తున్నాం.

– **ఎల్.జి.బి.ఎస్. రామరాజు** (94401 06567), కొత్తూరు తాడేపల్లి, విజయవాడ రూరల్ మండలం

ఆవు పిడకల పొగ వేస్తున్నాం..

మా 20 ఎకరాల తోట 30 ఏళ్ల నాటిది. వెయ్యి చెట్లున్నాయి. ఐదేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాం. 80% బేనిషాన్(బంగినపల్లి) చెట్లున్నాయి. ఈ ఏడాది చాలా చెట్లకు 80% పూత వచ్చింది. పిందె బాగానే వచ్చింది. అయితే, కొన్ని చెట్లకు చిగుళ్ల వచ్చాయి, పూత 25% మాత్రమే వచ్చింది. గత ఏడాది పూత ఎక్కువగానే వచ్చినా నిలబడింది తక్కువ. ప్రకృతి ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియటం లేదు. ఇప్పటికి మా తోటకు తెగుళ్లు ఏమీ రాలేదు. పూత రాకముందు పది రోజులకోసారి ఆవు మూత్రం కలిపిన నీటిని పిచికారీ చేశాం. ఇప్పుడు పిచికారీలు చేయడం లేదు. నీరు ఇవ్వడం లేదు. చీడపీడలు రాకుండా పది రోజులకోసారి పిడకల పొగ వేస్తున్నాం. సాయంత్రపు వేళలో ఐదెకరాలకు ఒక చోట కిలో ఆవు పిడకలు, పావు కిలో నెయ్యి, పచ్చి ఆకులు వేసి పిడకల పొగ వేస్తున్నాం. పూత, పిందెలు రాలిపోకుండా రక్షించుకోవడానికి పిడకల పొగ ఉపయోగపడుతున్నది. తేనెమంచు పురుగు కూడా రాలేదు. ఏ చెట్టుపైనైనా వచ్చిందన్న అనుమానం వస్తే ఆ దగ్గర్లో పిడకల పొగ పెడుతున్నాం. పిచికారీలు చేయడం లేదు. వడగళ్ల వాన రాకుండా ఉంటే ఈ ఏడాది మంచి దిగుబడే వస్తుందనుకుంటున్నాం.



– **సుధామోహన్** (93947 47100), బొమ్మరాజుపేట, శామీర్‌పేట మండలం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా

వేస్ట్ డీ కంపోజర్ వల్ల తోట బాగుంది..

మా 60 ఎకరాల సేంద్రియ తోటలో 1500 మామిడి చెట్లు, 1500 కొబ్బరి చెట్లున్నాయి. 1995 నుంచి సేంద్రియ, బయోడైనమిక్ పద్ధతిలో సాగు చేస్తున్నాం. ఇప్పుడు జీవామృతం, ఘనజీవామృతం, వేస్ట్ డీ కంపోజర్‌ను విరివిగా వాడుతున్నాం. జాతీయ, అంతర్జాతీయ సేంద్రియ సర్టిఫికేషన్లు ఉన్నాయి. మా తోటలో పల్ప్ రకం మామిడి చెట్లు ఎక్కువగా ఉన్నాయి. రసాలు తక్కువ. గత మూడేళ్లుగా మా చెట్లకు ఎటువంటి తెగుళ్లూ ఎరుగం. కాయకు చివరన ముడ్డిపుచ్చు వస్తుంటుంది. మాకు అది అసలు లేనే లేదు. 'సాక్షి సాగుబడి' ద్వారా వేస్ట్ డీ కంపోజర్ ద్రావణం గురించి తెలుసుకొని గత అక్టోబర్ నుంచి దాదాపు రోజు మార్చి రోజు వాడుతున్నాం. వెయ్యి లీటర్ల ట్యాంకులు 24 చోట్ల ఏర్పాటు చేసి.. పావు గంటలో చెట్లన్నిటికీ ఈ ద్రావణాన్ని ఇచ్చే ఏర్పాటు చేశాం. ఇప్పుడు తోట చాలా ఆరోగ్యంగా ఉంది. ఏ తెగుళ్లూ లేవు. అప్పుడప్పుడూ ఘనజీవామృతం వేస్తున్నాం. జీవామృతం ఇస్తున్నాం. అయితే, వేస్ట్ డీ కంపోజర్‌ను జీవామృతంతో కలపకుండా విడిగా ఇస్తున్నాం. మా తోటలో మామిడి చెట్లు ప్రతి ఏటా కాస్తున్నాయి. కాయకోతలు పూర్తవ్వగానే ప్రూనింగ్ చేసి, ఎండుపుల్ల తీసేసి.. సక్రమంగా పోషణ ఇస్తాం. మళ్లీ ఏడాదీ కాపు వస్తుంది. వాతావరణంలో చాలా మార్పు వచ్చింది. ఎప్పుడు ఎలా ఉంటుందో ఊహకు అందటం లేదు. రసాయనిక వ్యవసాయం చేసే రైతులు మామిడి తోటల్లో ఈ ఏడాది తెగుళ్లతో పిందె రాలిపోతున్నది. ఇప్పటికే 8,9 సార్లు పురుగుమందులను పిచికారీ చేసినా, పిందె రాలుతూనే ఉంది. వాతావరణ మార్పులను దీటుగా ఎదుర్కోవడానికి సేంద్రియ వ్యవసాయం తోడ్పడుతుంది.



– **చలసాని దత్తు** (94414 73246), నూజివీడు, కృష్ణా జిల్లా

పది రోజులకోసారి కషాయం పిచికారీ..

ఈ ఏడాది జనవరిలో 3 రోజుల పాటు దట్టమైన పొగమంచు కురిసి మామిడి పూతను దెబ్బతీసింది. దీని ప్రభావం వల్ల కొన్ని చెట్లకు పూత 50% వస్తే, మరికొన్నిటికి ఇంకా తక్కువే వచ్చింది. మాకున్న 30 ఎకరాలలో చాలా ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయాన్నే చేస్తున్నాను. 310 మామిడి చెట్లున్నాయి. గత ఏడాది 70% చెట్లకు పూత, కాత చాలా బాగా వచ్చింది. లోకల్‌గా కిలో రూ. 100–120 వరకు అమ్మాం. అమెరికా, జర్మనీ, సింగపూర్‌కు కూడా పంపాం. ఖర్చులు పోను రూ. 8 లక్షల నికరాదాయం వచ్చింది. ఈ ఏడాది పూతే తక్కువగా వచ్చింది. పూతరాక ముందు నవంబర్ నుంచే 15 రోజులకోసారి కషాయాలు, జీవామృతం పిచికారీ చేస్తున్నాం. తేనెమంచు పురుగు రాలేదు. 20 ఆకులను కుళ్లబెట్టి తయారు చేసుకున్న కషాయం, జీవామృతం, పులిసిన మజ్జిగ, దేశీ ఆవు పాలు–శొంఠి–ఇంగువ ద్రావణం, కొబ్బరి నీరు, సప్తధాన్యాంకుర కషాయం.. అదొకసారి ఇదొకసారి 7–10 రోజులకోసారి పిచికారీ చేస్తున్నాం. పిందె రాలడం ఆగే వరకు, పిందెలు గోలికాయ సైజుకు పెరిగే వరకు కొడుతూ ఉంటాం. అయినా గత ఏడాది బూడిద తెగులు కంట్రోల్ కాలేదు.



– **బీరం వెంకట్రామారెడ్డి** (98498 04527), సింగోటం, మహబూబ్‌నగర్ జిల్లా

వాతావరణం మారింది.. పూత, లేత పిందె మాడిపోతున్నది..

మా 8 ఎకరాలలోని 18 ఏళ్ల మామిడి తోటలో 500 చెట్లున్నాయి. సొంతంగా తయారు చేసుకునే జీవన ఎరువులు, జీవామృతంతో వ్యవసాయం చేస్తున్నాను. సగటున 40 టన్నుల దిగుబడి వచ్చేది.. రెండేళ్లుగా 25 టన్నులకు పడిపోయింది. మూడేళ్లుగా వాతావరణం మారిపోయింది. ఈ ఏడాది ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు మరీ ఎక్కువై.. పూత, పిందెకు గొడ్డలిపెట్టులా మారాయి. ఈ రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రత(సాధారణంగా 23–24 డిగ్రీలు ఉండాల్సింది) 19 డిగ్రీలకు తగ్గింది. పగటి ఉష్ణోగ్రత (ఉగాది లోపల 35 డిగ్రీలు ఉండాల్సింది) 38–39 డిగ్రీలకు పెరిగింది. గత రెండేళ్ల దిగుబడి తగ్గినా పూత సమయానికి వచ్చింది. ఈ ఏడాది పూత 25–30 రోజులు ఆలస్యంగా వచ్చింది. దశేరి, హిమాయత్ కన్నా బంగినపల్లి పూత ఆలస్యంగా వస్తుంది. బంగినపల్లి చిన్న పిందె దశలో ఉంది. ఇప్పుడున్న లేత పిందె, లేత ఆకులు కూడా మాడి, రాలిపోతున్నాయి. ఇందులో 80% రాలిపోయే అవకాశం ఉంది.



పిందెలను నిలబెట్టుకునేందుకు మామిడి చెట్లపై వేప నూనె, వర్టిసెల్లం లఖానియా(జీవన శిలీంధ్ర నాశిని)లను నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 20,000–50,000 పీపీఎం గల వేపనూనె అర లీటరు, వర్టిసెల్లం లఖానియా 0.5% ద్రావణం అర లీటరు చొప్పున 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వారం వ్యవధిలో మరోసారి పిచికారీ చేయాలి. ఇందులో ఎమల్సిఫయర్ కలపకూడదు. ఎమల్సిఫయర్ కలిపితే వేడి పెరుగుతుంది. 10,000 పీపీఎం లోపు ఉండే వేప నూనె నీటిలో కరగదు కాబట్టి ఎమల్సిఫయర్ కలుపుతుంటాము. 20,000–50,000 పీపీఎం వేపనూనెకు అవసరం లేదు. వర్టిసెల్లం లఖానియా.. రసం పీల్చే పురుగులన్నిటినీ సమర్థవంతంగా అరికడుతుంది. తేనెమంచు పురుగు, బూడిద తెగులు, పేనుబంక, పాముపొడ(లీఫ్‌మైనర్)లను అరికడుతుంది, నిరోధిస్తుంది.

– **కొక్కు అశోక్‌కుమార్** (98661 92761), సేంద్రియ మామిడి రైతు, ఒగులాపురం, మల్యాల మండలం, జగిత్యాల జిల్లా

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

సేంద్రియ చిట్కా

మామిడిలో బూడిద తెగులు – నివారణ



లక్షణాలు: మామిడి చెట్ల కాడలపై, పూల మీద, చిరు పిందెల మీద తెల్లని పొడరు లాంటి బూజు(పౌడరీ మిల్‌డ్యూ) ఏర్పడుతుంది. ఈ బూజు వల్ల పూలు, పిందెలు వడలి, రాలిపోయి, పంటకు నష్టం కలుగుతుంది.

నివారణ:
- పూత, మొగ్గలు కనిపించిన వెంటనే లీటరు నీటికి 3 గ్రాములు నీటిలో కరిగే గంధకం కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.
- శొంఠిపాల కషాయం కూడా ఒకసారి పిచికారీ చేయొచ్చు.

ఆకుమచ్చ తెగులు

లక్షణాలు: ఈ తెగులు కొల్లోటో్ట్రైకం అనే బూజు (శిలీంధ్రం) వల్ల వస్తుంది. వర్షాలు లేదా పొగమంచు అధికంగా ఉన్న సమయాల్లో దీని వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి క్రమంగా మచ్చలు కలిసిపోయి ఆకులు త్వరగా పండుబారి రాలిపోతాయి. లేత రెమ్మలపై నల్లని మచ్చలు ఏర్పడి పూలగుత్తులు, పూలు మాడిపోతాయి. తెగులు సోకిన కాయలపై నల్లటి గుంత మచ్చలు ఏర్పడి కాయలు కుళ్లిపోతాయి.

నివారణ: ● పూత దశకు ముందే ఎండిన కొమ్మలను తీసివేసి వాటిని నాశనం చేయాలి. ● బోర్డో మిశ్రమం 1 శాతం లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ చెట్లపై పిచికారీ చేయాలి. ● బాగా పులిసిన పుల్లని మజ్జిగ 6 లీటర్లు + 100 గ్రాముల ఇంగువ, 100 లీటర్ల నీటిలో కలిపి చెట్లపై 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

మసి తెగులు (సూటీ మోల్డ్)



లక్షణాలు: ఈ తెగులు 'క్యాప్నోడియం' అనే శిలీంధ్రం ద్వారా వస్తుంది. రసం పీల్చే తేనెమంచు పురుగు, పిండినల్లి విసర్జించిన తియ్యని పదార్థం ఆకుల మీద పిందెలు, కాయల మీద పడి నల్లటి మసిలా పెరుగుతుంది. దీని వల్ల కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం కలుగుతుంది. కాయ సైజు తగ్గిపోయి, రాలిపోతాయి.

నివారణ: రసం పీల్చే పురుగులను 5 శాతం వేప కషాయం (లేదా) నీమాస్త్రం ఉపయోగించి అరికట్టాలి. 2 కిలోల గంజి పొడి(స్టార్చ్)ని 5 లీటర్ల వేడి నీటిలో కలిపి, దీనికి 100 లీటర్ల నీటిని చేర్చి గంజి ద్రావణం తయారు చేయాలి. గంజి ద్రావణాన్ని మసి తెగులు సోకిన చెట్ల కొమ్మలకు, ఆకులపై కాయలపై బాగా తడిసేటట్లు పిచికారీ చేయాలి. *(సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రచురణ 'తొలకరి' సౌజన్యంతో.. వివరాలకు: 040– 27017735)*

నివాళి

'అప్పుల వాళ్లు పెట్టిన బాధ అంతా ఇంతా కాదు..'



ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతమైన అమరావతి మండలం లింగాపురంలో గిరిజన (ఎరుకల) కౌలు రైతు కుంభా గోవిందు 2016 నవంబర్ 19న అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదెకరాల భూమిని ఎకరానికి రూ. 30 వేల చొప్పున కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి పంటలు వ్యవసాయం చేస్తే.. వరుసగా నాలుగేళ్లు నష్టం వచ్చింది. అప్పు రూ. 5 లక్షలకు చేరడంతో గోవిందు ఆత్మహత్య చేసుకున్నాడు. 'అప్పుల వాళ్లు పెట్టిన బాధ అంతా ఇంతా కాదండి. ఆ బాధకే ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు..' అని ముగ్గురు పిల్లలతో భారంగా జీవనం నెట్టుకొస్తున్న గోవిందు భార్య వెంకట రావమ్మ వాపోతున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయమూ అందలేదు. స్వచ్ఛంద సంస్థల తోడ్పాటుతో బతుకు బండి నెట్టుకొస్తున్నారు. 'అప్పులిచ్చిన బంధువులు బయటి వారి కంటే దారుణంగా ప్రవర్తిస్తున్నారని, ఏది ఏమైనా అప్పు చెల్లించాల్సిందేనంటూ గొడవకు దిగుతున్నారని, నిద్ర కూడా పట్టడం లేదన్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే తాను ఎక్కడి నుంచి తెచ్చి డబ్బు కట్టేదని ఆమె వాపోయారు.

మేడ మీద ము'నగ'!

- టెర్రస్‌పైన సేంద్రియ ఇంటిపంటలు
- ఇంటిపైన షేడ్‌నెట్ వల్ల 3-4 డిగ్రీలు తక్కువగా ఇంటి ఉష్ణోగ్రత

హైదరాబాద్ గుడిమల్కాపూర్ ఎస్.బి.ఐ. కాలనీలో రెండంతస్థుల సొంత భవనంలో నివాసం ఉంటున్న అర్చన, ఫార్మా ఉద్యోగి అరవింద్‌కుమార్ దంపతులు గత ఐదారేళ్లుగా సేంద్రియ ఇంటిపంటలు సాగు చేసుకుంటున్నారు. ఉద్యాన శాఖ నుంచి సబ్సిడీపై సిల్పాలిన్ బెడ్స్ తీసుకొని టమాటా, వంకాయలు, అల్లంతోపాటు మునగ, బొప్పాయి చెట్లను పెంచుతున్నారు. పార్స్‌లీ, ఆరెగానో, తులసి, లెమన్‌గ్రాస్, కలబంద తదితర ఔషధ మొక్కలను సాగు చేస్తున్నారు. పెద్ద సిల్పాలిన్ బెడ్‌లో నాలుగేళ్లుగా ఎత్తుగా పెరిగిన మునగ చెట్టు వీరి కిచెన్ గార్డెన్‌కు తలమానికంగా నిలిచింది. మునగ కాయలతోపాటు ఆకులను కూడా కూరవండుకుంటున్నామని అర్చన తెలిపారు. ఉల్లి, వెల్లుల్లి వాడకుండా పార్స్‌లీ, ఆరెగానో తదితర ఆకులను ఉపయోగించి ఇంట్లోనే పిజ్జాలు తయారుచేసుకొని తింటుండడం విశేషం. 30 ఏళ్ల నాటి ఈ రెండంతస్థుల భవనానికి పిల్లర్లు వేయలేదు. గోడలపైనే నిర్మించారు. అందువల్ల గోడలపైనే 8 సిల్పాలిన్ బెడ్స్, కుండీలను ఏర్పాటు చేసుకొని ఐదారేళ్లుగా ఇంటిపంటలను సాగు చేసుకుంటున్నారు.

15 రోజులకోసారి జీవామృతం మొక్కలకు మట్టి ద్వారా, పిచికారీ ద్వారా కూడా ఇస్తున్నారు. రోజూ దేశీ ఆవుపాలు సరఫరా చేసే వ్యక్తే జీవామృతాన్ని సైతం ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. మేడపైనే ఒక సిల్పాలిన్ బెడ్‌ను కంపోస్టు తయారీకి వాడుతున్నారు. టెర్రస్‌పైన ఇంటిపంటలు, షేడ్‌నెట్, ఇంటి చుట్టూ వెదురు తదితర మొక్కలు ఉండటం వల్ల తమ ఇంట్లో వేసవిలోనూ ఉష్ణోగ్రత 3–4 డిగ్రీల మేరకు సాధారణం కన్నా తక్కువగా ఉంటున్నదని అర్చన(98663 63723) సంతోషంగా చెప్పారు. అంటే.. ఇంటిపంటల కోసం శ్రద్ధతీసుకుంటే.. ఆరోగ్యంతోపాటు ఇంటి ఏసీ ఖర్చులు కూడా తగ్గాయన్నమాట!



ఫొటోలు: ఇసుకపట్ల దేవేంద్ర, సాక్షి ఫొటో జర్నలిస్టు



మునగాకు చిన్న – పోషకాలలో మిన్న

మునగను తింటే అనేక పోషకాలను పుష్కలంగా తిన్నట్టే లెక్క. ఇదీ మునగ ఆకులో నిక్షిప్తమై ఉన్న పోషకాల జాబితా..

విటమిన్-సి: కమలాల్లో కన్నా 7 రెట్లు ఎక్కువ
విటమిన్-ఎ: క్యారెట్లలో కన్నా 4 రెట్లు ఎక్కువ
కాల్షియం: పాలలో కన్నా 4 రెట్లు ఎక్కువ
పొటాషియం: అరటి పండ్లలో కన్నా 3 రెట్లు ఎక్కువ
విటమిన్-ఇ: పాలకూరలో కన్నా 3 రెట్లు ఎక్కువ
మాంసకృత్తులు: పెరుగులో కంటే 2 రెట్లు ఎక్కువ

మునగాకును పప్పులో, సాంబారులో వేసి వండవచ్చు. మునగాకు వేపుడు చేయవచ్చు. మునగకాయలో కంటే ఆకుల్లో పోషకాలు ఎక్కువ

మునగ పొడి చేసేదెలా?

- తయారు చేయటం తేలిక – వాడటం తేలిక
- లేత మునగాకును కడిగి, నీడలో ఆరబెట్టాలి
- గలగలలాడేలా ఆరిన మునగాకును పొడి చెయ్యాలి
- పొయ్యి మీద నుంచి దించిన తరువాత కూరలు, చారు వంటి వాటిల్లో వేయచ్చు.

మునగలో ఉపయోగపడని భాగం లేదు

ఆకులు – కూర, పోషకాల గని
గింజ – మందు, నూనె, నీటి శుద్ధి
కాయ – కూర **పువ్వు** – మందు, చట్నీ
బెరడు – మందు **బంక** – మందు
వేరు – మందు

పెరటిలో మునగ చెట్టు ఉండగ –
విటమిన్లు, టానిక్కులు కొనటం దండగ.
మునగ చెట్లు పెంచుదాం –
మునగాకు వాడకం పెంచుదాం.
వివరాలకు..
కేరింగ్ సిటిజెన్స్ కలెక్టివ్(040–27610963)

నల్ల కోళ్లు నాలుగు విధాల మేలు!

పెంపకంపై తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న ఆసక్తి

'నలుపు రంగు'.. అయితేనేం? మాంసం రుచి అదరహో! ప్రొటీన్ల శాతం కూడా ఎక్కువే.. కొవ్వు తక్కువ. ఇంకెన్నో సుగుణాలు కల్గిన 'కడక్‌నాథ్' అనే నల్ల కోళ్ల పెంపకంపై తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో ఆసక్తి పెరుగుతోంది. రైతులు వ్యవసాయానికి అనుబంధంగా అదనపు ఆదాయ వనరుగా ఈ కోళ్ల పెంపకం చేపడుతున్నారు. హైదరాబాద్ నగర శివారు ఫాం హౌజ్‌లలో 'కడక్‌నాథ్' కోళ్ల సందడి వినిపిస్తోంది. స్థానిక పెరటి కోళ్ల మాదిరిగానే.. వీటి పోషణకు పెద్దగా ఖర్చు లేకుండా మంచి ఆదాయం పొందే అవకాశాలున్నాయి. ముఖ్యంగా పంట పొలాల వద్ద ఈ కోళ్ల పోషణ చేపడితే.. పంటలకు ఆశించే పురుగులను తిని పంట ఎదుగుదలకు దోహదపడతాయి. కోళ్ల విసర్జితాలు పంటకు మంచి ఎరువు. తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ కోళ్ల పెంపకంపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో వెనకబడిన ప్రాంతాలైన ఝాబువా, అలీరాజ్‌పూర్ పరిసరాల్లో భీల్, భిలాలా తెగ ప్రజలు వందల ఏళ్ల నుంచి ఈ జాతి కోళ్లను పెంచుతున్నారు. కొలెస్ట్రాల్ శాతం చాలా తక్కువ. ఐరన్ శాతం మామూలు కోళ్ల కంటే పది శాతం ఎక్కువ అని చెబుతున్నారు. కిలో మాంసం రూ.700 నుంచి రూ.వెయ్యి, గుడ్డు ధర రూ.40–50 పైనే. గుడ్లు గోధుమ రంగులో ఉంటాయి. పిల్లలు నీలం, నలుపూ తెలుపూ చారలతో ఉండి, పెరిగే కొద్దీ నలుపు రంగులోకి మారుతాయి. శంషాబాద్ రూరల్ ప్రాంతంలో సురేశ్ అనే యువ రైతు సేంద్రియ పద్ధతిలో ఈ కోళ్లను పెంచి, మాంసం అమ్ముతున్నారు. వీటి గుడ్లను హేచరీలో పొదగేసి ఒక్కో పిల్లను రూ.80లకు అమ్ముతున్నారు. కడక్‌నాథ్ కోళ్ల పోషణ చాలా సులువని, 5 నెలల్లో అమ్మకానికి తగినంత పెరుగుతాయని సురేశ్(99599 52345) చెబుతున్నారు.



సురేశ్

– **బుర్ర ప్రభాకర్‌రెడ్డి**, శంషాబాద్ రూరల్ (రాజేంద్రనగర్), రంగారెడ్డి జిల్లా

నేపాల్‌లో ఘోర ప్రమాదం


కుప్పకూలిన విమానం వద్ద సహాయక సిబ్బంది

విమానం కూలి 50 మంది దుర్మరణం
- 21 మందికి తీవ్ర గాయాలు
- కఠ్మాండూ ఎయిర్‌పోర్టులో బంగ్లాదేశ్ విమానం దిగుతుండగా దుర్ఘటన
- ఫుట్‌బాల్ మైదానంలోకి దూసుకుపోయి మంటల్లో చిక్కుకున్న విమానం

కఠ్మాండూ: నేపాల్ రాజధాని కఠ్మాండూ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 50 మంది ప్రాణాలు కోల్పోయారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నుంచి 67 మంది ప్రయాణికులతో బయల్దేరిన విమానం త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగుతుండగా సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విమానం ఒరిగి పక్కనున్న ఫుట్‌బాల్ మైదానంలోకి దూసుకెళ్లింది. మంటలు అంటుకోవడంతో అందులోని ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ కొందరు మరణించారు. మిగతా వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అధికారులు చెప్పారు. విమానంలో 33 మంది నేపాలీలు ఉండగా.. 32 మంది బంగ్లాదేశీయులు, చైనా, మాల్దీవులకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. నేపాల్ అధికారుల కథనం ప్రకారం.. యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్‌కు చెందిన బాంబార్డియర్ డాష్ 8 క్యూ 400 విమానం 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో సోమవారం ఉదయం బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నుంచి కఠ్మాండూకు బయల్దేరింది. నేపాల్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో కఠ్మాండూ ఎయిర్‌పోర్టులో దిగుతుండగా ఈ ఘోరం జరిగింది. విమానంలో ఉండే బ్లాక్ బాక్సును స్వాధీనం చేసుకుని ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై వివరాలు సేకరిస్తున్నామని టీఐఏ జీఎం రాజ్‌కుమార్ ఛత్రీ తెలిపారు.


ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలు

చివరి నిమిషంలో సాంకేతిక లోపం వల్లే..

'విమానాన్ని దక్షిణం వైపు రన్‌వేపై ల్యాండింగ్ చేసేందుకు అనుమతించాం. కానీ ఉత్తరం వైపు రన్‌వేపై దిగింది. రన్‌వేపై దిగేందుకు ప్రయత్నించిన సమయంలో అదుపు తప్పింది. సాంకేతిక సమస్యలే కారణం కావచ్చని భావిస్తున్నాం' అని నేపాల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ డైరెక్టర్ జనరల్ సంజీవ్ గౌతమ్ చెప్పారు. యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్ సీఈవో ఇమ్రాన్ ఆసిఫ్ మాట్లాడుతూ.. పైలట్‌కు ఏటీసీ తప్పుడు సిగ్నల్స్ ఇచ్చినట్లు తెలుస్తుందన్నారు.

ల్యాండ్ అయ్యేముందే..

ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ బోహోరా ఆ 'హారిబుల్' గుర్తు చేసుకున్నారు. 'ఢాకాలో విమానం టేకాఫ్ సమయంలోనే ఇబ్బందులు లేవు. ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యే ముందు విమానం ఒక్కసారిగా కుదుపునకు లోనైంది. ఆ తర్వాత పెద్ద శబ్దంతో పక్కకు ఒరిగింది. కిటికీ పక్కన కూర్చోవడంతో దానిని పగులగొట్టి బయటపడ్డాను' అని చెప్పారు.

ఆ ముగ్గురికి ప్రత్యేక వీఐపీ విమానాలు

న్యూఢిల్లీ: రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని కోసం 3 కొత్త ప్రత్యేక విమానాలు 2020 ప్రథమార్థానికి సిద్ధంగా ఉంటాయని ఉన్నతాధికారులు చెప్పారు. అత్యాధునిక సదుపాయాలు ఉండే బోయింగ్-777 విమానాలను ఎయిరిండియా నుంచి కొనుగోలు చేసేందుకు బడ్జెట్‌లో రూ.4,469.5 కోట్లను కేటాయించారు. కొనుగోలు చేశాక ఆధునీకరిస్తారు. ఈ విమానాల్లో వీఐపీ గదులు, పత్రికా సమావేశ గది, వైద్యపరంగా అత్యవసర సమయాల్లో రోగులను తరలించేందుకు ఏర్పాట్లు ఉండనున్నాయి. వై-ఫై సౌకర్యం, క్షిపణులు ఢీ కొట్టకుండా రక్షణ వ్యవస్థ కలిగిన ఈ విమానాలు ఇంధనం కోసం మధ్యలో ఎక్కడా ఆగకుండానే అమెరికా వరకు ఏకధాటిగా ప్రయాణించగలవు.

24 వరకు కార్తీకి జ్యుడీషియల్ కస్టడీ

న్యూఢిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా ముడుపుల కేసుకు సంబంధించి కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కొడుకు కార్తీని 24వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీకి తరలించాలని ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. తీహార్ జైల్లో తనకు ప్రత్యేక గది, బాత్‌రూమ్ ఇవ్వాలన్న కార్తీ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. జైల్లో తనకు ఇంటి భోజనం తినడానికి అవకాశం ఇవ్వాలని, అలంకార వస్తువులు తీసుకెళ్లడానికి అనుమతించాలని కార్తీ చేసిన అభ్యర్థనను తిరస్కరించింది. బెయిల్ పిటిషన్‌ను ఈ నెల 15న విచారించనున్నారు.

జమ్మూకశ్మీర్ మంత్రిపై సీఎం వేటు



న్యూఢిల్లీ: పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) సీనియర్ నేత, జమ్మూకశ్మీర్ ఆర్థికమంత్రి హసీబ్ ద్రాబూపై సోమవారం వేటు పడింది. కశ్మీర్ సమస్య రాజకీయపరమైనది కాదని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ద్రాబూను మంత్రిపదవి నుంచి తప్పిస్తూ కశ్మీర్ సీఎం మెహబూబా నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన ఓ సమావేశంలో మాట్లాడుతూ.. కశ్మీర్ సమస్య రాజకీయపరమైనది కాదనీ, కేవలం సామాజిక పరమైనదేనని ద్రాబూ అన్నారు. దీనిపై కశ్మీర్‌లోని అన్ని వర్గాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో ద్రాబూపై వేటుపడింది.

11 విమానాల సేవలకు సెలవు

న్యూఢిల్లీ: ఇంజిన్‌లలో లోపాల కారణంగా 11 ఎయిర్‌బస్ ఏ320 నియో (న్యూ ఇంజిన్ ఆప్షన్) విమానాలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) సేవల నుంచి తప్పించింది. వీటిలో 8 విమానాలు ఇండిగో సంస్థకు చెందినవి కాగా మరో మూడు గో ఎయిర్‌వి. ఈ 11 విమానాల్లోనూ ప్రాట్ అండ్ వైట్నీ సంస్థ తయారుచేసిన పీడబ్ల్యూ 1100 రకం ఇంజిన్లను అమర్చారు. ఈ రకం ఇంజిన్లు తరచూ మొరాయిస్తున్నాయి. సోమవారం అహ్మదాబాద్ నుంచి లక్నో మీదుగా కోల్‌కతా వెళ్తున్న ఇండిగోకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 నియో విమానం టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే అందులోని పీడబ్ల్యూ 1100 ఇంజిన్ పనిచేయడం మానేసింది. దీంతో 186 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆ విమానాన్ని వెంటనే అహ్మదాబాద్‌కు తీసుకొచ్చి ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది.

ప్రతిపక్ష నేతలకు నేడు సోనియా విందు



న్యూఢిల్లీ: యూపీఏ చైర్‌పర్సన్ సోనియా మంగళవారం ప్రతిపక్ష నేతలకు విందు ఇవ్వనున్నారు. ప్రతిపక్షంలోని 17 పార్టీల నేతలు ఈ విందుకు హాజరవుతారని భావిస్తున్నారు. 2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏకు దీటుగా విస్తృత కూటమిని ఏర్పాటు చేసే అంశంపై ఈ సందర్భంగా సోనియా వారితో చర్చించనున్నారు. విందు భేటీకి జార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎంకు చెందిన బాబూలాల్ మరాండీ, బిహార్ మాజీ సీఎం జితన్ మాంఝి, ఆర్జేడీ నుంచి తేజస్వి యాదవ్, టీఎంసీకి చెందిన సుదీప్ బందోపాధ్యాయ్, డీఎంకే తరఫున కనిమొళి హాజరయ్యే వీలుంది. సీపీఎం నేత ఏచూరి, సీపీఐకి చెందిన డి.రాజాతోపాటు ఆర్‌ఎల్డీ పార్టీ నేతలు పాల్గొననున్నారు.

శ్రీనగర్ జైలులో సెల్‌ఫోన్లు, జిహాదీ సాహిత్యం

శ్రీనగర్: శ్రీనగర్‌లోని సెంట్రల్ జైలులో జాతీయ దర్యాప్తు విభాగం (ఎన్‌ఐఏ) జరిపిన ఆకస్మిక సోదాల్లో పెద్ద మొత్తంలో సెల్‌ఫోన్లు, జిహాదీ సాహిత్యం, ఐపాడ్, పెన్‌డ్రైవ్, పాకిస్తాన్ జాతీయ జెండా బయటపడ్డాయి. ఈ జైలులో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు శిక్ష అనుభవిస్తున్నారు. డ్రోన్ల నిఘా మధ్య, సిబ్బంది జైలు బ్యారక్‌లతోపాటు ఆవరణను క్షుణ్ణంగా గాలించారు. ఈ సందర్భంగా ఖైదీల వద్ద 25 సెల్‌ఫోన్లు, కొన్ని సిమ్ కార్డులు, 5 మెమరీ కార్డులు, 5 పెన్‌డ్రైవ్‌లు, ఒక ఐపాడ్, జిహాదీ సాహిత్యంతో కూడిన కీలక పత్రాలు, పాక్ జాతీయ పతాకం లభ్యమయ్యాయి.

కార్డు లిమిట్ 13 వేలు.. ఖర్చు 9 కోట్లు

న్యూఢిల్లీ: 200 డాలర్ల(రూ.13 వేలు) పరిమితితో ఎస్‌బీఐ జారీచేసిన విదేశీ ట్రావెల్ కార్డుల్లో మార్పులు చేసి ముంబైకి చెందిన ఒక వ్యక్తి రూ. 9.1 కోట్ల మేర ఖర్చు చేసిన సంఘటన బ్యాంకు ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. యలమంచిలి సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ తరఫున ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఎన్నారై బ్రాంచ్ 2016లో ఫారిన్ ట్రావెల్ కార్డుల్ని జారీచేసింది. సందీప్ కుమార్ అనే వ్యక్తికి జారీచేసిన మూడు కార్డుల బ్యాలెన్స్‌లో మార్పులు చేసి నాలుగు బ్రిటిష్ ఈ కామర్స్ వెబ్‌సైట్లలో రూ. 9.1 కోట్ల మేర షాపింగ్ చేసిన విషయాన్ని యలమంచిలి కంపెనీ బ్యాంకు దృష్టికి తీసుకెళ్లింది. మూడు నెలల వ్యవధిలో మొత్తం 374 లావాదేవీలు జరిగినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. ఒరకిల్ డేటాబేస్ ద్వారా బ్యాలెన్స్‌లో మార్పులు చేసి ఈ మోసానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఈ మోసంపై ఎస్‌బీఐ ఫిర్యాదు మేరకు సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది.


కిర్గిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో గిన్నిస్ రికార్డు కోసం బెష్ బర్మాక్ స్టైల్‌లో 1,464 కిలోల బరువైన, అత్యంత పెద్దవైన నూడుల్స్‌ను సిద్ధం చేస్తున్న చెఫ్‌లు. దీనిలో 'చుచుక్' స్టైల్‌లో వండిన, గుర్రాల మాంసాన్ని కలిపారు.

రైతు 'మహా' విజయం

కర్షకుల సమస్యలు తీర్చేందుకు అంగీకరించిన ప్రభుత్వం
- ఆదివాసీలు సాగు చేస్తున్న అటవీ భూములు వారికే
- ఆందోళన విరమించిన రైతన్నలు

సాక్షి, ముంబై: మండుటెండలో బొబ్బలెక్కిన పాదాలతో ఆరు రోజులపాటు 180 కిలో మీటర్లు నడిచి తమ సమస్యల పరిష్కారం కోసం ముంబైకి చేరుకున్న వేలాది మంది రైతుల ఆందోళనకు మహారాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చింది. రైతుల డిమాండ్లలో దాదాపు అన్నింటినీ నెరవేరుస్తామని రెవెన్యూ మంత్రి చంద్రకాంత్ పాటిల్ సోమవారం ప్రకటించారు. ఆ తర్వాత సీఎం ఫడ్నవిస్ అసెంబ్లీ బయట మాట్లాడుతూ 'రైతులు, ఆదివాసీల ప్రతినిధులతో సమావేశమయ్యాం. ఆదివాసీలు సాగుచేస్తున్న అటవీ భూములను వారికే బదిలీ చేయాలని నిర్ణయించాం. అయితే 2005కు ముందు నుంచి ఆ భూమిని తామే సాగు చేస్తున్నట్లు గిరిజనులు ఆధారాలు చూపించాలి. వారికి భూములను బదిలీ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తాం. డిమాండ్లలోని దాదాపు అన్నింటినీ నిర్ణీత సమయంలోపు మేం నెరవేరుస్తాం' అని చెప్పారు. సీపీఎం అనుబంధ అఖిల భారత కిసాన్ సభ రైతుల పోరాటానికి నేతృత్వం వహించింది. తమ సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం ఒప్పుకోవడంతో అలసి సొలసిన రైతన్నలు ఆందోళన విరమించి ఇక తమ స్వగ్రామాలకు చేరుకోవడానికి సిద్ధమవుతున్నారు. రైతులను ముంబై నుంచి ఇళ్లకు తిరిగి పంపేందుకు ప్రభుత్వం ప్రత్యేక రవాణా సౌకర్యాలను కల్పించనుంది. ముంబై నుంచి నాసిక్ మీదుగా భుసావల్ వరకు రైతుల కోసం 2 రైళ్లను నడపటంతోపాటు ఆ మార్గంలో వెళ్లే రైళ్లకు అదనపు జనరల్ బోగీలను కూడా తగిలిస్తున్నట్లు రైల్వే అధికారి ఒకరు చెప్పారు. అదనంగా రైతు రుణాలను మాఫీ చేయాలన్న డిమాండ్‌ను మాత్రం తాము నెరవేర్చలేమని సీఎం చెప్పారు. కొన్ని కుటుంబాల్లో భార్యాభర్తలిద్దరూ రుణాలు తీసుకున్నప్పుడు వారిలో ఎవరి పేరున అప్పు తక్కువగా ఉంటే ఆ రుణం మాత్రమే మాఫీ అయిందనీ, దీన్ని సరిదిద్దడానికి ఇంకా ఎంత ఎక్కువ వ్యయం అవుతుందో అంచనా వేయడానికి ప్రభుత్వం మరో కమిటీని ఏర్పాటు చేస్తుందని చెప్పారు.


సోమవారం తెల్లవారుజామున ఆజాద్ మైదానానికి చేరుకుంటున్న రైతులు

ఒకటే గమ్యం.. ఒకటే గమనం


బొబ్బలు తేలిన మహిళా రైతు పాదాలు

నడిచి నడిచి పాదాలకు పుండ్లు పడి రక్తాలు కారాయి. తినడానికి సరైన తిండి లేదు. నిద్రపోవడానికి అనువైన జాగా దొరికేది కాదు. మార్చిలోనే మాడుపగిలే ఎండలతో నిస్సత్తువ ఆవహించేది. అయినా మహారాష్ట్ర రైతన్నల అడుగు తడబడలేదు. నడక ఆగలేదు. వారి సంకల్ప బలం చెక్కు చెదరలేదు. అందరి కడుపులు నింపే అన్నదాతలు తమ ఆకలి తీరే మార్గం కోసం, బతుకుదెరువు కోసం చేసిన పాదయాత్ర యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. నాసిక్ నుంచి ముంబై వరకు మొత్తం 180 కిలో మీటర్లు సాగిన ఈ రైతు పాదయాత్రలో అడుగడుగునా ఎన్నో ఇబ్బందులు, మరెన్నో కష్టనష్టాలు.. మహిళా రైతులు కూడా అన్నింటినీ పంటి బిగువున భరించారు. అలుపూసొలుపూ లేకుండా దాదాపు 35 డిగ్రీల మండుటెండలో రోజుకి 30 కిలో మీటర్లు నడిచారు. మహారాష్ట్ర సర్కార్ దృష్టికి తమ సమస్యలు తీసుకువెళ్లాలన్న ఏకైక లక్ష్యంతో తమకెదురైన ఇబ్బందులేమీ పట్టించుకోలేదు. ఒక్కో ఊరు దాటుతుంటే ప్రవాహంలా మరికొందరు రైతులు వారి అడుగుకి అడుగు కలిపారు. మరాఠ్వాడా, రాయగఢ్, విదర్భ ఇలా ఒక్కో ప్రాంతం నుంచి రైతులు కదం తొక్కారు. తొలి రోజు 30 వేల మందితో మొదలైన మార్చ్‌లో రోజు గడిచేకొద్దీ రైతుల సంఖ్య పెరిగి ముంబైకొచ్చేసరికి 50 వేలు దాటేసింది.

కనీస సదుపాయాలు లేకున్నా..

డెబ్బయి ఏళ్ల వయసు దాటిన వారు, మహిళా రైతులు కూడా ఈ పాదయాత్రలో ఎక్కువగా కనిపించారు. ఆరు రోజుల పాటు సాగిన నడకలో కాలకృత్యాలు తీర్చుకోవడం దగ్గర్నుంచి ఎన్నో అవసరాలు ఉంటాయి. కనీస సదుపాయాలు లేకపోయినా వారు పట్టించుకోలేదు. కొందరు రైతులు బియ్యం, గోధుమలు, పప్పుదినుసుల మూటలను మోస్తూనే నడక సాగించారు. రోడ్డుపక్కనే వండుకొని తినడం, మళ్లీ నడవడం.. రాత్రయ్యేసరికి హైవేపక్కనో, ఏ మైదానాల్లోనో కాసేపు కునుకు తీయడం.. మళ్లీ లేచి నడక నడక.. అలా అదే పనిగా దుమ్ము, ధూళిలో 140 గంటల సేపు నడిచారు. మండిపోతున్న ఎండలో నడవడం వల్ల డయేరియా, లో బీపీ వంటి అనారోగ్య సమస్యలూ తలెత్తాయి. 'మేము ఎదుర్కొంటున్న కష్టాలతో పోల్చి చూస్తే ఇదేమంత కష్టం కాదు. మా జీవితాలే ప్రమాదంలో ఉన్నాయి. పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాకపోతే ఎలా బతకాలి? అందుకే ఎంతటి బాధనైనా తట్టుకున్నాం' అని 74 ఏళ్ల వయసున్న శంకర్ గావిట్ అనే రైతు చెప్పారు. రైతుల దుస్థితిని చూసి చాలా ఊళ్లల్లో స్థానికులే వారిని ఆదుకున్నారు. అంతటి కష్టంలోనూ రైతులు ముంబై విద్యార్థుల కష్టాన్ని గుర్తించారు. ఆదివారం సాయంత్రానికల్లా ముంబై శివార్లకు చేరుకున్న వారు.. తమ పాదయాత్రతో సోమవారం టెన్త్, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందీ కలగకూడదనే సదుద్దేశంతో ఆదివారం రాత్రి కూడా నడక సాగించి సూర్యుడు ఉదయించేలోపే ఆజాద్ మైదానానికి చేరుకున్నారు.

డబ్బావాలాల ఆహారం.. స్థానికుల ఔదార్యం

ఎన్నో బాధలను భరించి అన్ని కిలోమీటర్లు నడిచొచ్చిన రైతులకు ముంబై వాసులు ఘనంగా స్వాగతం పలికారు. దేశమంతటికీ అన్నం పెట్టే రైతన్నల ఆకలిదప్పులు తీర్చారు. స్వచ్ఛందంగా చాలా మంది రోడ్లపైకి వచ్చి రైతుల అవసరాలను అడిగి మరీ నెరవేర్చారు. నగరంలో పాదయాత్ర సాగుతుండగా అర్ధరాత్రే అనేక మంది ప్రజలు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు, డబ్బావాలాలు ట్రక్కులతో మంచినీళ్లు, తిండిపదార్థాలు తీసుకువచ్చి రైతులకు అందించారు. చెప్పులు లేని వారికి కొత్తవి ఇచ్చారు. పాదాల గాయాలకు వైద్య విద్యార్థులు చికిత్స చేశారు. రైతులకు అనూహ్యంగా అన్ని వైపుల నుంచి మద్దతు లభించడంతో మహారాష్ట్ర సర్కార్ దిగి రావల్సి వచ్చింది.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

10కి చేరుకున్న కార్చిచ్చు మృతులు

26 మందిని రక్షించిన సహాయక సిబ్బంది

సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడులోని తేని జిల్లాలో బోడినాయకనూర్ అటవీప్రాంతంలోని కురంగని కొండల్లో ఆదివారం చెలరేగిన కార్చిచ్చు ఘటనలో మృతి చెందిన ట్రెక్కర్ల సంఖ్య 10కి చేరుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు పురుషులతో పాటు ఏడుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. చెన్నై, తిరుప్పూర్, ఈరోడ్ నుంచి ఈ అటవీప్రాంతానికి ట్రెక్కింగ్ కోసం వచ్చిన 36 మంది ఉద్యోగులు, విద్యార్థులు తిరుగుప్రయాణంలో కార్చిచ్చులో చిక్కుకోవడం తెల్సిందే. సహాయక చర్యలు చేపట్టిన అధికారులు సోమవారం నాటికి 26 మంది ట్రెక్కర్లను రక్షించారు. కాగా, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.4 లక్షలు, తీవ్రంగా గాయపడ్డవారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడ్డవారికి రూ.50 వేల నష్టపరిహారాన్ని సీఎం పళనిస్వామి ప్రకటించారు. రాష్ట్ర అగ్నిమాపక సిబ్బందితో పాటు, నాలుగు రక్షణశాఖ హెలికాప్టర్లు, 16 మంది గరుడ్ కమెండోలు ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కాగా, డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్, అన్నాడీఎంకే బహిష్కృత నేత ఆర్కేనగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్, మక్కల్ నీది మయ్యం పార్టీ చీఫ్ కమల్‌హాసన్‌తో పాటు సీపీఐ, పీఎంకే నేతలు అగ్నిప్రమాద మృతులకు సంతాపం తెలిపారు.

ఆగని నిరసనల హోరు

పార్లమెంట్‌లో కొనసాగిన ఆందోళనలు..

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయసభల్లో ఆందోళనలు ఆగలేదు. కాంగ్రెస్, టీఎంసీ, ఆప్‌తోపాటు ఎన్డీఏ పక్షం సభ్యులు తమ డిమాండ్లపై నిరసనలు తెలిపారు. దీంతో బడ్జెట్ మలి విడత సమావేశాల్లో ఆరో రోజూ ఎటువంటి కార్యకలాపాలు లేకుండానే సభలు వాయిదాపడ్డాయి. లోక్‌సభ ఉదయం సమావేశం కాగానే వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యులు ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలంటూ ప్లకార్డులతో వెల్‌లోకి వచ్చి నినాదాలు చేపట్టారు. తెలంగాణకు రిజర్వేషన్ల కోటా కోసం టీఆర్‌ఎస్, కావేరి బోర్డు ఏర్పాటు కోరుతూ ఏఐఏడీఎంకే సభ్యులు నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను 11 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాకా ఆందోళనలు కొనసాగాయి. ఇదే సమయంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి శుక్లా ఫ్యూజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ బిల్లును ప్రవేశపెట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీఆర్‌ఎస్, ఏఐఏడీఎంకే సభ్యులు వెల్‌లో నినాదాలు చేస్తుండటంతో ప్రశ్నోత్తరాల సమయంలో లోక్‌సభ స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలో సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాల సభ్యులు నిరసనలు చేపట్టడంతో మధ్యాహ్నానికి వాయిదా పడింది. తిరిగి సమావేశమయ్యాక వైఎస్సార్‌సీపీ, టీఎంసీ, ఆప్ సభ్యులు పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. రాజధాని ఢిల్లీలో సీలింగ్ డ్రైవ్‌ను వెంటనే నిలిపివేయాలంటూ ఆమ్‌ఆద్మీ పార్టీ సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక నిరసనలు మధ్యనే గ్రామీణాభివృద్ధిపై పార్లమెంట రీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసుల అమలుపై తాగునీరు, పారిశుద్ధ్యం శాఖ సహాయ మంత్రి ఎస్ఎస్ అహ్లూవాలియా ఒక ప్రకటన చేశారు. ఆందోళనలు ఆగకపోవటంతో డిప్యూటీ స్పీకర్ సభను మంగళవారానికి వాయిదావేశారు.

మోదీ-మాక్రాన్ పడవ విహారం


వారణాసిలో గంగానదిలో మోదీ, మాక్రాన్

యూపీలో అతిపెద్ద సోలార్ విద్యుత్ కేంద్రం ప్రారంభం

వారణాసి/దాదర్ కలాన్: ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ దంపతులతోపాటు ప్రధాని మోదీ వారణాసిలో పర్యటించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కేంద్రంలో ఏర్పాటుచేసిన చేనేత ప్రదర్శనను సందర్శించారు. ఇక్కడి కళాకారుల హస్తకళలు, భాదోహి కార్పెట్ల గురించి ప్రపంచ ప్రఖ్యాత బనారసీ చీరల ప్రత్యేకత గురించి మాక్రాన్‌కు మోదీ వివరించారు. అనంతరం డీడీయూ ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన చిత్రకూట్ నాటకాన్ని (రాముడి 14ఏళ్ల వనవాసాన్ని ప్రతిబింబించే) తిలకించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పడవలో మోదీ, మాక్రాన్, యూపీ సీఎం ఆదిత్యనాథ్‌లు (అస్సీ ఘాట్, దశాశ్వమేధ్ ఘాట్ల మధ్య) విహరించారు. అనంతరం వారణాసి-పాట్నాల మధ్య నడిచే రైలును మోదీ ప్రారంభించారు. అంతకు ముందు, మోదీ, మాక్రాన్ కలిసి ఉత్తరప్రదేశ్‌లోనే అతి పెద్ద సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని మిర్జాపూర్ జిల్లా ఛాన్వే బ్లాక్‌లో ప్రారంభించారు. 75మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యమున్న ఈ సోలార్ ప్లాంట్‌ను రూ.500కోట్ల వ్యయంతో ఫ్రెంచ్ కంపెనీ ఎంజీ (ఈఎన్‌జీఐఈ) సాంకేతిక సహకారంతో నిర్మించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపుచేసే దృష్టితో ఢిల్లీలో మార్చి 16నుంచి జరగనున్న 'కృషి ఉన్నతి మేళా'ను మోదీ ప్రారంభించనున్నారు. కాగా, మాక్రాన్‌తో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, మాజీ ప్రధాని మన్మోహన్ కలిసి అసత్య వార్తలు, ఉదార ప్రజాస్వామ్యాలను ప్రభావితం చేస్తున్న అంశాలపై చర్చించారు.

'2జీ' జాప్యంపై సుప్రీం ఆగ్రహం

- సీబీఐ, ఈడీలకు ఆరు నెలల గడువు
- రెండు వారాల్లో స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని ఆదేశం



న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రం కేసుల దర్యాప్తులో జాప్యాన్ని తప్పు పడుతూ సీబీఐ, ఈడీలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2జీ, అందులో భాగమైన ఎయిర్‌సెల్-మాక్సిస్ ఒప్పందంలో అవకతవకలపై దర్యాప్తును ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. ముఖ్యమైన ఇలాంటి కేసుల్లో ప్రజలకు వాస్తవాలు తెలియకుండా దాచిపెట్టకూడదని కోర్టు వ్యాఖ్యానించింది. '2జీ స్పెక్ట్రం, అనుబంధ కేసుల్లో దర్యాప్తు ముగించేందుకు ఎందుకింత జాప్యం జరుగుతోంది. 2010లో సుప్రీంకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది. ఇంతవరకూ ఎందుకు విచారణ పూర్తి చేయలేదో చెప్పండి' అని నిలదీసింది. కేసు దర్యాప్తు జాప్యం వెనుక ఏదైనా అదృశ్య శక్తి హస్తముందా? అని కేంద్రాన్ని సుప్రీం ప్రశ్నించింది. ' ఈ కేసుతో సంబంధమున్న అందరిపై కేసులు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ జరపండి. దర్యాప్తు తీరుపై అసంతృప్తిగా ఉన్నాం' అని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై అటార్నీ జనరల్ వేణుగోపాల్ స్పందిస్తూ.. 'టెలికం మాజీ మంత్రి రాజాకి ప్రమేయమున్న 2జీ కేసులో నిందితుల్ని ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. అదేవిధంగా ఇతర అనుబంధ కేసుల్లో నిందితులపై ఆరోపణల్ని కూడా కొట్టివేశారు. కేవలం మలేసియా వ్యాపారవేత్త టీ ఆనంద కృష్ణన్‌కు ప్రమేయమున్న ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసు దర్యాప్తు మాత్రమే పెండింగ్‌లో ఉంది. అతను మలేసియాలో అత్యంత పలుకుబడి కలిగిన వ్యక్తి కావడంతో అతన్ని భారత్‌కు రప్పించలేకపోయాం' అని చెప్పారు. ఈ సందర్భంగా కోర్టు జోక్యం చేసుకుంటూ... కేసు దర్యాప్తు పురోగతిపై రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని ఆదేశించింది. బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి వాదిస్తూ.. ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసు దర్యాప్తుపై స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని ఇంతకముందే కోర్టు ఆదేశించిందని, అయితే కేసులోని ఒక నిందితుడి బెడ్‌రూంలో ఆ ఫైల్ ఉందని ఆరోపించారు. ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసు నుంచి దయానిధి మారన్, అతని సోదరుడు కళానిధి మారన్ పేర్లను ప్రత్యేక కోర్టు తప్పించినా.. ఒప్పందానికి ఎఫ్‌ఐపీబీ ఇచ్చిన అనుమతిపై మాత్రం సీబీఐ విచారణ కొనసాగుతోంది.

డాన్సులు చేసే వారితో నాకు పోలికా?

జయా బచ్చన్‌పై ఎంపీ అగర్వాల్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)కి చెందిన రాజ్యసభ సభ్యుడు నరేశ్ అగర్వాల్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సినీ నటి, రాజకీయ నేత జయా బచ్చన్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో చేరిన సందర్భంగా ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ..'సినిమాల్లో నటించే వారితో, డ్యాన్స్ చేసే వారితో పోలుస్తూ ఆ స్థాయికి నన్ను సమాజ్‌వాదీ పార్టీ దిగజార్చింది..నాకు పార్టీ టికెట్ నిరాకరించటం సబబు కాదు' అని జయాబచ్చన్‌పై, సమాజ్ వాదీ పార్టీపై మండిపడ్డారు. జయ కారణంగా తనకు రాజ్యసభ అవకాశం చేజారిందని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని బీజేపీ స్పష్టంచేసింది.

భాషా శాస్త్రాలు చదివిన వారికి
ఉద్యోగాలివ్వాలి

- లేకపోతే భాషలు అంతరించిపోయే ప్రమాదం ఉంది
- ప్రవేశాలు, పోస్టుల మంజూరుపై పూర్తి వివరాలివ్వండి
- వెంకటేశ్వర, ఆంధ్రా వర్సిటీలకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: భాషా శాస్త్రాలు చదివిన విద్యార్థులకు ఉద్యోగవకాశాలు కల్పించాలని హైకోర్టు అభిప్రాయపడింది. లేకపోతే వాటిని చదివేందుకు ఎవరూ ముందుకు రారని, దీంతో భాషలు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. తల్లిదండ్రులందరూ తమ పిల్లలు ఇంజనీరింగ్, మెడిసిన్ మాత్రమే చదవాలని ఆశపడుతున్నారని, వారే పిల్లలను భాషా శాస్త్రాల వైపు రాకుండా నిరుత్సాహపరుస్తున్నారని వ్యాఖ్యానించింది. ఈ ధోరణితో ఇప్పటికే సంస్కృతం, తదితర భాషలు ప్రాధాన్యం కోల్పోయి చరిత్రలో కలిసిపోయే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని గుర్తు చేసింది. శ్రీ వెంకటేశ్వర, ఆంధ్రా విశ్వవిద్యాలయాల్లో తెలుగు, ఇంగ్లిష్, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, పర్షియన్ తదితర భాషా శాస్త్రాల్లో 2015–16 విద్యా సంవత్సరం నుంచి జరిగిన ప్రవేశాల వివరాలు, శాఖల వారీగా మంజూరైన పోస్టులు, ఒక శాఖ నుంచి మరో శాఖకు బదిలీ అయిన అధ్యాపక పోస్టుల వివరాలను తమ ముందుంచాలని రెండు విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మీల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. శ్రీవెంకటేశ్వర, ఏయూలో ఉర్దూ, పర్షియన్, అరబిక్ భాషలు బోధిస్తున్న అధ్యాపకులను హిందీ, న్యాయశాస్త్రాలో బోధించే శాఖలకు బదిలీ చేస్తున్నారంటూ, అలాగే పాఠ్య ప్రణాళిక నుంచి ఉర్దూ, పర్షియన్, అరబిక్ కోర్సులను తొలగిస్తున్నారంటూ హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

బాబువి అన్నీ దొంగ లెక్కలే

- కమీషన్లకు అవకాశం ఉన్న శాఖలకే కేటాయింపులు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ఆదిమూలపు సురేశ్, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ వి.గోపాల్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి. చిత్రంలో ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ గోపాల్ రెడ్డి

విజయవాడ సిటీ: రాష్ట్ర బడ్జెట్‌లో 54 శాతం (రూ.84 వేల కోట్లు) నిధులు కేంద్రం నుంచి వస్తున్నాయని సీఎం చంద్రబాబు చెబుతున్నారని, ఏ ప్రాతిపదికన వస్తున్నాయో లెక్కలు చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఆదిమూలపు సురేశ్, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ వి.గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ముగ్గురు నేతలు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను నాలుగేళ్లుగా మోసం చేస్తూ వస్తున్న చంద్రబాబు ఆఖరి బడ్జెట్‌లోనూ కేంద్రం నిధులు ఇస్తుందని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆయనవన్నీ దొంగలెక్కలని తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్యే ఆదిమూలపు సురేశ్ మాట్లాడుతూ కేంద్రం చేపట్టాల్సిన పోలవరం ప్రాజెక్టును కమీషన్లకు కక్కుర్తిపడి చంద్రబాబు తీసుకున్నారన్నారు. అన్ని రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక నిబంధనల పేరుతో రూ.87 వేల కోట్ల రుణాలను రూ.24 వేల కోట్లకు కుదించి రుణమాఫీ కోసం చివరి బడ్జెట్లో రూ.400 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. వ్యవసాయ రుణాల బకాయిలు చెల్లించకుండా రైతులకు ఎగనామం పెట్టారని విమర్శించారు. ఏ ఒక్క వర్గం కూడా ఈ ప్రభుత్వ హయాంలో సంతోషంగా లేరన్నారు. కమీషన్లకు అవకాశమున్న శాఖలకే నిధులు కేటాయించారని విమర్శించారు.

ప్రత్యేక హోదా ఎవరిచ్చినా మద్దతిస్తాం

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేవారికే వైఎస్సార్‌సీపీ మద్దతిస్తుందని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఇదివరకే ప్రకటించారని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతను తిట్టడానికే చంద్రబాబు సమయం కేటాయిస్తున్నారని, ప్రజా సంక్షేమం పట్టడం లేదని మండిపడ్డారు. కేసుల నుంచి కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని మండిపడ్డారు. తమ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో నలుగురితో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్‌కు అసలు సిగ్గుందా అని ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు.

నూతన ఏసీ బస్సులు ప్రారంభం

సాక్షి, అమరావతి బ్యూరో/సాక్షి, అమరావతి/బస్‌స్టేషన్/: ఏపీఎస్ ఆర్టీసీ తొమ్మిది అధునాతనమైన బస్సులను కొనుగోలు చేసింది. ప్రయాణికుల సౌకర్యార్థం కోసం అమరావతి ఏసీ బస్సుల పేరుతో వీటిని అందుబాటులోకి తెచ్చింది. సోమవారం విజయవాడలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలసి ఈ నూతన బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ ఏడాది 19 బస్సులను కొనుగోలు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలివిడతగా వోల్వో కంపెనీకి చెందిన తొమ్మిది ఏసీ బస్సులను కొనుగోలు చేశారు. ఇవి విజయవాడ, విశాఖ, హైదరాబాద్ రూట్లలో తిరగనున్నాయి. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ మాలకొండయ్య, ఈడీలు, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం


బడ్జెట్‌పై చర్చను ప్రారంభించిన టీడీపీ ఎమ్మెల్యే ఆలపాటి

సాక్షి, అమరావతి: తమది అభివృద్ధి లక్ష్యంతో రూపొందించిన సంక్షేమ బడ్జెట్ అని, సంక్షేమం, అభివృద్ధికి కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇచ్చామని టీడీపీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. 2018 –19 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వార్షిక బడ్జెట్‌పై చర్చను సోమవారం అసెంబ్లీలో ఆయన ప్రారంభించారు. విభజన చట్టం ప్రకారం రావాల్సిన ప్రయోజనాలు, రాష్ట్ర విభజన చట్టం సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం ఇవ్వడంలేదన్నారు. అయినా రూ.5,327 కోట్ల రెవెన్యూ మిగులుతో బడ్జెట్ ప్రవేశపెట్టడం గొప్ప విషయమన్నారు. సంవత్సరానికి 365 రోజులుంటే దానిని 700 రోజులుగా మార్చుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. రాష్ట్రంలో ఆస్పత్రులు అత్యంత అధ్వానంగా ఉన్నాయని, పరికరాలను వార్షిక నిర్వహణకు ఇచ్చినా పట్టించుకునే నాథుడే లేరని పలువురు ఎమ్మెల్యేలు చెప్పారు. తామే ఆస్పత్రికి వెళ్లి పరికరాలపై ఆరా తీసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు శాసనసభ్యులు ఈ అంశాన్ని లేవనెత్తారు. వార్షిక పరీక్షల నిర్వహణ పేరుతో టీబీఎస్ అనే ప్రైవేటు సంస్థకు రూ. 40 కోట్లకు పైగా చెల్లిస్తున్నారని, కానీ పరికరాలు ఎక్కడా బాగుచేయడం లేదని అన్నారు. ఈనెల 25, 26 తేదీల్లో శాసనసభ, మండలి సభ్యులకు క్రీడలు నిర్వహించనున్నట్టు స్పీకర్ కోడెల తెలిపారు. ప్రశ్నోత్తరాల అనంతరం మాజీ సభ్యుడు పి.సంగన్నదొరకు మృతికి సభ సంతాపం ప్రకటించింది. కాగా, రేషన్ డీలర్లు వేలిముద్రలు పడలేదన్న కారణంగా రేషన్ ఇవ్వకుండా ఆపకూడదని, ఇక్కడ తీసుకోకపోతే మరో చోట రేషన్ తీసుకోవచ్చునని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.


సీఎం బంధువుకే ఈడీ పోస్టు

"ఆర్టీసీలో విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన ఎన్.వెంకటేశ్వరావు కుమార్తె అమెరికాలో ఎమ్ఎస్ చేస్తోంది. అంతే కాకుండా ఆయన తల్లిదండ్రులను కూడా చూసుకోవాల్సి ఉంది. అందువల్ల ఆయనకు మరో రెండేళ్లు పదవీకాలం ఇవ్వండి" అంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి ఆర్టీసీ ఎండీకి పంపిన ఉత్తర్వులకు ఆమోద ముద్ర పడింది. ఆర్టీసీలో 55వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా ఎవరికీ 60 ఏళ్ల పదవీవిరమణ నిబంధన వర్తించలేదు. పదవీవిరమణ తర్వాత పోస్టింగ్ కల్పించలేదు. కేవలం సీఎం సమీప బంధువు కావడంతోనే వెంకటేశ్వరరావుకు ఆ ప్రత్యేక సదుపాయం వచ్చింది.

- ఆర్టీసీ వాణిజ్య, మార్కెటింగ్ ఈడీగా ఎన్.వెంకటేశ్వరరావు నియామకం
- గతేడాదే పదవీ విరమణ చేసిన ఈయనకు మళ్లీ పోస్టింగ్
- ఆయన కుమార్తె అమెరికాలో చదువుతోందట.. తల్లిదండ్రులను చూసుకోవాలట..
- అందువల్ల పోస్టింగ్ ఇవ్వాలంటూ ఆర్టీసీ ఎండీకి లేఖ.. ఆమోదం
- రెండేళ్ల పదవీ కాలం.. నెలకు రూ. 2.50 లక్షల వేతనం
- ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు పీఏలు, ఒక ప్రత్యేక కారు కేటాయింపు
- పదవీ విరమణ చేసిన వారికి ఉన్నత పదవులపై అధికారుల్లో అసంతృప్తి


Sub:-Transport Department - APSRTC - Re-employment of Sri N.Venkateswararo, retired Executive Director for a period of 2 years from the date of assuming charge - Permitted to engage the services of Sri.N.venkateswara Rao, ED(Retd) as ED(Commercial & Marketing) on outsourcing basis – Regarding.

ఎన్.వెంకటేశ్వరరావుకు తిరిగి ఉద్యోగం కల్పించాలని కోరుతూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నుంచి ఆర్టీసీ ఎండీకి పంపిన ఉత్తర్వు.


unk of Executive Director, Vijayawada Zone on 31.12.2017, submitted for -employment on the grounds that he has to look after his daughter who is irsuing MS in the USA and elder family-members also.

వెంకటేశ్వరరావు పిల్లలు యూఎస్‌లో చదువుతున్నారని, అందువల్ల ఉద్యోగం ఇవ్వాలన్న ఉత్తర్వు

సాక్షి, అమరావతి

సీఎం చంద్రబాబు బంధువులకు, అనుయాయులకు ఆర్టీసీ పునరావాస కేంద్రంగా మారింది. నాలుగేళ్లుగా ఆర్టీసీలో ఒక్క పోస్టు భర్తీ చేయని యాజమాన్యం పదవీ విరమణ చేసిన వారికి కాంట్రాక్టు విధానంలో భారీ వేతనాలిస్తూ కీలక పోస్టులు కట్టబెడుతోంది. తాజాగా సీఎం చంద్రబాబు బంధువు ఎన్.వెంకటేశ్వరరావుకు కీలక పోస్టు అయిన వాణిజ్య, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ పోస్టును అప్పగించారు. ఈయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. నెలకు రూ. 2.50 లక్షల వేతనంతో పాటు ఇరువురు డ్రైవర్లు, ఇద్దరు పీఏలు, ఓ అటెండరు, ఓ ప్రత్యేక కారును వెంకటేశ్వరరావుకు కేటాయించారు. ఆర్టీసీలో విలువైన స్థలాల పర్యవేక్షణ, బీవోటీ టెండర్ల విధానం మొత్తం వాణిజ్య ఈడీ పరిధిలో ఉంటుంది. వీటిని కొట్టేసేందుకు సర్కారు పెద్దలు వెంకటేశ్వరరావును కీలక ఈడీగా నియమించారన్న ప్రచారం ఆర్టీసీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. గతేడాది సీఎం చంద్రబాబు వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాస్ బంధువులకు కాంట్రాక్టు విధానంలో పోస్టులు కట్టబెట్టడం గమనార్హం. విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న ఎన్.వెంకటేశ్వరావు గతేడాది డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు. ఆయన స్వస్థలం కృష్ణా జిల్లా నిమ్మకూరు. సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ, సీఎం సతీమణి భువనేశ్వరికి దగ్గరి బంధువు. ఇదిలా ఉండగా సోమవారం ఆర్టీసీలో ఈడీల బదిలీలు జరిగాయి. విజయనగరం జోన్ ఈడీగా పనిచేస్తున్న రామకృష్ణకు విజయవాడ జోన్ ఈడీగా, ప్రధాన కార్యాలయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న అన్సారీని పదోన్నతి కల్పించి విజయనగరం ఈడీగా పోస్టింగిచ్చారు.

ఉన్నతాధికారుల్లో అసంతృప్తి

ఆర్టీసీలో ఖాళీ అయిన పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేయాలని ఉన్నతాధికారులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఏళ్ల తరబడి పదోన్నతులు లేక, కొత్త పోస్టులను భర్తీ చేయకుండా ఆర్టీసీ యాజమాన్యం ఒంటెత్తు పోకడలు అనుసరిస్తోందని అధికారులు మండిపడుతున్నారు. పదవీ విరమణ చేసిన వారికే తిరిగి ఆ పోస్టులను అప్పగించడం వెనుక పెద్దల ప్రయోజనాలున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మీరిచ్చిన 1200 హామీల
మాటేమిటి?

- వాటి అమలుకు 2019తో గడువు తీరుతుంది
- కేంద్రం ఇచ్చిన విభజన హామీలకు పదేళ్ల గడువు ఉంది
- సీఎం చంద్రబాబుపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఫైర్



సాక్షి, అమరావతి: అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు ఇచ్చిన 1200 హామీల అమలుకు 2019తో గడువు తీరిపోతుందని, అదే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రాష్ట్ర విభజన హామీల అమలుకు 2022 వరకు గడువు ఉందని శాసనమండలిలో బీజేపీ పక్ష నేత సోము వీర్రాజు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సోమవారం మండలిలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. విభజనకు అనుకూలంగా రెండుసార్లు లేఖలిచ్చిన టీడీపీ ఏపీలో సమైక్య ఉద్యమం, తెలంగాణలో విభజన ఉద్యమం చేసిందని తప్పుబట్టారు. ఏపీకి న్యాయం చేయాలని వెంకయ్యనాయుడు మాత్రమే పోరాడారని గుర్తు చేశారు. నాడు ఏపీ ఆర్థిక లోటు, పోలవరం ముంపు మండలాల విలీనం గురించి ఎవరూ అడగలేదని, అయినా బీజేపీ ప్రభుత్వం వీలైనంత చేసిందన్నారు. విభజన చట్టంలోని హామీలు పదేళ్లలో అమలు చేయాలని ఉంటే కేంద్ర ప్రభుత్వం మూడేళ్లలోనే చాలా వరకు నెరవేర్చిందని చెప్పారు. కేంద్రం తాము అడిగినదానికంటే ఎక్కువే నిధులిచ్చిందని, ఇంతకంటే ఏమీ అడగలేమని, హోదా కంటే ప్యాకేజీ మేలని సీఎం, కేంద్ర మంత్రి సుజనాచౌదరి అనేకసార్లు ప్రస్తావించిన పత్రికల క్లిప్పింగ్‌లను సభలో చూపించారు. కాగా, విశాఖలో చేపట్టిన నిరసనలో టీడీపీ ఎమ్మెల్యే ఏకంగా ప్రధానిని కించపరిచేలా ప్రవర్తించారని సభ దృష్టికి తెచ్చారు. కాగా, ప్రజా ఉద్యమాలతో మా పార్టీకి నూకలు చెల్లే రోజులు వచ్చాయని, అందుకే రాజకీయ నిర్ణయం తీసుకున్నామని మంత్రి పితాని వ్యాఖ్యానించారు.

విలువలే ఊపిరి.. విశ్వసనీయతే ఆభరణం

- కష్టాలొచ్చినా సడలని ధైర్యం
- ప్రజల పక్షమే అనుక్షణం
- వైఎస్ఆర్ ఆశయ సాధనే లక్ష్యం
- వెన్నుచూపని యోధుడు జగన్
- ద్రోహం బాబుదైతే... త్యాగం జగన్‌ది
- వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విలువలు, విశ్వసనీయతే ప్రామాణికంగా ప్రజాక్షేత్రంలో తమ పార్టీ దినదినాభివృద్ధి చెందుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాక్షేత్రమే దేవాలయంగా తమ నేత వైఎస్ జగన్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై అనుక్షణం పోరాడుతున్నారని తెలిపారు. గడచిన ఏడేళ్లుగా పార్టీ చేసిన పోరాటాలు, ప్రజాభిమానం పొందిన తీరును భూమన ఈ సందర్భంగా వివరించారు.

ఆయనే ఓ నమ్మకం... విశ్వాసం...

అత్యున్నత వ్యక్తిత్వం, నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడే నైజం, కొండంత ధైర్యం తమ నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆభరణాలని భూమన కొనియాడారు. ప్రజల్లోనే ఉంటూ, వారి కష్టాలే వింటూ, వారి కోసమే పోరాడుతూ పార్టీని బలోపేతం చేశారని తెలిపారు. ఎలాంటి తప్పుడు హామీలివ్వకుండా, ఏ సినీ గ్లామర్ లేకుండానే 2014 ఎన్నికల్లో 67 స్థానాలు గెలుచుకున్న చరిత్ర తమ పార్టీదని గర్వంగా అన్నారు. ఏడేళ్లుగా తమ పార్టీ అనేక ఆటుపోట్లను ఎదుర్కొందని, టీడీపీ దౌర్జన్యాలకు ఎంతోమంది నాయకులు, కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని భూమన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఆశయ సాధన కోసం అసువులు బాసిన వారికి ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. వారి త్యాగాలు వృథా పోవని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్ఆర్ తరహాలోనే అభివృద్ధి, సంక్షేమ రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మహాభారత యుద్ధంతో పోల్చిన భూమన... టీడీపీని కౌరవ సేనగా అభివర్ణిస్తూ... చరిత్రలో పాండవులే గెలిచారని, కౌరవులు చిత్తుగా ఓడిపోయారని గుర్తుచేశారు. అంతిమ విజయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆశయ సాధనకు పునరంకితం

ప్రత్యర్థులు పెట్టే కష్టనష్టాలు ఎదుర్కొంటూ ప్రజలతో కలిసి పోరాడేందుకు తమ పార్టీ పునరంకితమవుతోందని భూమన తెలిపారు. పేదవాడి పక్షపాతిగా ముద్రపడ్డ వైఎస్ఆర్ ఆశయ సాధన కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధమేనన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికలప్పుడు 600 వాగ్దానాలిచ్చి, ఏ ఒక్కటీ నెరవేర్చకపోయినా... ఆయనను పచ్చ మీడియా పొగడ్తలతో ముంచెత్తడం దారుణమన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజాక్షేత్రంలోనే జగన్ ఎండగడుతున్నారని, ప్రజల్లో రెట్టింపు అభిమానం పొందుతున్నారని భూమన తెలిపారు. దీన్ని జీర్ణించుకోలేని తెలుగుదేశం పార్టీ వైఎస్సార్‌సీపీని దెబ్బతీసేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతోందని ఆయన మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాటాల ఫలితంగానే చంద్రబాబు ఆగడాలకు కొంతైనా కళ్లెం పడుతోందని భూమన తెలిపారు. తాను అధికారంలోకి వస్తే రాష్ట్రానికి 15 ఏళ్ల పాటు ప్రత్యేక హోదా తీసుకొస్తానని చెప్పిన చంద్రబాబు... గెలిచిన తర్వాత హోదా అవసరమే లేదని అనుకూల మీడియాతో ప్రచారం చేయించడం ఆయన నయవంచనకు నిదర్శనమన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా ఢిల్లీ నుంచి గల్లీ దాకా ప్రత్యేక హోదా, విభజన అంశాల సాధనకు జగన్ అలుపెరగని పోరాటాలు చేశారని, ప్రతి ఊరికి వెళ్లి హోదా ప్రయోజనాలను వివరించి, ప్రజలను చైతన్యం చేశారని భూమన తెలిపారు.

కలుషిత ఆహారంతో 15 మంది విద్యార్థినులకు అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): కలుషిత ఆహారం తిని 15 మంది డిగ్రీ విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏపీ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రాంగణంలోని ఏపీ గురుకుల డిగ్రీ కళాశాల హాస్టల్‌కు చెందిన 110 మంది విద్యార్థినులు హాజరయ్యారు. అక్కడ చికెన్‌తో భోజనాలు చేశారు. అనంతరం మిగిలిన చికెన్‌ను హాస్టల్‌కు తీసుకుని వచ్చి రాత్రి తిన్నట్లు తెలిసింది. అంతేకాక అదే చికెన్‌ను సోమవారం ఉదయం కూడా తిన్నట్లు చెబుతున్నారు. దీంతో ఉదయం 10.30 గంటల సమయంలో కొందరికి వాంతులు, విరేచనాలు అయినట్లు విద్యార్థినులు చెప్పారు. విషయాన్ని హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్‌కు తెలపగా, వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జాయింట్ కలెక్టర్ విజయకృష్ణన్ పరామర్శించారు. విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అయిన ఘటనపై విచారణకు ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. అందరి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

పీఈటీ పోస్టులు భర్తీ చేయాలి

ఏపీ వ్యాయామ విద్య పోరాట సమితి నిరాహార దీక్ష



ధర్నాచౌక్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి రిలేనిరాహార దీక్షలు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): పాఠశాలల్లో వ్యాయామ విద్యను బలోపేతం చేయాలని, ఫిజికల్ లిటరసీని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి అధ్యక్షుడు ఇ.మోహన్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. తొలుత పోరాట సమితి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌నుంచి అలంకార్ సెంటర్ మీదుగా ధర్నాచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నాచౌక్‌లో జరిగిన సభలో మోహన్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ–2018 ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదర్శపాఠశాలు, కళాశాలల్లోనూ వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలను ఆరికట్టాలంటే ప్రాథమిక స్థాయినుంచి వ్యాయామ విద్య అవసరమన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విధిగా క్రీడా మైదానాలు ఉండేలా చూడాలన్నారు. పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్య, బొడ్డు నాగేశ్వరరావు, శ్రీనివాసులురెడ్డి ఆందోళనకు మద్దతు తెలిపారు.

హామీలు అమలు చేయాలనే అడుగుతున్నాం

శాసనమండలిలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని.. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే అడుగుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం చంద్రబాబు సోమవారం శాసనమండలిలో ప్రసంగించారు. అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తామంటూ బీజేపీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొందని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీని గురించి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరితే, రాష్ట్ర బీజేపీ నేతలు తనపై ఎదురుదాడి చేస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. ''ఇప్పటివరకు ప్రత్యేక హోదా అమలు చేసిన రాష్ట్రాలకు ఇక నుంచి హోదా ఉండదని కేంద్రం చెప్పింది. కానీ ఇప్పటికీ 90 శాతం రాయితీతో ఆ రాష్ట్రాలకు నిధులిస్తున్నారు. మరోవైపు ప్రధాని అనుమతి లేదంటూ మన రాష్ట్ర ఖజానాకు వచ్చిన డబ్బులను వెనక్కి తీసుకున్నారు. విభజనతో నష్టపోయిన ఏపీని ఆదుకోవాల్సిన కేంద్రం తప్పించుకుంటోంది. విశాఖ రైల్వే జోన్, ఉక్కు కర్మాగారం తదితర ముఖ్య హామీలను కూడా పట్టించుకోవడం లేదు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిధులకు సంబంధించిన వినియోగ పత్రాలను ఎప్పటికప్పుడు నీతి ఆయోగ్‌కు పంపిస్తున్నాం. వీటిని నీతి ఆయోగ్ ధ్రువీకరించినా కూడా కేంద్రం నిధులివ్వడం లేదు. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ భాగం కాదా?'' అని సీఎం ప్రశ్నించారు.

శాసనసభ స్థానాలు కూడా పెంచట్లేదు: రాష్ట్ర శాసనసభ స్థానాలు పెంచుతామని హామీ ఇచ్చారని.. కానీ కేంద్ర ప్రభుత్వం అది కూడా పట్టించుకోవడం లేదని చంద్రబాబు మండిపడ్డారు. దానిపై గట్టిగా అడిగితే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తిరుపతిలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో ప్రధాని మోదీ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుకు సభలోనూ, బయటా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని తమ పార్టీ ఎంపీలకు సీఎం చంద్రబాబు సూచించారు. టీడీపీ ఎంపీలతో సీఎం సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక హోదా గురించి ప్రజల్ని చైతన్యపరచాల్సిన బాధ్యత కూడా ఎంపీలదేనన్నారు. కాగా, నీరు–ప్రగతిపై అధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

విభేదాలున్నా టీడీపీ మా మిత్రపక్షమే

బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ

టీడీపీ, బీజేపీ మధ్య విభేదాలు ఉన్నాయని బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ అన్నారు. అయినా తాము టీడీపీతో మిత్రపక్షంగానే కొనసాగుతున్నామని చెప్పారు. సోమవారం అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పొత్తుపై తాము మిత్రధర్మాన్ని పాటిస్తున్నామన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో నాలుగో నామినేషన్ వేసి.. ఓటింగ్ జరిగితే బీజేపీ ఎవరికి మద్దతిస్తుందని అడగ్గా.. ఆయన సమాధానం దాటవేశారు.

● తెలంగాణ

తొలిరోజే ఉద్రిక్తత

- తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుల రభస
- హెడ్‌సెట్‌ను గవర్నర్‌పైకి విసిరిన కోమటిరెడ్డి
- మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయం



సోమవారం అసెంబ్లీలో గవర్నర్‌పైకి హెడ్‌సెట్ విసురుతున్న కోమటిరెడ్డి



గాయపడిన మండలి చైర్మన్ స్వామిగౌడ్

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల తొలి రోజునే తెలంగాణ అసెంబ్లీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్ నరసింహన్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ సభ్యులు చేసిన ఆందోళన అదుపు తప్పింది. ఏకంగా ప్లకార్డులు, కాగితాలు, హెడ్‌సెట్‌లతో కాంగ్రెస్ సభ్యులు దాడికి దిగటంతో అనూహ్య ఘటనలు చోటు చేసుకున్నాయి. సోమవారం జాతీయ గీతాలాపన అనంతరం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ప్రారంభించారు. ప్రసంగం మొదలైన మూడు నిమిషాలకే కాంగ్రెస్ సభ్యులు తమ సీట్లలోంచి లేచి.. ప్లకార్డులతో నిరసన తెలిపారు. మరోవైపు గవర్నర్ ప్రసంగానికి మద్దతు పలికేందుకు టీఆర్ఎస్ సభ్యులు బల్లలు చరుస్తూ శబ్దాలు చేశారు. దీంతో పోటీ వాతావరణం నెలకొంది. నినాదాలు చేస్తూ కాంగ్రెస్ సభ్యులు ఒక్కసారిగా వెల్‌లోకి దూసుకెళ్లేందుకు యత్నించారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన మార్షల్స్ కాంగ్రెస్ సభ్యులను వెల్ వైపు రాకుండా అడ్డుకున్నారు. దీంతో మార్షల్స్ కాంగ్రెస్ సభ్యుల మధ్య తోపులాట కొనసాగింది. గవర్నర్ ప్రసంగం కొనసాగినంత సేపు కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి చొచ్చుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి .. తమ సీట్లకు అమర్చిన హెడ్‌ఫోన్స్‌ను విరిచేసి గవర్నర్ వైపు గురి చేసి విసిరారు. తన సీటుపై నిలబడి దాడి చేశారు. ఈ క్రమంలో కోమటిరెడ్డి తనంతట తానే అదుపు తప్పి టేబుల్‌పై పడ్డారు. రెండోసారి విసిరిన హెడ్‌ఫోన్స్ గవర్నర్ ప్రసంగిస్తున్న వేదికపైకి దూసుకెళ్లింది. వెనుక ఉన్న గోడకు తగిలి గవర్నర్ పక్క సీటులో ఉన్నమండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలింది. దీంతో ఆయన కంటికి స్వల్ప గాయమైంది.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కేంద్రీయ విద్యాలయ, ఎద్దుమైలారంలో 22 ఖాళీలు

మెదక్ జిల్లా ఎద్దుమైలారంలోని కేంద్రీయ విద్యాలయంలో 2018-19కి గానూ కాంట్రాక్టు పద్ధతిలో 22 ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.



- **పోస్టు-ఖాళీలు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)-1 (ఫిజిక్స్); ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ)-13 (ఇంగ్లిష్-2+హిందీ-3+ సంస్కృతం-1+సోషల్ స్టడీస్-3+సైన్స్-2+ మ్యాథ్స్-2); ప్రైమరీ టీచర్ (పీఆర్‌టీ)-2; వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్స్-6 (స్పోర్ట్స్ కోచ్-1+ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్-1+యోగా ఇన్‌స్ట్రక్టర్-1+డాక్టర్-1+నర్స్-1+ఎడ్యుకేషనల్ కౌన్సెలర్-1).
- **వేతనం:** పీజీటీ-రూ.27,500; టీజీటీ, ఎడ్యుకేషనల్ కౌన్సెలర్-రూ.26,250; పీఆర్‌టీ, స్పోర్ట్స్ కోచ్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, యోగా ఇన్‌స్ట్రక్టర్-రూ.21,250. డాక్టర్‌కు రోజుకు (కనీసం 2 గంటలు)-రూ.1,000, నర్స్-రోజుకు రూ.750 (విధులకు హాజరైన రోజుకు మాత్రమే).
- **అర్హతలు:** బోధన (పీజీటీ/టీజీటీ/పీఆర్‌టీ) ఖాళీలకు సంబంధిత పోస్టు, విభాగాన్ని బట్టి ఇంటర్మీడియెట్/మాస్టర్స్ డిగ్రీ/బ్యాచిలర్ డిగ్రీతోపాటు బీఈడీ/సీటీఈటీ పేపర్ 2/డీఈడీ/సీటీఈటీ పేపర్ 1. మిగిలిన పోస్టులకు బీపీఈడీ/బీసీఏ/బీఈ/బీటెక్/ ఎంఎస్సీ/ఎంసీఏ/పీజీడీసీఏ/డిప్లొమా (నర్సింగ్)/ఎంబీబీఎస్. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, అనుభవం తదితర అర్హతలుండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** పోస్టు ద్వారా (స్పీడ్ పోస్ట్ మాత్రమే).. మార్చి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.kvemailaram.edu.in

ఐఐటీ మద్రాస్‌లో ఎంఎస్ (రీసెర్చ్), పీహెచ్‌డీ

తమిళనాడులోని చెన్నైలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటీఎం).. 2018-19కి గానూ ఎంఎస్ (రీసెర్చ్), పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సులు:** ఎంఎస్ (రీసెర్చ్), పీహెచ్‌డీ.
- **విభాగాలు:** ఏరోస్పేస్ ఇంజనీరింగ్, అప్లైడ్ మెకానిక్స్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ డిజైన్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్, మ్యాథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్ ఇంజనీరింగ్, ఓషియన్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫిజిక్స్.
- **అర్హతలు:** సంబంధిత కోర్సులు, విభాగాలను అనుసరించి బీఈ/బీటెక్/బీఎస్ (నాలుగేళ్లు)/మాస్టర్స్ డిగ్రీ/ఎంఎస్ (రీసెర్చ్)/బీఎస్+ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ (ఐదేళ్లు)/ఎంఎస్సీ (ఐఐటీ)/తత్సమాన విద్య. అలాగే నిబంధనల మేర అనుభవం, గేట్/క్యాట్/నెట్/జేఆర్ఎఫ్/టోఫెల్/ తత్సమాన జాతీయస్థాయి పరీక్షల్లో క్వాలిఫై తదితర అర్హతలు ఉండాలి.
- **ఎంపిక:** టెస్ట్/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు రూ.50.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** మార్చి 31, 2018.
- **వెబ్‌సైట్:** www.iitm.ac.in

ఏపీ ఈసెట్-2018

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ వృత్తి విద్యా కళాశాలల్లో 2018-19కి గానూ బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సుల లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ 'ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్)-2018' ప్రకటన విడుదలైంది.

- **కోర్సులు:** బీఈ, బీటెక్, బీఫార్మసీ.
- **అర్హతలు:** సంబంధిత విభాగాల్లో డిప్లొమా/ బీఎస్సీ (మ్యాథమెటిక్స్) ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **దరఖాస్తు ప్రారంభం:** మార్చి 15, 2018.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 14, 2018.
- **రూ.1,000 ఆలస్య రుసుముతో చివరి తేదీ:** ఏప్రిల్ 21, 2018.
- **దరఖాస్తు రుసుం:** రూ.550.
- **పరీక్ష తేదీ:** మే 3, 2018.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.sche.ap.gov.in

టీఎస్ పీజీఈసెట్-2018

తెలంగాణలోని వివిధ ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కళాశాలల్లో 2018-19కి గానూ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ 'తెలంగాణ రాష్ట్ర పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్ పీజీఈసెట్)-2018' ప్రకటన విడుదలైంది.

- **కోర్సులు:** ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్కిటెక్చర్, గ్రాడ్యుయేట్ లెవల్ ఫార్మా డీ (పీ.బీ).
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్/ బీఫార్మసీ/బీఆర్క్ ఉత్తీర్ణత.
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1000 (ఎస్సీ/ఎస్టీ- రూ.500).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **దరఖాస్తుల ప్రారంభం:** మార్చి 15, 2018.
- **పరీక్ష తేదీలు:** మే 28-31, 2018.
- http://pgecet.tsche.ac.in/

సరికొత్తగా సీఎస్..



కంపెనీ, కార్పొరేట్ చట్టాల్లో నిరంతరం చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విధుల నిర్వహణకు సరికొత్త నైపుణ్యాలు అందించే కోర్సు కంపెనీ సెక్రటరీస్ (సీఎస్) కోర్సు. దీన్ని పూర్తిచేసిన వారికి కార్పొరేట్ రంగం, ఇతర ప్రముఖ సంస్థల్లో కంపెనీ సెక్రటరీ, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీ తదితర హోదాలు లభిస్తున్నాయి. ఈ కోర్సుకు సంబంధించిన కొత్త సిలబస్‌పై ఫోకస్..

మొత్తం మూడు దశల్లో కోర్సు

కంపెనీ సెక్రటరీస్ కోర్సు మూడు దశల్లో ఉంటుంది. అవి.. ఫౌండేషన్ ప్రోగ్రామ్, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్. సీఎస్ కోర్సులో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన అర్హతతో అడుగుపెట్టొచ్చు. ప్రత్యేక అర్హతలతో (ఉదా: ఫైన్‌ఆర్ట్స్ మినహా ఇతర విభాగాల్లో గ్రాడ్యుయేషన్ ద్వారా) ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లో నేరుగా ప్రవేశించొచ్చు.

- రెండు, మూడు దశల్లో మార్పులు: 2018, మార్చి 1 నుంచి ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ (మాడ్యూల్ 1-4 పేపర్లు; మాడ్యూల్ 2-4 పేపర్లు)కు కొత్త సిలబస్ అమల్లోకి వచ్చింది. అదే విధంగా ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ (3 మాడ్యూళ్లలో 9 పేపర్లు)కు 2018, సెప్టెంబర్ 1 నుంచి కొత్త సిలబస్ అమలవుతుంది.
- కార్పొరేట్ రంగంలో మారుతున్న పరిస్థితులు, వాటికి అనుగుణంగా ఔత్సాహికులకు నైపుణ్యాలను అందించి, కోర్సు పూర్తయ్యేసరికి పరిపూర్ణ సీఎస్‌లుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో సిలబస్‌లో మార్పులు చేసినట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) వర్గాలు పేర్కొన్నాయి.

ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ కొత్త సిలబస్

మాడ్యూల్-1

1. జ్యూరిస్ప్రుడెన్స్, ఇంటర్‌ప్రిటేషన్ అండ్ జనరల్ 'లా'స్.
2. కంపెనీ లా.
3. సెటింగ్ అప్ ఆఫ్ బిజినెస్ ఎంటిటీస్ అండ్ క్లోజర్ (వ్యాపార సంస్థల ఏర్పాటు, మూసివేత).
4. ట్యాక్స్ 'లా'స్.

మాడ్యూల్-2

5. కార్పొరేట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్.
6. సెక్యూరిటీస్ 'లా'స్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్.
7. ఎకనామిక్, బిజినెస్ అండ్ కమర్షియల్ 'లా'స్.
8. ఫైనాన్షియల్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్.

ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ కొత్త సిలబస్

మాడ్యూల్-1

1. గవర్నెన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్, కంప్లయన్సెస్ అండ్ ఎథిక్స్.
2. అడ్వాన్స్‌డ్ ట్యాక్స్ 'లా'స్.
3. డ్రాఫ్టింగ్, ప్లీడింగ్స్ అండ్ అపీయరెన్సెస్.

మాడ్యూల్-2

4. సెక్రటేరియల్ ఆడిట్, కంప్లయన్స్ మేనేజ్‌మెంట్ అండ్ డ్యూ డిలిజెన్స్.
5. కార్పొరేట్ రీస్ట్రక్చరింగ్, ఇన్‌సాల్వెన్సీ, లిక్విడేషన్ అండ్ వైండింగ్ అప్.
6. రిజల్యూషన్ ఆఫ్ కార్పొరేట్ డిస్ప్యూట్స్, నాన్ కంప్లయెన్సెస్ అండ్ రెమిడీస్.

మాడ్యూల్-3

7. కార్పొరేట్ ఫండింగ్ అండ్ లిస్టింగ్స్ ఇన్ స్టాక్ ఎక్స్ఛేంజెస్.
8. మల్టీ డిసిప్లినరీ కేస్ స్టడీస్.
9. ఎలక్టివ్ పేపర్.

- బ్యాంకింగ్- లా అండ్ ప్రాక్టీస్
- ఇన్సూరెన్స్ - లా అండ్ ప్రాక్టీస్.
- ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ - లా అండ్ ప్రాక్టీసెస్.
- ఫోరెన్సిక్ ఆడిట్.
- డైరెక్ట్ ట్యాక్స్ లా అండ్ ప్రాక్టీస్.
- లేబర్ 'లా'స్ అండ్ ప్రాక్టీస్.
- వాల్యుయేషన్స్ అండ్ బిజినెస్ మోడలింగ్.
- ఇన్‌సాల్వెన్సీ-లా అండ్ ప్రాక్టీస్. (వీటిలో ఒక దాన్ని ఎంపిక చేసుకోవాలి).

ప్రాక్టికల్ శిక్షణ విధానాల్లో మార్పు

సీఎస్ ఎగ్జిక్యూటివ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ సిలబస్‌లో మార్పులు చేసిన ఐసీఎస్ఐ.. ఫౌండేషన్ నుంచి ప్రొఫెషనల్ వరకు అమలు చేస్తున్న పలు రకాల శిక్షణ విధానాల్లోనూ మార్పు చేసింది. ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్, కంప్యూటర్ ట్రైనింగ్ నుంచి మినహాయింపు ఇచ్చింది.

అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్.. యథాతథం

సీఎస్ కోర్సు పూర్తిచేసే క్రమంలో విద్యార్థులు కేవలం రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా.. తప్పనిసరిగా అప్రెంటీస్‌షిప్ పేరుతో ఉండే ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ అప్రెంటీస్‌షిప్ గరిష్ఠ వ్యవధి మూడేళ్లు. అభ్యర్థులు సీఎస్ కోర్సు ఏ దశలో చేరారో దానికి అనుగుణంగా ఈ వ్యవధిలో మార్పు ఉంటుంది.

- **సీఎస్ కోర్సు పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.icsi.edu

కోర్సుతో కొలువులు

సీఎస్ కోర్సు పూర్తిచేసి, ఐసీఎస్ఐ అసోసియేట్ మెంబర్‌షిప్ పొందిన అభ్యర్థులకు కార్పొరేట్ సంస్థల్లో కంపెనీ సెక్రటరీలు, అసోసియేట్ కంపెనీ సెక్రటరీలు, కంప్లయన్స్ ఆఫీసర్స్ తదితర కీలక హోదాల్లో కొలువులు లభిస్తాయి. అంతేకాకుండా స్వయం ఉపాధి కోణంలోనూ ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీగా కెరీర్ ప్రారంభించొచ్చు. ఇందులోనూ మంచి ఆదాయం లభిస్తుంది. కొత్తగా కంపెనీ ఏర్పాటు చేసేటప్పుడు నిర్దేశిత చట్టాల ప్రకారం.. కంపెనీ ప్రాస్పెక్టస్, ఇతర వివరాలను గుర్తింపు పొందిన కంపెనీ సెక్రటరీ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో స్వయం ఉపాధికి మంచి ఆదరణ నెలకొంది.


కొత్త నైపుణ్యాలు అందించేందుకే..

ఐసీఎస్ఐ.. ఎగ్జిక్యూటివ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌ల సిలబస్‌లో మార్పులు చేయడానికి ప్రధాన కారణం.. విద్యార్థుల్లో కొత్త నైపుణ్యాలు అందించడమే. ఇటీవల కార్పొరేట్ చట్టాలు, ఇతర అంశాల పరంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వీటికి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేసేందుకు కొత్త సిలబస్‌ను రూపొందించాం. ఈ కోర్సు ఔత్సాహికులు నిరంతర పరిణామాలపై అవగాహనతో అడుగులు వేస్తే ఎన్ని మార్పులు వచ్చినా సులువుగా కెరీర్‌లో రాణించగలరు.

– ఆర్.రామకృష్ణ గుప్తా, చైర్మన్, ఎస్ఐఆర్‌సీ-ఐసీఎస్ఐ.

విద్య-ఉపాధి-వేతనాలు

సాంకేతిక ప్రగతి, ఉపాధి కల్పన మధ్య సంబంధాన్ని నిర్లక్ష్యం చేయలేం. అభివృద్ధి విధానాలన్నీ ఆర్థిక వ్యవస్థలో ఉపాధి కల్పన నిరాటంకంగా కొనసాగేందుకు దోహదపడేవిగా ఉండాలి. అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో విద్యార్థిపై చేసే తలసరి వ్యయంతో పోల్చితే యూనివర్సిటీ, ఉన్నత విద్యా స్థాయిలో చేసే తలసరి వ్యయం ఎక్కువగా ఉంది. వృద్ధి ప్రక్రియలో పాఠశాల విద్యకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. వృద్ధి స్వభావం.. ఉపాధి నిర్మాణత, ప్రత్యేక నైపుణ్యతలకు సంబంధించి శ్రామిక డిమాండ్‌ను నిర్ణయిస్తుంది. చలనాత్మక ఆర్థిక వ్యవస్థలో విద్య అందుబాటు; ప్రభుత్వ జోక్యం ద్వారా పరపతి, శ్రామిక మార్కెట్‌కు సంబంధించిన అసంపూర్ణతలను తగ్గిస్తే.. సమాజం అధిక ప్రయోజనం పొందుతుంది.



ప్రభుత్వం విద్యపై చేసే వ్యయం.. సాంఘిక ప్రతిఫల రేటు, ప్రాథమిక, సెకండరీ విద్యా స్థాయి పెరుగుదల, అధిక ప్రతిఫలం, దీర్ఘకాల వృద్ధికి అనువైన వాతావరణం ఏర్పరచడం తదితర అంశాల ఆధారంగా ఉండాలి. కేవలం వనరుల పంపిణీ మాత్రమే 'విద్య' పరంగా లింగ సంబంధిత అసమానతలను తొలగించలేదు. పాఠశాల, ఉన్నత విద్యా వ్యవస్థలో వికేంద్రీకరణ, అధిక సరళత, పరీక్షల ప్రక్రియలో మార్పు, ఉపాధ్యాయులకు శిక్షణ వంటి సంస్కరణలు చేపట్టాలి. ఆయా సంస్కరణలు విజయవంతం కావాలంటే పెద్ద మొత్తంలో ప్రభుత్వ వ్యయం అవసరం. భారత ప్రభుత్వం పాఠశాల స్థాయిలో సంప్రదాయ విద్యకు తగిన మద్దతు అందిస్తోంది. కానీ, వృత్తి విద్యా శిక్షణ, నైపుణ్యాతాభివృద్ధిపై ప్రభుత్వ పెట్టుబడులు పెరిగినప్పుడే ఆర్థికాభివృద్ధి ప్రక్రియ వేగవంతమవుతుంది. ప్రభుత్వ విధానాలు ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో మహిళా భాగస్వామ్యాన్ని పెంచేవిగా ఉండాలి. ఈ దిశగా మహిళలకు సంబంధించి విద్య, ఆరోగ్య ప్రమాణాలు, స్కిల్ డెవలప్‌మెంట్ పెంపుపై దృష్టిసారించాలి. ఆర్థిక వ్యవస్థలో సాంఘిక- ఆర్థికాభివృద్ధికి విద్య, నాణ్యతలను ముఖ్య కారకాలుగా గుర్తించాలి.

విద్య-ఉపాధి

అనేక అనుభవపూర్వక ఆధారాల ప్రకారం విద్యా స్థాయి, శాశ్వత ఉపాధికి మధ్య సంబంధం జీవన నాణ్యతపై ప్రభావం చూపుతుంది. విద్యాస్థాయిలో పెరుగుదల వల్ల భారతదేశంలో శాశ్వత ఉపాధి పెరిగింది. ఫలితంగా పేదరిక స్థాయి తగ్గింది. ప్రాథమిక విద్యతో పోల్చితే ఉన్నత విద్య.. ఉపాధి పెరుగుదల, పేదరికం తగ్గింపునకు ఎక్కువగా దోహదపడుతుంది. విద్య, సాంకేతిక శిక్షణలను ఉపాధి పెంపునకు మూలస్తంభాలుగా పేర్కొనవచ్చు. తక్కువ నైపుణ్యత, అల్ప ఉత్పాదకత, తక్కువ వేతన ఆర్థిక వ్యవస్థ తదితర లక్షణాల నుంచి ఆర్థిక వ్యవస్థ బయటపడాలంటే విద్యా స్థాయిని పెంచే చర్యలు అవసరం. నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి నాణ్యతలను పెంపొందించడం.. ఆర్థిక వ్యవస్థ ముందున్న సవాళ్లుగా చెప్పొచ్చు. భారత ఆర్థిక వ్యవస్థలో విద్య, శ్రామికుల నైపుణ్యత తక్కువగా ఉంది. కేవలం 5 శాతం గ్రామీణ మహిళలు, 13 శాతం గ్రామీణ పురుషులు మాత్రమే హయ్యర్ సెకండరీ, అంతకు మించిన విద్యను అభ్యసించారు. కాగా, పట్టణ శ్రామికుల్లో మహిళలకు సంబంధించి గ్రాడ్యుయేట్, ఆపై అభ్యసించిన వారి శాతం గణనీయంగా పెరిగినట్లు నేషనల్ శాంపుల్ సర్వే వెల్లడించింది.

నైపుణ్య అభివృద్ధి

పనిచేసే జనాభాలో నైపుణ్య అభివృద్ధి.. ప్రభుత్వ తక్షణ ప్రాధాన్యాంశంగా ఉంది. భారతదేశంలో నైపుణ్యతాభివృద్ధి ప్రక్రియ సమీక్ష ప్రకారం 2009-10లో 15 నుంచి 19 సంవత్సరాల వయోవర్గ శ్రామికశక్తిలో వృత్తి విద్యా శిక్షణ పొందినవారు కేవలం 10 శాతం మాత్రమే. సేవారంగంలోని మొత్తం శ్రామికుల్లో 33 శాతానికి పైగా; తయారీ రంగంలో సుమారు 33 శాతం; వ్యవసాయ రంగంలో 27 శాతం శ్రామికులు మాత్రమే వృత్తి విద్యా శిక్షణ పొందారు. తయారీయేతర అనుబంధ రంగాల్లోని మొత్తం శ్రామికుల్లో 9 శాతం మంది మాత్రమే వృత్తి విద్యా శిక్షణ తీసుకున్నారు.

ప్రాథమిక విద్యను పెంపొందించేందుకు భారత ప్రభుత్వం ప్రణాళికా యుగంలో సర్వశిక్షా అభియాన్, జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమం (డీపీఈపీ), ఆపరేషన్ బ్లాక్ బోర్డ్, మధ్యాహ్న భోజన పథకం తదితర కార్యక్రమాలను అమలుచేసింది. వీటితోపాటు సమాజంలో అన్ని వర్గాల పిల్లలు కుల, మత, లింగ సంబంధిత తేడా లేకుండా అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు నేషనల్ బాల భవన్, నవోదయ విద్యాలయ సమితి, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ తదితరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

విద్య-శ్రామికుల వేతనాలు

భారత ఆర్థిక వ్యవస్థలో ముఖ్యంగా సంస్కరణల కాలంలో నైపుణ్యత గల శ్రామికశక్తి, నైపుణ్యత లేని శ్రామికశక్తి మధ్య వేతన వ్యత్యాసాలు బాగా పెరిగాయి. అనేక ఉపాధి కేటగిరీల్లో పురుషులతో పోల్చితే మహిళా శ్రామికుల వేతనాలు తక్కువ. తాత్కాలిక ఉపాధితో పోల్చితే శాశ్వత ఉపాధిలో విద్య-వేతనాలకు సంబంధించిన జెండర్ అసమానతలను తగ్గిస్తుంది. నేషనల్ శాంపుల్ సర్వే అంచనాల ప్రకారం 2011-12లో శాశ్వత ఉపాధిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పురుషులు, మహిళల మధ్య వేతన వ్యత్యాసం విద్యా స్థాయి పెరిగే కొద్దీ తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఉపాధిలో ఏవిధమైన విద్యను అభ్యసించని మహిళ వేతనం.. పురుషుడి వేతనంలో 53 శాతం కాగా, గ్రాడ్యుయేట్ మహిళ వేతనం గ్రామీణ ప్రాంతాల్లో అదే విద్యను అభ్యసించిన పురుషుడి వేతనంలో 70 శాతంగా ఉంది. కానీ, పట్టణ ప్రాంతాల్లో మాత్రం పురుషులు, మహిళల మధ్య వేతన వ్యత్యాసం తక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళ వేతనం.. పురుషుడి వేతనంలో 62 శాతం కాగా, సెకండరీ విద్యను అభ్యసించిన మహిళ వేతనం.. పురుషుడి వేతనంలో 86 శాతంగా, గ్రాడ్యుయేట్ చేసిన మహిళా వేతనం.. పురుషుడి వేతనంలో సగటున 76 శాతంగా నమోదైంది.

విద్యా స్థాయి పరంగా శాశ్వత శ్రామికుల వేతనాలు (రోజుకు రూపాయల్లో..)

విద్య	గ్రామీణ		పట్టణ	
	పురుషులు	మహిళలు	పురుషులు	మహిళలు
నిరక్షరాస్యులు	178	95	208	129
ప్రాథమిక	189	102	222	139
మిడిల్	217	112	252	138
సెకండరీ హయ్యర్ సెకండరీ	338	229	383	328
గ్రాడ్యుయేట్, అంతకు పైన	550	378	792	607
మొత్తం	**320**	**203**	**463**	**360**

భారత్‌లో విద్య అందుబాటు

- భారత్‌లో 'విద్య'.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త బాధ్యత. విద్యా హక్కును రాజ్యాంగంలో పొందుపరిచారు. 14 సంవత్సరాల లోపు వయోవర్గానికి రాజ్యాంగంలో ఉచిత, తప్పనిసరి విద్యను నిర్దేశించారు. భారత్‌లో పాఠశాల విద్య నాలుగు దశలుగా ఉంది. అవి..1. ప్రాథమిక; 2. అప్పర్ ప్రైమరీ; 3. సెకండరీ; 4. హయ్యర్ సెకండరీ. ప్రాథమిక, అప్పర్‌ప్రైమరీ దశలను ఎలిమెంటరీ విద్యగా పరిగణిస్తారు. జాతీయ విద్యా వ్యవస్థ 10+2 పాఠశాల విద్యా ప్రక్రియను కలిగి ఉంది.
- 2000-01 నుంచి 2013-14 మధ్యకాలంలో భారతదేశంలో ప్రాథమిక పాఠశాలలు 6,38,738 నుంచి 8,58,916కు; అప్పర్ ప్రైమరీ పాఠశాలలు 2,06,269 నుంచి 5,89,796కు పెరిగాయి. దేశంలోని 98 శాతం గ్రామీణ నివాస ప్రాంతాలు కిలోమీటర్ లోపే ప్రాథమిక పాఠశాలలను కలిగి ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 2000-01 నుంచి 2013-14 మధ్యకాలంలో 113.8 మిలియన్ల నుంచి 132.4 మిలియన్లకు పెరిగింది. ఇదే కాలంలో అప్పర్ ప్రైమరీలో విద్యార్థుల నమోదు 42.8 మిలియన్ల నుంచి 66.5 మిలియన్లకు పెరిగింది. 2013-14లో ప్రాథమిక విద్యలో నికర నమోదు నిష్పత్తి 88.1 శాతంగా నమోదైంది. 2009-10 తదుపరి కాలంలో ప్రాథమిక విద్యలో డ్రాప్-అవుట్ రేటులో స్థిరమైన తగ్గుదల సంభవించింది. 2009-10, 2012-13 మధ్యకాలంలో ప్రాథమిక విద్యలో సగటు సాంవత్సరిక డ్రాప్-అవుట్ రేటు 9.1 శాతం నుంచి 4.7 శాతానికి తగ్గింది. ప్రాథమిక విద్య నుంచి అప్పర్ ప్రైమరీ విద్యకు వెళ్లినవారు 2007-08లో 81.1 శాతం కాగా, 2012-13లో 89.6 శాతం.
- విద్యాభివృద్ధి ప్రక్రియను నియంత్రించేందుకు 1953లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఉన్నత విద్యా పరిశోధనను ప్రోత్సహించేందుకు ఐకార్ (ఐసీఏఆర్), ఎన్‌పీఎల్, సీఎస్ఐఆర్, డీఏఈ వంటి జాతీయ సంస్థలు, లేబొరేటరీలను ఏర్పాటు చేశారు.
- ప్రాథమిక విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 2000-01లో 95.7 శాతం కాగా, 2010-11లో 116 శాతానికి పెరిగి.. 2013-14లో 101.4 శాతానికి తగ్గింది. 2000-2001 నుంచి 2013-14 మధ్యకాలంలో ప్రాథమిక విద్య నమోదు నిష్పత్తిలో పెరుగుదల 5.7 శాతంగా ఉంది. ఇదే కాలంలో బాలుర స్థూల నమోదు నిష్పత్తిలో 4.7 శాతం తగ్గగా, బాలికల స్థూల నమోదు నిష్పత్తిలో 16.8 శాతం పెరిగింది.
- 2005-06లో ప్రాథమిక విద్యలో నికర నమోదు నిష్పత్తి 84.5 శాతం కాగా, 2013-14లో 88.08 శాతం. బాలురతో పోల్చితే (87.2 శాతం) బాలికల్లో నికర నమోదు నిష్పత్తి (89.26) ఎక్కువగా ఉంది.
- 12వ ప్రణాళికలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ అండ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు రూ.3,43,028 కోట్ల స్థూల బడ్జెటరీ మద్దతు ప్రకటించారు. ఈ మొత్తంలో సర్వశిక్షా అభియాన్‌కు రూ.1,92,726 కోట్లు, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్‌కు రూ.27,466 కోట్లు, మధ్యాహ్న భోజన పథకానికి రూ.32,681 కోట్లు కేటాయించారు.



డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్, హైదరాబాద్

సాక్షి బిజినెస్

మంగళవారం 13-3-2018

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు (సోమ రెండు రాత్రి 10.30కి)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
611 ▲	195 ▲
33,918	10,421

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	7,606	▲	45
డోజోన్స్	25,202	▽	133
ఎఫ్‌టీఎస్ఈ 100	7,215	▽	10
డాక్స్	12,418	▲	72
షాంఘై	3,326	▲	19
నికాయ్	21,824	▲	355

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.70	65.83
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.32	91.50
€	యూరో	ఎస్‌బీఐ	81.30	81.46
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.89	62.02
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.90	52.01
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.15	50.25
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.72	18.62
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.09	18.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.26	11.78

బుల్ ధనాధన్!



అమెరికా గణాంకాలతో ఉరకలేసిన ప్రపంచ మార్కెట్లు

- ఇటీవలి పతనం కారణంగా ఆకర్షణీయంగా షేర్ల ధరలు
- అన్ని రంగాల షేర్లలో జోరుగా కొనుగోళ్లు
- కలసివచ్చిన షార్ట్ కవరింగ్
- రిటైల్ ద్రవ్యోల్బణం, ఐఐపీలపై ఆశావహ అంచనాలు
- 611 పాయింట్ల లాభంతో 33,918కు సెన్సెక్స్
- 195 పాయింట్లు పెరిగి 10,421కు నిఫ్టీ
- సూచీలకు రెండేళ్లలో అత్యధిక పాయింట్ల పెరుగుదల ఇదే
- పతన బాట వీడని ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు

అమెరికా ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుందన్న గణాంకాలు వాణిజ్య యుద్ధ భయాలను వెనక్కినెట్టడంతో అంతర్జాతీయంగా రిలీఫ్ ర్యాలీ చోటు చేసుకుంది. దీనికి వ్యాల్యూ బయింగ్, షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు కూడా జత కావడంతో మన స్టాక్ మార్కెట్ సోమవారం భారీ లాభాలను ఆర్జించింది. బీఎస్ఈ సెన్సెక్స్ 611 పాయింట్ల లాభంతో 33,918 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 195 పాయింట్ల లాభంతో 10,421 పాయింట్ల వద్ద ముగిశాయి. రెండేళ్లలో సెన్సెక్స్ ఒక్క రోజులో ఇన్ని పాయింట్లు లాభపడడం ఇదే మొదటిసారి. శాతం పరంగా చూస్తే నిఫ్టీ ఈ స్థాయిలో పెరగడం గత 22 నెలల్లో ఇదే తొలిసారి. గత వారం మొత్తంలో స్టాక్ మార్కెట్ 2 శాతం మేర నష్టపోగా, ఈ వారం మొదటి రోజునే స్టాక్ సూచీలు 2 శాతం వరకూ లాభపడ్డాయి. ఒక్క ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు మంచి లాభాలు సాధించాయి. మార్కెట్ ముగిసిన తర్వాత వచ్చే రిటైల్ ద్రవ్యోల్బణ, ఐఐపీ గణాంకాలు ఆశావహంగా ఉంటాయన్న అంచనాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయి. ఇటీవల పతనం కారణంగా కుదేలైన లోహ, ఆయిల్, గ్యాస్, ఎఫ్ఎమ్‌సీజీ, బ్యాంక్, విద్యుత్, మౌలిక, ఐటీ, వాహన, క్యాపిటల్ గూడ్స్‌షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరిపారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 655 పాయింట్లు, నిఫ్టీ 207 పాయింట్ల చొప్పున లాభపడ్డాయి.

కొనుగోళ్ల సునామీ...

అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా ఉండడం, రిటైల్‌ద్రవ్యోల్బణం 4.7%కి దిగిరాగలదన్న అంచనాలతో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరిపారని జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. వాణిజ్య యుద్ధాల భయాలను మార్కెట్ పట్టించుకోలేదని, అమెరికా ఉద్యోగ గణాంకాలు ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందన్న సంకేతాలనివ్వడం కలసివచ్చిందని పేర్కొన్నారు. ఈ ర్యాలీ ఆశ్చర్యకరమని రెలిగేర్ బ్రోకింగ్ ప్రెసిడెంట్ జయంత్ మాంగ్లిక్ చెప్పారు. నిఫ్టీ 10,400 పైన కొనసాగడం ... తదుపరి రికవరీకి కీలకమని వ్యాఖ్యానించారు. మరోవైపు నిఫ్టీ ఏడాది టార్గెట్‌ను 11,600 పాయింట్లుగా కొనసాగిస్తున్నామని గోల్డ్‌మన్ శాక్స్ పేర్కొంది.

మరిన్ని విశేషాలు..

- సెన్సెక్స్‌లో రెండు షేర్లు–కోల్ ఇండియా, ఎస్‌బీఐలు మాత్రమే నష్టపోయాయి. మిగిలిన అన్ని షేర్లు లాభపడ్డాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మధ్యంతర డివిడెండ్‌గా ఒక్కో షేర్‌కు రూ.16.50ను ఇవ్వనున్నామని కోల్ ఇండియా ప్రకటించింది. ఇంత భారీగా డివిడెండ్ ఇస్తే, కంపెనీ మూలధన ప్రణాళికలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న అంచనాలతో ఈ షేర్ 2 శాతం నష్టపోయింది.
- రూ.16,500 కోట్ల నిధుల సమీకరణకు కంపెనీ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలపడంతో భారతీ ఎయిర్‌టెల్ 4.6 శాతం లాభపడి రూ. 421 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. ఇంట్రాడేలో ఈ షేర్ 6 శాతం లాభంతో రూ.425 వద్ద ముగిసింది.
- గత శనివారం జరిగిన జీఎస్‌టీ మండలి సమావేశంలో సిగరెట్లపై పన్ను విషయమై ఎలాంటి మార్పులు, చేర్పులు చేయక పోవడంతో ఐటీసీ 4 శాతం ఎగసి రూ.270 వద్ద ముగిసింది.
- ఎన్‌టీపీసీ బాండ్లకు మూడీస్ సంస్థ బీఏఏ2 రేటింగ్‌ను ఇవ్వడంతో ఎన్‌టీపీసీ షేర్ 4.3 శాతం లాభపడింది.
- గత నెలలో టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) హోల్‌సేల్ విక్రయాలు 18 శాతం పెరిగాయన్న వార్తల కారణంగా టాటా మోటార్స్ షేర్ 3 శాతం లాభంతో రూ.352 వద్ద ముగిసింది. మరో వైపు ఈ షేర్‌ను రూ.515 టార్గెట్ ధరకు కొనుగోలు చేయవచ్చని మోతీలాల్ ఓస్వాల్ బ్రోకరేజ్ సంస్థ రికమెండ్ చేయడం కూడా కలిసివచ్చింది.
- దేశీయ వాహన అమ్మకాలు గత నెలలో 8 శాతం వరకూ పెరిగాయన్న సియామ్ గణాంకాల కారణంగా వాహన షేర్లు పరుగులు పెట్టాయి. హీరో మోటొకార్ప్ 2.7 శాతం, మారుతీ సుజుకీ 1.7 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 1 శాతం, బజాజ్ ఆటో 0.8 శాతం వరకూ లాభపడ్డాయి.
- ఎల్ అండ్ టీ అనుబంధ సంస్థలు రూ.3,039 కోట్ల మేర ఆర్డర్లు సాధించడంతో ఎల్ అండ్ టీ షేర్ 1.5 శాతం పెరిగి రూ.1,309 వద్ద ముగిసింది.
- వేదాంత, జిందాల్ స్టీల్, సెయిల్, హిందాల్కో, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నాల్కో, ఎన్ఎమ్‌డీసీ, హిందుస్తాన్ జింక్ షేర్లు 4.4 శాతం వరకూ పెరిగాయి.
- టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ, యస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఓఎన్‌జీసీ, విప్రో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, రిలయన్స్, హెచ్‌యూఎల్, ఎల్ అండ్ టీ, సన్ ఫార్మా, కోటక్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి.
- ర్యాడికో ఖైతాన్, గ్రాఫైట్ ఇండియా, హెచ్ఈజీ, హిటాచి హోమ్, జై ప్రకాశ్ అసోసియేట్స్, జై ప్రకాశ్ పవర్, జిందాల్ స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సుజ్లాన్ ఎనర్జీ, సెయిల్, ఫోర్టిస్ హెల్త్ కేర్, జీఎమ్ఆర్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ క్యాపిటల్, మహీంద్రా లాజిస్టిక్స్ షేర్లు 19 శాతం వరకూ ఎగిశాయి.

రూ.1.78 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

సెన్సెక్స్ భారీగా లాభపడటంతో ఇన్వెస్టర్ల సంపద రూ.1.78 లక్షల కోట్లు పెరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 1,78,394 కోట్లు పెరిగి రూ.1,44,52,009 కోట్లకు చేరింది.



ప్రభుత్వ బ్యాంక్ షేర్లు... బేర్...

అన్ని రంగాల షేర్లు దూసుకుపోయినా.. ప్రభుత్వ రంగ షేర్లు మాత్రం పతనమయ్యాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 19 నెలల కనిష్ట స్థాయికి పడిపోయింది. పీఎన్‌బీ రుణ కుంభకోణంలో కీలకమైన, నీరవ్ మోదీ సంబంధిత కంపెనీలకు రూ.120 కోట్లు, మేహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూప్ కంపెనీలకు రూ.175 కోట్లు చొప్పున యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేరుగా రుణాలిచ్చిందన్న వార్తలు పీఎస్ బ్యాంక్ షేర్లపై తీవ్ర ప్రభావం చూపించాయి. మొత్తం 21 ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లలో ఐదు బ్యాంక్ షేర్లు–ఆంధ్రా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంక్‌లు ఐదేళ్ల కనిష్ట స్థాయికి (ఇంట్రాడేలో) పడిపోయాయి. దేనా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఓబీసీ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్ షేర్లు తాజా ఏడాది కనిష్ట స్థాయిలను తాకాయి. పీఎన్‌బీ రుణ కుంభకోణం వెలుగులోకి వచ్చిన నాటి నుంచి చూస్తే, ఒక నెల కాలంలో పీఎస్ బ్యాంక్‌ల మార్కెట్ క్యాప్ రూ.90,000 కోట్ల మేర హరించుకుపోయింది. పీఎస్ బ్యాంక్ షేర్ల పతనానికి కారణమైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ రుణ కుంభకోణం(రూ.12,000 కోట్లు)తో పోల్చితే ఇది దాదాపు ఏడు రెట్లు అధికం కావడం విశేషం.

14 ఏళ్ల కనిష్టానికి ఆంధ్రాబ్యాంక్

గుజరాత్‌కు చెందిన స్టెర్లింగ్ బయెటెక్ ఫార్మా కంపెనీకి సంబంధించి రూ.5,000 కోట్ల మోసం కేసులో ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరెక్టర్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో ఈ షేర్ ఇంట్రాడేలో 15 శాతం నష్టంతో 14 ఏళ్ల కనిష్ట స్థాయి, రూ.32.55కు పడిపోయింది. చివరకు 7 శాతం నష్టంతో రూ.36 వద్ద ముగిసింది. బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.231 కోట్లు తగ్గి రూ. 3,129 కోట్లకు పడిపోయింది. అటు స్టెర్లింగ్ బయొటెక్ కంపెనీ కూడా శాతం నష్టపోయింది.

లాభాలు ఎందుకంటే...

అదరగొట్టిన అమెరికా గణాంకాలు: గత శుక్రవారం అమెరికా ఉద్యోగ గణాంకాలు వెల్లడయ్యాయి. గత నెలలో కొత్త ఉద్యోగాలు అంచనాలను మించి పెరిగాయని, అయితే వేతన వృద్ధి జనవరితో పోల్చితే తగ్గిందని ఈ గణాంకాలు పేర్కొన్నాయి. ఉద్యోగాలు పెరగడం అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడాన్ని సూచిస్తుండగా, వేతన వృద్ధి తగ్గడంతో ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయాలు తగ్గాయని, దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్లను తగ్గించే విషయంలో దూకుడుగా వ్యవహరించకపోవచ్చన్న అంచనాలు నెలకొన్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ఇప్పటి వరకూ కయ్యానికి కాలు దువ్వుతూ వచ్చిన ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ చర్చలకు సిద్ధమంటూ సంకేతాలివ్వడమూ సానుకూల ప్రభావం చూపించింది. దీంతో శుక్రవారం అమెరికా స్టాక్ మార్కెట్ భారీ లాభాల్లో ముగిసింది.

ప్రపంచ మార్కెట్ల పరుగు: అమెరికా మార్కెట్లు గత శుక్రవారం మంచి లాభాలు సాధించడంతో ఈ సోమవారం ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల పెంపు విషయంలో దూకుడుగా ఉండకపోవచ్చని, దీంతో వర్ధమాన దేశాల నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోవనే భరోసా మార్కెట్లకు లభించింది. దీంతో షాంగై కాంపొజిట్ 1.5 శాతం, సింగపూర్ 1 శాతం, హాంగ్‌కాంగ్ హాంగ్‌సెంగ్ 2 శాతం వరకూ, జపాన్ నికాయ్ 1.6% వరకూ లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు మంచి లాభాల్లోనే ఆరంభమయ్యాయి.

గణాంకాలపై ఆశావహ అంచనాలు: కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల ధరలు తగ్గడంతో గత నెలలో ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ట స్థాయికి దిగిరావచ్చని, అలాగే పారిశ్రామికోత్పత్తి పుంజుకోవచ్చన్న ఆశావహ అంచనాలు కొనుగోళ్ల జోరును పెంచాయి (మార్కెట్లు ముగిశాక సానుకూల గణాంకాలు వెలువడ్డాయి).

షార్ట్ కవరింగ్, వ్యాల్యూ బయింగ్ కొనుగోళ్లు: ఈ ఏడాది జనవరిలో జీవిత కాల గరిష్ట స్థాయిలను చేరిన స్టాక్ సూచీలు ఆ తర్వాత 10 శాతం మేర పతనమయ్యాయి. ఈ నెలలో గత శుక్రవారం నాటికి మొత్తం ఎనిమిది ట్రేడింగ్ సెషన్లలో ఏడు ట్రేడింగ్ సెషన్లలో స్టాక్ సూచీలు నష్టపోయాయి. సాంకేతికంగా మార్కెట్ 'ఓవర్‌సోల్డ్' పొజిషన్‌లో ఉందని, షేర్ల ధరలు ఆకర్షణీయంగా ఉండటంతో కొనుగోళ్లు జోరుగా జరిగాయని నిపుణులంటున్నారు. మరోవైపు షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు కూడా చోటు చేసుకోవడం కలిసివచ్చిందని వారంటున్నారు.

ఐకియా ఇండియా సీఈవోగా పీటర్ బెజెల్



న్యూఢిల్లీ: ఫర్నిచర్ దిగ్గజం ఐకియా భారత విభాగం సీఈవోగా కొత్తగా పీటర్ బెజెల్ నియమితులయ్యారు. ఇప్పటిదాకా ఈ స్థానంలో ఉన్న జువెన్సియో మేజ్టూ ఇకపై అంతర్జాతీయ స్థాయిలో ఐకియా గ్రూప్ ఇన్‌గా హోల్డింగ్ సీఎఫ్‌వో, డిప్యూటీ సీఈవోగా బాధ్యతలు చేపడతారు. స్వీడన్‌కి చెందిన హోమ్ ఫర్నిషింగ్స్ సంస్థ అయిన ఐకియా భారత్‌లో తమ తొలి స్టోర్‌ని హైదరాబాద్‌లో త్వరలోనే ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. కొత్త సీఈవోగా నియమితులైన బెజెల్.. ఇప్పటిదాకా జర్మనీ విభాగానికి సారథ్యం వహించినట్లు ఐకియా తెలిపింది. దాదాపు పాతికేళ్లుగా ఐకియాలో ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు.

సిడ్నీలో ఓలా ట్యాక్సీ సేవలు



న్యూఢిల్లీ: దేశీ దిగ్గజ క్యాబ్ సర్వీసుల సంస్థ ఓలా ఆస్ట్రేలియాలో కార్యకలాపాలు విస్తరించింది. ఇది తాజాగా సిడ్నీలోనూ సేవలు ప్రారంభించినట్లు పేర్కొంది. ఓలా గత నెల పెర్త్‌లో సర్వీసులు ప్రారంభించడం ద్వారా ఆస్ట్రేలియా మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. కాగా కంపెనీ ఆస్ట్రేలియా మార్కెట్‌లోకి ప్రవేశిస్తామని జనవరిలోనే ప్రకటించింది. ఓలా ఇప్పుడు సిడ్నీలో అధికారికంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇది భాగస్వామ్యాలు కుదుర్చుకోవడానికి, డ్రైవర్ పార్ట్‌నర్స్‌కు సపోర్ట్ ఇవ్వడానికి స్థానికంగా టీమ్‌ను కూడా నియమించుకుంది. 'డ్రైవర్ పార్ట్‌నర్స్ ఇన్వెస్ట్‌మెంట్‌పై దృష్టి కేంద్రీకరించాం. కొత్త టెక్నాలజీ, శిక్షణ ద్వారా వారికి మద్దతునిస్తాం. ఆదాయ పెంపునకు మార్గాలను అన్వేషిస్తాం' అని సంస్థ తెలిపింది. కాగా ఆస్ట్రేలియా మార్కెట్లో ఓలాకు ఉబెర్ ప్రధాన ప్రత్యర్థి. ఉబెర్ 2012లోనే ఆస్ట్రేలియాలో కార్యకలాపాలు ప్రారంభించింది.

ఎన్‌పీఏలుగా స్టెర్లింగ్ గ్రూప్ కంపెనీలు: ఆంధ్రాబ్యాంకు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్టెర్లింగ్ గ్రూప్ కంపెనీలపై ఆర్‌బీఐతోపాటు సీబీఐకి ఫిర్యాదు చేసినట్లు ఆంధ్రాబ్యాంకు తెలిపింది. మోసపూరిత ఖాతాలుగా తెలుపుతూ, రూ.519.19 కోట్ల నిధులు దారి మళ్లించారని 2017 డిసెంబరులో ఇచ్చిన ఫిర్యాదులో తాము పేర్కొన్నట్టు వెల్లడించింది. ఈ గ్రూప్ కంపెనీలు 2015 మార్చి నుంచే ఎన్‌పీఏల ఖాతాలో చేరాయని బ్యాంకు తెలిపింది. డిసెంబరు 31 నాటికి రూ.515.19 కోట్ల ఫండ్ ఆధారిత రుణం ఎన్‌పీఏగా ఉందని వివరించింది. రూ.5,000 కోట్ల బ్యాంకు మోసం కేసులో ఆంధ్రాబ్యాంకు మాజీ డైరెక్టర్ అనుప్ ప్రకాశ్ గర్గ్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే అనుప్ ప్రకాశ్ 2006–09 మధ్య చార్టర్డ్ అకౌంటెంట్ డైరెక్టర్‌గా ఉన్నారని బ్యాంకు తెలిపింది. ప్రస్తుతం అతను తమ ఉద్యోగి లేదా డైరెక్టర్ ఎంత మాత్రమూ కాదని ఆంధ్రాబ్యాంకు స్పష్టం చేసింది. స్టెర్లింగ్ గ్రూప్ కంపెనీలకు రుణం ఇచ్చిన కన్సార్షియంలో ఆంధ్రాబ్యాంకు లీడ్ బ్యాంకర్‌గా ఉంది. ప్రస్తుతం ఈ కంపెనీలకు ఆంధ్రాబ్యాంకు ఇచ్చిన రుణంలో ఫండ్ ఆధారిత రుణం రూ.578.57 కోట్లు, నాన్ ఫండ్ ఆధారిత రుణం రూ.568.35 కోట్లు ఉందని, మీడియాలో వచ్చినట్టు రూ.5,000 కోట్లు కాదని వెల్లడించింది. తాజా వార్తల నేపథ్యంలో సోమవారం ఆంధ్రాబ్యాంకు షేరు క్రితం ముగింపుతో పోలిస్తే 6.88 శాతం పడిపోయి రూ.35.85 వద్ద స్థిరపడింది.

ఆర్థిక వ్యవస్థకు జోష్..!


పరిశ్రమల జోరు.. ధరల ఊరట • జనవరిలో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి 7.5 శాతం • ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.44 శాతం

న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థ పురోగతికి సంబంధించి సోమవారం కేంద్రం గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) విడుదల చేసిన గణాంకాలు ఊరట నిచ్చాయి. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి జనవరిలో 7.5 శాతంగా నమోదయ్యింది (డిసెంబర్‌లో 7.1 శాతం). 2017 జనవరిలో 3.5 శాతం. అయితే పారిశ్రామిక ఉత్పత్తి జనవరిలో భారీగా పెరిగినా, ఆర్థిక సంవత్సరం మొదటి నుంచీ ఇప్పటి వరకూ చూస్తే, నిరాశలోనే ఉంది. వృద్ధి రేటు 5 శాతం నుంచి 4.1 శాతానికి పడిపోయింది. ఇక వినియోగ ధరల ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ట స్థాయిలో 4.4 శాతంగా నమోదయ్యింది. మరింత విశ్లేషిస్తే...

పరిశ్రమలకు తయారీ ఊరట...

- మొత్తం ఐఐపీలో దాదాపు 78 శాతం వాటా ఉన్న తయారీ రంగం జనవరిలో మంచి పురోగతి చూపించడం మొత్తం గణాంకాలపై సానుకూల ప్రభావం చూపింది. ఈ విభాగంలో వృద్ధి 8.7%గా నమోదయ్యింది. 2017 జనవరిలో ఈ పెరుగుదల శాతం కేవలం 2.5 శాతమే. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి వరకూ చూస్తే, (2017 ఏప్రిల్ నుంచీ) ఈ విభాగంలో వృద్ధి 4.8% నుంచి 4.3%కి పడిపోయింది. జనవరిలో తయారీ రంగంలోని 23 పారిశ్రామిక గ్రూపుల్లో 16 సానుకూల వృద్ధిని నమోదచేసుకున్నాయి.
- **కేపిటల్ గూడ్స్:** పెట్టుబడులకు, భారీ యంత్ర పరికరాల ఉత్పత్తికి సూచిక అయిన ఈ విభాగంలో జనవరిలో వృద్ధిరేటు 0.6%(2017 జనవరిలో) భారీగా 14.6%కి ఎగసింది.
- **మైనింగ్:** ఈ రంగంలో మాత్రం జనవరిలో వృద్ధి భారీగా పడిపోయింది. ఈ రేటు 8.6 శాతం నుంచి 0.1 శాతానికి చేరింది. ఏప్రిల్ నుంచి జనవరి మధ్య కాలంలో కూడా ఈ రేటు 4.8 శాతం నుంచి 2.5 శాతానికి పడిపోయింది.
- **విద్యుత్:** విద్యుత్ రంగంలో వృద్ధి జనవరిలో 5.1 శాతం నుంచి 7.6 శాతనికి పెరిగినా, ఏప్రిల్ నుంచీ జనవరి మధ్య మాత్రం ఈ రేటు 6.3 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గింది.
- **వినియోగ వస్తువులు:** సబ్బులు, టూత్ పేస్ట్‌లు వంటి ఎఫ్ఎంజీసీ (ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ గూడ్స్) వస్తువులు ప్రధాన భాగంగా ఉండే కన్జూమర్ నాన్–డ్యూరబుల్ గూడ్స్ వృద్ధి రేటు 9.6 శాతం నుంచి 10.5 శాతానికి పెరిగింది. అయితే ఫ్రిజ్‌లు, ఎయిర్ కండీషన్లు వంటి డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తుల వృద్ధి భారీగా 8 శాతం పెరిగింది. 2017 ఇదే నెలలో ఈ ఉత్పత్తుల్లో అసలు వృద్ధి నమోదుకాకపోగా, మైనస్ 2శాతం క్షీణత నమోదయ్యింది.

పారిశ్రామికోత్పత్తి వృద్ధి తీరు...



రిటైల్ ధరల ఊరట...

రిటైల్ ధరల విషయానికి వస్తే, జనవరిలో 5.07 శాతం ఉన్న ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 4.44 శాతానికి తగ్గింది. నవంబర్‌లో ఇంత తక్కువగా (4.88) ఇంత తక్కువ స్థాయిలో రిటైల్ ద్రవ్యోల్బణం నమోదయ్యింది. ఇందులో మొత్తం ఐదు విభాగాలనూ వేర్వేరుగా చూస్తే...

- ఆహారం, పానీయాల ధరలు 3.38 శాతం పెరిగాయి.
- పాన్, పొగాకు, ఇతర హానికారక వినియోగ వస్తువుల ధరలు 7.34 శాతం ఎగశాయి.
- దుస్తులు, పాదరక్షల విషయంలో రిటైల్ ద్రవ్యోల్బణం పెరుగుదల 5 శాతం.
- హౌసింగ్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 8.28 శాతం.
- ఇంధనం–లైట్ విభాగంలో రేటు 6.80 శాతం.

కూరగాయలు భారమే...



ఆహారం, పానీయల విభాగాన్ని విశ్లేషిస్తే... జనవరిలో కూరగాయల ధరలు భారీగా 17.57 శాతం ఎగశాయి. అయితే డిసెంబర్‌లో ఈ రేటు ఇంకా భారీగా 26.97 శాతంగా ఉంది. గుడ్ల ధరలు 8.51 శాతం ఎగశాయి. పండ్ల ధరలు 4.80 శాతం పెరిగాయి. తక్కువగా ధరలు పెరిగిన వస్తువుల్లో తృణ ధాన్యాలు (2.10 శాతం), మాంసం, చేపలు (3.31 శాతం), పాలు, పాలపదార్థాలు (3.83 శాతం), ఆయిల్స్, ఫ్యాట్స్ (1.09 శాతం) ఉన్నాయి. ఆల్కాహాల్‌యేతర పానీయాల ధరలు 1.34 శాతం పెరిగితే, ప్రిపేర్డ్ మీల్స్ ధరలు (స్నాక్స్, స్వీట్స్ కాకుండా) 4.47 శాతం పెరిగాయి. ఇక పప్పు ధాన్యాల ధరలు అసలు పెరక్కపోగా, – 17.34 శాతం తగ్గాయి. ధరలు తగ్గిన ఉత్పత్తుల్లో చక్కెర (–0.26 శాతం), సుగంధ ద్రవ్యాలు (–1.01 శాతం) ఉన్నాయి.

మూడు నెలల్లో 1.36 లక్షల ఉద్యోగాలు



న్యూఢిల్లీ: తయారీ, ఐటీ, రవాణా సహా ఎనిమిది కీలక రంగాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై–సెప్టెంబర్ కాలంలో నికరంగా 1.36 లక్షల ఉద్యోగాలు అదనంగా ఏర్పడినట్టు కేంద్ర కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో నిర్వహించిన త్రైమాసిక వారి సర్వేలో వెల్లడైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఉద్యోగాలు నష్టపోయినది నిర్మాణ రంగం ఒక్కటే. ఈ రంగంలో 22,000 ఉద్యోగాలు తగ్గిపోయాయి. తయారీ రంగంలో 89,000, విద్యా రంగంలో 21,000, రవాణా రంగంలో 20,000, వర్తకంలో 14,000, ఆరోగ్య రంగంలో 11,000 ఉద్యోగాలు పెరిగాయని ఈ సర్వే పేర్కొంది.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	30,430
బంగారం (99.5, 10గ్రా)	30,280
వెండి (కిలో)	38,335
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	– –
బంగారం (22 క్యారెట్లు)	29,010
వెండి (కిలో)	– –
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	30,460
బంగారం (22 క్యారెట్లు)	29,010
వెండి (కిలో)	41,400
ప్రొద్దుటూరు (శుక్రవారం ధరలు)	
బంగారం (24 క్యారెట్లు)	31,320
బంగారం (22 క్యారెట్లు)	28,980
వెండి (కిలో)	39,500
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	31,133
బంగారం (22 క్యారెట్లు)	29,110
వెండి (కిలో)	41,700
విజయవాడ (శనివారం ధరలు)	
బంగారం (24 క్యారెట్లు)	31,500
బంగారం (22 క్యారెట్లు)	29,200
వెండి(కిలో)	39,800
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	31,370
బంగారం (22 క్యారెట్లు)	29,010
వెండి (కిలో)	39,400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.03 (రాత్రి 11.00కు)	$62.04 (శుక్రవారం ముగింపు)
బ్రెంట్	64.64 (రాత్రి 11.00కు)	$65.49 (శుక్రవారం ముగింపు)

వడ్డీ రేట్లు

	అంకెలు శాతాల్లో
బేస్‌రేట్ రేంజ్	8.65 – 9.45
డిపాజిట్ రేట్ రేంజ్	6.25 – 6.75
డాలర్ లిబార్(6 నెలలు)	2.26

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 13-3-2018

విశాఖ	332–00
చిత్తూరు	362–00
వరంగల్	332–00
ముంబై	370–00
విజయవాడ	322–00
గోదావరి	322–00
నమక్కల్	360–00

లక్ష జనాభా ఉంటే 'బీ న్యూ' స్టోర్

ఈ ఏడాది మరో 85 ఔట్‌లెట్లు

ల్యాప్‌టాప్స్ విక్రయాల్లోకి వస్తాం

'బీ న్యూ' ఫౌండర్ బాలాజీ చౌదరి



సాక్షి ఇంటర్వ్యూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మల్టీ బ్రాండ్ మొబైల్స్ విక్రయంలో ఉన్న 'బీ న్యూ' విస్తరణ బాట పట్టింది. ఇందులో భాగంగా వారానికి ఒక స్టోర్ తెరుస్తోంది. ప్రస్తుతం సంస్థకు 49 కేంద్రాలు ఉన్నాయి. ఈ వారం 50వ ఔట్‌లెట్‌ను విజయనగరంలో ప్రారంభిస్తోంది. కొద్ది రోజుల్లో కరీంనగర్, గుడివాడ, ప్రొద్దుటూరులో అడుగు పెడుతోంది. డిసెంబరులోగా తెలంగాణలో 60 స్టోర్లు రానున్నాయని 'బీ న్యూ' మొబైల్స్ వ్యవస్థాపకులు వై.డి.బాలాజీ చౌదరి తెలిపారు. ఇందులో సగం హైదరాబాద్‌లో ఉంటాయని చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో మరో 25 ఔట్‌లెట్లు ప్రారంభిస్తామని సాక్షి బిజినెస్ బ్యూరోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. డిసెంబరుకల్లా మొత్తం 135 కేంద్రాలను దాటుతామన్నారు. కంపెనీ విస్తరణ, భవిష్యత్ ప్రణాళిక ఆయన మాటల్లోనే..

విద్యార్థుల కోసం గ్యాడ్జెట్లు..

బీ న్యూ ఔట్‌లెట్లలో అన్ని ప్రముఖ కంపెనీల మొబైళ్లు, ట్యాబ్లెట్ పీసీలు, యాక్సెసరీస్ విక్రయిస్తున్నాం. త్వరలో ల్యాప్‌టాప్స్ అమ్మకాల్లోకి అడుగు పెట్టబోతున్నాం. అలాగే పాఠశాల విద్యార్థులకు అవసరమయ్యే ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌ను అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నాం. దేశంలో ఏ కొత్త ఉత్పాదన వచ్చినా ప్రజలకు అందిస్తున్నాం. పాఠశాలల్లో డిజిటల్ బోధనకు ఉపయోగపడే ఎల్‌ఈడీ ప్రొజెక్టర్లు అందుబాటు ధరలో పరిచయం చేయబోతున్నాం. వినూత్న గ్యాడ్జెట్ల సేకరణలో మా టీమ్ నిమగ్నమైంది. సర్వీస్‌కు తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం. రిపేర్ అదేరోజు గనక కాకపోతే కస్టమర్‌కు స్టాండ్ బై ఫోన్ ఇచ్చేలా బ్రాండ్లతో ఒప్పందం కుదుర్చుకున్నాం.

ప్రతి మొబైల్‌పై బహుమతి..

మా ఔట్‌లెట్లలో రూ.499తో మొదలై రూ.1 లక్ష విలువ చేసే మోడళ్లనూ అమ్ముతున్నాం. ప్రతి మొబైల్ కొనుగోలుపై ఒక బహుమతి ఖచ్చితంగా అందిస్తున్నాం. సీజన్‌నుబట్టి స్కూల్ బ్యాగ్ వంటి గిఫ్టులు ఇస్తున్నాం. ప్రస్తుతం రూ.1,599 విలువ చేసే మొబైల్‌పై టేబుల్ ఫ్యాన్ ఉచితంగా అందజేస్తున్నాం. వినియోగదార్ల సౌకర్యార్థం ప్రతి స్టోర్‌లో 100 మోడళ్ల వరకు డిస్‌ప్లే ఉంచుతున్నాం. ప్రస్తుతం నెలకు 50,000 యూనిట్ల ఫోన్లు అమ్ముతున్నాం. ఇందులో స్మార్ట్‌ఫోన్ల వాటా 75 శాతముంది. ఒక్కో స్టోర్ ప్రాంతాన్ని బట్టి 500 నుంచి 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది.

రెండు రెట్ల టర్నోవర్..

బాలాజీ వాచ్ కంపెనీ పేరుతో నెల్లూరులో 1990లో రిటైల్‌లో అడుగు పెట్టాం. రిటైల్‌లో 28 ఏళ్లకుపైగా అనుభవం ఉంది. భారత్‌లో మొబైల్స్ ప్రవేశించిన నాటి నుంచే ఈ రంగంలో ఉన్నాం. ప్రముఖ బ్రాండ్ల సూపర్ డిస్ట్రిబ్యూషన్ సైతం చేపట్టాం. 2014లో 'బీ న్యూ'కు శ్రీకారం చుట్టాం. తొలి కేంద్రం విజయవాడలో ప్రారంభించాం. 2017లో ఏకంగా 30 స్టోర్లు తెరిచాం. ఇప్పటి వరకు తెలంగాణలోని హన్మకొండ మినహా మిగిలిన ఔట్‌లెట్లన్నీ ఆంధ్రప్రదేశ్‌కే పరిమితమయ్యాయి. ఇప్పుడు తెలంగాణపై ఫోకస్ చేశాం. లక్ష జనాభా ఉన్నచోట స్టోర్‌ను అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.250 కోట్ల టర్నోవర్ ఆశిస్తున్నాం. విస్తరణతో 2018–19లో టర్నోవర్ రెండింతలకు చేరుకుంటుంది. 2019లో కర్ణాటకలో అడుగు పెట్టాలని నిర్ణయించాం. సంస్థ వద్ద 600 మంది ఉద్యోగులు ఉన్నారు.

మొబైల్స్ రిటైల్‌లోకి 'హ్యాపీ'

అనంతపూర్‌లో తొలి స్టోర్ ప్రారంభం

ఏడాదిలో 200 ఔట్‌లెట్లు తెరుస్తాం • హ్యాపీ మొబైల్స్ ఎండీ కృష్ణ పవన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్స్ విక్రయంలోకి సరికొత్త బ్రాండ్ 'హ్యాపీ' రంగ ప్రవేశం చేసింది. తొలి స్టోర్‌ను అనంతపూర్‌లో నటి సమంత అక్కినేని చేతుల మీదుగా సోమవారం ప్రారంభించింది. తొలి దశలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో స్టోర్లను విస్తరిస్తామని హ్యాపీ మొబైల్స్ ఎండీ కృష్ణ పవన్ ఈ సందర్భంగా తెలిపారు. 'కస్టమర్లు, ఉద్యోగులు, భాగస్వాములు, ఈ రంగంతో ముడిపడి ఉన్న అందరూ సంతోషంగా ఉండాలన్న ప్రధాన విలువతో హ్యాపీ బ్రాండ్ కొనసాగుతుంది. తొలి ఏడాదే 150–200 ఔట్‌లెట్లను తెరవాలన్నది మా ప్రణాళిక. మొదటి సంవత్సరం రూ.500 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా చేసుకున్నాం. 1,000 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. ప్రతి స్టోర్‌లో లైవ్ డెమో జోన్స్ ఏర్పాటు చేస్తాం. కస్టమర్‌కు వినూత్న అనుభూతి కల్పించేందుకు వర్చువల్ రియాలిటీ, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తాం. అంతర్జాతీయ బ్రాండ్లతో 200ల దాకా మోడళ్ల డిస్‌ప్లే ఉంటుంది. వినియోగదార్ల కోసం బెస్ట్ డీల్స్ ఆఫర్ చేస్తున్నాం' అని వివరించారు. టాప్ కంపెనీల యాక్సెసరీస్‌కు ప్రత్యేక ఏర్పాటు ఉంటుందని కంపెనీ ఈడీ కె.సంతోష్ తెలిపారు. రిపేర్ వస్తే స్టాండ్ బై ఫోన్‌ను కస్టమర్‌కు ఇస్తామని ఈ సందర్భంగా చెప్పారు.



హ్యాపీ లోగోను ఆవిష్కరిస్తున్న సమంత. చిత్రంలో కంపెనీ డైరెక్టర్లు కృష్ణ పవన్, సంతోష్

ఎన్‌ఎండీసీకి అవార్డుల పంట



హైదరాబాద్: మైనింగ్ దిగ్గజం ఎన్‌ఎండీసీకి కార్పొరేట్ కమ్యూనికేషన్ రంగంలో ఆరు అవార్డులు వరించాయి. పుణెలో జరిగిన 12వ పబ్లిక్ రిలేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) గ్లోబల్ కమ్యూనికేషన్ కాన్‌క్లేవ్‌లో ఎన్‌ఎండీసీ డైరెక్టర్ (పర్సనల్) సందీప్ తుల ఈ అవార్డులను అందుకున్నారు. కార్పొరేట్ అడ్వర్‌టైజ్‌మెంట్ అండ్ డెయిరీలో రెండు క్రిస్టల్ అవార్డులు, వార్షిక నివేదికలో డైమండ్ అవార్డు, సీఎస్‌ఆర్‌లో సిల్వర్ అవార్డు, కార్పొరేట్ అడ్వర్‌టైజింగ్ క్యాంపెయిన్ అండ్ డిజిటల్ న్యూస్‌లెటర్‌లో అప్రిసియేషన్ అవార్డులు వరించాయి.

జీఎంఆర్‌కూ అవార్డులు...

ఉత్తమ సామాజిక మాధ్యమాల క్యాంపెయిన్, కార్పొరేట్ ఈవెంట్, కార్పొరేట్ ఫిల్మ్, కార్పొరేట్ బ్రౌచర్, పీఆర్ కేస్ స్టడీ అండ్ సీఎస్‌ఆర్ ఫిల్మ్ విభాగాల్లో జీఎంఆర్‌కు క్రిస్టల్, గోల్డ్, కాంస్యంలో ఒక్కోటి, మూడు వెండి అవార్డులు దక్కాయి.

ఎంఎస్‌ఎంఈ పల్స్ ఆవిష్కరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థలు (ఎంఎస్‌ఎంఈ) రంగం దేశ ఆర్థికాభివృద్ధికి చోదకాలుగా నిలుస్తున్నాయని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎన్‌ఎస్ విశ్వనాథన్ తెలిపారు. ఈ రంగం మొత్తం జీడీపీలో 37 శాతం, ఎగుమతుల్లో 43 శాతం వాటాను కలిగి ఉందని పేర్కొన్నారు. సిడ్బీ, ట్రాన్స్‌యూనియన్ సిబిల్ సంయుక్తంగా రూపొందిన 'ఎంఎస్‌ఎంఈ పల్స్' త్రైమాసిక నివేదికను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో 51 మిలియన్ల ఎంఎస్‌ఎంఈ యూనిట్లున్నాయని.. 117 మిలియన్ల మందికి పలు రంగాల్లో ఉపాధిని అందిస్తున్నాయని పేర్కొన్నారు.

నాల్కో మధ్యంతర డివిడెండ్ రూ.908 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ నేషనల్ అల్యూమినియమ్ కంపెనీ లిమిటెడ్(నాల్కో) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.908.48 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నది. రూ. 5 ముఖవిలువ గల ఒక్కో షేర్‌కు రూ.4.70 (94 శాతం) మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నామని ఈ నవరత్న కంపెనీ తెలిపింది. కంపెనీ ఆరంభమైనప్పటి నుంచి చూస్తే, ఇదే అత్యధిక డివిడెండ్ అని వివరించింది. ప్రభుత్వానికి అధిక భాగం వాటా ఉన్నందున రూ.547 కోట్ల మధ్యంతర డివిడెండ్ చెల్లించామని తెలిపింది. ఈ మొత్తానికి సమానమైన చెక్‌ను ఇటీవలే జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర గనుల మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు తమ సీఎమ్‌డీ తపన్ కుమార్ చాంద్ అందించారని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో నికర లాభం ఐదు రెట్లు పెరిగినందుకు, కంపెనీ మంచి పనితీరు సాధిస్తున్నందుకు సీఎమ్‌డీ చాంద్‌ను, ఇతర ఉన్నతాధికారులను ఈ సందర్భంగా తోమర్ అభినందించారని ఎన్‌టీపీసీ పేర్కొంది.

ఎయిర్‌టెల్ రూ.16,500 కోట్ల సమీకరణ

ఆమోదం తెలిపిన డైరెక్టర్ల బోర్డ్ • 5 శాతం వరకూ లాభపడిన షేర్



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ రూ.16,500 కోట్లు సమీకరించనున్నది. ఈ నిధుల సమీకరణకు తమ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని ఎయిర్‌టెల్ వెల్లడించింది. రుణాల పునర్వ్యవస్థీకరణ, స్పెక్ట్ర బకాయిల చెల్లింపుల కోసం ఈ నిధులు వినియోగిస్తామని పేర్కొంది. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన నాన్–కన్వర్టబుల్ డిబెంచర్లు(ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.10,000 కోట్ల వరకూ సమీకరించడానికి బోర్డ్ ఆమోదం తెలిపిందని వివరించింది. అలాగే విదేశీ కరెన్సీ బాండ్ల జారీ ద్వారా వంద కోట్ల డాలర్ల వరకూ సమీకరించడానికి కూడా డైరెక్టర్ల బోర్డ్ అనుమతించిందని పేర్కొంది. ఎన్‌సీడీల ద్వారా రూ.10,000 కోట్ల నిధులను దశలవారీగా సమీకరిస్తామని తెలిపింది. ఇక ఈ రూ.16,500 కోట్ల నిధుల సమీకరణకు తుది ఆమోదం కోసం వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉందని వివరించింది. కాగా గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి ఎయిర్‌టెల్ నికర రుణ భారం రూ.91,714 కోట్లు. ఈ నిధుల సమీకరణ వార్తల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఈ షేర్ 4.6% లాభంతో రూ.421 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో బాగా లాభపడిన షేర్ ఇదే. ఇంట్రాడేలో 6% లాభంతో రూ. 425ను తాకింది.

ఇన్ఫోసిస్ ఏడీఎస్‌ల డీలిస్ట్!: ఇన్ఫోసిస్



న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ కంపెనీ తన ఏడీఎస్(అమెరికన్ డిపాజిటరీ షేర్స్)ను యూరోప్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి స్వచ్ఛందంగా డీలిస్ట్ చేయనున్నది. యూరోనెక్స్‌ట్ ప్యారిస్, యూరోనెక్స్‌ట్ లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి ఏడీఎస్‌లను స్వచ్ఛందంగా డీలిస్ట్ చేయనున్నామని ఇన్ఫోసిస్ తెలిపింది. ఈ రెండు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో తమ ఏడీఎస్‌లకు రోజువారీ సగటు ట్రేడింగ్ పరిమాణం చాలా తక్కువగా ఉందని, అందుకనే ఈ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి ఏడీఎస్‌లను స్వచ్ఛందగా డీలిస్ట్ చేయాలనుకుంటున్నామని పేర్కొంది. ఈ డీలిస్టింగ్‌కు యూరోనెక్స్‌ట్ ప్యారిస్ ఎస్‌ఏ, యూరోనెక్స్‌ట్ లండన్‌ల ఆమోదం పొందాల్సి ఉందని వివరించింది. ఈ రెండు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో 2013 ఫిబ్రవరి నుంచి ఏడీఎస్‌ల ట్రేడింగ్ జరుగుతోంది. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో మాత్రం కొనసాగిస్తామని వివరించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం.VII

రిఫ్ నెం.సి1/606/17 తేది : 12-3-2018

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్‌రూల్ (1) ననుసరించి)

రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయిగూడెం మండలం జిల్లా గణపవరం గ్రామంకు సంబంధించిన భూములు అవసరమైనవని స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2017-18నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య.10.37 సెంట్లులను ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం Additional Land Acquisition Area of Main Canal కొరకు అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : పశ్చిమగోదావరి　　మండలం : బుట్టాయిగూడెం　　గ్రామం : గణపవరం

క్రమ సం.	సర్వే నెం./ స.డి.నెం.	మొత్తం విస్తీర్ణం	సేకరించిన విస్తీర్ణం	వర్గీకరణ	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరాలు	
1	2	3	4	5	6	7				8	
1	148/2ఎ2	2.02	0.27	న.పుంజ	దారే ముత్యాలు తండ్రి జోగయ్య	148/2ఎ1	148/2బి	V.No. Jakkisetti gudem	150	టేకు, ఎర్రచందనం	--
			0.17		ఆకుల వెంకట చెల్లారావు తండ్రి పద్మరాజు					--	3 షెడ్‌లలో 8 బ్యారన్‌లు
2	149/1ఎ2	0.09	0.09	న.పుంజ	ఆకుల వెంకట చెల్లారావు తండ్రి పద్మరాజు	149/1ఎ1	149/2ఎ	149/1ఎ1	150	--	--
3	149/2బి	3.07	0.26	న.పుంజ	గూడుపు వెంకటేశ్వరరావు తండ్రి గంగన్న	149/1ఎ2, 1ఎ1	149/2బి	V.No. Jakki setti gudem	150	నిమ్మ-1 మొక్కజొన్న పుగాకు, టేకు-1 తాడి-40	--
4	150/1బి	0.46	0.07	న.పుంజ	దాకారపు నాగరాజు తండ్రి సూరయ్య	150/1ఎ	150/2	148	152	--	--
			0.15		విజ్జ త్రిమూర్తులు తండ్రి బుల్లివెంకన్న					పుగాకు	--
5	150/7ఎ	4.53	0.06	న.పుంజ	దాకారపు సత్యనారాయణ తండ్రి చంద్రరావు	150/2	150/7బి	149, 150/2	152	మిరప	--
			0.24		విజ్జ త్రిమూర్తులు తండ్రి బుల్లి వెంకన్న					పుగాకు	షెడ్
6	152/1బి	0.77	0.24	న.పుంజ	శింగులూరి సుబ్బలక్ష్మి భర్త రాంబాబు	152/1ఎ	152/2	150	155	పుగాకు, తాడి-4	పాక, బ్యారన్-2
7	152/7ఎ	3.73	0.22	న.పుంజ	దాకారపు సత్యనారాయణ తండ్రి రాంబాబు	152/1ఎ	152/2	150	155	--	--
8	153/ఎ2	5.60	0.14	గ్రామ కంఠం	దాకారపు లక్ష్మి భర్త చంద్రరావు	153/1ఎ1	153/1బి	152	154	పుగాకు	షెడ్
9	154/2ఎ	1.41	0.05	న.పుంజ	కోరం వెంకటేశ్వరరావు తండ్రి ముత్యాలు	154/1	154/2బి	153	155	మొక్కజొన్న	--
10	155/1ఎ	4.76	0.30	న.పుంజ	ముయిబోయిన వసంతరావు తండ్రి వెంకన్న	155/1ఎ	155/2	152	140	పుగాకు	--
11	155/3ఎ	4.91	0.11	న.పుంజ	ముయిబోయిన వసంతరావు తండ్రి వెంకన్న	155/2	155/3బి	154	156	మిరప	--
			0.16		కురసా జంపాలు తండ్రి కన్నయ్య					మొక్కజొన్న	--
12	156/2ఎ	5.16	0.08	న.పుంజ	బండారు రమణ తండ్రి సోమరాజు	156/1	156/2బి	156	159	టమోట, జాడు	--
			0.20		రామిశెట్టి వెంకటలక్ష్మి భర్త నాగ సత్యనారాయణ					పుగాకు	--
			0.10		బండారు నాగరాజు					కాకర పందిరి	--
13	138/1ఎ2	4.08	0.22	న.పుంజ	బందెల వసంతరావు తండ్రి వెంకటేశ్వరరావు	138/1ఎ1	138/1బి	138/2ఎ	137	మిరప	--
			0.16		బందెల సంజీవరావు తండ్రి వీరన్న					పుగాకు	--
14	138/2ఎ2	1.66	0.02	న.పుంజ	జలసూత్ర నరసింహారావు	138/1ఎ1	138/1బి	138/2ఎ	137	--	పాక
15	159/2బి	1.64	0.01	న.పుంజ	ఈడుపుగింజ వెంకన్న తండ్రి రామయ్య	160	159/2ఎ	156	159/2ఎ	--	--
16	131/1ఎ2	1.78	0.26	న.పుంజ	బందెల సంజీవరావు	131/1ఎ1	131/1బి	138	130	పుగాకు	--
17	131/2బి1	0.63	0.26	న.పుంజ	గూడుపు వెంకటేశ్వరరావు తండ్రి గంగన్న	131/1బి	131/2బి2, 160	131/1బి	131/2బి2 129	--	ఇటుకలు తీసు కలం, కుండీ
18	130/1బి	2.63	0.34	న.పుంజ	చెన్ను సత్యనారాయణ	130/1ఎ	130/2	131	126	--	--
19	126/1బి	4.03	0.32	న.పుంజ	ఇబ్బా జయ్యన్న తండ్రి వెంకన్న	126/1ఎ	126/2	130	127	కొంత మొక్కజొన్న, కొంత భూమి	ఖాళీ
20	128/1ఎ	0.01	0.01	న.నంజ	నందిన వెంకటరావు తండ్రి సీతారామయ్య	126	128/1బి	126	126	--	--
21	128/1బి1	4.03	0.33	న.నంజ	నందిన మోహనరావు తండ్రి సుబ్బారావు	128/1బి	128/1బి2	128/2ఎ	110	పుగాకు	--
22	128/2ఎ	2.14	0.02	న.పుంజ	తాండ్ర నాగమణి భర్త రామకృష్ణ	126	128/2బి	126	128/1బి1	పుగాకు	--
23	110/2ఎ	7.67	0.29	న.నంజ	పునులూరి యశ్వంతకుమార్ తండ్రి రాంబాబు					జామాయిల్	--
			0.08		కాలువ					--	--
24	109/1బి1	2.00	0.13	న.నంజ	గెడా సూర్యారావు తండ్రి వెంకటేశ్వరరావు	109/1ఎ	109/1బి2,110	109/1ఎ	102	--	--
			0.04		శివుడు వెంకటస్వామి తండ్రి భీముడు					జాడు	--
25	109/2బి	0.06	0.06		దమ్మెటి వీరాస్వామి తండ్రి ఆటాలు						
26	120/2ఎ2	5.90	0.08	న.పుంజ	ఇబ్బా సత్యనారాయణ తండ్రి వెంకన్న	120/2ఎ1	120/2బి, 111	126	120/2ఎ1	పుగాకు తాడి-2	--
			0.19		మెండెం నాగేశ్వరరావు తండ్రి నరసింహులు					పుగాకు, వేప-1 మామిడి-1 జామాయిల్	--
27	112/1బి	0.31	0.01	న.పుంజ	శివుడు వెంకటస్వామి తండ్రి భీముడు	112/1ఎ	112/2బి 2ఎ2	112/2ఎ1	101	--	--
28	112/2ఎ2	3.73	0.14	న.నంజ	శివుడు వెంకటస్వామి తండ్రి భీముడు	112/2ఎ1	112/2బి	119	112/1బి	పుగాకు తాడి-2 వేపచిన్నది-1	--
			0.16		గద్దే సోమరాజు తండ్రి సత్యనారాయణ					పుగాకు	--
29	102/1సి1	1.65	0.20	న.పుంజ	గద్దే పిసుబాబు తండ్రి తాతారావు	102/1ఎ	102/1సి2	102/2	98	పుగాకు, తాడి-3	బోరు-1, పైపులైను
30	102/2బి1	0.45	0.08		శివుడు వెంకటస్వామి తండ్రి భీముడు						
31	101/3బి2	1.66	0.09	న.పుంజ	ఆచంట శ్రీనివాసరావు తండ్రి దుర్గిరాజు	101/3బి1	101/4సి2	101/4సి2	101/4ఎ2	పుగాకు	--
32	101/4ఎ2	0.18	0.04	న.పుంజ	గద్దే పద్మజ భర్త దుర్గారావు	101/4ఎ1	101/3ఎ	101/3బి2	87	పుగాకు	--
33	101/4సి2	0.68	0.28	న.పుంజ	గద్దే పద్మజ భర్త దుర్గారావు	101/4సి1	101/3ఎ	101/5ఎ	101/3బి2	పుగాకు	--
35	98/2ఎ2ఎ	2.82	0.38	న.పుంజ	అల్లూరి వెంకటలక్ష్మి భర్త రంగారావు	98/1ఎ	98/2ఎ 2బి	98/2బి 2ఎ	91	జామాయిల్	--
36	98/2సి2ఎ	0.09	0.01	న.పుంజ	పునులూరి సుధాకర్ తండ్రి బుల్లిబ్బాయి	98/1ఎ	98/2సి 2బి	102	98/2ఎ 2ఎ	కొంత జామాయిల్ కొంత ఖాళీభూమి	--
37	98/2డి 2ఎ	0.50	0.05	న.పుంజ	పునులూరి సుధాకర్ తండ్రి బుల్లిబ్బాయి	98/1ఎ	98/2డి 2బి	98/2సి 2ఎ	98/2ఇ2	--	--
38	98/2ఇ2	4.00	0.01	న.పుంజ	పునులూరి ప్రభావతి భర్త సత్యనారాయణ	98/2ఎ 2బి	98/2ఇ1	98/2డి2ఎ	98/2ఇ1	--	--
39	87/1ఎ2	8.24	0.11	న.పుంజ	యాదాల సత్యనారాయణ తండ్రి నాగన్న	87/1ఎ1	87/1బి	101	87/2ఎ1	--	--
			0.02		జత్తుల దుర్గమ్మ భర్త వెంకటేశ్వరరావు						
40	87/2ఎ2	1.15	0.23	న.పుంజ	కజీటి కృష్ణ తండ్రి చిన రాముడు	87/2ఎ1	87/1బి	87/1ఎ1	86	--	--
41	86/1ఎ2	6.11	0.18	న.పుంజ	కజీటి దుర్గారావు తండ్రి ఊసయ్య	86/1ఎ1	86/1బి	87	85	--	--
42	91/1బి1	8.06	0.51	న.పుంజ	తోలెం పుష్పావతి భర్త పరశురాముడు	91/1ఎ	91/1బి2	98	90	జమాయిల్	పైపులైను
43	85/2బి1బి	2.80	0.14	న.పుంజ	కజీటి దుర్గారావు తండ్రి ఊసయ్య	85/2బి1ఎ	85/3బి	86	85/3ఎ1	--	--
44	85/3ఎ2	3.32	0.19	న.పుంజ	కజీటి కృష్ణ	85/3ఎ1	85/3బి	85/2బి1బి	84	--	--
			0.11		మడకం దుర్గారావు తండ్రి పెంటయ్య						
			0.08		మడకం బోడియ్య						
45	84/3ఎ1	0.95	0.12	న.పుంజ	మడకం సన్యాసి తండ్రి కన్నయ్య	84/3ఎ1	84/3బి	85	82	--	--
46	89/1ఎ2	0.40	0.13	న.పుంజ	తాండ్ర వీరాకృష్ణ తండ్రి వెంకటరావు తాండ్ర వెంకటేశ్వరరావు తండ్రి వెంకటరావు	89/1ఎ1	89/1బి	84	82	జామాయిల్	--
47	89/2సి	0.27	0.11	న.పుంజ	తాండ్ర వెంకటేశ్వరరావు తండ్రి వెంకటరావు	89/1బి	89/3ఎ2	90	82	జామాయిల్	--
48	89/3ఎ2ఎ	1.85	0.19	న.పుంజ	గద్దే అచ్యుతరావు	89/1బి	89/3ఎ2	90	82	--	--
49	82/1ఎ1	1.91	0.06	న.పుంజ	పిచ్చుకల ధర్మరాజు తండ్రి సత్యనారాయణ	82/1ఎ1	82/1బి	86	83	--	--
50	82/2బి1	0.29	0.04	న.పుంజ	గద్దే అచ్యుతరావు	82/1బి2	82/2బి2	86	83	--	--
51	81/1బి1	2.36	0.02	న.పుంజ	పూనెం దుర్గారావు తండ్రి వీరభద్రుడు	81/1ఎ	81/1బి2	81/1బి2	66	--	--
52	63/2ఎ1	1.36	0.16	న.పుంజ	అల్లూరి దుర్గారావు తండ్రి రామారావు	63/2ఎ1	63/2బి	63/2బి	ఆర్.ఎఫ్	--	--
53	63/3ఎ1	4.51	0.08	న.పుంజ	పునులూరి బ్రహ్మానందం తండ్రి సత్యనారాయణ	63/2ఎ1	63/2బి	63/2బి	ఆర్.ఎఫ్	పుగాకు	--
54	63/4ఎ1	3.58	0.02	న.పుంజ	పునులూరి అచ్యుతరావు	63/2ఎ1	63/2బి	63/2బి	ఆర్.ఎఫ్	పుగాకు	--
55	64/1బి1	10.10	0.16	న.పుంజ	యాండ్ర కుబ్జాచార్యులు తండ్రి వీరాస్వామి	64/1ఎ	64/1బి2	64/2బి1	ఆర్.ఎఫ్	జామాయిల్ తోట నరికి వేసినారు	--
			0.12		యాండ్ర వీర వెంకట సత్యనారాయణ తండ్రి రామారావు					టేకు-5	
56	64/3బి1	0.57	0.06	న.పుంజ	యాండ్ర కుబ్జాచార్యులు తండ్రి వీరాస్వామి	64/1ఎ	64/3బి2	64/3బి2	64/1బి1	జామాయిల్ తోటనరికి వేసినారు	
మొత్తం			10.02								

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి కార్యాలయము నందు ఉంచబడినది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలో నైనా తనిఖీ చేసుకోవచ్చు. చట్టములోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్టు ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబములు ఎవ్వరు లేరు.

బొగ్గు గనులు, ఖనిజరాయి పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భూములో గాని వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూ భాగములను మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గాని చేయవలెను.

సం/- **సిహెచ్.భానుప్రసాద్**, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం.

హోదా ఇచ్చే పార్టీకే మా మద్దతు

ఎన్డీటీవీ ఇంటర్వ్యూలో వైఎస్ జగన్

- హోదా ఇస్తామంటే ఏ పార్టీ అయితేంటి?
- రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం
- చంద్రబాబు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు
- ఆయనంత అవినీతి పరుడు దేశంలోనే లేడు
- ఇసుక, మట్టి, మద్యం అన్నింటా లంచాలే
- సాక్ష్యాలతో సహా దొరికిపోయినా పదవి వీడరు..
- నాపై కేసులు కాంగ్రెస్, టీడీపీ కక్షసాధింపు పుణ్యమే
- పొత్తులపై ఎవరూ మమ్మల్ని సంప్రదించలేదు
- ప్రజల దీవెనలతో 2019లో అఖండ విజయం సాధిస్తాం



ఎన్డీటీవీ ప్రతినిధితో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి

''మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. ప్రత్యేక హోదా ఇచ్చే ఏ పార్టీకైనా మద్దతిస్తాం. ఈ విషయంలో మేం మొదటి నుంచీ స్పష్టంగా, పారదర్శకంగా ఉన్నాం.'' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఫైలుపై సంతకం పెట్టే ఏ పార్టీతోనైనా కలిసి పనిచేయడానికి మేం సిద్ధమే.' అన్నారు. దేవుడి దయ, ప్రజల దీవెనలతో 2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ ఆధిక్యతతో రాష్ట్రంలో అధికారం చేపడుతుందని జగన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అవినీతి పాలన నడుస్తోందని, సాక్షాత్తూ ముఖ్యమంత్రే నల్లధనంతో దొరికినా ఇంకా కొనసాగుతున్నారని జగన్ ధ్వజమెత్తారు. తనపై పెట్టిన కేసులన్నీ రాజకీయ కక్షపూరితమైనవేనని తెలిపారు. దీని వెనుక కాంగ్రెస్, టీడీపీలే ఉన్నాయని వెల్లడించారు. ప్రజా సంకల్పయాత్రలో ఉన్న జగన్ ఎన్డీటీవీకి ఇంటర్వ్యూ ఇచ్చారు. రాష్ట్ర, కేంద్ర రాజకీయాలపై ఆయన స్పష్టమైన వైఖరిని వెల్లడించారు. జగన్ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే....

పొత్తులపై ఎవరితో సంప్రదించలేదు

అరుణ్‌జైట్లీ మాట్లాడిన మాటలకు బాధపడి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు వచ్చామంటున్నారు. జైట్లీ కొత్తగా ఏమీ అనలేదు. 2016 సెప్టెంబర్ 8న ఏం చెప్పారో ఇపుడూ అదే చెప్పారు. ప్రత్యేక హోదా లేదని, సాయం కింద నిధులిస్తామని అన్నారు.. ఆ రోజు అర్ధరాత్రి జైట్లీ ప్రకటనను చంద్రబాబు వెంటనే స్వాగతించారు. అసెంబ్లీలో ధన్యవాదాలు చెప్పారు. తర్వాత ఢిల్లీ వెళ్లి ఆయనకు సన్మానం చేసి వచ్చారు. ప్రజల్లో వ్యతిరేకత చూసి ఇపుడు చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారు. మేం బీజేపీతో సన్నిహితంగా ఉన్నామనేది నిజమైతే కేంద్రంపై అవిశ్వాసం ఎందుకు పెడతాం? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 6న మా ఎంపీలు ఎందుకు రాజీనామా చేస్తారు? పొత్తుల గురించి బీజేపీ, కాంగ్రెస్ ఏ పార్టీ నుంచి మాకు ఇంత వరకూ ఎలాంటి సమాచారం రాలేదు. మమతా బెనర్జీ, కేసీఆర్ సహా ఎవరూ నాతో మాట్లాడలేదు. ఎందుకంటే అసలిప్పుడు ఎలాంటి ఎన్నికలు లేవు కదా. అలాంటప్పుడు పొత్తులపై చర్చించాల్సిన అవసరం మాత్రం ఏముంటుంది? పైగా మేం ప్రత్యేక హోదా విషయంలో బీజేపీ, కాంగ్రెస్ సహా ఏ పార్టీతోనూ రాజీ పడటం లేదు. ఈ నెల 21వ తేదీన కేంద్ర ప్రభుత్వంపై పెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని టీడీపీని కూడా కోరుతున్నాం. ప్రత్యేక హోదా విషయంలో మేం మొదటి నుంచీ స్పష్టంగా, పారదర్శకంగానే ఉన్నాం. ప్రత్యేక హోదా, రాష్ట్రానికి విభజన సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ఏ పార్టీ సంతకం పెట్టినా మద్దతిస్తాం. బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీలు ఏవైనా సరే... రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం.

హద్దులు దాటిన చంద్రబాబు అవినీతి

చంద్రబాబు అంత అవినీతి ముఖ్యమంత్రి దేశంలో మరెవ్వరూ లేరు. ఆయన అవినీతి చేస్తూ మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీతో కలిసేందుకు మేం సిద్ధమైనట్టు ప్రచారం చేస్తున్నారు. అసలు అవినీతి చేస్తున్నదెవరు? చంద్రబాబే అన్నింటా అవినీతికి పాల్పడుతున్నారు. ఇసుక, మట్టి, మద్యం, విద్యుత్, బొగ్గు కొనుగోళ్లు దేన్నీ విడిచిపెట్టడంలేదు. కాంట్రాక్టులు ఇష్టానుసారం నామినేషన్ పద్ధతిలో ఇస్తూ ముడుపులు తీసుకుంటున్నాడు. ఏపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని కాగ్ రిపోర్టులు కూడా చెప్పాయి. అవినీతిపై అనేక వాస్తవాలు బయటకొచ్చాయి. నల్లధనం పంచుతూ ఆడియో, వీడియో టేపులతో దొరికిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు. ఏదైనా ప్రభుత్వ అధికారి ఇలా లంచం తీసుకుంటూ దొరికితే ఏం చేస్తారు? వెంటనే ఉద్యోగంలోంచి తీసేసి, జైలుకు పంపుతారు. కేవలం ఈ ముఖ్యమంత్రికి మాత్రమే ఇది వర్తించదు. ఆయనపై ఎలాంటి చర్య తీసుకోరు. ఆయన ఆ పదవి నుంచి వైదొలగడు. ఎందుకంటే ఆయనకు కేంద్రంతో లింకులున్నాయి. ఇంత పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి అవినీతి ముఖ్యమంత్రి నల్లధనంతో దొరికినా ఇంకా కొనసాగడం ఆశ్చర్యంగా ఉంది.

నాపై కేసులు పెట్టిందెవరు?

నాపై పెట్టిన కేసులన్నీ రాజకీయ కక్షపూరితమైనవే. మా నాన్నగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేనసలు ఎమ్మెల్యేను కాదు. ఎంపీనూ కాదు. హైదరాబాద్‌లో కూడా లేను. నా పిల్లలను చదివించుకుంటూ బెంగుళూరులో ఉన్నాను. అప్పుడు నేను రాజకీయాల్లో కూడా లేను. ఏనాడూ ఏ ఐఏఎస్ అధికారితో కానీ, మంత్రితో కానీ మాట్లాడలేదు. నాన్నగారు సీఎంగా ఉన్నప్పుడు ఏనాడూ కనీసం సచివాలయంలో కూడా అడుగు పెట్టలేదు. ఆయన బతికున్నంత కాలం జగన్ మంచోడే. ఏ కేసులూ లేవు. ఆయన మరణించిన తర్వాతే... నేను కాంగ్రెస్‌ను విడిచి వెళ్లాలని నిర్ణయించిన తర్వాతే నాపై కేసులు నమోదయ్యాయి. కేసులు పెట్టిందెవరు? కాంగ్రెస్, టీడీపీ వాళ్ళు. ఎర్రం నాయుడు, అశోక్ గజపతి రాజు ఎవరు? టీడీపీ వాళ్ళు కాదా? పిటీషన్ వేసిన శంకర్ రావు కాంగ్రెస్ కాదా? కేసు వేసిన తర్వాత ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదా? కాంగ్రెస్, టీడీపీ అనైతికంగా కలిసి నాపై రాజకీయ దురుద్దేశంతో కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైనప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్‌తో చంద్రబాబు కుమ్మక్కయి కలిసి పనిచేశారు. కిరణ్ సర్కార్‌ను దించాలని మేం అవిశ్వాసం పెడితే చంద్రబాబు విప్ జారీ చేసి మరీ ఆ ప్రభుత్వాన్ని కాపాడాడు. దీన్ని బట్టి ఆ రెండు పార్టీలు అనైతికంగా కలిసి పనిచేశాయని అర్థం కావడం లేదూ. వాళ్ళే నాపై కేసులు పెట్టారు. నేనప్పుడు రాష్ట్రంలో ఎవరి మద్దతూ లేకుండా ఉన్న ప్రతిపక్ష నేతను. అధికారంలో ఉన్న వారు కేసులతో నన్ను వెంటాడారు. ఈ కేసులన్నీ కొత్తవి కాదు. పదేళ్ళ క్రిందటివి. విచారణ కొనసాగుతోంది.

ఒక్కడిగానే వచ్చా...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. నేను, మా అమ్మ... ఇద్దరితోనే మొదలైంది. ఆ తర్వాత వచ్చిన ఉప ఎన్నికల్లో నేను ఎంపీగా, అమ్మ ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచాం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, టీడీపీ ఆ పార్టీకి మద్దతిస్తున్నా ప్రజల మద్దతు, దేవుని దయతో నాకు రికార్డు స్థాయిలో 5.45 లక్షల ఓట్లు వచ్చాయి. అలా మొదలైన పార్టీ 67 మంది ఎమ్మెల్యేలను, 9 ఎంపీలను గెలుచుకుంది. 2014 ఎన్నికల్లో 44.5 శాతం ఓట్లు సాధించింది. అదీ కూడా టీడీపీ, బీజేపీ ఇతర పార్టీలన్నీ ఏకమై ఎన్నికలకు వెళ్ళినా కూడా. ఒంటరిగానే మేం ఎన్నికలను ఎదుర్కొన్నాం. కేవలం ఒక్కశాతం ఓట్ల తేడాతోనే మేం అధికారానికి దూరమయ్యాం. వచ్చే ఎన్నికల కోసం ప్రశాంత్ కిషోర్‌ను వ్యూహకర్తగా తెచ్చుకున్నామనే కామెంట్స్‌పై ఏం మాట్లాడాలి? రాజకీయ పార్టీలు కన్సల్టెన్సీలు పెట్టుకోవడం తప్పేమీ కాదే. అది ఆ పార్టీల వ్యక్తిగత అంశం. ఏవైనా లోపాలు ఉంటే అధిగమించి ముందుకెళ్ళడమే దీని ఉద్దేశం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురించి ఏం చెబుతాం.. ఆయన మా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదు. అది మాత్రమే చెప్పగలను. ఆయన కొన్ని మంచి పనులు చేసి ఉండవచ్చు. కొన్ని చేయకపోవచ్చు. నాకు సంబంధించిన నంత వరకు మా రాష్ట్ర ప్రయోజనాలే నాకు ముఖ్యం. మోదీ, రాహుల్‌గాంధీ ఇద్దరిలో ఎవరికి ర్యాకింగ్ ఇస్తారనేది నేనెలా చెప్పను. రాహుల్ గాంధీ ఈ మధ్యే పార్టీ అధ్యక్షుడయ్యారు. వాళ్ళల్లో ఎవరు బెటర్ అని చెప్పేందుకు నేనేమీ న్యాయ నిర్ణేతను కాదు. జ్యోతిష్యుడిని కాదు. ఆంధ్రప్రదేశ్‌లో దేవుడి దయ, ప్రజల దీవెనలతో 2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ ఆధిక్యతతో రాష్ట్రంలో అధికారం చేపడుతుందని భావిస్తున్నా.'' అని జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'మీరు కూడా మీ నాన్నగారైన వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్నారు. సుదీర్ఘ పాదయాత్ర చేస్తున్నారు. మీ ఆకాంక్షలు నెరవేరతాయని ఆశిస్తున్నాం' అని ఎన్డీటీవీ ప్రతినిధి ఇంటర్వ్యూ ముగించారు.

ప్రజా సంక్షేమమే పార్టీ లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ శాసన సభాపక్షం ఉపనేత పెద్దిరెడ్డి
- పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం
- చంద్రబాబు కుట్రలను తిప్పి కొట్టాలి: భూమన
- తెలుగోడి సత్తా చూపిన నేత జగన్: ఆర్కే రోజా
- ప్రజలంతా వైఎస్ జగన్ వెంటే: కొండా రాఘవరెడ్డి



పార్టీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, చిత్రంలో భూమన, గంగుల ప్రతాప్‌రెడ్డి, ఆర్కే రోజా, లక్ష్మీపార్వతి, రాఘవరెడ్డి, వాసిరెడ్డి పద్మ, ధర్మశ్రీ, ప్రఫుల్లారెడ్డి, చల్లా మధుసూదన్‌రెడ్డి, పద్మజారెడ్డి, సాయినాథ్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, పార్టీ గెలుపు ఖాయం అని పార్టీ శాసనసభాపక్షం ఉపనేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధీమాగా చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 8వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించి మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆశయసాధనకు అందరం కంకణ బద్ధులై కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల మధ్యన ఉంటూ, వారి తరపున ఉద్యమాలు చేస్తూ పేదలకు అండగా నిలిచారన్నారు. ప్రత్యేక హోదా కోసం ఆది నుంచి పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్ ఒక్కరే అని అన్నారు. వైఎస్ జగన్ సీఎం అయితే రాజన్న రాజ్యం వస్తుందని చెప్పారు. వైఎస్సార్ ఆశయాల సాధనకు వైఎస్సార్ సీపీని స్థాపించటం జరిగిందని, అటువంటి పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు.

దమ్మున్న నేత వైఎస్ జగన్: ఎమ్మెల్యే రోజా

తెలుగువాడి సత్తా ఏంటో గల్లీ నుంచి ఢిల్లీ వరకు చూపించిన దమ్మున్న నాయకుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ అని పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. వైఎస్సార్‌సీపీని పురిట్లోనే చంపేయాలని ఢిల్లీ పెద్దలు, ఆంధ్రప్రదేశ్ గుంటనక్కలు ప్రయత్నించాయని, అయినా వైఎస్ జగన్ పార్టీని ఒక శక్తిలా ముందుకు నడిపించారన్నారు. రాజకీయ లబ్ధికోసం జగన్ ఆలోచించలేదని, ప్రజల కోసం నిర్విరామంగా పోరాటాలు చేస్తూనే ఉన్నారన్నారు. హోదాకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ మాత్రమేనన్నారు.

ప్రజల జీవితాల్లో వెలుగు కోసమే పార్టీ: భూమన

పార్టీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్ జగన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారని చెప్పారు. చంద్రబాబు పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. చంద్రబాబు కుట్రలను తిప్పి కొట్టాలని భూమన పిలుపు నిచ్చారు. దేశ, విదేశాల్లోని పార్టీ అభిమానులకు, నాయకులు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.


ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం: వైఎస్సార్‌సీపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన కోసమే జగన్ పార్టీని స్థాపించారని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. అనంతరం కేకును కట్ చేసి, కొవ్వొత్తులు వెలిగించారు. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మహిళా నేతలు లక్ష్మీపార్వతి, వాసిరెడ్డి పద్మ, పద్మజ, అమృతసాగర్, నేతలు ఆదిశేషగిరిరావు, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, చల్లా మధుసూదన్‌రెడ్డి, బన్సూరీ మోహన్‌కుమార్, బొడ్డు సాయినాథ్‌రెడ్డి, మేడపాటి వెంకట్, డాక్టర్ ప్రఫుల్లారెడ్డి, కె.శివకుమార్, టి.రాజశేఖర్, నాగదేశి రవికుమార్, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, బుర్రా సురేష్ గౌడ్, బసిరెడ్డి బ్రహ్మానందరెడ్డి, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పాలన అందించడమే జగన్ లక్ష్యం

వైఎస్సార్ అందించిన సుపరిపాలనను కొనసాగించాలన్న ఏకైక లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించారని వైఎస్సార్ సీపీ ఎంపీలు పేర్కొన్నారు. ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ లోక్‌సభాపక్ష నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎంపీలు విజయసాయిరెడ్డి, వరప్రసాదరరావు, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఇతర నేతలు వైఎస్‌కు నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఎంపీలు మాట్లాడుతూ.. రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీని తప్పకుండా ఆదరించి పార్టీని అధికారంలోకి తీసుకొస్తారని చెప్పారు.

జెండాను ఆవిష్కరించిన జగన్

బాపట్ల శివారులోని ఈపూరుపాలెం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్



సాక్షి అమరావతి బ్యూరో: గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం ప్రకాశం జిల్లా ఈపూరుపాలెంలో పార్టీజెండాను ఆవిష్కరించి భారీ జనసందోహం మధ్య కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ, వైఎస్ జగన్ రాజకీయ కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ బాపట్ల పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణ, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోన రఘుపతి, గుంటూరు నగర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు పార్లమెంటరీ సమన్వయకర్త లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ నాగార్జున పాల్గొన్నారు.

లంకను పడేశారు

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం 13-3-2018



1
అంతర్జాతీయ టి20లో హిట్ వికెట్‌గా ఔటైన తొలి భారత బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్

మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ శార్దుల్ ఠాకూర్

అటు, ఇటు భారీ స్కోర్లు లేవు...
ఫోర్లు, సిక్సర్ల హోరు కనిపించలేదు...
అంతా సావధానంగా సాగిపోయింది...
విజయం భారత్‌కే దక్కింది...

బౌలింగ్‌లో శార్దూల్ మెరుపులు

- రాణించిన పాండే, కార్తీక్
- శ్రీలంకపై ఆరు వికెట్లతో భారత్ గెలుపు

కొలంబో: నిదహాస్ ముక్కోణపు టి20 టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో ఎదురైన పరాజయానికి భారత్ బదులు తీర్చుకుంది. పద్ధతైన బౌలింగ్‌తో ముందుగా ప్రత్యర్థిని కట్టడి చేసి... తర్వాత పెద్దగా ఇబ్బంది పడకుండానే ఛేదనను పూర్తి చేసింది. సోమవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 19 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. ఓపెనర్ కుశాల్ మెండిస్ (38 బంతుల్లో 55; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడి మంచి ప్రారంభాన్నిచ్చాడు. మధ్యలో తరంగ (24 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్), చివర్లో షనక (19) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' శార్దుల్ ఠాకూర్ (4/27) చెలరేగగా, వాషింగ్టన్ సుందర్ (2/21) మరోసారి పొదుపైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అనంతరం భారత్ 17.3 ఓవర్లలో 4 వికెట్లకు 153 పరుగులు చేసింది. మనీశ్ పాండే (31 బంతుల్లో 42; 3 ఫోర్లు, 1 సిక్స్), దినేశ్ కార్తీక్ (25 బంతుల్లో 39; 5 ఫోర్లు)ల సంయమనానికి సురేశ్ రైనా (15 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) తోడవడంతో భారత్ మరో 9 బంతులు ఉండగానే లక్ష్య ఛేదన పూర్తి చేసింది. జల్లుల వర్షం కారణంగా మ్యాచ్ గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో రెండు జట్ల ఇన్నింగ్స్‌లో ఒక్కో ఓవర్ తగ్గించారు. భారత్ రిషభ్ పంత్‌ను పక్కనబెట్టి కేఎల్ రాహుల్‌ను ఆడించగా, లంక చండిమాల్ స్థానంలో లక్మల్‌కు చోటిచ్చింది. ఈ టోర్నీలో ఇప్పటికి మూడు మ్యాచ్‌లాడిన భారత్ రెండు విజయాలు సాధించింది. లంక మూడింటిలో రెండు ఓడింది. మన జట్టు బుధవారం బంగ్లాదేశ్‌తో తలపడుతుంది.

కుశాల్ మెండిస్ ఒక్కడే...

ఓపెనర్ గుణతిలక (17), గత రెండు మ్యాచ్‌ల్లో చెలరేగిన కుశాల్ పెరీరా (3) విఫలమైనా మరో ఓపెనర్ కుశాల్ మెండిస్ శ్రీలంక ఇన్నింగ్స్‌కు ఇరుసుగా నిలిచాడు. మిగతా బ్యాట్స్‌మెన్ ఒకటీ, రెండు మెరుపులతో నిష్క్రమిస్తున్నా భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ చక్కటి షాట్లు కొట్టాడు. ఆడిన తొలి బంతినే సిక్స్ కొట్టాడు. అద్భుత ఫామ్‌లో ఉన్న అతడు ఈ టోర్నీలో రెండో అర్ధ శతకం (31 బంతుల్లో) సాధించాడు. గత అయిదు ఇన్నింగ్స్‌ల్లో మెండిస్‌కిది నాలుగో హాఫ్ సెంచరీ కావడం విశేషం. ఇతడితో పాటు తరంగ క్రీజులో ఉండగా 10.4 ఓవర్లలో 96/2తో నిలిచిన లంక భారీ స్కోరు చేస్తుందనిపించింది. కానీ తరంగను బౌల్డ్ చేసి 62 పరుగుల వీరి భాగస్వామ్యాన్ని విజయ్ శంకర్ విడదీశాడు. అయితే... తర్వాతి రెండు బంతులను సిక్సర్లుగా మలిచి దూకుడు చూపిన కెప్టెన్ తిసార పెరీరా (15)తో పాటు జీవన్ మెండిస్ (1), కుశాల్ మెండిస్‌లను 24 పరుగుల వ్యవధిలో అవుట్ చేసి టీమిండియా ప్రత్యర్థిని కట్టడి చేసింది. లోయరార్డర్‌లో షనక (16 బంతుల్లో 19; 1 ఫోర్, 1 సిక్స్) తప్ప ఎవరూ నిలవలేదు. చివరి ఐదు ఓవర్లలో 31 పరుగులు మాత్రమే చేసిన ఆతిథ్య జట్టు 152కే పరిమితమైంది.

నిలిచి గెలిపించిన పాండే, కార్తీక్

ఛేదనలో మన జట్టుకు శుభారంభం దక్కలేదు. మొదటి ఓవర్లో సిక్స్, ఫోర్‌తో టచ్‌లోకి వచ్చినట్లు కనిపించినప్పటికీ కెప్టెన్ రోహిత్ శర్మ (7 బంతుల్లో 11; 1 ఫోర్, 1 సిక్స్) మరోసారి తక్కువ పరుగులకే అవుటయ్యాడు. మంచి ఫామ్‌లో ఉన్న శిఖర్ ధావన్ (8) ముందుకొచ్చి ఆడబోయి మిడాన్‌లో క్యాచ్ ఇచ్చాడు. ఓపెనర్లిద్దరూ స్పిన్నర్ అఖిల ధనంజయ బౌలింగ్‌లోనే అవుటయ్యారు. జట్టు స్కోరు 22/2తో నిలిచిన ఈ దశలో కేఎల్ రాహుల్ (18), రైనా వేగంగా పరుగులు జోడించి రన్‌రేట్ పడిపోకుండా చూశారు. వీరు 3.4 ఓవర్లలోనే 40 పరుగులు జోడించారు. ముఖ్యంగా రైనా వేగంగా ఆడాడు. అంతా సాఫీగా సాగుతుండగా ప్రదీప్ బౌలింగ్‌లో రైనా షాట్ కొట్టేందుకు యత్నించి అవుటయ్యాడు. మూడు ఓవర్ల అనంతరం రాహుల్ హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి విజయానికి 55 బంతుల్లో 68 పరుగులు చేయాల్సి ఉంది. ఒకరిద్దరు బ్యాట్స్‌మెన్ విఫలమైతే కొంత క్లిష్ట పరిస్థితి ఎదురయ్యేదే. కానీ... పాండే, కార్తీక్ కుదురుకుంటూనే అడపాదడపా బౌండరీలు బాదుతూ, సింగిల్స్, డబుల్స్ తీస్తూ తడబడకుండా పని పూర్తి చేశారు.



పాండే

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: గుణతిలక (సి) రైనా (బి) ఠాకూర్ 17; కుశాల్ మెండిస్ (సి) రోహిత్ (బి) చహల్ 55; కుశాల్ పెరీరా (బి) సుందర్ 3; తరంగ (బి) శంకర్ 22; తిసార పెరీరా (సి) చహల్ (బి) ఠాకూర్ 15; జీవన్ మెండిస్ (బి) సుందర్ 1; షనక (సి) కార్తీక్ (బి) ఠాకూర్ 19; ధనంజయ (సి) రాహుల్ (బి) ఉనాద్కట్ 5; లక్మల్ నాటౌట్ 5; చమీర (సి) ఉనాద్కట్ (బి) ఠాకూర్ 0; ప్రదీప్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (19 ఓవర్లలో 9 వికెట్లకు) 152.**

వికెట్ల పతనం: 1–25, 2–34, 3–96, 4–113, 5–118, 6–120, 7–146, 8–151, 9–151.

బౌలింగ్: ఉనాద్కట్ 3–0–33–1, సుందర్ 4–0–21–2, ఠాకూర్ 4–0–27–4, చహల్ 4–0–34–1, శంకర్ 3–0–30–1, రైనా 1–0–6–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) మెండిస్ (బి) ధనంజయ 11; ధావన్ (సి) పెరీరా (బి) ధనంజయ 8; రాహుల్ హిట్ వికెట్ (బి) మెండిస్ 18; రైనా (సి) పెరీరా (బి) ప్రదీప్ 27; పాండే నాటౌట్ 42; కార్తీక్ నాటౌట్ 39; ఎక్స్‌ట్రాలు 8. **మొత్తం (17.3 ఓవర్లలో 4 వికెట్లకు) 153.**

వికెట్ల పతనం: 1–13, 2–22, 3–62, 4–85.

బౌలింగ్: లక్మల్ 2–0–19–0, ధనంజయ 4–0–19–2, చమీర 3–0–33–0, ప్రదీప్ 2.3–0–30–1, జీవన్ మెండిస్ 4–0–34–1, తిసార పెరీరా 2–0–17–0.

భారత మహిళల ఓటమి

తొలి వన్డేలో ఆసీస్ జయభేరి • 15న రెండో వన్డే



నికోల్ బోల్టన్

వడోదర: ఆస్ట్రేలియాతో మొదలైన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ పరాజయంతో ప్రారంభించింది. సోమవారం జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించి... గతేడాది ప్రపంచకప్ సెమీస్‌లో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకుంది. అస్వస్థతతో కెప్టెన్ మిథాలీ రాజ్ ఈ మ్యాచ్‌కు దూరమవడం బ్యాటింగ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. హర్మన్‌ప్రీత్ కౌర్ భారత్‌కు సారథిగా వ్యవహరించింది. మొదట భారత్ 50 ఓవర్లలో 200 పరుగుల వద్ద ఆలౌటైంది. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి అర్ధ సెంచరీ సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా పూజ వస్త్రకర్ (51) రికార్డు సృష్టించగా, సుష్మా వర్మ (41) రాణించింది. వీరిద్దరు ఎనిమిదో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. వన్డేల్లో అరంగేట్రం చేసిన జెమీమా రోడ్రిగ్స్ (1) విఫలమైంది. పూనమ్ రౌత్ 37 పరుగులు చేసింది. స్పిన్నర్లు జొనసెన్ (4/30), వెల్లింగ్టన్ (3/24) భారత్‌ను దెబ్బతీశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 32.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ నికోల్ బోల్టన్ (101 బంతుల్లో 100 నాటౌట్; 12 ఫోర్లు) అజేయ శతకం సాధించగా, అలీసా హీలీ (38), లానింగ్ (33) మెరుగ్గా ఆడారు. శిఖా పాండేకు ఒక వికెట్ దక్కింది. గురువారం ఇక్కడే రెండో వన్డే జరుగుతుంది.

యూకీ సంచలనం

ప్రపంచ 12వ ర్యాంకర్‌పై విజయం • ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ

కాలిఫోర్నియా (అమెరికా): భారత టెన్నిస్ యువ తార యూకీ బాంబ్రీ తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని నమోదు చేశాడు. ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్‌లో 25 ఏళ్ల ఈ ఢిల్లీ ప్లేయర్ మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 110వ ర్యాంకర్ యూకీ 6–4, 6–4తో ప్రపంచ 12వ ర్యాంకర్ లుకాస్ పుయి (ఫ్రాన్స్)ను బోల్తా కొట్టించాడు. 79 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. మూడో రౌండ్‌లో ప్రపంచ 21వ ర్యాంకర్ సామ్ క్వెరీ (అమెరికా)తో యూకీ తలపడతాడు. ఇదే టోర్నీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)–వాసెలిన్ (ఫ్రాన్స్) జంట 7–5, 2–6, 4–10తో గైల్స్ ముల్లర్ (లక్సెంబర్గ్)–సామ్ క్వెరీ (అమెరికా) జోడీ చేతిలో ఓడిపోయింది.

ఫెడరర్ ముందుకు... జొకోవిచ్ ఇంటికి

మరోవైపు ఇదే టోర్నీ పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లగా... ఐదుసార్లు మాజీ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా) రెండో రౌండ్‌లో ఇంటిముఖం పట్టాడు. రెండో రౌండ్‌లో ఫెడరర్ 6–3, 7–6 (8/6)తో డెల్‌బోనిస్ (అర్జెంటీనా)పై నెగ్గగా... క్వాలిఫయర్ టారో డానియల్ (జపాన్) 7–6 (7/3), 4–6, 6–1తో పదో సీడ్ జొకోవిచ్‌ను ఓడించాడు.



అఫ్గానిస్తాన్ గట్టెక్కింది!

సూపర్ సిక్స్‌కు అర్హత

- ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ

బులవాయో: ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో సోమవారం అఫ్గానిస్తాన్‌కు సంబంధించిన మ్యాచ్ జరగలేదు. కానీ ఫలితం మాత్రం అనుకూలంగా వచ్చింది. హాంకాంగ్‌తో జరిగిన పోరులో నేపాల్ గెలవడంతో అఫ్గాన్ ముందంజ వేసింది. సూపర్ సిక్స్‌కు అర్హత సంపాదించింది. గ్రూప్ 'బి'లో ఈ మూడు జట్లు ఒక్కో విజయంతో రెండేసి పాయింట్లు సాధించాయి. అయితే మెరుగైన రన్‌రేట్‌తో అఫ్గాన్ 'సూపర్' బెర్తు దక్కించుకుంది. సోమవారం జరిగిన పోరులో నేపాల్ 5 వికెట్ల తేడాతో హాంకాంగ్‌పై నెగ్గింది. మొదట హాంకాంగ్ 48.2 ఓవర్లలో 153 పరుగులు చేసింది. నిజాకత్ ఖాన్ (47) ఆకట్టుకున్నాడు. తర్వాత నేపాల్ 40.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలిచింది. రోహిత్ కుమార్ (48 నాటౌట్), సోమ్‌పాల్ కామి (37 నాటౌట్) రాణించారు. ఇతర మ్యాచ్‌ల్లో వెస్టిండీస్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 54 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై గెలువగా, ఐర్లాండ్ 226 పరుగుల భారీ తేడాతో యూఏఈపై ఘనవిజయం సాధించింది. జింబాబ్వే, స్కాట్లాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ టై అయింది. గ్రూప్ 'ఎ' నుంచి వెస్టిండీస్, ఐర్లాండ్, యూఏఈ, 'బి' నుంచి జింబాబ్వే, స్కాట్లాండ్, అఫ్గానిస్తాన్ సూపర్ సిక్స్‌కు అర్హత పొందాయి. ఈ నెల 15 నుంచి సూపర్ పోరు జరుగుతుంది.

షమీకి ధోని మద్దతు

న్యూఢిల్లీ: పీకల్లోతు కేసుల్లో ఇరుక్కున్న భారత పేసర్ మొహమ్మద్ షమీకి మాజీ క్రికెటర్లతో పాటు సహచరులు మద్దతు పలుకుతున్నారు. తాజాగా భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని స్పందిస్తూ... 'నాకు తెలిసి షమీ మంచివాడు. భార్యను, దేశాన్ని మోసగించడనే అనుకుంటున్నా. ఇది పూర్తిగా అతని వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వ్యవహారం. దీనిపై వ్యాఖ్యానించడం తగదు' అని ఓ వెబ్ మీడియాతో అన్నాడు. మాజీ క్రికెటర్ చేతన్ చౌహాన్ మాట్లాడుతూ 'భారత క్రికెట్ బోర్డు షమీ కాంట్రాక్టును రద్దు చేయలేదు... కేవలం నిలిపివేసింది. దీని వల్ల వచ్చే ఇబ్బందులేవీ లేవు. కాంట్రాక్టు అనేది ఆటగాడి సత్తా సామర్థ్యానికి సంబంధించింది. పైగా ఏ కోర్టు అతన్ని ఇంకా దోషిగా నిర్ధారించలేదు' అని అన్నాడు. ఇంతకు ముందే భారత దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్... షమీ కష్టపడే క్రికెటర్ అని మద్దతు తెలిపారు.



దక్షిణాఫ్రికా ప్రతీకార విజయం

రెండో టెస్టులో 6 వికెట్లతో ఆస్ట్రేలియా చిత్తు

- రెండో ఇన్నింగ్స్‌లో రబడ 6/54

పోర్ట్ ఎలిజబెత్: సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో చావుదెబ్బ తిన్న దక్షిణాఫ్రికా వెంటనే కోలుకుంది. నాలుగో రోజే ముగిసిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో సఫారీ జట్టు 22.5 ఓవర్లలో 4 వికెట్లకు 102 పరుగులు చేసి విజయాన్నందుకుంది. డివిలియర్స్ (28), ఆమ్లా (27), మార్క్‌రమ్ (21) చకచకా ఆడి పని పూర్తి చేశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 180/5తో సోమవారం ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 239 పరుగులకు ఆలౌటైంది. ప్రధాన బ్యాట్స్‌మన్ మిషెల్ మార్ష్ (45)ను తొలి ఓవర్లోనే రబడ క్లీన్‌బౌల్డ్ చేయడంతో కంగారూల పతనం ప్రారంభమైంది. 37 పరుగుల వ్యవధిలో ఆసీస్ మిగిలిన ఆరు వికెట్లు చేజార్చుకుంది. టిమ్ పైన్ (28 నాటౌట్) కొద్దిగా పోరాడాడు. తొలి ఇన్నింగ్స్‌లాగే మరోసారి చెలరేగిన రబడ 54 పరుగులకే 6 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని కుప్పకూల్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో 139 పరుగుల ఆధిక్యాన్ని కోల్పోయిన ఆసీస్ దక్షిణాఫ్రికాకు 101 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ టెస్టులో మొత్తం 11 వికెట్లు తీసిన రబడ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. మూడో టెస్టు ఈ నెల 22 నుంచి కేప్‌టౌన్‌లో జరుగుతుంది.



రబడ ఖేల్ ఖతం

పేసర్‌పై రెండు టెస్టుల నిషేధం

కేవలం 28 టెస్టుల కెరీర్... నాలుగో సారి మ్యాచ్‌లో పది వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా తరపున స్టెయిన్, ఎన్తిని తర్వాత ఆ ఘనత సాధించిన బౌలర్ కగిసో రబడ అత్యద్భుత బౌలింగ్ గణాంకాలు ఇవి. పోర్ట్ ఎలిజబెత్‌లో ఆస్ట్రేలియా పని పట్టిన ఈ యువ బౌలర్ తన ఆగ్రహాన్ని మాత్రం అదుపులో ఉంచుకోలేక తనను, తన జట్టును తీవ్రంగా నష్టపరిచాడు. దక్షిణాఫ్రికా భయపడినట్లుగానే రబడపై 2 మ్యాచ్‌ల నిషేధం పడింది. ఈ సిరీస్‌లో 15 వికెట్లతో చెలరేగిన రబడ తాజా ఐసీసీ శిక్షతో ఈ సిరీస్‌లోని తర్వాతి రెండు టెస్టులకు దూరమయ్యాడు. అతనిపై మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా కూడా విధించారు. తొలి ఇన్నింగ్స్‌లో స్మిత్ భుజాన్ని ఉద్దేశపూర్వకంగా ఢీకొన్న ఘటనపై ఆదివారం సాయంత్రమే రిఫరీ ముందు విచారణకు హాజరైన రబడ దానికి కొద్ది సేపు ముందే మరో తప్పు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో వార్నర్‌ను బౌల్డ్ చేసిన తర్వాత అతని వైపు చూస్తూ తీవ్రంగా అరిచాడు. దీనికి సంబంధించి రబడపై సోమవారం లెవల్–1 ఫిర్యాదు నమోదైంది. స్మిత్ ఘటన లెవల్–2 కాబట్టి 3 డీమెరిట్ పాయింట్ల శిక్ష పడింది. జనవరి 2017 నుంచి వేర్వేరు ఘటనల్లో (డిక్‌వెలా, స్టోక్స్, ధావన్‌లతో గొడవ) ఇప్పటికే ఐదు డీమెరిట్ పాయింట్లు ఈ పేసర్ ఖాతాలో ఉన్నాయి. దాంతో పాయింట్ల సంఖ్య ఎనిమిదికి చేరి రెండు టెస్టుల నిషేధం పడింది. వార్నర్ ఘటనలో కూడా 15 శాతం మ్యాచ్ ఫీజు జరిమానాతో పాటు 1 డీమెరిట్ పాయింట్‌ను ఐసీసీ శిక్షగా విధించింది. దాంతో రబడ మొత్తం పాయింట్ల సంఖ్య 9కి చేరింది.

నవ యువ శకం...

భారత షూటింగ్‌లో కొత్త స్టార్స్

- ప్రపంచకప్ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన
- తొమ్మిది పతకాలతో తొలిసారి అగ్రస్థానం

సాక్షి క్రీడావిభాగం

వరుసగా మూడు ఒలింపిక్స్ క్రీడల్లో (2004 ఏథెన్స్, 2008 బీజింగ్, 2012 లండన్) భారత్‌కు వ్యక్తిగత పతకాలు అందించిన క్రీడాంశం షూటింగ్. ఏథెన్స్‌లో రాజ్యవర్ధన్ రాథోడ్ రజతం... బీజింగ్‌లో అభినవ్ బింద్రా స్వర్ణం... లండన్‌లో విజయ్ కుమార్ రజతం, గగన్ నారంగ్ కాంస్యం గెలిచారు. దాంతో రియో ఒలింపిక్స్‌లోనూ మళ్లీ పతకం ఖాయమని షూటింగ్‌పై అందరూ భారీ అంచనాలు పెట్టుకున్నారు. కానీ మన షూటర్ల గురి తప్పింది. 'రియో'కు అర్హత పొందిన 12 మందిలో అభినవ్ బింద్రా మినహా మిగతా వారు కనీసం టాప్–5లో నిలువలేక పోయారు. ఫలితంగా భారత షూటర్లు రిక్త హస్తాలతో స్వదేశానికి తిరిగొచ్చారు. ఒక వైపు అనుభవజ్ఞులైన షూటర్లు విఫలమవ్వగా... మరోవైపు నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఆర్‌ఏఐ) మాత్రం 'రియో' ఫలితాలతో వెంటనే మేల్కొంది. ప్రతిభావంతులైన కొంతమంది యువ షూటర్లను ఎంపిక చేసింది. మాజీ స్టార్ షూటర్లు జస్పాల్ రాణా, దీపాలి దేశ్‌పాండే ఆధ్వర్యంలో వారికి శిక్షణ మొదలైంది. రెండేళ్లు తిరిగేలోపు ఈ యువ షూటర్లు ఆశ్చర్యపరిచే ఫలితాలు సాధించారు. ఆదివారం రాత్రి మెక్సికోలో ముగిసిన సీజన్ తొలి ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత షూటర్లు నాలుగు స్వర్ణాలు, నాలుగు కాంస్యాలు, ఒక రజతంతో కలిపి మొత్తం తొమ్మిది పతకాలు సాధించారు. దాంతో 32 ఏళ్ల ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో తొలిసారి భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానాన్ని దక్కించుకొని కొత్త చరిత్ర లిఖించింది.

కెరీర్‌లో ఆడిన తొలి ప్రపంచకప్‌లోనే 23 ఏళ్ల షాజర్ రిజ్వీ, 17 ఏళ్ల హరియాణా అమ్మాయి మనూ భాకర్, 18 ఏళ్ల బెంగాల్ షూటర్ మెహులీ ఘోష్ పతకాల బోణీ కొట్టారు. రిజ్వీ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించడమే కాకుండా కొత్త ప్రపంచ రికార్డును సృష్టించాడు. మనూ భాకర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఒక్కో పసిడి పతకం సొంతం చేసుకుంది. మెహులీ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో, మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఒక్కో కాంస్యం సాధించింది. కెరీర్‌లో రెండో ప్రపంచకప్ ఆడిన అఖిల్ షెరాన్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో పలువురు స్టార్ షూటర్లను వెనక్కినెట్టి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు.



మనూ భాకర్, ఓం ప్రకాశ్



అఖిల్



రిజ్వీ

పతక విజేతలు వీరే...

స్వర్ణాలు

- **మనూ భాకర్:** మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్; మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ (ఓం ప్రకాశ్ జతగా).
- **షాజర్ రిజ్వీ:** పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్.
- **అఖిల్ షెరాన్:** పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్.

రజతం

- **అంజుమ్ ముద్గిల్:** మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్.

కాంస్యాలు

- **రవి కుమార్:** పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్.
- **జీతూ రాయ్:** పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్.
- **మెహులీ ఘోష్:** మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్, మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ (దీపక్ కుమార్ జతగా).

'మెక్సికో ప్రపంచకప్ టోర్నీలో భారత షూటింగ్‌లో కొత్త శకం మొదలైంది. భారత షూటింగ్ భవిష్యత్‌కు ఈ యువ షూటర్లు భరోసా ఇచ్చారు. రాబోయే కాలంలోనూ ఈ యువ షూటర్లు ఇదే ఉత్సాహంతో ఒలింపిక్స్‌లో శిఖరాగ్రాన నిలవాలని ఆశిస్తున్నాను. యువ షూటర్ల విజయంలో తెరవెనుక ఉండి కీలకపాత్ర పోషించిన వారందరికి తగిన గుర్తింపు ఇవ్వాలి'. – అభినవ్ బింద్రా










రిజిస్ట్రేషన్ శాఖకు 210 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 210 సబ్‌రిజిస్ట్రారు కార్యాలయాలకు కొత్తగా సీనియర్ అసిస్టెంట్ పోస్టులు మంజూరయ్యాయి. జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతుల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఫైలుపై సోమవారం సీఎం చంద్రబాబు సంతకం చేశారు. 'ప్రస్తుతం రాష్ట్రంలో 290 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో 210 కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లు లేరు. దీనిపై రాష్ట్ర సబ్ రిజిస్ట్రార్స్ అసోసియేషన్ నేతలు పలుమార్లు విజ్ఞప్తి చేయగా పోస్టులను మంజూరు చేశారు.

శ్రీలంక సమీపంలో తీవ్ర అల్పపీడనం

సాక్షి, విశాఖపట్నం: శ్రీలంక సమీపంలో భూమధ్య రేఖా ప్రాంతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది సాయంత్రానికి తీవ్ర అల్పపీడనంగా మారింది. రానున్న 24 గంటల్లో ఇది మరింత బలపడి అరేబియా సముద్రంలో వాయుగుండంగా మారనుందని భారత వాతావరణ విభాగం సోమవారం రాత్రి వెల్లడించింది. దీని ప్రభావంతో రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని నిపుణులు చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో మాత్రం ఉష్ణోగ్రతల్లో కాస్త పెరుగుదల ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రం మీదుగా పశ్చిమ, నైరుతి గాలులు వీస్తున్నాయి. ఈ గాలుల ప్రభావం ఉత్తర కోస్తాపై ఉండడం వల్ల ఆ ప్రాంతంలో వేడి గాలులు ఉంటాయని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ 'సాక్షి'కి చెప్పారు.









Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.